Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

# తెలుగు సామెతలు-
# మానవ స్వభావం

★

మాచార్యులు
ఎం.ఏ., ఎం.ఫిల్.,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

गुरुकुल कांगड़ी विश्वविद्यालय
कृपया पुस्तक के ऊपर कोई निशान आदि
न लगायें।

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri


# पुस्तकालय
## गुरुकुल कांगड़ी विश्वविद्यालय, हरिद्वार

वर्ग संख्या.........                आगत संख्या...............

पुस्तक—वितरण की तिथि नीचे अंकित है। इस तिथि सहित २० वें दिन तक यह पुस्तक पुस्तकालय में वापिस आ जानी चाहिए। अन्यथा १० पैसे के हिसाब से विलम्ब-दण्ड लगेगा।


బుక్కరాయ సముద్రం రామాచార్యులు, ఎం.ఏ., ఎం.ఎల్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

NATION

पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

# "చంద్రునికో నూలుపోగు"

"కృషితో నాస్తి దుర్భిక్షం" అనే ఆర్యోక్తిని అక్షరాల తాను పాటిస్తూ,
ఇతరులకు బోధించే కృషీవలుడూ,

"చదువంగవలయు జనులు" అనే సూక్తిని జీర్ణించుకొని
సాంకేతిక, వృత్తి, సామాన్య విద్యాసంస్థల
స్థాపించిన వ్యవస్థాపకులూ,

"చదువుకు సంస్కారముండాలి" అనే సూక్తిననుసరించి
వివిధ సాంస్కృతిక సంస్థలకు సారథ్యం
వహించినవారూ అయినా

**శ్రీ జి. పుల్లారెడ్డి మరియు శ్రీమతి జి. నారాయణమ్మ గార్లకు**

ఈ చిరుగ్రంథాన్ని హృదయపూర్వకంగా
అంకితమియ్యబడింది.

"భక్తి కలిగిన కూడుపట్టెడైనను చాలు కదా!"

—రచయిత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

# తెలుగు సామెతలు - మానవ స్వభావం

Forwarded free of cost, and with the compliments of the Department of Education, Government of India, New Delhi.

007375

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

ఎం.ఫిల్. పట్టా పొందిన సిద్ధాంత గ్రంథం

బుక్కరాయ సముద్రం రామాచార్యులు, ఎం.ఏ., ఎం.ఫిల్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సర్వహక్కులు : రచయితవి

ప్రథమ ముద్రణ : 1988

ప్రతులు : 1000

మూల్యం : రూ. 30.00

ప్రతులకు :

1. బి. రామాచార్యులు, ఎం.ఏ., ఎం.ఫిల్.
ఆంధ్రోపన్యాసకుడు
'జి. పుల్లారెడ్డి జూనియర్ కళాశాల'
మెహిదీపట్నం, హైదరాబాదు - 28

2. బి. సుందరవల్లి, బి.ఏ.
7-1-400/25/2,
శ్రీనివాసనగరు (తూర్పు)
హైదరాబాదు - 28

ముద్రణ :
శ్రీ లక్ష్మీవేంకటేశ్వర పవర్ ప్రెస్
హిమాయత్‌నగర్, హైదరాబాదు - 29

ఈ గ్రంథం తెలుగు విశ్వవిద్యాలయం వారి ఆర్థిక సహాయంతో ముద్రితం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

DONATION

पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

# "చంద్రునికో నూలుపోగు"

"కృషితో నాస్తి దుర్భిక్షం" అనే ఆర్యోక్తిని అక్షరాల తాను పాటిస్తూ,
ఇతరులకు బోధించే కృషీవలుడూ,

"చదువంగవలయు జనులు" అనే సూక్తిని జీర్ణించుకొని
సాంకేతిక, వృత్తి, సామాన్య విద్యాసంస్థల
స్థాపించిన వ్యవస్థాపకులూ,

"చదువుకు సంస్కారముండాలి" అనే సూక్తిననుసరించి
వివిధ సాంస్కృతిక సంస్థలకు సారథ్యం
వహించినవారూ అయినా

**శ్రీ జి. పుల్లారెడ్డి మరియు శ్రీమతి జి. నారాయణమ్మ గార్లకు**

ఈ చిరుగ్రంథాన్ని హృదయపూర్వకంగా
అంకితమియ్యబడింది.

"భక్తి కలిగిన కూడుపట్టెడైనను చాలు కదా!"

–రచయిత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

# ఆశీస్సులు

శ్రీ రామాచార్యులు గారు ప్రకటించిన "తెలుగు సామెతలు - మానవ స్వభావం" అనే గ్రంథాన్ని చూచాను.

సామెతలలోని వస్తువును వారు మానవ స్వభావ విశ్లేషణకు మాత్రమే పరిమితం చేసుకున్నారు. ఎం. ఫిల్. పట్టానికి ఉద్దేశించిన వ్యాసం కనుక అలా విషయాన్ని నియమించుకోవలసి రావడం సహజం.

వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, పురాణాలు అన్నీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో మానవ మనోధర్మ విశ్లేషణకు ప్రాధాన్యమిచ్చినవే. ఆయాచోట్ల కవితాతత్త్వాన్ని వారంతా మనస్తత్త్వ చిత్రణకు అభిముఖంగా నడుపుకున్నారే గాని, మనః ప్రీణన కార్యం వేపుకు కాదు.

అట్లాగే సాహిత్యశాస్త్రంలో కూడా బహుముఖాలుగా మానవ మనోధర్మమే విశ్వరూపం తాల్చి కనిపిస్తుంది. చివరకు నిత్య వ్యవహారంలో మామూలు మనిషి మాట్లాడుకునే ప్రతిమాటలోనూ ఆధర్మమే తొణికిసలాడుతుంది. అందుకే వాఙ్మయాన్ని పరిగణించి చరిత్ర రచన చేయడానికి పూనుకుంటే, భౌతిక చరిత్ర కంటే ముందు మనిషి అంతస్తత్త్వ చరిత్రే సాక్షాత్కరిస్తుంది.

అందునా, నాగరకపు నాజూకులు తెలీని జానపదులు అచ్చపు మనుష్య ధర్మానికి ప్రతీకలు. సుఖమో దుఃఖమో, అనురాగమో కోపమో, ఈ ద్వంద్వా లకు వాళ్ళ జీవితం ఉనికిపట్టు. రకరకాల మనోభావాలను బుడగలవలే మానస కాసారంలో పుట్టించి చిదిపి వేయడానికి వారే తగుదురు - ఆ వ్యాపారమంతా నిసర్గ మధురమై, ఏ రకమైన కల్పిత వృత్తికీ లోనుకాక, విశ్వరూపం ధరించి సామెతల్లో కనిపిస్తుంది.

రామాచార్యులుగారు ఆ విశ్వరూపాన్ని చిన్న సిద్ధాంత వ్యాసంలో బంధించే ప్రయత్నం చేశారు. స్థూల దృష్టికి ఆకారరేఖ కుదిరినా, గ్రంథకర్త చేయవల సిందెంతో ఉంది. ప్రపంచ భాషల్లోని సామెతలతో, ప్రపంచ మానవ స్వభావ విశ్లేషణతో, ఈ వ్యాసాన్ని జోడించుకుంటూ, తులనాత్మక విశ్లేషణ చేసుకుంటూ, ఎన్నో కాళీలను పూర్తి చేసుకుంటూ, ముందుకు ఉద్ధృతంగా సాగిపోవలసి ఉంది.

ఆ ప్రయత్నాన్ని రామాచార్యులుగారు ముందు ముందు కొనసాగిస్తారని ఆశిస్తూ

హైదరాబాదు
11-11-88

శుభాకాంక్షలతో
నాయని కృష్ణకుమారి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

# హితవచనం

జానపద సాహిత్యం మీద పరిశోధనా వ్యాసంగం ఇటీవల బాగానే సాగుతోంది. అయితే సామెతల మీద ఒకటి అర మంచి పుస్తకాలు వచ్చినా, జరగవలసినంత కృషి జరగలేదనే చెప్పాలి సామెతల గురించి చెప్పాల్సింది ఇంకా ఎంతో ఉన్న కారణంగానే అనుకుంటాను మిత్రుడు రామాచార్యులు వాటిని మానవ స్వభావమనే దృక్కోణం నుంచి చూశాడు. చూసిన దాన్ని నలుగురికీ చూపించడానికి ఈ పుస్తకాన్ని అందిస్తున్నాడు. అందుకు అతనిని హార్థికంగా అభినందిస్తున్నాను.

సామెతలు అనంతం. అందునా తెలుగు సామెతలు. మాటమాటకు సామెత చెప్పే మనుషులు మన పల్లెల్లో కోకొల్లలు. వాటి ప్రభావం జన వ్యవహారం మీద అపరిమితం. అది ఎంతదాకా వెళ్లిందో గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది. సామెత చెప్ప(లే)కపోయినా కొందరు 'ఏదో సామెత చెప్పినట్లు' అనైనా అనాల్సిందే. అలా అనకపోతే వాళ్ల వాగ్వ్యవహారం ఆగిపోయే ప్రమాదం ఉంది.

అపరిమితమైన ప్రభావాన్ని నెరపే సామెతలు ఒక పక్క, అంతకన్న అనంతమైన మానవ స్వభావం ఇంకొక పక్క. ఒక్కొక్క అంశాన్ని గురించి చెప్పడమే కష్టం. అలాంటిది రెంటినీ కలిపి విశ్లేషించడం అసాధ్యమైన పని. అయినా తన పరిధిలో సామెతలలో ప్రతిబింబించే మానవ స్వభావాన్ని చెప్పడానికి ప్రయత్నం చేశాడు రామాచార్యులు.

సామెతలు ప్రధానంగా జీవితానికి మెరుగులు దిద్దే ప్రయత్నం చేస్తాయి. వ్యక్తి సమున్నతుడు కావడానికి ఒక గొప్ప అడ్డంకిని అరిషడ్వర్గాన్ని - దాటవలసి ఉంటుంది. అది అంత సులువు కాకపోయినా తప్పనిసరి. అందుకే ఈ గ్రంథంలో అరిషడ్వర్గానికి సంబంధించిన సామెతల్ని ప్రప్రథమంగా పేర్కొనడం, తర్వాత మనిషిని అతలాకుతలం చేసే ద్వంద్వాలను వెనువెంటనే చెప్పడమూ సమంజసంగా ఉంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఒకే అర్థానిచ్చే సామెతల్ని ఒకచోట చేర్చడం, శతక పద్యాల్లోని సామెతల్ని ఉదాహరించడం (పుటలు 28, 62, 68), వివరణ సాపేక్షాలైన కొన్ని సామెతలకి ఉపబలకంగా కథల్ని ఏర్చికూర్చడం (పుటలు 18, 51, 83, 98, 110) ఈ గ్రంథానికి వన్నె తెచ్చే గుణాలు.

రచనకు సంక్షిప్తత ఎంతో అవసరం. 'పాఠకుడి నుంచి తక్కువ సమయాన్ని తీసుకొని ఎక్కువ ఆలోచింపజేసేవాడు ఉత్తమ రచయిత' అన్న సిడ్నీ స్మిత్ మాటల్ని ఇక్కడ స్మరించుకోవాలి. ఈ రచనలో ఆ సంక్షిప్తత కొరవడింది. తొలిరచన కావడంవల్ల ఈ ఇబ్బంది ఉంది కాబోలు! దీన్ని సులభంగా అధిగమించవచ్చు. మలి రచనలో ఆ ప్రయత్నాన్ని ఆశిస్తున్నాను.

మిత్రుడు రామాచార్యులుకి పట్టుదల, పరిశ్రమ రెండూ సమపాళ్లలో ఉన్నాయి. వాటితో ఇతోధికమైన కృషిచేసి ఇంకెన్నో పుస్తకాలు వెలువరిస్తాడని విశ్వసిస్తున్నాను.

పి. ఎల్. శ్రీనివాసరెడ్డి
రీడర్, ఆంధ్రభారతి,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం
అనంతపురం-515 003

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

డా॥ పి. నరసింహారెడ్డి
రీడర్, తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502

తేది. 16-11-1988

# నాకు తోచిన నాలుగు మాటలు

1. నిన్న మొన్నటివరకు అనాదృతమైన పల్లీయుల మౌఖిక వాఙ్మయం దేశ సంస్కృతికి భాండాగారంగా నిలిచిన జానపద వాఙ్మయంలో రెండు విభాగా లున్నాయి. 1. గేయ విభాగం 2. వచన విభాగం. కథలు, సామెతలు, పొడుపు కథలు, వచన విభాగంలోకి చేరతాయి.

1.1 'సామెతలేని మాట - ఆమెతలేని యిల్లు' సామెతలేని మాట విందు లేని యిల్లు లాంటిదట. సంభాషణలో సామెతల ప్రాచుర్య, ప్రాముఖ్యాల్ని నొక్కి చెప్తుంది పై సామెత.

నానుడులు, సుద్దులు, జనశ్రుతులు, శాస్త్రాలు, మాటలు, సాటువ/సాటవ/ చాటువ/చాటవ అనే పదాలు జన వ్యవహారంలో సామెతకు సమానార్థకాలు. లోకోక్తి, శ్లోకము, సామ్యము, జనవాదము, లోకహితోక్తి, కత, నానుడి, నుడి కారం అనే పదాల్ని సామెతకు సమానార్థకంగా ప్రాచీనాంధ్ర కవులు ప్రయో గించారు.

1.2 సామెతకు అరిస్టాటిల్ నిర్వచనం మొట్టమొదటిది. "A Proverb Is a remnant from old Philosophy Preserves amidst countless destructions, by reason of its brevity and fitness for use" (సంక్షిప్తత, ప్రయోగార్హత కారణాలుగా అసంఖ్యాకమైన ఆటుపోట్లకు మారొడ్డి నిలిచిన ప్రాచీన జిజ్ఞాసావశేషమే సామెత) సెర్వాంటెస్ సామెతని ఇలా నిర్వ చించాడు. "Short sentences drawn from long experience" (తర తరాల అనుభవం సృష్టించిన సంక్షిప్త వాక్యాలు సామెతలు)

'ఒక పిండితార్థాన్ని కొద్ది మాటల్లో చెబుతుంది సామెత' అని విశ్వనాథ, 'సామెత అనగా జనవ్యవహారోక్తమైన ఉక్తి' అని సంపత్ రాఘవాచారిగార్లు నిర్వచించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పదహారు వేల తెలుగు సామెతలు ఆధారంగా తెలుగు సామెతకు నేనిచ్చిన నిర్వచనం 'సామాజికమైన తరతరాల అనుభవాన్ని ఇముడ్చుకొని సామ్యత, ప్రభావోత్పాదకత, ధ్వని ప్రాధాన్యత, ప్రజా ప్రాచుర్యం, శ్రావ్యత కలిగి సంభాషణా యోగ్యమైన సంక్షిప్తవాక్యం తెలుగు సామెత' (తెలుగు సామెతలు - జన జీవనం పు 6) పై వివరణాత్మక నిర్వచనంలో సామెత ముఖ్యలక్షణాల్ని చెప్పే ప్రయత్నం జరిగింది.

తరతరాల అనుభవాల్ని దాచుకున్న రసగుళికలు సామెతలు. వేలాది సామెతలు మనుషుల స్వభావంలోని వివిధ గుణాలు ఆధారంగా పుట్టినవే.

1.3 మొట్టమొదటి తెలుగు సామెతల సంకలనం ఎం. డబ్లేయూకార్ 'ఆంధ్రలోకోక్తి చంద్రిక' 1868 లో వెలువడింది. ఇందులో 2200 సామెతలున్నాయి.

తెలుగు సామెతల సేకరణకు విశేష కృషి చేసిన వారిలో చిలుకూరి నారాయణరావు గార్ని ప్రథములుగా చెప్పుకుంటారు. కానీ వారి సేకరణ ఇంతవరకు అలభ్యం కావడం దురదృష్టం. నేదునూరి గంగాధరం గారు 4325 సామెతల్ని సేకరించి "పసిడి పలుకులు" గ్రంథంలో పొందుపరిచారు. శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు కార్డుల్లో సామెతలు ఎక్కించి వేటపాలెం సారస్వత నికేతన్ గ్రంథాలయంలో భద్రపరిచారు. శ్రీ వెలగా వెంకటప్పయ్యగారు సేకరించిన సామెతల్ని 'రాయలసీమ పలుకుబళ్లు'లో సంకలనం చేశారు. నేనూ, నా మిత్రుడు శ్రీ ఇ. చంద్రమౌళి సేకరణ 'తెలుగు సామెతలు - జనజీవనం' గ్రంథం చివర్లో ఇచ్చాం. 1852లో వచ్చిన సి. పి. బ్రౌన్ తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులో 294 సామెతల్ని ఉదాహరణాలుగా ఇవ్వడం విశేషం. కానీ ఒక పద్ధతిలో సవ్యాఖ్యానంగా, 'తెలుగు సామెతల నిఘంటువు' - **'The Oxford Dictionary of English Proverbs'** లాగా- తెలుగువారికి అందకపోవడం విచారకరం. తెలుగు విశ్వవిద్యాలయం లాంటి సంస్థలు ఆలోచించాల్సిన విషయం. నాటి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీవారు అచ్చేసిన 'తెలుగు సామెతలు' తెలుగు సామెతల సంకలనాలు అన్నిటిలో పెద్దది. ఇందులో 10511 సామెతలున్నాయి.

తెలుగు సామెతలు, పలుకుబళ్ళపై మొదటి పరిశోధక గ్రంథం డా॥ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిది. 1979-80 సం॥నికి ఆం.ప్ర. సాహిత్య అకాడమీ వారి ఉత్తమ గ్రంథ రచనకు పోటీ అంశం 'తెలుగు సామెతలు-సాంఘిక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



జీవితం' వీటికోసం గ్రంథం వ్రాసిన వాళ్ళలో నేను ఒకణ్ణి. డా॥ జి. యస్. మోహన్ మరొకరు. సామెతలపై వచ్చిన మరో పరిశోధక గ్రంథం తెలుగు సామెతల్లో స్త్రీ చిత్రణ. శ్రీమతి ఛాయ రచయిత్రి. శ్రీ బి. రామాచార్యులు 'తెలుగు సామెతలు - మానవ స్వభావం' ఎం. ఫిల్. డిగ్రీకోసం పరిశోధనాంశంగా స్వీకరించడం నాకెంతో ఆనందాన్నిచ్చింది. ఆ వ్యాసం అచ్చు కావడంతో నా ఆనందం ద్విగుణీకృతమైంది. కానీ సామెతలపై జరిగిన ఈ పరిశోధన గుమ్మడి కాయలో ఆవగింజ మాత్రమే. ఇంకా విస్తృతంగా పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

2. శ్రీ బి. రామాచార్యులు ఎం. ఏ. తెలుగు విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే నాకు తెలుసు. చేసే ప్రతిపనిలో సిన్సియార్టీ చూపడం, తగిన వ్యక్తుల్ని కలిసి విషయ సేకరణ చేయడం, ప్రణాళిక ఇదని చెప్పి మార్పులు చేర్పుల కోసం సలహాలడగడం, వాటిని పాటించడం ఈయన ప్రత్యేకతగా నేను గమనించిన అంశాలు. రామాచార్యులు పరిశోధన మొదటినుంచి నన్ను చాలాసార్లు సంప్రదించాడు. కొన్ని అపురూప గ్రంథాలు ఆ సందర్భంలో నేనివ్వడం కూడా జరిగింది. ఈ సిద్ధాంత వ్యాసం బాగా రావడానికి ప్రేరకుడు నా మిత్రుడు డా॥ పి. యల్. శ్రీనివాసరెడ్డి కూడా అభినందనీయుడే.

ఈ సిద్ధాంత గ్రంథంలో నాలుగు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయం 'మానవుడు - మానవ స్వభావం' ఇది ఈ పుస్తకానికి నేపథ్యంగా ఉపయోగపడింది. స్వభావానికి మూలాంశాలుగా మనస్సు, పూర్వజన్మ కర్మఫలం, ప్రకృతి, అనువంశికం, వయస్సు, అనుకరణం, పరిసరాలు కారణాలుగా చెప్పడం అందుకోసం ఉపనిషత్తులు, భారత, భాగవత, రామాయణాలు, భగవద్గీత, భర్తృహరి శతకం, వేమన శతకం, మనస్తత్వ శాస్త్రం ఆధారంగా సమర్థించడం సముచితంగా ఉంది.

2.2 రెండో అధ్యాయం 'సామెతలు - అరిషడ్వర్గము' - మానవుని స్వభావంలో అంతశ్శత్రువులుగా పేరొందినవి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. అవి వ్యక్తుల స్వభావాలపై ఎంత బలవత్తరమైన ప్రభావం చూపుతాయో సోదాహరణంగా నిరూపించడం రామాచార్యుల పరిశోధనా సామర్థ్యానికి గీటురాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



2.3 మూడో అధ్యాయం 'సామెతలు - ద్వంద్వాలు' అనేది. మనిషి స్వభావం ఆయా పరిస్థితుల్నిబట్టి మారడం సహజం. అంటే స్వభావానికి కారణభూతాలు, కష్టసుఖాలు, మంచిచెడులు, ఇష్టాయిష్టాలు, సత్యం, అసత్యం లాంటి ద్వంద్వాలు. ఇవి ఎలా మనిషిని ప్రభావితం చేస్తాయో సామెతలు ఆధారంగా పరిశోధకుడు చక్కగా తెలియజేశాడు.

2.4 'సామెతలు - విభిన్న స్వభావాలు' అనేది నాల్గో అధ్యాయం. విభిన్న స్వభావాలు అనడం కన్నా విభిన్న స్వభావాంశాలు అంటే బాగుంటుందేమో ? ఇందులో కృతఘ్నత, మోసం లాంటి గుణాలు; అప్పు చేయడం, బద్ధకం లాంటి అలవాట్లు ఉన్నాయి. ఈ అధ్యాయం 21 అంశాలుగా విభజింపబడిది. సముచితమైన సామెతల్తో వివరణాత్మకంగా పరిశీలించబడింది.

అన్ని అధ్యాయాల్లోనూ సామెతల్లోని అంశాలకు తగినట్లు వివరణాత్మక వ్యాఖ్య ఇవ్వడం, ఎక్కడికక్కడే స్వయం సంపూర్ణం చేయడంవల్ల ఈ గ్రంథం ఒక సంపూర్ణతను సిద్ధించుకొందని చెప్పవచ్చు.

3. మిత్రుడు శ్రీ రామాచార్యులు మరోసారి ఈ గ్రంథాన్ని ప్రచురించు కొనగలిగినప్పుడు పనికి వచ్చే విధంగా కొన్ని సవరణల్ని ప్రతిపాదించడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను.

3.1 చాంచల్యం, పొగరు, చిన్నదాన్ని పెద్దదిగా చేసుకోడం, రూపానికి బుద్ధికి సంబంధం లేకపోవడం అతి పరిచయం, అధికార దుర్వినియోగం, ఇతరుల్ని చెడగొట్టడం, గొప్పతనం, అల్పత్వం - లాంటి మరిన్ని అంశాల మీద ఉండే సామెతలు కూడా స్వభావాన్ని చాటేవే. నాల్గోఅధ్యాయంలో చేర్చుకోవచ్చు.

3.2 సామెతలు చాలామట్టుకు ధ్వని ప్రధానాలు. అంటే ప్రత్యక్షంగా కంటే పరోక్షంగానే భావవ్యక్తీకరణ చేసేవి. అసలు 'సామెత' అంటేనే 'పోలిక' అని గదా అర్థం ! ఇలాంటి పరోక్ష భావవ్యక్తీకరణ కోసం ప్రతీకలుగా సామెతల్లో పశు పక్ష్యాదుల్ని తీసుకోవడం జరుగుతుంటుంది. ఇందుకోసం ఒక్క ఉదాహరణ 'ఏనుగును చూచి కుక్కలు మొరిగినట్లు' అని సామెత. ఈ సామెతలో ఏనుగు ఏనుగేకాదు - గొప్పవాడు, బలవంతుడు, సజ్జనుడు అయిన వ్యక్తి. కుక్క కుక్కేగాదు అల్పుడు, బలహీనుడు, దుర్జనుడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఇలాగే నక్క కాపట్యానికి, యుక్తికి, పాము పగకు, దుర్జనత్వానికి, కృతఘ్నతకు, త్రాచు, సింహం, పులి అభిమానానికి; మేక మెతకతనానికి; గొర్రె అమాయకత్వానికి; కప్ప అజ్ఞానానికి; కోతి చాంచల్యానికి; చిలుక అనుకరణకు ఇలా ఎన్నో ప్రతీకలుగా చెప్పబడ్డాయి తెలుగు సామెతల్లో. అందువల్ల 'మానవ స్వభావ చిత్రీకరణలో పశు పక్ష్యాదుల పాత్ర' అని ఒక ప్రత్యేక అధ్యాయంలో పరిశీలించే అవకాశం ఉంది. ఈ గ్రంథ సమగ్రతకు మరింత తోడ్పడుతుంది కూడాను.

3.2 ఈ గ్రంథంలో నేను నెరసులనుకున్నవి వరి అన్నంలో రాళ్ళ లాంటివి ఒక రెండు

గ్రంథం అంతా చక్కని వ్యావహారికంగా, చరివించే రీతిలో సాగింది. ఒకటి రెండు చోట్ల గ్రాంథిక వాసనలు పూర్వజన్మ కర్మ ఫలంలా కనిపిస్తున్నాయి. 'కొంగ....తపస్సు చేయుచున్న దానిలా నటించి (పుట 96); తిండి పోతులకు గూర్చిన జానపదగేయమే సామెతగా నిలిచిపోయిన తీరు చూడుడు (పుట. 100)

'మొండికి బండకు నూరేండ్లాయుస్సు'లాంటి సామెతల్లో (పుట. 199) మొండి, బండ కుల సంబంధమైనవి. స్వభావ సంబంధి కాదు. (చూడు తెలుగు సామెతలు - జనజీవనం పుట. 128, 138). మేనమామ పిల్లనిస్తామని తిరిగితే అబ్బాయి వాళ్ళు చులకనగా చూడడం అనే అంశం కింద ఇచ్చిన ఉదాహరణ సామెతలు సరైనవి కావు. 'వలచివస్తే మేనమామ కూతురు వావి కాదన్నట్లు' అనే సామెత సరిపోతుంది.

'పానకంలో పుడకల్లాంటి' ఇలాటి నెరసులకేం! తీసి పారేసి పానకం మాధుర్యాన్నా స్వాదిద్దాం! రండి: పాఠకులూ! ఆస్వాదించండి!

—వి. నరసింహారెడ్డి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

# ముందుమాట

"కందువ మాటల సామెత
లంగముగా గూర్చి చెప్పనది తెలుగునకుం
బొందై రుచియై వీనుల
విందై మతి కాసపించు విబుధుల మదికిన్"

(పీఠిక - పుట. xxii)

మొల్ల రామాయణంలోని పై పద్యం సామెతల ప్రాశస్త్యాన్ని వెల్లడి చేస్తుంది. తెలుగు భాషకు ఇంపునూ, సొంపునూ కలిగించేవి, జానపద వాఙ్మయాంబుధి నుండి వెలువడిన జాతిరత్నాలు సామెతలు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని ప్రకటిస్తూ పూర్వుల అనుభవాన్ని పుణికి పుచ్చుకొని ప్రజల భాషలో, ప్రజల వ్యవహారంలో బహుళ ప్రచారాన్ని పొంది, సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబిస్తూ, రాజకీయ, ఆర్థిక, మత, సాంఘిక విషయాల్ని వెల్లడి చేస్తూ, వక్తప్రతిభా పాటవాలతో శ్రోతపై ప్రభావాన్ని కలిగించడమేగాక లయాత్మకములై వీనులకు విందు చేసేవే సామెతలు. అందుకే "సామెతలేని మాట- ఆమెతలేని ఇల్లు" అనే సామెత పుట్టింది. విందులేని ఇల్లు బంధువులు లేక కళావిహీనంగ ఉంటుందో అలాగే సామెత ప్రయోగంలేని సంభాషణ పేలవంగా ఉంటుంది. అంతేకాదు శ్రోతల్ని ఆకర్షించలేదు కూడా. ఉప్పులేని శాకంలా సామెతలేని మాట వ్యర్థం. అందుకే 'Hamid' అనే ఆంగ్ల పండితుడు **"A proverb is to speech what salt is to food"** అని సామెతను నిర్వచించాడు.

ఇతర జానపద వాఙ్మయ శాఖల్లాగే సామెతలు కూడా ఎపుడు పుట్టాయో, ఎలా పుట్టాయో, ఎవరు సృష్టించారో చెప్పడం సాహసంతో కూడుకున్న పని. ప్రాచీన గ్రంథాలైన వేదాల్లోనూ, ఉపనిషత్తుల్లోనూ, బైబిల్‌లోనూ సామెతలు, సామెతల్లాంటి వాక్యాలు ఉండడంవల్ల సామెతలు అతి ప్రాచీనమైనవని చెప్పవచ్చు. ఇప్పుడిప్పుడే గ్రంథస్థమవుతూ పండితజనరంజకమై పరిశోధకుల్ని కూడా ఆకర్షిస్తున్న సామెతలు మౌఖిక ప్రచారాన్ని పొంది ఉండడంవల్ల వాటిని అపౌరుషేయాల్లాంటివని అంటారు. ప్రతిభావంతుడైన జానపదుడు తానునుభవించినా, విన్నా జీవిత సత్యాల్ని తెలిపే రసగుళికల్లాంటి వాక్యాల్ని సంభాషణలో ప్రయోగిస్తే అవి ప్రజలచే ఆకర్షింపబడి ప్రజల నోళ్లలో నాని నానుడులుగా మారి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"పదుగురాడుమాట పాటియై ధరజెల్లు" అన్నట్లు ప్రాచుర్యాన్ని పొంది సామెత లుగా స్థిరపడి ఉండవచ్చు.

సామెతలు ప్రజాజీవనానికి దర్పణాలు. ప్రజల అనుభవాలు, పురాణేతి హాసాల పరిజ్ఞానం, చారిత్రక జానపద విజ్ఞానం, ఆచార వ్యవహారాలు ప్రతి బింబించినట్లే, మానవుని భిన్న భిన్న స్వభావాల్ని సామెతలు వెల్లడి చేస్తాయి. తెలుగు సామెతల్లో ప్రతిబింబించే విభిన్న స్వభావాల్ని పరిశీలించడమే పరిశోధన లోని ప్రధానాంశం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రచురించిన "తెలుగు సామెతలు" (మార్పులు చేర్పులతో మూడవకూర్పు) అనే గ్రంథం పరి శోధనకు ప్రధాన ఆధారం. దానితోపాటు సామెతలకు సంబంధించిన ప్రధాన మైన ఇతర గ్రంథాల్ని, సిద్ధాంత వ్యాసాల్ని, ఇతర వ్యాసాల్ని, సేకరించిన సామెతల్ని పరిశీలించడం జరిగింది.

సిద్ధాంత వ్యాసం నాలుగు అధ్యాయాలుగా విభజించబడింది. తొలి అధ్యా యంలో మానవుని స్వభావం, మానవుని స్వభావంలోని భిన్నత్వాన్ని, భిన్నభిన్న స్వభావాలకు మూలమైన కారణాల్ని గూర్చి చర్చించడమైంది.

రెండో అధ్యాయంలో "సామెతలు - అరిషడ్వర్గం" అనే అంశాన్ని గురించి వివరించడం జరిగింది. సహజాతాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరాలు సామెతల్లో ఏ విధంగా చిత్రించబడ్డాయో పరిశీలించబడింది.

మూడో అధ్యాయంలో మానవుని జీవితంలో కనిపించే కష్టసుఖాలు, మంచీ చెడులు, సమర్థతాసమర్థతలు, ఆడంబర నిరాడంబరాలు, అభిమాన దురభిమానాలు మొదలైన ద్వంద్వాలు సామెతల్లో ఏ విధంగా ప్రకటించబడ్డాయో వివరించ బడింది.

నాల్గవ అధ్యాయంలో విభిన్న స్వభావాల్ని (పై అధ్యాయంలోని విభ జనకు లొంగని సామెతల్ని) గురించీ, అవి సామెతల ద్వారా వ్యక్తం చేయబడ్డ విధానాన్ని గూర్చి చెప్పడం జరిగింది.

-రచయిత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

# కృతజ్ఞతలు

పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం ఆంధ్రభారతి విభాగానికీ, పరిశోధనలోని సాధక బాధకాల్ని వివరిస్తూ ముందుకు నడిపించిన ఆంధ్రభారతి అధ్యాపక బృందానికీ....

పరిశోధనా పర్యవేక్షణ బాధ్యతను వహించి, అడుగడుగునా సందేహాల్ని తొలగిస్తూ, అమూల్యాభిప్రాయాల్ని అందించి ముందుకు నడిపిస్తూ పరిశోధన ఫలవంతమగుటకు కారకులైన సౌమ్యమూర్తులు డాక్టర్ పి. ఎల్. శ్రీనివాసరెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

పరిశోధన చేయుటకై అనుమతినిచ్చిన కళాశాల గౌరవకార్యదర్శి శ్రీ. ఎస్. మల్లికార్జునరావుగారికీ, పరిశోధన నిరాటంకముగా కొనసాగించుటలో సహాయ సహకారాల్ని అందించిన కళాశాల ప్రధానాచార్యులు శ్రీ వి. చంద్రమౌళిగారికీ, పరిశోధనలోని సమస్యల్ని తమ జీవితానుభవంతో తీర్చుటకు ప్రయత్నించిన ఇతర అధ్యాపక బృందానికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

పరిశోధనపట్ల ఆసక్తిని పెంచడమేగాక వెన్నుతట్టి ప్రోత్సహించిన శ్రేయోభిలాషులు డాక్టర్ ఓగేటి అచ్యుత రామశాస్త్రిగారికి కృతజ్ఞతాభినందనాలు.

సిద్ధాంత వ్యాసానికి, శుద్ధప్రతుల్ని తయారు చేయుటలో సహకారాన్ని అందించిన సహధర్మచారిణి శ్రీమతి. బి. ఎస్. వల్లికీ, సోదరి పద్మినికీ, గ్రంథ ముద్రణా కార్యభారాన్ని వహించిన మిత్రుడు డాక్టర్. చిగిచర్ల కృష్ణారెడ్డిగారికీ, అచ్చుతప్పుల్ని దిద్దడంలో సహకరించిన శ్రీ. పి. రామకృష్ణగారికీ, ముద్రణకై కావలసిన ధనాన్ని ఋణంగా ఇచ్చిన సిండికేట్‌బ్యాంక్ మేనేజరు (ఖైరతాబాదు) గారికీ, పుస్తకాన్ని అచ్చువేయడంలో తమ శ్రమశక్తిని పంచిపెట్టిన శ్రీ పి. శ్రీని వాస్‌గారికి, ఇతర శ్రామిక వర్గానికీ కృతజ్ఞతలు.

నా ప్రప్రథమ గ్రంథానికి ఆశీస్సులను పలికిన డాక్టర్. నాయని కృష్ణ కుమారి గారికి, హితవచనం చెప్పిన డాక్టర్. పి. ఎల్. శ్రీనివాసరెడ్డిగారికి, "నాకు తోచిన నాలుగు మాటలు" అంటూ గ్రంథ మంచీ చెడుల్ని విమర్శించడమేగాక చక్కని సలహాల్ని ఇచ్చిన డాక్టర్. పి. నరసింహారెడ్డిగారికి హృదయపూర్వక నమస్సుమాంజలులు.

రచయిత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Forwarded free of cost, and with the compliments of the Department of Education, Government of India, New Delhi.
Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

# విషయసూచిక

పుటల సంఖ్య

1. ఒకటవ అధ్యాయం

మానవుడు - మానవ స్వభావం 1- 14

2. రెండవ అధ్యాయం

సామెతలు - అరిషడ్వర్గం 15- 52

కామం-15; క్రోధం-20; లోభం-26; మోహం-33; మదం-40; మత్సరం-45

3. మూడవ అధ్యాయం

సామెతలు - ద్వంద్వాలు 53- 92

కష్టసుఖాలు-53; మంచీచెడులు-58; ఇష్టాయిష్టాలు-63; నిజం, అబద్ధం-66; నమ్మకం, అపనమ్మకం-70; అభిమాన దురభిమానాలు-74; భయనిర్భయాలు - 76; ఉపకారాపకారాలు - 80; సమర్థతాసమర్థతలు-83; ఆడంబర నిరాడంబరాలు-86; మొహమాట నిర్మొహమాటాలు-92

4. నాల్గవ అధ్యాయం

సామెతలు - విభిన్న స్వభావాలు 93-157

కృతఘ్నత-93; మోసం - 95; అనుమానం - 97; తిండిపోతుతనం-98; ప్రయత్నలోపం-104; అనుకరణం-107; అనుభవం-110; సోమరితనం-113; తొందరపాటు/ఆత్రం-116;

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అమాయకత్వం-118; లోకువ-119; ఆలస్యం - 123; అతి గారాబం-126; స్వార్థం-129; ఆశ-132; మొండితనం-137; అవకాశవాదం-139; లంచగొండితనం-141; క్రమశిక్షణ-142; నిష్ప్రయోజనం-143; ఉపాయం-144; చదువు-145; నిర్దయ-146; తప్పు-150; సంతోషం-152; అప్పు-153; పనికిమాలిన తనం-155; గయ్యాళితనం-156

5. ఆధార గ్రంధాల (వ్యాసాల) పట్టిక 158-162

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

## ఒకటవ అధ్యాయం

# మానవుడు - మానవ స్వభావం

పైకి మానవులంతా ఒకటే అయినా వాళ్ళ వాళ్ళ స్వభావాల్లో తేడాలుంటాయి. మానవుల రూపురేఖల్లో తేడాలెలా ఉంటాయో స్వభావాల్లో కూడా భిన్నత్వ ముంటుంది. "ఒకచేతి వేళ్ళే సమంగా ఉండవు", "ఒకే చెట్టు కాయలే ఒక్కలా ఉండవు" అని సామెతలు చెప్పినట్లుగా ఒకే తల్లికి పుట్టిన బిడ్డల్లోనే శారీరకంగా ఎంతో వ్యత్యాసం ఉంటుంది. ఒకే విధంగా కనిపించే కవలపిల్లల్లోనే ఏదో ఒక భిన్నత్వం ఉంటుంది. భౌతికంగానే భిన్నత్వం కనిపిస్తే ఇక స్వభావాల్లో మార్పులుండడం సహజం. ఒక్కొక్క మనిషి స్వభావం ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఒక్కొక్కసారి మానవుని ప్రవర్తన ఇతరుల్ని ఆశ్చర్యంలో ముంచివేస్తుంది. ఆదరించిన వ్యక్తినే నిరాకరించడం, ప్రేమించిన వ్యక్తినే ద్వేషించడం, ఒకసారి దయచూపి దగ్గరకు తీస్తే మరోసారి నిర్దయగా శిక్షించడం, ఈ విధంగా ఒక మనిషిలోనే ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క విధమైన స్వభావం వెల్లడవుతుంది. కొందరు నిష్కారణంగా ఇతరుల్ని హింసిస్తారు, మరికొందరు పరుల కష్టాల్ని తమవిగా భావించి సర్వజనులకు మార్గదర్శకులుగా ఉంటారు, శాంతస్వభావులుగా కొందరు పేరుకెక్కితే ముక్కుమీది కోపంతో ధుమధుమలాడే దుర్వాసమహామునులు కొందరు. "పరోపకారార్థమిదంశరీరమ్" అనే సూక్తిని అక్షరాల పాటించేవాళ్లు కొందరైతే "తిన్నయింటి వాసాల్ని లెక్కపెట్టే" కృతఘ్నులు మరికొందరు. ఈ దేశం నాకేమిచ్చిందంటూ తమ స్వార్థానికై దేశాన్ని తాకట్టుపెట్టే దేశద్రోహులూ మానవులే. ఎన్ని కష్టాలకైనా ఓర్చి అనుకున్న కార్యాన్ని సాధించే అపర భగీరథులు కొందరుంటే కాలాన్ని వృథాచేస్తూ దేశానికి, సంఘానికి చివరకు తల్లిదండ్రులకు కూడా భారమయ్యే సోమరిపోతులు మరికొంద రున్నారు. మానవుల్లోనే దుఃఖం వస్తే క్రుంగిపోయేవాళ్ళు, ఆనందం కలిగితే పొంగిపోయేవాళ్ళూ ఉన్నారు. సుఖదుఃఖాల్ని సమంగా భావించే విశాల హృదయులూ ఉన్నారు. మానవులుగా పుట్టినా దివ్యశక్తి సంపన్నులై మానవాతీత కార్యాల్ని చేస్తూ అవతారపురుషులుగా, మహాపురుషులుగా, జాతీయ వీరులుగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కీర్తింపబడే వాళ్ళు మానవులే. దగా, మోసం, ద్వేషాలకు ఆలవాలమై మానవత్వాన్నే మరచిపోయి నరరూపరాక్షసులుగా ప్రవర్తించే వాళ్ళు మానవులే.

మానవునిలో కనిపించే ఈ భిన్నత్వానికి మొదటి కారణం మనస్సే కావచ్చు. మానవుడు చేసే ప్రతిపని వెనుక కనిపించే బలమైన సాధనం అతని మనస్సే. మానవుని స్వభావం మనస్సు ననుసరించే ఉంటుందని అంటాడు వేమన.

"ఏ వంక మనసు కలిగిన
నా వంకకు నింద్రియంబులన్నియు నేగున్"[1]

మంచిచేసినా, చెడు చేసినా మనస్సే ప్రధానం. మనస్సుకు నచ్చితే ఎంతో కష్టసాధ్యమైన పనైనా చేస్తారు. నచ్చకపోతే ఎంత సులభమైనా చేయరు. "Where there is a will there is a way" అని ఆంగ్లసామెత. మనస్సుంటే మార్గముంటుంది." "పూజకన్నా బుద్ధి - బాటకన్న మనసు ప్రధానం" అనే సామెతలు సమర్థిస్తాయి. మనస్సుకు నచ్చితేనే ఏ స్త్రీయైనా భర్తతో కాపురం చేస్తుంది. మనస్సుకు నచ్చకపోతే కాపురం చేయడానికి ఇష్టపడదని" మనసుకు నచ్చినవాడు మొగుడుకాని తాళికట్టగానే మొగుడౌతాడా ?" అనే సామెత వెల్లడి చేయగా "మనసు కుదిరితేమల్లి - మనసు కుదరకుంటే ఎల్లి" అని అంటుంది మరో సామెత. "మనసు లేని మనువు వలె" ఇష్టంలేకపోతే ఏదైనా వ్యర్థమే. కావున మానవుని స్వభావంపై మనస్సు ప్రభావాన్ని చూపిస్తుంది. ఏ పని చేసినా త్రికరణ శుద్ధిగా చేయాలని అంటారు. త్రికరణాల్లో మళ్ళీ మనస్సే ప్రథమంగా ఉంటుంది. మనస్సు పెట్టి చేయకపోతే ఏ పనైనా సరిగా జరుగదు. చేసే పనిలో కల్మషం చోటు చేసుకుంటుంది. ఒకే శరీరంతో భార్యను ఆలింగనం చేసుకున్నా, కూతురిని ఆలింగనం చేసుకున్నా మనోభావంలో తేడా ఉంటుంది. భార్య ఆలింగనంలో పొందే అనుభూతికి, కూతురు ఆలింగనంలో పొందే అనుభూతికి భేదం కనిపిస్తుంది. శరీరం ఒకటే అయినా మనస్సు ప్రధానం కావటంవల్ల మనోభావంలో అంతరం చూపించడం జరుగుతుంది :

1. వేమన పద్యములు-పద్యం నెంబరు 508 - శ్రీ యస్. వి. గోపాల్ అండ్ కో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



మనసైవకృతంపాపం నశరీరం కృతం కృతమ్
యేనై వాలింగితాకాన్తా తేనై వాలింగితాసుతా"[2]

శివలింగాన్ని కాలితో తన్నినా, పుక్కిటి నీటిని శివలింగంపై పోసినా తిన్ననికి శివసాయుజ్యం లభించింది కదా! కావున నిర్మలమైన మనస్సే ప్రధానం.

మానవుని శుభాశుభకార్యాలకు మనస్సే కారణమని క్రింద శ్లోకం వివరిస్తుంది.

"మనోహి హేతుసర్వేషామింద్రియాణాం ప్రవర్తనే
శుభాసభాస్యవస్థాసు తచ్చమే సువ్యవస్థితమ్."[3]

ఇంద్రియాలన్నీ మంచిలోగానీ, చెడులోగానీ ప్రవర్తించడానికి మనస్సే కారణం. ఆ మనుస్సును నిగ్రహించి ఆధీనంలో పెట్టుకోవాలి, మనస్సే బంధ మోక్షాల రెండింటికీ కారణమని మైత్ర్యుపనిషత్తు తెలుపుతుంది ;

"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో ;
బంధాయనిషయా సంగి ; ముక్త్యైనిర్విషయం స్మృతం"[4]

మానవుని స్వభావంపై ప్రభావాన్ని చూపే మనస్సు అతివిచిత్రమైంది. మనస్సు మానవుని నడిపించే తీరు మరీ విచిత్రంగా ఉంటుంది. మనస్సు చంచలమైంది. క్షణక్షణానికి మారిపోతూ ఉంటుంది. దాని గమనానికి హద్దులుండవు' కట్టుబాటులుండవు. గాలికందే వేగంగా పరుగెత్తుతుంది. గాలిని పట్టడం ఎంత కష్టమో మనోవేగాన్ని కట్టుదిట్టం చేయడం అంతకంటే కష్టం. చంచలమైన మనస్సును స్వాధీనం చేసుకోవటానికి నిరంతర సాధన ఉండాలి. ఎన్నో రకాల సాధనల్ని చేయాలి. అలా సాధనచేసే వారికి ఏదో ఒకనాటికి మనస్సు స్వాధీనం కావచ్చు.

---

2. మహీధర జగన్మోహనరావు సూక్తిముక్తావళి పుట. 400
3. శ్రీమద్రామాయణం - సుందరకాండ 11-41
4. మైత్ర్యుపనిషత్తు - 6-30

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"కింతు చిత్తం మనుష్యాణా మనిత్యమితిమే మతిః
సతాంతు ధర్మనిత్యానాం కృతశోభిచ రాఘవః"[5]

(మానవుల మనస్సు ఎప్పుడూ మారిపోతూ ఉంటుంది. పారిపోతూ ఉంటుంది. ధర్మమార్గంలో నడిచే ధార్మికుల్లో మాత్రం అది నిలకడగా నిలబడి ప్రకాశిస్తుంది.)

"చంచలం హిమనః కృష్ణప్రమాథిబలవద్దృఢమ్
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్"[6]

(మనస్సు కున్న స్వభావం చంచలత. అది అణగదు. మొండితనంతో తాను పట్టిన దారిలోన వెళ్ళుతుంది. దాన్ని అణచడం గాలిని అణచడంతో సమానమే గదా! అది వీలుకాని పనేకదా!)

మనస్సు స్వాధీనమైతే చాలు మంత్రతంత్రాలతో పనిలేదు. ఆ మనస్సే స్వాధీనం కానపుడు మంత్రతంత్రాలు కానీ, పూజా పునస్కారాలు కానీ వ్యర్థమని అంటాడు త్యాగరాజు.

"మనస్సు స్వాధీనమైన యాఘనునకు
మరి మంత్ర తంత్రములేల ?"

"మనస్సు నిల్ప శక్తి లేకపోతే
మధుర ఘంటా విరులపూజేమి చేయను"

"మనస్సుకు మనస్సే సాక్షి" అని సామెత. మనస్సును అర్థం చేసుకోవడం అంత కష్టమన్నమాట. లోకంలో దేన్నైనా అర్థం చేసుకోవచ్చును గానీ మనస్సును అర్థం చేసుకోవడం సాధ్యంకాదు. అందుకే "బావిలోతును చూడవచ్చును గానీ, మనస్సులోతును చూడకూడదు" అనే సామెత పుట్టింది. మనస్సు నరకాన్ని స్వర్గంగా, స్వర్గాన్ని నరకంగా భాసింప చేస్తుంది.

**The mind in its own place and in itself can make a heaven of hell and a hell of heaven' (Milton)**

---

5. శ్రీమద్రామాయణం - అయోధ్యాకాండం 4-27
6. శ్రీమద్భగవద్గీతః 6 వ అధ్యాయం 34 వ శ్లోకం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



మానవుని మనస్సు అద్దంలాంటిది. అద్దాన్ని అతి సున్నితంగా చూసుకోవాలి. చేయిజారితే ముక్కలై పోతుంది. తిరిగి అతికించడం సాధ్యం కాదు. ఒకవేళ అతి కష్టంతో అతికించినా పూర్వపుశోభరాదు. కానీ మనస్సు విరిగితే మాత్రం అతకడానికి వీల్లేదు. ఇనుము విరిగితే అతకవచ్చును కానీ మనస్సు విరిగితే అతకరాదని అంటాడు వేమన.

"ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాచి యతకనేర్చు కమ్మరీడు
మనసు విరిగెనేని మఱియంటనేర్చునా"7

అతి సున్నితమైన మనస్సును ఎపుడు బాధపెట్టకూడదు. మనస్సుకు కష్టం కలిగించే మాటలు పలుకరాదు. శరీరానికి తగిలిన గాయాన్ని మాన్పవచ్చు కాని మనస్సుకు గాయమైతే మాన్పలేమని భారత సూక్తి.

"తనువున విఱిగిన యలుగుల
ననువున బుచ్చంగవచ్చు నతినిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె యధిపా"8

అందుకే "మనసున నాటిన మాటలు చెరపలేరు" అనే సామెత పుట్టింది.

ఆడవారి మనస్సు మరీ చంచలమైందని అంటారు. "క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్" అన్నట్లుగా ఆడవారి మనస్సు క్షణక్షణం మారిపోతూ ఉంటుంది. ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో చెప్పలేము. ఒకసారి కోపిస్తే మరోసారి ప్రేమను ఒలకబోస్తారు. ద్వేషించినవాళ్ళనే ప్రేమిస్తారు. ప్రేమించినవాళ్ళనే ద్వేషిస్తారు. తమకు నచ్చితే అందలమెక్కిస్తారు. నచ్చకపోతే అగాధంలోకి తోసేస్తారు. ఆడవాళ్ళ మనస్సును లోకంలో ఏవి పట్టి బంధించలేవు. ఎంత అనురాగం చూపినా, అష్టైశ్వర్యాలున్నా, కోరిన కోరికల్ని తీర్చినా ఆడవారి మనస్సును ఆకట్టుకోవడం సాధ్యంకాదు. పుట్టించిన బ్రహ్మకైనా ఆడదాని మనస్సును అర్థం చేసుకోవడం వీలు కాదంటే ఇక మానవుడి గురించి చెప్పనవసరం లేదు.

"నకులంనకృతం విద్యా నదత్తం నాపి సంగ్రహమ్
స్త్రీణాం గృహ్ణాతి హృదయం అనిత్యహృదయా హితాః :"9

---

7. వేమన పద్యములు : 5వ పద్యం - ఎస్. వి. గోపాల్ అండ్ కో.
8. ఆంధ్రమహాభారత - ఉద్యోగపర్వం — 2-62
9. శ్రీమద్రామాయణం - అయోధ్యాకాండం 39-28

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



చంచలమైన ఆడదాని మనస్సును కులం, సాహాయ్యం, పాండిత్యం, పారితోషికాలు చివరకు వివాహబంధం కూడా కట్టి బంధించలేవు.

మానవులంతా ఒకటే అనుకున్నా వాళ్ళవాళ్ళ ప్రవర్తనాన్ని బట్టీ మాట తీరును బట్టీ సజ్జనులనీ దుర్జనులనీ వేమన రెండు విధాలుగా విభజిస్తాడు.

ఉప్పుకప్పురంబు నొక్క పోలికనుండు
జూడజూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా"11

"జిహ్వాకొకరుచి పుర్రెకొకబుద్ధి" అన్న సామెత మానవ స్వభావంలోని భిన్నత్వాన్ని తెలుపుతుంది. మానవుల్లో కనిపించే భిన్నభిన్న స్వభావాలకు కారణం పూర్వజన్మ కర్మంఫలం కూడా ఒకటి. "బుద్ధి : కర్మానుసారణీ" అన్నట్లుగా మానవుని బుద్ధి కర్మననుసరించి నడుచుకుంటుంది. ఈ జన్మలో మానవుడు చేసే ప్రతికర్మకు పూర్వజన్మ కర్మఫలమే కారణం :

"యదాచరిత (కళ్యాణి) శుభంవాయ దివాఽశుభమ్
తదేవలభతే భద్రం కర్తా కర్మజమాత్మనం"12

(మంచిగానీ, చెడుగానీ పూర్వజన్మలో మానవుడు ఎలాంటి కర్మ చేస్తాడో దానివల్ల కలిగే సుఖంకానీ, దుఖం కానీ అనుభవిస్తాడు.)

మానవుడు ఎంతో ఉత్తమ వంశంలో పుట్టినా, సదసద్వివేకం ఉన్నా పూర్వజన్మలో చేసుకున్న కర్మఫలాన్ని అనుభవించక తప్పదని భారత సూక్తి.

"ఎట్టి విశిష్ట కులంబున
బుట్టియు సదసద్వివేకములు గల్గియుమున్
గట్టిన కర్మ ఫలంబులు
నెట్టన భోగింపకుండ నేర్తురె మనుజుల్"13

కాలాన్నిబట్టి వృక్షం ఫలించినట్లుగా మానవుడు తాను పూర్వజన్మలో చేసుకున్న తపస్సే ఫలిస్తుంది కానీ అతని ఆకారం కానీ, కులంగానీ, శీలంకానీ, విద్యకానీ ఎంతో కష్టానికోర్చి చేసే సేవ కానీ ఫలించదని భర్తృహరి నీతి :

10. వేమన పద్యములు : 16వ పద్యం ఎస్.వి. గోపాల్ అండ్ కో
11. శ్రీమద్రామాయణం - అయోధ్యాకాండం 63-6
12. ఆంధ్రమహాభారతం - ఆదిపర్వం 5-58

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"నైవాకృతిః ఫలతి, నైవకులం, నశీలం,
విద్యాపినైవ, నచ యత్న కృతాఽపిసేవా
భాగ్యాని పూర్వతపసా ఖలుసఞ్చితాని
కాలేఫలంతి పురుషస్య యథైవ వృక్షః[13]

"ఎవడెవడు చేసిన కర్మ వానికే కొట్టుకుంటుంది." అనే సామెత కూడ పూర్వ జన్మ కర్మఫలాన్ని సమర్థిస్తుంది."

పూర్వజన్మ కర్మఫలమేగాక ప్రకృతి, అనువంశికం, సామాజిక పరిస్థితులు, పరిసరాలు, విద్య, ధనం, అధికారం, కులం, ఆర్థిక, మత, రాజకీయ పరిస్థితులు కూడా మానవుని స్వభావంపై ప్రభావాన్ని చూపిస్తాయి. వయసు యొక్క ప్రభావం కూడా మానవుని స్వభావంపై పని చేస్తుంది.

మానవుని స్వభావంపై మిక్కిలి ప్రభావాన్ని చూపేది ప్రకృతి ప్రకృతి మానవునికి ప్రథమ గురువులాంటిది. మానవుని పరిశీలనా జ్ఞానం ప్రకృతి వల్లనే పెరుగుతుంది. ప్రకృతిలోని వివిధ పదార్థాల్ని, సన్నివేశాల్ని పరిశీలించే మానవుడు తన జీవితాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దుకన్నాడు. ఎంతో అభివృద్ధిని సాధించాడు. మానవుని ప్రవృత్తికి ప్రధాన హేతువైన మనస్సును నియంత్రణ చేసేది ప్రకృతే అని భగవద్గీత చెబుతుంది.

"సత్త్వం రజస్తమ ఇతిగుణాః ప్రకృతి సంభవాః[14]

మానవుడి మనస్సును నియంత్రణం చేసే సత్త్వరజస్తమో గుణాలు పాంచభౌతికమైన ప్రకృతి నుండి పుట్టునని భావం. మానవుడి శరీరం కూడా పాంచభౌతికమే. అందువల్ల మానవుని స్వభావంపై ప్రకృతి ప్రభావాన్ని చూపుతుందనడంలో సత్యదూరంలేదు.

అనువంశికంగా వచ్చే లక్షణాలు మానవుని స్వభావం భిన్నంగా ఉండడానికి కారణం. వంశ పారంపర్యంగా కొన్ని లక్షణాలు మానవులకు సంక్రమిస్తాయి :

---

13. భర్తృహరి నీతిశతకం - 97 వ పద్యం
14. శ్రీమద్భగవద్గీత : 14 వ అధ్యాయం 5 వ శ్లోకం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అంగాదంగాత్సంభవసి హృదయాదధి జాయసే
ఆత్మ వై పుత్ర నామాసిత్వం జీవశరదశ్శతమ్[15]

తండ్రియే కుమారునిగా జన్మిస్తాడని భారతవచనం. తండ్రి శరీరంలోని ప్రతి అవయవంలోని లక్షణాల్ని పుణికి పుచ్చుకొని పుత్రుడు జన్మిస్తాడట.

"వినుగార్హ పత్యమనున
య్యనలము విహరింపబడి తదాహవనీయం
బున వెలుగునట్లు వెలుగును
జనకుడుదా బుత్రుడై నిజద్యుతితోడన్"[16]

పాశ్చాత్యులు కూడా అనువంశిక ప్రభావాన్ని సమర్థిస్తారు. డార్విన్ "సంతానం అనువంశిక ప్రభావం" అనే విషయాన్ని చర్చిస్తూ **"From all this we know for certain that the natural qualities of parents will reappear amongst their discendents to such an extent as to enable us to foretell in no small degree, the characteristics of the coming generation"**[17] అని అంటాడు.

**J. P. Guil Ford** అనే మనస్తత్వ శాస్త్రవేత్త **"A child development and his personal characters are product of interaction between his heridity and his environment"**[18] అని అంటాడు.

తల్లిదండ్రుల శారీరక లక్షణాలు వంశ పారంపర్యంగా పిల్లలకు సంక్రమిస్తాయని "తల్లికి బొల్లి వుంటే పిల్లకు చుక్క అయినా ఉంటుంది." అనే సామెత చెబుతుంది.

తల్లిదండ్రుల శారీరక లక్షణాలెలా సంతానానికి సంక్రమిస్తాయో అట్లే వాళ్ళ స్వభావ సంస్కారాలు కూడా సంక్రమిస్తాయి. తల్లి నుంచి కూతుళ్ళకు,

---

15. మంత్రప్రపన్నములు : 2వ పన్నం
16. ఆంధ్ర మహాభారతం - ఆది 4-87
17. **What Is Eugenics : Page – 19**
18. **Fields of Psychology : Page 107 Edited by J. P. Guil Ford.**

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



తండ్రి నుంచి కుమారులకు సజాతీయమైన సంస్కారాలు స్వభావాలు వార సత్వంగా వస్తుంటాయి :

"పితౄన్సమనుజాయన్తే నరా మాతరమంగనాః"[19]

తల్లిదండ్రుల స్వభావాదులు సంతానంపై ప్రభావాన్ని చూపగలవని సామెతలు వెల్లడిచేస్తాయి. తల్లివలెనే పిల్లలు ప్రవర్తిస్తే అలాంటివాళ్ళను విమర్శించే సందర్భంలో "తల్లిచాలు పిల్లకు తప్పుతుందా?"అనే సామెతను చెప్పుకుంటారు. "ఆ తండ్రికి కొడుకు కాడా?", ఆ తల్లికి కూతురుకాదా?" అనే సామెతలు రూపురేఖల్లో స్వభావాల్లో తల్లిదండ్రుల్లా ఉంటారని వెల్లడి చేస్తాయి. ఇలాంటివే "ఆ గుడ్డలోదే ఆ పేలిక", "ఆ కట్టెలోదే ఆ పేడు" అనే సామెతలు :

ఏ విత్తనం నేలలో నాటితే దానికి సంబంధించిన చెట్టే మొలుస్తుంది. అలాగే తల్లిదండ్రుల లక్షణాలే పిల్లల్లో ఉంటాయని "తల్లిని బట్టి పిల్ల విత్తును బట్టి పంట" అనే సామెత సూచిస్తుంది.

బలవంతులకు బలవంతులైన వాళ్ళు జన్మిస్తారు. కాని బలహీనులు జన్మించరని "పులి కడుపున లేడి పుట్టునే", "పులి కడుపున మేక పుట్టునే", "గోధుమలు చేస్తే బాదములు పండునా?", "చిక్కుడు తీగకు బీరకాయ కాస్తుందా?" అనే సామెతలు చెబితే మరికొన్ని సామెతలు తల్లిదండ్రులకు భిన్నంగా ప్రవర్తించే వాళ్ళ స్వభావాన్ని వెల్లడి చేస్తాయి." "పులికడుపున మేక పుట్టినట్లు", "పనివాని కడుపున తినువాడు పుట్టినట్లు" అనేవి ఉదాహరణాలు.

మానవుని మనస్సుపై వయస్సు యొక్క ప్రభావం పని చేస్తుంది. అందు వల్ల స్వభావాల్లో తేడా ఉంటుంది. బాల్యంలోని, యౌవనంలోని, వృద్ధాప్యం లోని మనో భావాలకు భిన్నత్వం ఉంటుందని J. P. Guil Ford అభిప్రాయం :

"Behavioural differance among the infant, the teenager the adult in his prime and the actoge heriam are fully conspicious as the difference is their physical appearance"[20]

---

19. శ్రీమద్రామాయణం - అయోధ్యకాండం 35 - 261
20. Fields of Paychology – Page 142 : J. P. Guil Ford.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



బాలల హృదయం నిర్మలంగా ఉంటుంది. ఎలాంటి కల్మషాలుండవు. అలాంటి నిర్మల మనుస్సులో చుట్టూ ఉన్న వాతావరణాన్నిబట్టి నిక్షిప్తంగా ఉన్న భావాలు బయటికి ప్రకటితమవుతాయి. బాల్యంలో పిల్లల మానసికస్థితిలో పరిపక్వత ఉండదు. అందువల్ల ఏదైనా విషయాన్ని ఆలోచించేశక్తి వాళ్ళలో ఉండదు. తమలోని ఉద్వేగాన్ని అదుపు చేసుకోలేరు. అందువల్ల పెద్దలు చెప్పినా వినరు. ఒక్కొక్కసారి మొండి చేస్తారు. పిల్లలకు ఏదైనా సరే ఒకసారి అలవాటయితే దాన్ని మాన్పించడం కష్టం. ఎత్తుకోవడం చిన్నపిల్లలకు అలవాటు చేస్తే ఎపుడూ ఎత్తుకొనే ఉండాలి. క్రిందికి దించితే ఏడుస్తారు. అందుకే ఎత్తుకొవడం అలవాటు చేయకూడదంటారు. "చంకెక్కిన పిల్ల చచ్చినా దిగదు" అనే సామెత కూడా పై విషయాన్ని చాటుతుంది.

పిల్లల మనస్సు లేతకొమ్మ లాంటిది. మొక్క చిన్నగా ఉంటే ఎటు వంచితే అటే పెరుగుతూ పోతుంది. పిల్లల మనస్సు కూడా అలాంటిదే. అందుకే బాల్యం నుండే పిల్లలకు మంచివాళ్ల సంపర్కం చాలా అవసరమంటారు పెద్దలు. బాల్యంలో ఏ అలవాట్లకు పిల్లలు లోబడితే అవే వాళ్లపై జీవితాంతం వరకు ప్రభావాన్ని చూపుతుంది. మరలా ఆ మార్గం నుండి మరల్చడం చాల కష్టం అందుకే "మొక్కై వంగుతుంది గాని మానై వంగుతుందా?" అనే సామెత పుట్టింది. పిల్లలుగా ఉన్నపుడు తల్లిదండ్రుల మాటల్ని వింటారు వాళ్లపై ప్రేమానురాగాల్ని చూపుతారు. కానీ వయసు పెరుగుతున్న కొద్ది ఆలోచనా విధానాల్లో మార్పు రావడం సహజం. స్వయంగా ఆలోచించే శక్తి రావడంవల్ల తల్లిదండ్రుల ఆలోచనల్ని ఒక్కొక్కసారి లెక్క చేయరు. తల్లిదండ్రుల మాటల్ని వినరు. "అడ్డాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడు బిడ్డలా" అనే సామెత పై విషయాన్ని సమర్థిస్తుంది. పెండ్లయి భార్యలొస్తే కొడుకుల్లా ప్రవర్తించరని "కనిపించిననాడు కొడుకులు గాని కోడళ్ళు వచ్చాక కొడుకులా?" అని సామెత వివరిస్తుంది.

బాల్యంలోని మానవుని స్వభావానికి యౌవనంలోని స్వభావానికి తేడా ఉంటుంది. అలాగే ముసలితనం వచ్చేసరికి ప్రవర్తనలో మార్పు ఉంటుంది. మొండితనం, పట్టుదల, చాదస్తం లాంటివి అలవాటు పడతాయి. శారీరకంగా అలసిపోవడమే గాక మానసికంగా కూడా అలసిపోతారు. తమ పిల్లలు సరిగా చూసుకోవడం లేదనీ, తమ మాటల్ని వినడం లేదనీ అనవసరమైన అపోహల్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పెంచుకొని తమలో తాము బాధపడి పోతారు. చిరాకు పొంది ఏమేమో మాట్లాడుతారు. వాళ్ల మనస్సులో స్థిరత్వ ముండదు. వయసు పెరుగుతున్నకొద్దీ బుద్ధి నశిస్తుందని "ఏండ్లు ఎగసన-బుద్ధిదిగసన", "అరవైయేండ్లయితే అరులుమరులు" అనే సామెతలు చెబుతాయి.

అరవైఏండ్లుదాటిన వాళ్లలో బుద్ధి మందగిస్తుంది కాబట్టి అలాంటివాళ్లను ఏ ఆలోచన అడగకూడదనీ, ఇరవై ఏండ్లలోపువాళ్లలో బుద్ధివికాసం ఉండదు కావున వాళ్లకు పెత్తనమీయకూడదని "అరవైఏండ్లు నిండినవాడిని ఆలోచన అడక్కు- ఇరవైఏండ్లు నిండనివానికి పెత్తనమీయకు" అనే సామెత వెల్లడి చేస్తుంది.

మానవ స్వభావంలోని భిన్నత్వానికి అనుకరణం కూడా ఒక కారణం. మానవుడు సంఘజీవి కాబట్టి సమాజంలోని వివిధ వ్యక్తుల స్వభావాలు అతనిపై ప్రభావాన్ని చూపిస్తాయి. అనుకరణమనేది బాల్యంలో ఎక్కువగా ఉంటుంది. "సంఘంలోని మర్యాద, మన్ననలు, భక్తిశ్రద్ధలు, పూజాపురస్కారముల వైఖరి మొదలగునవి పెద్దవారిని చూచి వారివలెనే నటించుకొరిక చిన్ననాటి నుండియే అజ్ఞాతముగా పని చేయుచుండును"21 సంఘంలోని పెద్దల ననుసరించి ఇతరులు నడుచుకుంటారని భగవద్గీత చెబుతుంది.

"యద్యదా చరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరోజనః
సయత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే"22

రాజు ప్రవర్తననుసరించి ప్రజలు నడచుకుంటారని క్రింది శ్లోకం వివరిస్తుంది.

"యద్వృత్తాః సన్తిరాజానఃతద్వృత్తాః సన్తిహిప్రజా"23

"యథారాజా తథాప్రజా" అనే సంస్కృత లోకోక్తి కూడ ప్రచారంలో ఉంది. స్త్రీలలో ఈ అనుకరణ స్వభావం ఎక్కువగా ఉంటుంది. అనుకరించడం మంచి విషయాల్లో ప్రయోజనకరమే కాని ఉచితానుచితాల్ని పాటించక గ్రుడ్డిగా అనుక

21. కె. వేదాంతాచారి : పిల్లలు శిక్షణాసమస్యలు : పుట. 99
22. శ్రీమద్భగవద్గీత : 3వ అధ్యాయం 21వ శ్లోకం.
23. శ్రీమద్రామయణం : అయోధ్య - 109-9

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



రిస్తే చాలా ప్రమాదకరం. పిల్లలు తమ తల్లిదండ్రులు ఎలా ప్రవర్తిస్తే వాళ్లు కూడా అలాగే అనుసరిస్తారని కొన్ని సామెతలు వెల్లడి చేస్తాయి.

"ఆవు చేలో మేస్తే దూడగట్టున మేస్తుందా?"
"తల్లి చేనులో మేస్తే పిల్లమేర మేస్తుందా?"
"తల్లి చేనులో మేస్తే దూడ గట్టున మేస్తుందా?"
"తల్లి నీటిలో ఏరిగితే పిల్ల ఒడ్డున ఏరుగుతుందా?"

తల్లిదండ్రుల్ని చూసి వాళ్లవలెనే ప్రవర్తించే పిల్లల స్వభావాన్ని విమర్శిస్తూ క్రింది సామెతలు పుట్టాయి.

"అందరూ ఆ బుర్రలోని విత్తనాలే?"
"ఆతానులోదే ఈ పీలిక"
"ఆతాడి (తాటిచెట్టు) లోనిదే యీపేడు"
"ఆపడుగులోనిదే ఈపేక"

కొందరు తమ శక్తికి మించిపోయి ఇతరుల్ని అనుకరించి నలుగురిలో నవ్వులపాలవుతుంటారు. కష్టాల్ని కొని తెచ్చుకొంటారు. "పులిని చూచి నక్క వాత పెట్టుకొన్నట్లు", నెమలిని చూచి నక్క నాట్యమాడినట్లు", "వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు తులాభారం తూగితే కరెడ్ల కామక్క వంకాయల భారం తూగిందట" అనే సామెతలు మానవుని స్వభావంపై ఉన్న అనుకరణ ప్రభావాన్ని నిరూపిస్తాయి.

ధనం, విద్య, వంశం అధికారం ఉండడంవల్ల కొందరి స్వభావాల్లో మార్పులు వస్తుంటాయి. సజ్జనులైన వాళ్ళలో ధనం, విద్య ఉత్తమ వంశం ఎలాంటి మార్పుల్ని కల్గించవు. కాని అవే దుర్మార్గుల స్వభావాల్లో మార్పుల్ని కల్గిస్తాయి.

"ధనమును విద్యయు వంశం
బును దుర్మతులకు మదంబు పొనరించును, స
జ్జనులైన వారి కడకువ
యును వినయము నివియతెచ్చునుర్వీనాథా"[24]

---

24. ఆంధ్రమహాభారతం - ఉద్యోగ : 2-35

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"అల్పబుద్ధి వాని కధికారమిచ్చిన దొడ్డవారినెల్ల తొలగగొట్టు" అని అన్నాడు వేమన. అల్పులకు ధనం అధికారం లభిస్తే గర్వంతో విర్రవీగి ప్రవర్తిస్తారనీ, అవి మానవుని స్వభావంపై ప్రభావాన్ని చూపుతాయని క్రింది సామెతలు నిరూపిస్తాయి.

"చీపురుకట్టకు సిరివస్తే గోలకొండ కాడికి గొడుగుపట్టమన్నాడట"
"అల్పుడికి ఐశ్వర్యం వస్తే అర్థరాత్రి గొడుగుపట్టమన్నాడట"
"నడమంత్రాన సిరివస్తే నడిరేయి గొడుగుపట్టమన్నాడట"
పేనుకు పెత్తనమిస్తే తలంతా తెగకొరికి పెట్టిందట"

పరిసరాల పరిస్థితుల్నిబట్టి మానవుని స్వభావంలో మార్పు కనిపిస్తుంది. పరజాతీయులు దేశాన్ని పాలించిన రోజుల్లో భారతీయులు కుంచించుకున్న తాబేళ్ళలా జీవనాన్ని సాగించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో చైతన్య ప్రవంతిలా ఉప్పొంగి బ్రిటిషువాళ్ళపై తిరుగుబాటు చేశారు. రాజకీయాల్లో ప్రవేశించిన వాళ్ళెందరో పరిస్థితుల ప్రభావానికి లోనై అవినీతిపరులుగా, లంచగొండులుగా మారిపోతారు. పరిస్థితులే మనిషిని దొంగగా, సోమరిపోతుగా మారుస్తాయని ;

"బీద బలసి బంది కాడైనట్లు"
"ఒళ్లు వంగనివాడు దొంగలలో కలసినాడట" అనే సామెతలు చెబుతాయి.

పిల్లల ప్రవర్తన ఇంటి పరిసరాల్ని బట్టి, వాళ్లు ఎక్కువ కాలం గడిపే పరిసరాల పరిస్థితుల్ని బట్టి మార్పు చెందుతుంది. ఇల్లే పిల్లలకు ప్రథమ పాఠశాల తల్లిదండ్రులే ప్రథమ గురువులంటారు. ఇంటివాతావరణం, ఇంట్లోని సభ్యుల ప్రవర్తన పిల్లల స్వభావంపై బలంగా పనిచేస్తాయి. ఇంట్లో క్రమశిక్షణగా నడుచుకొంటే బయటకూడా అలాగే నడుచుకుంటారు. తల్లిదండ్రుల్లా పిల్లలు కూడా ప్రవర్తిస్తారు.

"ఏ యీకల పక్షి ఆ గుంపులోనే చేరుతుంది"
"ఏ గూటి చిలుక ఆ గూటిపదం పాడుతుంది"

"ఏ వాద చిలుక ఆ వాద పలుకు పలుకుతుంది" అనే సామెతలు పరిసరాల ప్రభావం పిల్లలపై ఉంటుందని వెల్లడి చేస్తాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఇంట్లో కూడా తల్లి పోషణలో పెరిగిన బిడ్డకు స్వభావంలో తేడా ఉంటుంది. తల్లి పిల్లల్ని పెంచినట్లు తండ్రి పెంచలేడు. అందుకే "తల్లిపెంచిన బిడ్డా తండ్రి పెంచిన బిడ్డా" అనే సామెత పుట్టింది. "అమ్మ పెంచిన బిడ్డా అబ్బ పెంచిన బిడ్డా" అనేది కూడా పై సామెత లాంటిదే.

ఒంటరిగా ఉన్నపుడు, గుంపులో ఉన్నపుడు మనిషి స్వభావంలో భిన్నత్వం ఉంటుంది. ఒంటరిగా ఉన్న మంచివాడు గుంపులో భిన్నంగా ప్రవర్తిస్తాడు. క్రమశిక్షణ ఉన్న గుంపునకు, క్రమశిక్షణ లేని గుంపునకు ప్రవర్తించే పద్ధతుల్లో కూడా తేడాలు కనిపిస్తాయి ఒంటరిగా ఉంటే ఇతరు లేమనుకుంటారో అని భయంతో ప్రవర్తించేవాడు గుంపులో కలిస్తే తననెవరూ గుర్తించరని తలంచి భిన్నంగా ప్రవర్తిస్తాడని" "గుంపులో గోవిందా అన్నట్లు" అనే సామెత వెల్లడి చేస్తుంది. వ్యక్తిగత అభిప్రాయం ఎలా ఉన్నా సమాజంలో ఉన్నందువల్ల సమాజం కోసం అభిప్రాయాన్ని మార్చుకుంటాడని "నలుగురు నడిపించే బాట - పలుపురు పలికిందే బాట" అనే సామెత వ్యక్తం చేస్తుంది.

సాంఘిక కట్టుబాట్లు, ఆచారవ్యవహారాలు మానవుని ప్రవర్తనలో మార్పుల్ని కలిగిస్తాయి సంఘజీవియైన వాడు "తాను బట్టిన కుందేటికి మూడే కాళ్లు" అని పట్టుపట్టలేడు. "ఊరందరిదీ ఒకదారి ఉలిపికట్టెదొకదారి" అన్నట్లు సమాజంలో నడుచుకోలేడు. సాంస్కృతిక విలువలకు ఆచార వ్యవహారాలు అత్యంతావశ్యకం కాబట్టి మనిషి ఆచార వ్యవహారాల్ని పాటించి నడచుకోవలసి ఉంటుంది అందువల్ల వ్యక్తిగత అభిప్రాయాలకు భిన్నమైనా సదాచారాల్ని పాటించక తప్పదు. కాబట్టి మనిషి స్వభావంలో భిన్నత్వం కనిపిస్తుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

## రెండవ అధ్యాయం

# సామెతలు - అరిషడ్వర్గం

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరాలనే ఆరింటికి అరిషడ్వర్గమని పేరు. వీటినే అంతశ్శత్రువులని అంటారు. మానవుని బాహిర శత్రువుల కంటే ఈ అంతశ్శత్రువులే చాలా ప్రమాదకరమైనవి. అందువల్ల అంతశ్శత్రువుల్ని గెలిస్తే బయటి శత్రువుల్ని గెలవడం చాలా సులభం. అరిషడ్వర్గాన్ని జయించినవాడే బాహిర శత్రువుల్ని జయిస్తాడని భారతవచనం!

మదము గామంబు గ్రోధంబు మత్సరంబు
లోభమును మోహమును ననులోని సహజ
వైరి వర్గంబు నొడిచినవాడే యొడుచు
నశ్శంబున వెలుపలి యహిత తతుల[1]

కామ, క్రోధ, లోభాలనే మూడు ఆసుర గుణాలనీ, అవియే నరకానికి ద్వారాలనీ గీతాచార్యుని సూక్తి!

"త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః
కామక్రోధ స్తథా లోభ స్తస్మాదేత త్త్రయంత్యజేత్[2]

సహజాతులైన కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మత్సరం సామెతల్లో చిత్రించబడిన విధం చర్చించబడుతుంది.

### కామం :-

అరిషడ్వర్గంలో కామం మొదటిది. అరిషడ్వర్గాన్నే అంతశ్శత్రువులని అంటారు. అంతశ్శత్రువులు చాలా ప్రమాదకరమైనవి. బాహిర శత్రువుల్ని

1. ఆంధ్ర మహాభారతము : 1-3-206.
2. శ్రీమద్భగవద్గీత - 16వ అధ్యాయం : 21వ శ్లోకం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



జయింపవచ్చు కానీ అంతశ్శత్రువుల్ని జయించడం చాలా కష్టమని అంటాడు శ్రీనాథమహాకవి :

బాహ్యశత్రుల పరిహరింపంగ వచ్చు
నంతరారుల నిర్జింపనలవి గాదు[3]

కామవాంఛ చాలా బలవత్తరమైంది. అందుకే "ఎంతవారలైన కాంత దాసులే" అన్నాడు త్యాగరాజు. కామానికి దాసుడైనవాడు కన్నూ మిన్నూ కానక ప్రవర్తిస్తాడు. భౌతిక సుఖం కోసం పరస్త్రీ వ్యామోహంలోపడి ఉచితానుచితాల్ని, ధర్మాధర్మాల్ని పాటించడు. భయం, సిగ్గు వదలివేస్తాడు. కామాసక్తి గలవాడు సమయాసమయాల్ని గురించి ఆలోచించడని తెలిపే సామెతలు :

"కామతురాణాం నభయం నలజ్జా"
"కామము కాలమెరుగదు"
"కామానికి కండ్లులేవు గుడిసేటికి గుణంలేదు"

కామానికి లొంగినవాడు అబద్ధాలాడడం, పరస్త్రీ వ్యామోహంలో పడిపోవడం, నిష్కారణంగా ఇతరులతో శత్రుత్వం పెంచుకోవడం లాంటి వ్యసనాలకు బానిసవుతాడని రామాయణం చెబుతుంది.

"త్రీణ్యేవ వ్యసనాన్యత్ర కామజాని భవన్త్యుత
మిథ్యావాక్యం పరమకం తస్మాద్గురుతరావుభౌ
పరదారాభిగమనం వినా వైరం చరౌద్రతా"[4]

కామం ఎంత ప్రమాదకారి అయినా చతుర్విధ పురుషార్థాల్లో చేర్చడం వల్ల భారతీయ సంప్రదాయంలో కామానికి మానవుని జీవితానికి అవినాభావ సంబంధం ఏర్పడింది ధర్మార్థ కామాలతో కూడినదే నిజమైన మోక్షమని ఆర్యుల అభిప్రాయం. అందువల్ల కామాన్ని ధర్మబద్ధం చేశారు. కామం ధర్మబద్ధమైనపుడే ఆచరణీయమవుతుంది. ధర్మబద్ధంకానిది గర్హణీయం. స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ ప్రకృతి ధర్మం. కాపున సమాజ కల్యాణం కోసం కామాన్ని కట్టు

3. శ్రీనాథుడు : కాశీఖండం : 4 - 203
4. శ్రీమద్రామాయణం : అరణ్యకాండం 9 - 3

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



దిట్టం చేశారు. ఏ కామం ధర్మానికీ, అర్థానికీ వినాశకరమైంది కాదో దాన్నే మానవుడు అనుభవించాలి. అంతేకాని కామాతురుడై మూఢత్వంతో పశువర్తనుడై ఆత్మవినాశనం తెచ్చుకోకూడదని భారతసూక్తి :

"యత్సుఖం సేవమానోఽపి ధర్మార్థాభ్యాం న హీయతే
కామం తదుపసేవేత న మూఢవ్రతమాచరేత్", 5

కామం ఏ విధంగా చూచినా హేయమైందే అయినా, దాన్ని విడిచిపెట్టడం సాధ్యం కానపుడు స్వభార్యయందే ప్రవర్తించాలని హితోపదేశం చెబుతుంది :

"కామః సర్వాత్మనా హేయః సచేద్దాతుం న శక్యతే
స్వభార్యాం ప్రతి కర్తవ్యః సైవతస్య హి భేషజమ్", 6

కామం మానవ నైజం కాబట్టి "ప్రజా తంతుంమా వ్యవచ్ఛేత్సీః" అనే వేదవచనాన్నిబట్టి సంసారానికి తృతీయ పురుషార్థమైన కామం ప్రాణంలాంటిది. అందుకే వేమన

"కామిగాని వాడు కవికాడు, రవికాడు
కామిగాక మోక్షగామికాడు
కామియైన వాడే కవి యౌను రవి యౌను", 7 అని అంటాడు.

భారతీయ సంప్రదాయం పరస్త్రీని తల్లిగా భావించమని ఉద్బోధిస్తుంది. స్త్రీలవైపు కన్నెత్తి చూడని ప్రవరుని లాంటి వాళ్లు మనకు కనిపిస్తారు. కాని పరిస్థితుల ప్రభావం వల్లనో, మనిషిలోని సహజమైన బలహీనతవల్లనో కొందరు అక్రమ సంబంధాలకు పాల్పడుతారు. అందువల్ల సామెతలు కొన్ని ప్రజల వ్యవహారాలలో చోటు చేసుకున్నాయి. అత్తాఅల్లుళ్ళ, మామాకోడళ్ళ, బావామరదళ్ళ, మేనత్తా మేనల్లుళ్ల మధ్య ఉండే కామ సంబంధ చేష్టల్ని వెల్లడిచేసే సామెతలున్నాయి. పెళ్లయిన తర్వాత అల్లుడు అత్తగారింట్లో కొంతకాలం ఉండడం

---

5. సంస్కృత మహాభారత - ఉద్యోగ - 39 - 61
6. హితోపదేశం 4 - 95 (మోతీలాల్ బనారసీదాస్; ఢిల్లీ : 1985)
7. వేమన్నవేదం - 19 పుట : యువభారతి ప్రచురణ

2)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



వల్ల, రాకపోకలు జరుపుతుండడంవల్ల అత్తాఅల్లుళ్ల మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడి, అది వాళ్లను అక్రమ సంబంధానికి ప్రేరేపింపజేస్తుంది. "అలాన్‌మాక్ అనే బ్రిటన్ ప్రబుద్ధుడు ఇద్దరు పిల్లలున్న తన భార్యకు విడాకులిచ్చి అత్తగారిని పెళ్లిచేసుకోవడానికి సిద్ధపడ్డాడు. అది వాదోపవాదులకు దారితీసినా చివరకు అత్తా అల్లుళ్ళ ప్రేమ జయించి హౌస్ ఆఫ్ లార్డ్స్ వాళ్ల పెళ్లికి అనుమతి ఇచ్చిందట." (చూడుడు : ఈనాడు 17-6-85 సంపుటి 11 : కాలం 'టూకీగా') అందువల్ల అత్తా అల్లుళ్ళ మధ్య ఉన్న కామసంబంధ చేష్టల్ని వెల్లడిచేసే సామెతలు పుట్టాయి.

"అత్తనుంచుకున్నవాడు ఆయుష్మంతుడు"

"అత్తకు అల్లుడాశ బాపనికిపప్పాశ"

"అల్లుడికి అత్తాశ గొడ్డుకు దూడాశ"

సాధారణంగా ఉమ్మడి కుటుంబాల్లో పెత్తనమంతా మామగారిదే ఉంటుంది. అందువల్ల ఆశపరురాలైన కోడలు మామగారితో సన్నిహిత సంబంధం పెంచుకొంటుంది. మామగారిని తన చేతి కీలుబొమ్మగా చేసుకొని ఎక్కువ వాటా సంపాదించాలని చూస్తుంది. మామగారితో చాటుమాటుగా సరసాలు ప్రారంభిస్తుంది. మొగుడు మెత్తనివాడైతే ఆమె సరసాలకిక అడ్డు ఉండదు. సరసాలతో మామగారిని బుట్టలో వేసుకొని పెత్తనమంతా తనదే అన్నట్లుగ అధికారం చెలాయిస్తుంది. మామా కోడళ్ళ సరసాల్ని తెలియచెప్పే సామెతలు ప్రజల వ్యవహారంలో కనిపిస్తాయి.

"మతులెన్ని చెప్పినా మామ ప్రక్కనే పడుకొంటానన్నదట"

"ఏమీ ఎఱుగని పిల్ల మామనుమరిగిందట"

"మొగుడువిడిచినా మామవిడువడు మామ విడిచినా
దేవతార్చన బ్రాహ్మణుడు విడువడు"

జానపదుల జీవన విధానంలో బావ మరదళ్ళ సరసాలకు పరిహాసాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. "బావా! బావా! పన్నీరు బావను పట్టుక తన్నేరు" అంటూ జానపద స్త్రీలు పాడటం వింటాం. బావమెత్తనైతే ఏడిపించుక తినే మరదళ్ళు, మరదళ్ళను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించే బావలు ఉంటారు. కొత్తగా పెళ్ళయిన బావగారిని మరదలు పసందయిన మాటలతో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఊరించడం, వాలువాలు చూపులతో గాలంవేసి బావను తనవైపుకు లాక్కోవడం, అక్క మెత్తనయితే బావను తనవాడుగా చేసుకోవడం జరుగుతుంది. బావగారు సరసుడయితే మరదలితో జోరుగా హుషారుగా తిరుగుచూ కాలం గడుపుతూ ఉంటాడు. మొదట సరసంగా ప్రారంభమై ప్రణయంగా మారి ఒక్కొక్కసారి పెళ్ళికి కూడ దారి తీయవచ్చు. బావామరదళ్ళ సరసాల్ని తెలిపే సామెతలు :

"బావా ! అని చూడబోతే రావా ! అని కొంగుపట్టుకొన్నాడట"

"బావా ! బావా ! అంటే పక్కలోకి రమ్మన్నాడట"

"బక్క ప్రాణం కాస్తా బావచేతుల్లో పోయిందట"

"బావకు మరదలు పిల్లపై ఆశ"

మేనత్తా మేనల్లుళ్ళ, మేనమామ మేనకోడళ్ళ మధ్య ఉండే కామకలాపాల్ని తెలియజేప్పే సామెతలు కూడా వ్యాప్తిలో ఉన్నాయి.

"సగంపెట్టి మేనత్త అన్నట్లు"

"ముడ్డిపుండు మేనమామ వైద్యం"

వావి వరసలు లేకపోయిన సంఘంలోని కొందరు వ్యక్తులు అక్రమ సంబంధానికి పాల్పడుతూ ఉంటారు. కానీ ధనవంతులకూ, అధికారం కలవారికీ, బలవంతులకూ సంబంధించిన కామకలాపాలు బయటపడవు. ఒకవేళ తెలిసినా అదేదో వ్రతమనికానీ, నోము అని కానీ అనుకుంటారే తప్ప ధర్మవిరుద్ధమైన కార్యమని అనరు. అదే పేదవాళ్ళు, బలహీనులు మగవాళ్ళతో మాట్లాడితే చాలు లేనిపోనివి అంటగట్టి ఊరబ్బనారబ్బ చేస్తారని కొన్ని సామెతలు వెల్లడిచేస్తాయి.

"రాజు చేస్తే శృంగారం చాకలిచేస్తే వ్యభిచారం"

"కలిగినమ్మ గాడిదతోపోతే అదొకవ్రతం లేనమ్మ మొగుడితోపోతే మోహం"

"సాగినమ్మ చాకలితో సరసాలాడితే తప్పుకాదు
సాగనమ్మ సంసారితో మాట్లాడితే తప్పు"

కొన్ని సందర్భాల్లో గొప్పవాళ్ళు కామాంధులై బీదవాళ్ళతో అక్రమ సంబంధానికి పాల్పడతారనీ, పోగరణచుకోలేక కొందరు కామవాంఛకు లోనై

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అక్రమ సంబంధానికి అలవాటు పడతారని "గాడుపట్టిన గంగానమ్మ పూజారితో పోయినట్లు" అనే సామెత వివరిస్తుంది. కొవ్వుబట్టి విచ్చలవిడిగా తిరిగే వాళ్ళ స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"పూజారి బలిసిపోలేరమ్మ చండ్లు పట్టుకొన్నాడట"

"ఉడుము కొవ్వి పోలేరమ్మను పట్టుకొన్నదట"

## క్రోధం :-

క్రోధమంటే కోపం అని అర్థం. మానవుని సహజస్వభావాల్లో ఇదొకటి. ఇహలోకంలో మానవునికి శత్రువైన కోపం రజోగుణం నుండి పుడుతుందని భగవద్గీత తెలుపుతుంది.

"కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః"[8]

కోపమనేది సహజాతాల్లో ఒకటి. కాబట్టి ఇది మనిషికి పుట్టుకతోనే వస్తుంది. అందువల్ల ప్రతివాడూ ఎప్పుడో ఒకప్పుడు కోపాన్ని చూపిస్తాడు. కొందరు ప్రతి దానికి చికాకుపడుతూ ఆ చిరాకుతో ఇతరులపై కోపాన్ని చూపిస్తుంటారు. ముక్కు మీది కోపంతో ధుమధుమ లాడుతూ కనిపిస్తారు మరికొందరు. తాము చెప్పిన మాట వినకపోయినా, ఇతరులు నిందించినా, నష్టం కలిగించినా కోపం కలుగ వచ్చు. అసూయాద్వేషాలవల్ల, మానసికాందోళనవల్ల, తమ కోరిక, ఆకలి తీరక పోవడం వల్ల కోపం కలుగవచ్చు.

**"Anger, fear and other negative emotions are associated with frustrations of basic needs - Loss of food, Loss of a sex objects, blockage of any goal seeking activiiy etc"**[9]

మోటువాడికి కోపం తొందరగా వస్తుందని "మోటుకు కోపం ముక్కు మీద" అనే సామెత తెలుపుతుంది.

కోపంవల్ల మనిషి తాను నాశనం కావడమే కాక ఇతరుల్ని కూడా నాశనం చేస్తాడు. బలహీనుని కోపం తనకే ప్రమాదకరం. కానీ బలవంతుని కోపం

8. శ్రీ మద్భగవద్గీత : 3 వ అధ్యాయం : 37 వ శ్లోకం
9. **Basic Psychology : Page 136 : Ross stagner charless M. Solley**

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



తనకూ ఇతరులకూ ప్రమాద హేతువు. మానవుని సర్వానర్థాలకు కోపమే కారణం. మనిషిని శారీరకంగా మానసికంగా క్రుంగదీస్తుంది. అందుకే "తన కోపమే తన శత్రువు" అని అన్నాడు సుమతీ శతక కారుడు. కోపంవల్ల కలిగే నష్టాల్ని వివరిస్తూ తపస్వికి కోపం తగదని భారతవచనం :

007375

"క్రోధమ తపముం జెఱచును
గ్రోధమ యణిమాదులయిన గుణముల బాపుం
గ్రోధమ ధర్మక్రియలకు
బాధయగుం గ్రోధిగా దపస్వికి జన్నే[10]

కోపాన్ని అదుపులో పెట్టుకోకపోతే మనిషి చేయరాని పనులు చేస్తాడని రామాయణం వివరిస్తుంది.

"క్రుద్ధః పాపం నకుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురూనపి
క్రుద్ధః పరుషయా వాచా నరః సాధూనధిక్షేపేత్"[11]

కోపంవల్ల అవివేకం, అవివేకంవల్ల మరపు మరపువల్ల బుద్ధినాశనం, బుద్ధినాశనం వల్ల చివరకు మనిషి పూర్తిగా నశించి పోతాడని భగవద్గీత తెలుపుతుంది :

"క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతివిభ్రమః
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి"[12]

ఉత్తముల కోపం క్షణకాలం, మధ్యముల కోపం రెండు ఘడియలసేపు, అధముల కోపం ఒకదినం, పాపిష్ఠుల కోపం చచ్చేంతదాకా ఉంటుందని "భోజచరితం"లోని ప్రసిద్ధమైన శ్లోకం తెలుపుతుంది.

"ఉత్తమేక్షణకోపస్యాత్
మధ్యమే ఘటికాద్వయం

10. శ్రీమదాంధ్ర మహాభారతం 1 - 2 - 172
11. శ్రీమద్రామాయణం : సుందర కాండం : 55 - 5
12. శ్రీమద్భగవద్గీత : 2 వ అధ్యాయం : 62 వ శ్లోకం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అధమే స్యాదహోరాత్రం
పాపిష్ఠే మరణాంతకం"[13]

కోపంవల్ల మానవుడు తన గొప్పతనాన్ని పోగొట్టుకుంటాడని వేమనవాదం.

"కోపమునను ఘనత కొంచెమై పోవును
గోపమునను మిగుల గోడు చెందు
గోపమడిచెనేని గోరికలీడేరు"[14]

కాబట్టే "క్రోధమునణచుటయే మానవత్వము" అని అంటాడు గాంధీజీ. మానవుని సమస్త పాపాలకు కోపమే కారణమని "కోపం పాపకారణం" అనే సామెత చెబుతుంది.

ఇన్ని అనర్థాల్ని కలిగించే కోపాన్ని మానవుడు విడనాడాలి. నీటితో నిప్పును చల్లార్చినట్లుగ వివేకంతో కోపాన్ని జయించాలి. పాము కుబుసం విడిచినట్లుగ వివేకవంతుడు పెల్లుబికి వచ్చే కోపాన్ని ఓర్పుతో అణచుకొని జయించాలి. అపుడే వాడు మహాత్ముడనిపించుకుంటాడు. మనిషి వ్యక్తిగత కోపం విసర్జించక పోతే ఎంత నష్టం జరుగుతుందో అలాగే సమాజాన్ని సక్రమ మార్గంలో నడిపించడానికి కోపాన్ని వహించకపోతే అంతే హాని జరుగుతుంది. అందుకే "జీతం లేని నౌకరు కోపంలేని దొర" అనే సామెత పుట్టింది. స్వార్థంతోకూడిన కోపం సమాజానికి అపకారం. సమాజనిష్ఠమైన కోపం లోకోపకారకం. మానవునిలోని కోపస్వభావాన్ని, వివిధ సందర్భాల్లో కోపాన్ని ప్రదర్శించే వాళ్ల స్వభావాన్ని వెల్లడిచేసే సామెతలు ప్రజల్లో ప్రాచుర్యాన్ని పొందాయి.

అత్త కోడలిపై కారాలు మిరియాలు నూరినా, చీటికిమాటికి చీదరించుకున్నా, నలుగురిలో నవ్వులపాలు చేసినా కోడలికి అత్తనెదిరించే ధైర్యముండదు. అట్లని తనలోని కోపాగ్నిని చల్లార్చుకోనూలేదు. అత్తను సూటిగా ఎదిరించలేక కోడలు పిల్లిమీదనో, కోడిమీదనో తన కోపాన్ని తీర్చుకుంటుంది. ఇంట్లోని వస్తువులపై కోపాన్ని చూపి వాటిని ముక్కలు చేస్తుంది. కుండమీదనో, కడవ

13. భోజచరితమ్ (సూక్తిముక్తావళి'లో 393 పుట 2 వ శ్లోకం)
14. వేమన పద్యములు : 946 వ పద్యం : ఎస్. వి. గోపాల్ అండ్ కో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



మీదనో చూపి వాటిని నేలపాలు చేస్తుంది. అత్తాకోడళ్ళ అనుభవంనుండి "అత్త మీదకోపం దుత్తమీద చూపినట్లు" అనే సామెత పుట్టింది. అత్తపై కోడలు కోపాన్ని ప్రదర్శించలేక తనకనువైన వాటిపై చూపించినట్లే సమాజంలోని వ్యక్తులు తమ కోపాన్ని చూపవలసిన వాళ్ళపై గాక మరొకరిపై చూపిస్తుంటారు. కోపం కల్గినా బలహీనతవల్ల ఎదిరించే శక్తిలేక తమకోపాన్ని తమకులోకువైన వాళ్ళపై చూపిస్తారు. ఈ విధంగా ఒకరిమీద కోపాన్ని, మరొకరిపై చూపించే వాళ్ళను విమర్శిస్తూ పై సామెతను ప్రయోగిస్తారు. ఇలాంటి భావాన్నే వ్యక్తం చేసే సామెతలు :

"మిండగాడిమీద కోపం మొగుడిమీద చూపించినట్లు"
"ఆఫీసరు మీద కోపం ఆలి మీద చూపినట్లు"
"తల్లిమీద కోపం పిల్లమీద చూపినట్లు"

నష్టం కలిగించే పనులు చేస్తే ఎవరికైనా కోపం రావచ్చు. కానీ నష్టం కలిగించిన వాళ్ళు ఎదురుగా ఉండక తప్పించుకుపోతే ఆ సమయానికి ఎవరు ఎదురుగా కనిపిస్తే వాళ్ళపై తమకోపాన్ని చూపిస్తారు. అలాంటి వాళ్ళ స్వభావాన్ని ఖండిస్తూ "అడవి పంది చేనుమేసిపోతే ఊరపంది చెవులు కోసినట్లు" అనే సామెతను చెప్పుకుంటారు. చేను మేసిన అడవి పంది అక్కడే ఎందుకుంటుంది? అడవిపందిని ఎలాగు పట్టుకోలేరు. ఎదురుగా ఉన్న ఊరపందిని పట్టుకొని దాని చెవులు కోస్తారు. ఇలాంటి భావాన్ని ఆధారం చేసుకొని పుట్టిన సామెతలు :

"ఎద్దు చేనుమేసిపోతే గాడిదకు చెవులు కోసినట్లు"
"తిన్నకుక్క తినిపోతే కన్నకుక్కను కట్టేసినారట"
"తిన్నకుక్క తినిపోతే కన్నకుక్కను కాలు విరగగొట్టినట్లు"

బలహీనంవల్ల కానీ, మరే కారణం చేతకాని తమకు కోపం కలిగించిన వాళ్ళపై తిరిగి కోపాన్ని చూపలేక, ఆ కోపాన్ని తమలోనే అణచుకోలేక నిష్కారణంగా ఇతరులపై చూపిస్తూ ఉంటారు. కారణం లేకుండా ఒకరిమీద కోపాన్ని మరొకరిమీద చూపించేవాళ్ళ స్వభావాన్ని విమర్శించే సందర్భంలో "ఉరుము ఉరిమి మంగలం మీద పడినట్లు" అనే సామెతను ప్రయోగిస్తారు.

భార్యాభర్తలు ఎంత అన్యోన్యంగా ఉన్నా ఎప్పుడైన మనస్పర్థల వల్ల ఒకరిపై మరొకరికి కోపం రావచ్చు. కోపంవల్ల ఒకరితో నొకరు మాట్లాడుకో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కుండా ఎడమొహం పెడమొహంగా ఉంటారు. కాని భార్యాభర్తల మధ్య ఎంత కోపం ఉన్నా మరుక్షణంలో మాట్లాడుకుంటారనీ, కలిసిమెలసి ఒకటై పోతారనీ, వాళ్ళమధ్య నున్న కోపం తాత్కాలికమే అని తెలిపే సామెతలు ప్రచారంలో ఉన్నాయి.

"ఆలుమగల కలహం అద్దంమీద పెసరగింజ ఉన్నంతసేపు"

"ఆలుమగల కలహం అన్నంతినే దాక"

"ఆలుమగల కలహం ఆరికకూడు ఉడికినంతసేపు"

"మొగుడి మీద కోపం పొద్దు మునిగే వరకే"

"ఆలుమగల కలహం ఆకేసుకున్నంత సేపు"

బ్రాహ్మణుల మాట కటువుగా ఉన్నా మనస్సు వెన్నవలె మృదువుగా ఉంటుందని అంటారు.

"నిండు మనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత విప్రులయందు" అని [15]

భారతవచనం. నవనీతహృదయులైన బ్రాహ్మణులకు కోపం రాదు. బ్రాహ్మణులు సాత్త్వికగుణ సంపన్నులుగా ఉంటారు. ఒకవేళ కోపం వచ్చినా అది తాత్కాలిక బాధను కలిగిస్తుందే కాని మనిషిని శాశ్వతంగా హింసించదు. బ్రాహ్మణుల కోపం భగభగమండి వెంటనే ఆరిపోయే వరిగడ్డిమంటలా ఉంటుందని "బ్రాహ్మణుల కోపం వరిగడ్డిశాకం" అనే సామెత చెబుతుంది. వరిగడ్డి మంటలోవేస్తే భగ్గుమని మండి మరుక్షణంలో బూడిద అయిపోతుందే కాని నిప్పు చాలాసేపు ఉండదు. అలాగే బ్రాహ్మణుల కోపం కూడా. కోపం వచ్చినప్పుడు ఏవో నాలుగు మాటలు భగభగమండే మంటలా మాట్లాడగలరు కానీ మరుక్షణంలో మామూలుగా ఉంటారని పై సామెత భావం.

బలవంతులు బలహీనులకు ఏదైనా నష్టం కలిగించవచ్చు. అయితే బలహీనతవల్ల తామెదిరించలేక పెద్దలవద్ద పంచాయతీ పెట్టించవచ్చు. అపుడు

---

15. ఆంధ్రమహాభారతం - ఆదిపర్వం - 1 - 100

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



న్యాయం చెప్పవలసిన పెద్దలు ఇబ్బందిలో పడతారు. తప్పు బలవంతుడిదే అయినా న్యాయం చెప్పితే వాడేమనుకుంటాడో అని భయపడుతూ ఉంటారు. బలహీనులపట్ల న్యాయం చెప్పకపోతే ప్రజలెక్కడ కోపిస్తారో అనే భయం మరో వైపు అలాంటి సందర్భంలో "కరవమంటే కప్పకు కోపం విడువమంటే పాముకు కోపం" అనే సామెతను చెప్పుకుంటారు.

ధనవంతుడూ, బలవంతుడూ ధనమదంతో, బలగర్వంతో ఇతరులపై తమ కోపాన్ని తీర్చుకోవచ్చు. కానీ బలహీనుడికీ, ధనహీనుడికీ ఇతరులపై కోపం కలిగినా ఏమి చేయలేడు. కోపంతో తనలో తాను మథనపడి మానసికంగా బాధపడవలసిందే కానీ ఇతరులనేమి చేయటానికి వీలులేదు. తగిన శక్తి సామర్థ్యాలు లేక బలవంతునిపై కోపాన్ని ప్రదర్శిస్తే చివరకు తానే ప్రమాదానికి గురికావలసి ఉంటుంది. అందుకే "పేదవాని కోపం పెదవికి చేటు" అనే సామెత పుట్టింది. పేదవాడు కోపంతో తన పెదవిని కొరుక్కోవలసిందే కానీ తనకోపాన్ని మాత్రం తీర్చుకోలేడన్నమాట.

సాధారణంగా పండుగలకుకానీ, తిరుణాళ్ళకుగానీ, జాతర్లకు కానీ అల్లుడు అత్తవారింటికి పోతూ ఉంటాడు. కాని అత్తగారింట్లో సరిగా మర్యాదలు జరుగలేదనో, మంచికానుకలివ్వలేదనో అలిగి ఎవ్వరికి చెప్పకుండా తిరుణాల చూడకుండా వెళ్ళిపోతూ ఉంటాడని "అత్తతో పోట్లాడి తేరు చూడకుండా పోయినట్లు" అనే సామెత వెల్లడి చేస్తుంది. అల్లుడలిగి తేరు చూడకుండాపోతే అల్లుడికే నష్టం కాని అత్తకేమి నష్టం ఉండదు. అత్తా అల్లుళ్ళ అనుభవం నుండి పుట్టిన సామెత అయినా అనేక సందర్భాల్లో ఇతరులపై కోపించి తమకే నష్టం కలిగేట్లు ప్రవర్తించే వాళ్ళ స్వభావాన్ని విమర్శిస్తూ పై సామెతను చెప్పుకుంటారు. ఇలాంటివే మరికొన్ని సామెతలు :

"అద్దం మీద అలిగి ముక్కు కోసుకున్నట్లు"
"ఎలుకమీది కోపంతో ఇంటికి చిచ్చుపెట్టుకొన్నట్లు"
"చెరువు మీద అలిగి ముడ్డి కడుక్కోకుండా పోయినట్లు"
"మొగుడి మీద కోపంతో మాదిగవానివెంట పోయినట్లు"

అద్దం మీది కోపంతో ముక్కు కోసుకున్నా, ఎలుకమీది కోపంతో ఇంటికి నిప్పు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పెట్టుకున్నా, మొగుడి మీద కోపంతో మాలిగవాని వెంటపోయినా నష్టం తనకేగాని ఇతరులకు కాదు.

పెండ్లిండ్లలో సాధారణంగా మగపెండ్లివారిని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. సకల మర్యాదల్ని జరపాలి. ఏమాత్రం పొరపాటు జరిగినా కోపం వచ్చి అలిగిపోతారు. ఒకవేళ ఎవ్వరికి కోపం వచ్చినా ఫరవాలేదు కానీ అల్లుడికి మాత్రం కోపం రాకూడదు. కోపం వస్తే పెళ్లి ఎక్కడ ఆగిపోతుందో అనే భయం. అందుకని ప్రత్యేక శ్రద్ధతో అల్లుణ్ని చూస్తూ ఉంటారు. అత్తమామలు ఎంతో జాగ్రత్తగా అల్లుణ్ని కనిపెట్టుకొని ఉంటారు. కాబట్టి అల్లుడికి అలగడానికి వీలుండదు అల్లుడికి ఎక్కడా కోపం కలుగకపోయినా అంకపాన్పు ఉండనే ఉంది. అక్కడైనా అల్లుడలిగిపోవచ్చు. అల్లుడలిగితే అత్తగారు కంగారు పడిపోతుందని "అంకపాన్పుమీద అల్లుడలిగితే అత్తకంగారు పడ్డట్లు" అనే సామెత వెల్లడి చేస్తుంది సమయం చూసి కోపంతో ఇతరుల్ని భయపెట్టేవాళ్ళ స్వభావాన్ని పై సామెత ప్రకటిస్తుంది.

## లోభం :-

లోభి స్వభావాన్ని తెలిపేది లోభం. లోభగుణాన్నే పిసినారితనం, పినిసిగొట్టుతనం అని కూడా అంటారు. ఇతరులకు సహాయం చేయాలంటే కొందరికి లోభం అడ్డుపడుతుంది. లోభంవల్ల ఇతరులకు పెట్టడు. తానూ తినడు. చివరకు శవాన్ని దహనం చేయడానికి కూడా డబ్బు ఖర్చయిందని ఏడుస్తాడట లోభి అయినవాడు.

"పిసినివానియింట పీనుగువెడలిన
కట్టెకోలలకును గాసులిచ్చి
వెచ్చెమాయెనంచు వెక్కివెక్కేడ్చురా" 16

లోభి అయినవాడు గొడ్డుటావులాంటివాడు. పాలకొరకు పోతే గొడ్డుటావు కాలితో తన్నుతుందే కాని తన దగ్గరున్న పాలనీయదు. డబ్బుకై లోభివాని చుట్టు ఎన్ని

16. వేమన పద్యములు : 34 వ పద్యం : ఎస్. వి. గోపాల్ అండ్ కో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



సార్లయినా తిరగవలసిందేకానీ వానినుండి డబ్బును సంపాదించడం మాత్రం అసాధ్యం. అందుకే వేమన ఇలా అంటాడు.

"గొడ్డుటావు బిదుక గుండ గొంపోయిన
బండ్ల నూడదన్ను పాలనీదు
లోభివానినడుగ లాభంబు లేదయా"[17]

లోభివానికి తగిన శిక్ష వాని దగ్గరకు వెళ్లి ధనమడగడమే. డబ్బు అడిగితే చాలు భగ్గునమండి చస్తాడు. వానికి ప్రాణంకంటే ముఖ్యం ధనం.

"లోభివాని జంప లోకంబులోపల
మందువలదు వేఱే మతము గలదు
పైకమడుగ జాల భగ్గునపడిచచ్చు"[18]

"లోభిని చంపవలెనంటే డబ్బు అడిగితే చాలును" అనే సామెత పై విషయానికి అద్దం పడుతుంది.

లోభం మానవునికున్న దుర్గుణాల్లో ఒకటి. లోభంవల్ల ఎన్నో అనర్థాలు వస్తాయి. సర్వనాశనాన్ని కలిగించేదే లోభం.

"లోభాత్క్రోధః ప్రభవతి లోభాత్ కామః ప్రజాయతే
లోభాన్మోహశ్చ నాశశ్చ లోభః పాపస్య కారణమ్"[19]

లోభంవల్ల కోపం పుడుతుంది. కోరికలు కలుగుతాయి. మోహం కలుగుతుంది. నాశనం ప్రాప్తిస్తుంది :

"లోభేన బుద్ధిశ్చలతి లోభో జనయతే తృషమ్
తృషార్తో దుఃఖమాప్నోతి పరత్రేహచ మానవః"[20]

---

17. వేమన పద్యరత్నాకరము: 2457 వ-పద్యం: బాలసరస్వతీ బుక్ డిపో
18. వేమన పద్యములు : 36 వ పద్యం ఎస్. వి. గోపాల్ అండ్ కో
19. హితోపదేశంః మిత్రలాభః - 28 వ శ్లోకం.
20. హితోపదేశంః మిత్రలాభః - 152 వ శ్లోకం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



లోభంవల్ల బుద్ధి చలిస్తుంది. ఆశ కలుగుతుంది. ఆశవల్ల మానవుడు ఈ లోకం లోనేకాక పరలోకంలో కూడ దుఃఖాన్ని పొందుతాడు.

మానవునిలోని లోభస్వభావాన్ని వెల్లడిచేసే సామెతలు ప్రజల వ్యవహారంలో ప్రాచుర్యాన్ని పొంది ఉన్నాయి.

ఏటిలో నీళ్లు తక్కువగా ఉన్నా, నిండుగా పొర్లిపారినా కుక్క గతుకుతూ మాత్రమే నీళ్లు తాగుతుంది. అది దాని సహజగుణం. అందుకే "ఏరు ఎంత పారినా కుక్కకు గతుకునీళ్లే" అనే సామెత పుట్టింది. మానవుని లోభస్వభావాన్ని వివరించే సందర్భంలో ఈ సామెత ప్రయోగించబడుతుంది. ఏరు ఎంత నిండుగా ప్రవహిస్తున్నా ఎలా కుక్కగతుకుతూ నీళ్లు తాగుతుందో అదేవిధంగా లోభి అయినవాడు తనకు సంపద పుష్కలంగా ఉన్నపుడు కూడా సరిగా భోంచేయడు. ధనం పెరుగుతున్నకొద్దీ వానిలో ఇంకా లోభం పెరిగిపోతుంది. ఈ విధంగా ధనం ఉన్నపుడు కూడా సరిగా అనుభవించని వాళ్ల స్వభావాన్ని విమర్శించే సందర్భంలో పై సామెతను చెప్పుకుంటారు. "గోదావరి పారినా కుక్కకు గతుకు నీళ్ళే" అనే సామెతకూడా పై సామెతలాంటిదే. ఈ సామెత భాస్కర శతక పద్యంలో ఎంత చక్కగా యిమిడిందో చూడుడు :

"అతి గుణహీన లోభికి బదార్థము గల్గిన లేక యుండినన్
మితముగ గాని కల్మిగల మీదటనైన భుజింప డింపుగా
సతమని నమ్మదేహమును సంపద; నేఱులు నిండి పాఱినన్
గతుకగ జూచు గుక్క తన కట్టడ మీఱక యెందు భాస్కరా"[21]

"లోభికి ధర్మచింతన వెట్టివానికి వేదాంతం దూరం" అనే సామెత లోభ గుణం కలవానికి ధర్మాధర్మాలు, ఉచితానుచితాలతో నిమిత్తం లేదని వివరిస్తుంది. సాధారణంగా తల్లిదండ్రులకు, అక్కచెల్లెళ్ళకు అన్నం పెట్టడం అన్నదమ్ముల కర్తవ్యం, ధర్మం కూడా. తండ్రి తర్వాత తండ్రిలాంటివాడు అన్న. కాబట్టి అక్కాచెల్లెళ్ళకు అన్నం పెట్టి పోషించాల్సిన ధర్మం అతనిపై ఉంటుంది. ఆ ధర్మ

21. భాస్కరశతకము : టీకా తాత్పర్య సహితము. 5 వ పద్యం : బాలసరస్వతీ బుక్ డిపో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



చింతనలేని లోభి అక్కచెల్లెళ్ళకు ఏదైనా సహాయం చేసినా దానికి జమాఖర్చులు వ్రాసిపెట్టి వడ్డీతోసహా వసూలు చేసుకుంటాడు. అందుకే "అక్కచెల్లెళ్ళకు అన్నం పెట్టి లెక్క వ్రాసినట్లు" అనే సామెత పుట్టింది. అక్కాచెల్లెళ్ళ, అన్నదమ్ముల అనుభవం నుండి పుట్టిందే అయినా బాధ్యతగల వాళ్ళ తాము చేసిన సహాయాన్ని తమ ధర్మంగా భావించక లోభంతో లెక్కలు వ్రాసిపెట్టి లాభం కోరేవాళ్ల స్వభావాన్ని వెల్లడి చేస్తుంది.

గాలికాలంలో ఎక్కువగా ఆకులు రాలిపోవడం కనిపిస్తుంది. కానీ ఎంత హోరుగాలి వీచినా ఈతాకులు మాత్రం రాలవు. కొందరు ఇతరులకు ఎంత అవసరంగా ఉన్నా, ఎవరెన్ని మాటలు చెప్పి ఎంత ప్రయత్నించినా, ఎవరెంత అరిచి గీపెట్టినా ఒక పైసాకూడా ఇవ్వరు. "మాటల సత్రానికి నాదోమాట" అంటూ మాటల్ని ఎన్నైనా చెప్తారే కానీ డబ్బు మాత్రం చేజారనివ్వరు. డబ్బు దగ్గరకు వచ్చేసరికి వెనుకంజవేస్తారు మాటలు చెప్పినంత సులభంగా డబ్బు ఇవ్వరు. ఎన్ని ప్రయత్నాలు చేసినా లోభినుండి ధనం రాబట్టలేమని చెప్పే సందర్భంలో "ఏ ఆకురాలినా ఈతాకురాలదు" అనే సామెతను చెప్పకుంటారు.

"అతిథిదేవోభవ" అని ఆర్యోక్తి. ఇంటికి వచ్చిన వాళ్ళను సాదరంగా ఆహ్వానించి సత్కరించి సంతృప్తి పరచడం గృహస్థు ధర్మం. కాని కొందరు పిసినారితనంతో ఇంటికి ఎవరైనా వస్తే ఎక్కడ ఖర్చవుతుందో అని భయపడి పోతారు. అందువల్ల ఇతరులు తమ ఇంటికి రావడానికి ఇష్టపడరు. ఒకవేళ ఎవరైనా వస్తే మాటలతో కడుపు నింపటానికి ప్రయత్నిస్తారే కానీ ఏమీ పెట్టరు. వచ్చిన పని పూర్తయిందని తెలిస్తే ఎప్పుడు బయల్దేరుతారో అన్నట్లు ఎదురు చూస్తారు. చేష్టలద్వారా వ్యక్తం చేస్తారు. మాటల్తో కడుపు నింపే వాళ్ళ స్వభావాన్ని "మాటల చుట్టమేకాని పూట చుట్టంకాదు" అనే సామెత వెల్లడిచేస్తుంది.

కొందరికి తమ డబ్బు ఖర్చు కాకూడదు. కానీ అన్నీ సమకూరాలని అనుకుంటారు. ఇతరులు ఏమనుకున్నా ఫరవాలేదు. కానీ తమవద్ద ఉన్న ధనం మాత్రం ఖర్చవరాదనుకుంటారు. పైసా ఖర్చు కాకుండా అన్ని పనులు జరిగి పోవాలని భావిస్తారు. తమ పిల్లలు బాగా పెరిగి పుష్టిగా ఉండాలంటే వాళ్లకు తగిన ఆహారం ఇవ్వాలి. వ్యాధులు రాకుండా చూసుకోవాలి. ఒకవేళ అవసరం వస్తే వ్యాధి నివారణకై ధనం ఖర్చు చేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పోషించాలి. డబ్బు ఖర్చు కాకూడదనుకుంటే ఇవన్నీ కుదరవు. కాని కొందరు పిసినారితనంతో పైసా ఖర్చు కాకుండా పిల్లలు బాగుండాలనుకుంటారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని తెలియచెప్పే సామెతలు :

"కుండలో కూడు కుండలో ఉండాలి బిడ్డలు మాత్రం పెరగాలి"

"కుండలో కూడు కుండలో ఉండాలి బిడ్డ గుండ్రాయిమాదిరి కావాలి"

"కుండలో బియ్యం కుండలో ఉండాలి బిడ్డలు గుండ్రాళ్ళులా ఉండాలి"

"గుమ్మలో గింజలు గుమ్మలో ఉండాలి పిల్లలు పిడకల్లాగా ఉండాలి"

"గాదెలో గింజలు గాదెలోన ఉండాలి బిడ్డలు గారకాయల్లా ఉండాలి"

"పిడతలో నూనె పిడతలోనే ఉండాలి బిడ్డలు బీరగింజల్లా ఉండాలి"

కుండలో బియ్యం కుండలోనే ఉంటే పిల్లలు పెరిగి పెద్దవారెలా అవుతారు? బిడ్డలు బలిష్ఠంగా ఎలా తయారవుతారు? అందుకే "కలిమిగల లోభికంటే పేద మేలు", "లోభి బీదకంటే బీడు" అనే సామెతలు ప్రచారంలోకి వచ్చాయి. ఎంతటి బీదవాడైనా తానూ, తన పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని ఆశించి ఉన్నంత లోనే చక్కటి ఆహారాన్ని తింటాడు. తన పిల్లలకు పెడతాడు. ఎంత ధనవంతు డైనా తాను తిన్నా, తన పిల్లలు తిన్నా ఖర్చవుతుందనుకునే లోభి ఎంత ధన మున్నా బీదవాడే.

కొందరు చచ్చీచెడీ ఎంతో ధనం వెచ్చించి ఒక వస్తువును కొంటారు. కానీ దానికి సంబంధించిన అతిముఖ్యమైన, వెల తక్కువ గల వస్తువును కొనడా నికి పిసినారి తనాన్ని చూపిస్తారు. ఆవును కొనటానికి ఎంతో డబ్బు ఖర్చుచేసినా దాన్ని కట్టివేయడానికి కావలసిన తలుగుకొనే దగ్గర వెనుకముందులాడుతారు. ఆవుకు తలుగు చాలా అవసరం. అదిలేకుంటే మొదటికే మోసం వస్తుంది. అంటే ఆవే తప్పిపోయే ప్రమాదం ఉంది. అయినా సరే దాన్ని కొనటానికి వెనుకాడు తారు. అలాంటివాళ్ల స్వభావాన్ని విమర్శిస్తూ "ఆవును కొని తలుగుకు లోగి నట్లు" అనే సామెత పుట్టింది. ఎక్కువ విలువగల వస్తువును కొని దానికి అత్యంత అవసరమైన తక్కువ వెలగల వస్తువును కొనడంలో లోభాన్ని చూపించే వాళ్లను విమర్శించే సామెతలు :

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"దూడను కొని తలుగుకులొంగినట్లు"

"వేయి రూపాయలు పెట్టి ఏనుగును కొని అరసం అంకుశానికి పాలు మాలినట్లు"

"మూడు వందలు పెట్టి గేదెను కొని మూడాణాలు పెట్టి తాడును కొనలేనట్లు"

లోభి ఏ పనిచేసినా నష్టపోతుంటాడని "లోభికి నాలుగు విధాల నష్టం" అనే సామెత వెల్లడి చేస్తుంది. వస్తువుల్ని కొనడంలో నాణ్యతకంటే తక్కువ ధరకే ప్రాముఖ్యం ఇస్తాడు. ధర తక్కువ కావడంవల్ల నాణ్యత సరిగా లేక వస్తువు త్వరగా పాడైపోతుంది. దాన్ని మళ్ళీ బాగు చేయించడానికి ఎక్కువ డబ్బు ఖర్చు చేయ్యాలి. ఎక్కువ డబ్బు ఖర్చుచేసే వాళ్ళ స్వభావాన్ని "వెల తక్కువని గుడ్డి గుర్రాన్ని కొంటే వారానికి రెండుసార్లు మరామత్తు" అనే సామెత విమర్శిస్తుంది. ఇలాంటివే మరికొన్ని సామెతలు :

"ఓలి తక్కువని గుడ్డిదాన్ని పెండ్లాడితే, దొంతకుండలన్నీ పగులకొట్టినట్లు"

"ఓలి తక్కువని గుడ్డి దానిని పెళ్ళాడితే, నెలకు ముప్పైకుండలు సీళ్ళాడుతాయి"

లోభితనంవల్ల అనవసరంగా ఖర్చులు పెంచుకుంటాడని "లోభికి ఖర్చెక్కువ, ఏబ్రాసికి పనెక్కువ" అనే సామెత చెబుతుంది.

లోభి అయిన వాడు ఇతరులడిగితే ఎక్కడ డబ్బివ్వవలసి వస్తుందో అని అందరికి దూరంగా ఉంటాడు. డబ్బు అడిగే వాళ్ళను తన దగ్గరకే రానీయడు. అలాంటి వాళ్ళంటే లోభికి అసలే గిట్టదు. తన ధనానికి ఎవరైతే ఆశించరో అలాంటి వాళ్ళంటే లోభికి చాలా ఇష్టం. వాడు మూర్ఖుడైనా, నీచుడైనా, అల్పుడైనా గొప్పవాడుగా, మహాపండితుడుగా భావించి పొగడుతాడు. అలాంటి పిసినారి స్వభావాన్ని "అతిలోభిరాజుకు అడగనివాడే పండితుడు" అనే సామెత వెల్లడి చేస్తుంది. సాధారణంగా పండితులను గౌరవించి సత్కరించడం, అగ్రహారాదులు, దానం చేయడం వితరణగల రాజు స్వభావం. కాని లోభి అయిన రాజు నిజమైన పండితులకంటే తనను ఏమీ అడగని వాళ్ళంటేనే ఇష్టపడతాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పండితుడెంతటి మూర్ఖుడైనా సరే తననేమి అడగకపోతే చాలు అనుకుంటాడు లోభి అయిన రాజు.

"పరోపకారార్థమిదం శరీరమ్" అని ఆర్యోక్తి. ప్రతివాడు తనకు చేత నయినంతలో ఇతరులకు సహాయపడటం మానవధర్మం. తాను నష్టపోకుండా, తనకు ఇబ్బంది కలుగకుండా ఉంటే ఇతరులకు సహాయపడటంలో తప్పులేదు. కానీ లోభి అయినవాడు తనకేమి నష్టం జరుగదని తెలిసి కూడా ఇతరులకు సహాయం చేయడానికి ముందుకురాడు. అతి స్వల్ప సహాయాన్ని చేయడంవల్ల తాను నష్టపోతానేమో అనే భయంతో అల్పసహాయం చేయడానికి కూడా ఇష్టపడడు. వేలు తెగి రక్తం కారుతుంటే వెంటనే ప్రథమ చికిత్సగా సున్నం పెట్టడమో, ఏదో ఆకురసాన్ని పిండడమో చేస్తారు. కాని లోభి అలా సున్నంవేసి కట్టు కట్టడానికి కూడా ముందుకురాడని "తెగిన వ్రేలికి సున్నం కూడా పెట్టడు" అనే సామెత పుట్టింది. అవసరాన్నికూడా గుర్తించక అల్పమైన విషయంలో పిసినారితనాన్ని చూపించే వాళ్లను విమర్శించే సందర్భంలో పై సామెతను ప్రయోగిస్తారు. ఇలాంటివే మరికొన్ని సామెతలు :

"వ్రేలు తెగినా ఉచ్చబోయనివాడు"

"వ్రేలు తెగినా సున్నం పెట్టడు"

అల్ప సహాయం కూడా చేయటానికి ముందుకురానివాడు అధిక సహాయం చేయలేడు. పిల్లికి కూడా తిండిపెట్టనివాడు అతిథికి అన్నం పెడతాడా? అన్నం ఉన్న చేత్తో కాకిని తోలితే చేతిమెతుకులు రాలిపడిపోతాయని భావించి మానేసే వాడూ, వ్రేలు తెగితే ఉచ్చపోస్తే తనకు నష్టమని భావించి పోయనివాడు ఇతరులకు అధిక సహాయం చేయలేడని కొన్ని సామెతలు వెల్లడి చేస్తాయి :

"విరిగిన వ్రేలిమీద ఉచ్చబోయనివాడు
వినాయకుడికి టెంకాయ కొట్టబోతాడా?"

"ఎంగిలి చేత కాకిని తోలనివాడు భిక్షంపెట్టునా?"

"తోటకాడ వంకాయలు పెట్టనివాడు ఇంటికాడ బజ్జీపెట్టునా?"

కొందరు పిసినారి తనంతో తాము తినక ఇతరులకు పెట్టక నానా అవస్థలు పడి కూడబెడతారు. కానీ ఎంత సంపాదించినా వాళ్లకు మాత్రంతినే అదృష్టం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఉండదు. లోభి కష్టపడి కూడబెట్టవలసిందే కానీ అనుభవించలేడని "కూడబెట్టిన సొమ్ము కుడువనురాదు" అనే సామెత వివరిస్తుంది. కూడబెట్టినవాడు అనుభవించ లేకపోవచ్చు. కానీ వాడి తర్వాతవచ్చిన వాడు ధారాళంగా ఖర్చుపెట్టేస్తాడు, అలాంటి సందర్భంలో ప్రయోగించే సామెతలు:

"పాసిపండ్లోడు సంపాదిస్తే బంగారు పండ్లోడు పోగొట్టినట్లు"
"కుంచాలమ్మ కూడబెడితే మంచాలమ్మ మాయంచేస్తుంది"

కోమటికులానికి చెందినవాళ్లు సాధారణంగా పిసినారులుగా ఉంటారని చెప్పుకోవడం ఉంది. దానగుణం వాళ్లలో ఉండనే ఉండదు. తమకు సంబంధించిందయితే చివరికి ఉల్లిపాయకూడా ఇతరులకు ఇవ్వరు. మాటలవరకే కానీ చేతలదగ్గరమాత్రం శూన్యం. పసుపుకానీ, పసుపు కొమ్ముకానీ ఇతరులకిస్తే పుణ్యప్రదమని అంటారు. అలాంటిదాన్ని కూడా ఇవ్వటానికి సిద్ధపడరట. ఇతరులకిచ్చే విషయంలో, పెట్టే విషయంలో పిసినారులుగా ఉండి ఉత్తుత్తి మాటల్ని చెప్పే వాళ్ల స్వభావాన్ని విమర్శించి చెప్పే సామెతలు:

"ఉల్లిపాయ పెట్టని కోమటి ఊరంతా ధారపోసినట్లు"
"పసుపు కొమ్ము పెట్టని కోమటి పట్టణమంతా చూరవదిలాడట"

## మోహం :-

మోహం అంటే అజ్ఞానం. సదసద్వివేకాన్ని కలిగించే విద్యలేక పోవడం వల్ల మానవునిలో అజ్ఞానం చోటు చేసుకుంటుంది. అజ్ఞానమనేది ఒక చీకటిలాంటిది. చీకట్లో మనిషి ఏ వస్తువునూ స్పష్టంగా చూడలేడు. అట్లే అజ్ఞానంవల్ల మనిషి సత్యాసత్యాల్ని, సమయాసమయాల్ని, అవసరానవసరాల్ని, సాధ్యాసాధ్యాల్ని, మంచిచెడుల్ని గ్రహించడు. అజ్ఞానం వల్ల మనిషిలో మూర్ఖత్వం ఏర్పడి ఇతరులేమి చెప్పినా వినడు. అలాంటి వాడికి తెలియచెప్పడం చాలకష్టం. ఈ విషయాన్నే భర్తృహరి

"మకరముఖాంతరస్థమగు మానికమున్ బెకలింపవచ్చు బా
యక చలదూర్మికా నికరమైన మహోదధి దాటవచ్చు, మ



CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



స్తకమున పూవుదండవలె సర్పమునైన ధరింపవచ్చు, మ
చ్చికఘటియించి మూర్ఖ జనచిత్తము తెల్పనసాధ్యమేరికిన్" 22

అని అంటాడు.

అజ్ఞానం వల్ల కొందరు ఏమి మాట్లాడుతున్నారో ఆలోచించరు. తాము మాట్లాడేది తప్పా? ఒప్పా? అని ఆలోచించరు. ఇతరులు తమ మాటల్లోని అజ్ఞానాన్ని గుర్తించి ఏమనుకుంటారో అని కూడా పట్టించుకోకుండా నోటికి వచ్చినట్లు తమకు తోచింది మాట్లాడుతారు. తమ అజ్ఞానాన్ని ప్రదర్శిస్తారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని వెల్లడి చేసే సామెతలు.

"పంచపాండవులంటే నాకు తెలియదా? మంచపుకోళ్ళవలె ముగ్గురని
రెండు వ్రేళ్ళు చూపించాడట"

"ఆచార్యులకొడుకునై పౌరాణికుని అల్లుడనైయుండి
ఘృతమంటే బ్రహ్మపేడ అని తెలియదా?"

"శాస్త్రులవారింట పుట్టి సోమయాజుల వారింటమెట్టి లవణమంటే
తెలియదా? దూడపేడ అన్నట్లు"

"అల్లం అంటే తెలియదా బెల్లంమాదిరి పుల్లగాఉంటుంది అన్నాడట" పంచపాండవులెందరో, మంచానికి కోళ్ళు ఎన్ని ఉంటాయో తెలియని వాళ్లెందరు. తెలియకపోయినా అజ్ఞానంవల్ల తెలుసునని భ్రమలో పడి ముగ్గురని రెండువ్రేళ్ల చూపిస్తే ఎంతటి అజ్ఞానులో తెలుస్తుంది.

కొందరు తమ అజ్ఞానం వల్ల ప్రమాదాన్ని తామే కొనితెచ్చుకుంటారు. "చేప అని మొసలినోట్లో చేయిపెట్టినట్లు" గా ప్రవర్తించే వాడొకడయితే "సూదికోసం దూలం మోసినట్లు"గా అనవసరమైన కష్టాన్ని నెత్తిన వేసుకొనే అజ్ఞాని మరొకడు.

కొందరు అజ్ఞానంవల్ల ఒక ప్రమాదం నుంచి తప్పించుకుంటున్నామను కొంటూనే అంతకన్న ఎక్కువ ప్రమాదంలో ఇరుక్కుంటారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని వెల్లడిచేసే సామెతలివి:

22. భర్తృహరి సుభాషితము : 3 వ పద్యం బాలసరస్వతీ బుక్ డిపో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఎద్దు తన్నుతుందని గాడిదకాళ్లు పట్టుకొన్నట్లు"
"ఎద్దు పొడుస్తుందని తన్నే గుర్రం చాటు చేరినట్లు"
"ఎద్దు తన్నుతుందని గుర్రం చాటు చేరినట్లు"

ఎద్దు తన్నుతుందేమోనని, పొడుస్తుందేమోనని భయపడి గాడిద చాటున చేరినా, గుర్రం వెనుకదాగినా అవి మాత్రం ముద్దుపెట్టుకుంటాయా? ఎద్దుకంటే గట్టిగా బలంగా తన్నుతాయికదా!

కొందరికి ఏపని ఎక్కడ, ఎందుకు, ఎలా, ఎప్పుడు చేస్తే ప్రయోజనం ఉంటుందో తెలియదు. అలాంటి వాళ్లనుద్దేశించి

"కోడిగ్రుడ్డును కొట్టను గుండ్రాయి కావాలా"
"తెడ్డునాకి వ్రతం చెడగొట్టుకొన్నట్లు"
"వక్క కొరికి ఒక్కపొద్దు చెడుపుకొన్నట్లు"
"రేపల్లె వాడలో పాలమ్మినట్లు"
"కమ్మరి వీధిలో సూదులమ్మినట్లు"
"దివిటీముందు దీపంపెట్టినట్లు"

అనే సామెతలు వెలువడ్డాయి.

గౌరవార్హులెవ్వరో, తమపని సానుకూలమవడానికి కావల్సిన సాధనమేదో తెలియక ప్రవర్తించే వాళ్ల స్వభావాన్ని చాటి చెప్పే సామెతలు పుట్టాయి:

"శిరసుండగ మోకాలికి సేసలు బోసినట్లు"
"తలవిడిచి కాలికి బాసికం కట్టినట్లు"
"కాళ్ళుండగా మోకాళ్ళతో నడిచినట్లు"
"తల్లికుండగ పినతల్లిని పొగడినట్లు"
"అమ్మ ఉండగ పెద్దమ్మను పొగడినట్లు"

సేసలు చల్లవలసింది శిరస్సుపైన కాని మోకాలిపై కాదు. బాసికం కట్టవలసింది తలకేగాని కాలికి కాదు. కన్నతల్లి ఉండగా పెద్దమ్మను, చిన్నమ్మను పొగడడం అజ్ఞానం కాక మరే మవుతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఏది లాభాన్ని కలిగిస్తుందో, ఏది నష్టాన్ని కలిగిస్తుందో తెలియని వాళ్లలో పరాకాష్ఠకు చేరిన అజ్ఞానాన్ని ప్రతిబింబింపచేసే సామెతలు వ్యాప్తిలో ఉన్నాయి.

"రత్నాన్ని రువ్వి గాజును కోరినట్లు"
"అంగడి అమ్మి గొంగడి కొన్నట్లు"
"పాలిచ్చే బఱ్ఱెను అమ్మి పైన ఎక్క దున్నను తెచ్చుకొన్నట్లు"
"కంచమమ్మి మట్టెలు చేయించుకొన్నట్లు"
"కప్పురమిచ్చి ఉప్పును కొన్నట్లు"
"పంటచేను విడిచి పరిగ ఏరినయట్లు"
"కంచం, చెంబు బయట పారేసిరాయిరప్పలోన వేసుకొన్నట్లు"

పనిచేయడానికి తగిన సాధనాన్ని ఉపయోగించి ప్రమాదరహితంగా పనిని ఫలప్రదం చేసుకోవడం ప్రజ్ఞావంతుల లక్షణం. తద్భిన్నంగా ప్రవర్తించి ఇబ్బందుల్ని ఆహ్వానించే అజ్ఞానుల స్వభావాన్ని విడమరచి చూపేసామెతలివి.

"తెడ్డుండగా చేయికాల్చుకున్నట్లు"
"తెడ్డుండగా చేత్తో కలియబెట్టినట్లు"
"తెడ్డుండగా చేతితో తాకనేల?"

అన్నాన్ని ఎవరైనా తెడ్డుతో కలియబెడతారు కాని చేతితో కలియబెట్టి చేయి కాల్చుకునే అజ్ఞానులుంటారా?

కొందరు తమ అజ్ఞానంతో తమకే నష్టాన్ని కల్గించుకుంటారు. తాము "తినేకూటిలో మన్నుపోసుకున్నట్లు"గా ప్రవర్తించే వాళ్లు కొందరైతే, తమకు లాభం కల్గించే "పాడికుండను పగులగొట్టుకున్నట్లు" నడుచుకునే వాళ్లు మరి కొందరు. "మట్టి గుఱ్ఱాన్ని నమ్మి ఏట్లోదిగే" వాడొకడు, "గుడిలో ఉండి గుడి రాళ్లను తీసే" వాడు మరొకడు. "బిడ్డనుదించి లోతు చూచే" వాడింకొకడు. వీళ్లంతా అజ్ఞానం మూర్తిభవించిన మూర్ఖశిఖామణులు. ముగ్గురిలోను ఒకణ్ణిమించిన వాడింకొకడు. మొదటివాడు తానొక్కడే నష్టపోగా రెండవవాడు తనతోపాటు గుడిని కూడ పడగొడుతున్నాడు. మూడవ వాడేమో తన స్వార్థం కోసం పసిపాప నిండు ప్రాణాల్ని బలిపెడుతున్నాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



లోకంలో అన్నింటిని సాధించాలనుకోవడం తప్పుకాదు. కాని. అనుకున్న వన్నీ సాధ్యమవుతాయా? కావా? అని ఆలోచించాలి. సాధ్యం కాదని తెలిస్తే వదలివేయాలి. అది బుద్ధిమంతుల లక్షణం. కానీ సాధించడానికి తగిన సాధన సామగ్రి లేవని తెలిసి కూడా అసాధ్యమైన వాటిని కూడా సాధించాలని పట్టుదలను చూపించి నలుగురి విమర్శకు గురవుతూ ఉంటారని క్రింది సామెతలు వెల్లడిచేస్తాయి.

"నేలమీద యీతనేర్చుకొన్నట్లు"
"నేలమునగకు నిచ్చెనవేసినట్లు"
"ఆకాశానికి నిచ్చెనవేసినట్లు"
"గాలితో తాడు పేనినట్లు"
"జమ్మి ఆకుతో విస్తరి కుట్టినట్లు"
"నేలమెత్తనిదని మోచేత త్రవ్వినట్లు"
"అంధునకు అద్దం చూపినట్లు"
"మొండిచేతితో మూరవేసినట్లు"
"భూమికి ఆకాశానికి దారము పట్టుట"
"మోకాళ్లకు బట్టతలకు ముడిపెట్టుట"

"కాకిపిల్ల కాకికి ముద్దన్నట్లు" ఎలాంటివాడికైనా తనది అనే అభిమానం ఉంటుంది. ఆ అభిమానంతో తానేంచేసినా అది మంచిదనీ, గొప్పదనీ చెప్పుకుంటాడు. అది నిజంగా మంచిదైనా కాకపోయినా మంచిదని చెప్పుకోవడం సహజంగా మనకు కనిపిస్తుంది. కాని మూర్ఖుడైనవాడు తనవస్తువు తానే బాగాలేదని చెప్పుకుంటాడని "తన చల్ల పుల్లనిదని తానే చెప్పుకుంటాడా?" అనే సామెత విమర్శిస్తుంది.

కొన్ని ప్రదేశాలకు, కొన్ని కొన్ని కార్యాలకు కొన్ని వస్తువుల్ని తీసికొని వెళ్ళరు. నియమిత కార్యాలకు నియమిత వస్తువుల్ని తీసికొని వెళ్లాలి. అలాకానీ పక్షంలో ఆపని జరుగకపోవచ్చు. కాని అజ్ఞానులు ఏది తగినదో, ఏది కాదో ఆలోచించరు. శుభకార్యాలకు పోతూ అశుభాన్ని కలిగించే వాటిని తీసికొని వెళ్తూ ఉంటారు. అలాంటివాళ్ల అజ్ఞానాన్ని విమర్శిస్తూ" పెండ్లికి వెడుతూ పిల్లిని చంకన బెట్టుకొనిపెళ్లినట్లు" అనే సామెత పుట్టింది. పిల్లి కనిపించటం అశుభసూచకం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



శుభమైన పెండ్లి కార్యానికి పోతూ పిల్లిని చంకన బెట్టుకొని పోవడం మూర్ఖత్వమే కదా ! ఇలాంటి భావాన్ని తెలిపే సామెతలు:

"గృహప్రవేశానికి పోతూ గడ్డ గూబను చంకనబెట్టికొనిపోయినట్లు"

"దొంగతనానికి పోతూ డోలుచంకన బెట్టుకొని పోయినట్లు"

"ఉడుమును చంకన బెట్టుకొని ఊళ్లో ప్రవేశించినట్లు"

తమకు కావలసిన వస్తువు తమ దగ్గరే ఉంటుంది. కానీ వారికి ఆ విషయం తెలియదు. కావలసిన వస్తువు యొక్క జ్ఞానం వారికి లేకపోవడం చేత దానికోసం ఎక్కడెక్కడో వెదుకుతూ ఉంటారు. ఎందరెందరినో అడుగుతూ ఉంటారు. అప్పుడు ఎదుటి వాళ్లు వాళ్లలోని అజ్ఞానాన్ని గుర్తించి పరిహాసం చేస్తూ చెప్పిన వాక్యాలే సామెతలుగా ప్రాచుర్యాన్ని పొందాయి.

"చంకలో పిల్లనుంచుకొని సంతలో వెదికినట్లు"

"ఉయ్యాలలో పిల్లను ఉంచి ఊరెల్ల వెతికినట్లు"

"చంకలో పిల్లను పెట్టుకొని లంకలన్నీ వెదికినట్లు"

"చంకలో పిల్లను పెట్టుకొని ఊరంతా వెదికినట్లు"

"ఉయ్యాలలో బిడ్డను పెట్టి ఊరంతా వెదికినట్లు"

"అరచేత వెన్నపెట్టుకొని నేతికి ఏడ్చినట్లు"

"ఉట్టిమీద వెన్నపెట్టుకొని ఊరంతా నేతికి దేవులాడినట్లు"

"వెన్నచేతబట్టుకొని నేతికి వెదికినట్లు"

"వెన్న దగ్గర ఉంచుకొని నేతికి వెదికినట్లు"

"గొల్లవాడు గొర్రె పిల్లను చంకన పెట్టుకొని - అడవి అంతా వెదకినట్లు"

"మేకపిల్లను చంకలో పెట్టుకొని ఊరంతా వెదకినట్లు"

"కొండను తలక్రింద పెట్టుకొని రాళ్ళకై వెదకినట్లు"

ఎవరితో పని చేయించుకుంటామో వారికి తగిన కూలి యివ్వటం ధర్మం. కూలి యిచ్చిన వానితోనే పని చేయించుకోవటం బుద్ధిమంతుల లక్షణం. కూలి డబ్బులు ఒకరికిచ్చి మరొకరిని పనిచేయమనటం అజ్ఞానం. దానివల్ల ప్రయోజనం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కూడా ఉండదు. శ్రమ మాత్రమే మిగులుతుంది. కార్యకారణ సంబంధాన్ని తెలిసికోకుండా పెట్టుబడి ఒకచోట పెట్టి ఫలితాన్ని మరొక చోట నుండి ఆశించే వాళ్ల స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"గాడిదకు గడ్డివేసి ఆవును పాలిమ్మన్నట్లు"
"ఎనుముకు మేతవేసి ఆవును పితికినట్లు"
"ఎద్దుకు చొప్పవేసి ఆవును పాలీయమన్నట్లు"

పాలివ్వాలంటే ఆవుకు గడ్డివేయాలి, ఆవుకు మేత తినిపించాలి. కాని ఆవుకు గడ్డి పెట్టక ఎనుముకు పెడితే పాలెలావస్తాయి.

కొందరు అజ్ఞానంతో తక్కువ వెలగల వస్తువుల్ని కొంటూ ఎక్కువ వెలగల వస్తువుల్ని కొసరు అడుగుతుంటారు. ఎక్కడైనా తక్కువ ధరగల వస్తువుల్ని అదీ కూరగాయల్లాంటివి కొంటే కొసరు అడిగితే వేయవచ్చును. కానీ తక్కువ ధర వస్తువును కొని ఎక్కువధర గల వస్తువును కొసరడం అజ్ఞానమవుతుంది. వంకాయలు కొంటూ గుమ్మడికాయను కొసరడిగితే తగునా? ఇలాంటి వాళ్ల స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"కొన్నది వంకాయ కొసరింది గుమ్మడికాయ"
"వెండి బేరమాడుతూ బంగారు కొసరినట్లు"

కొందరు అజ్ఞానంతో ఒకచోట వస్తువు పెట్టి మరోచోట దానికై వెదకుతుంటారు. వస్తువును ఎక్కడపెడితే అక్కడే వెదకితే దొరుకుతుంది కానీ మరెక్కడో వెదకితే దొరకదు. తమ వస్తువుల్ని ఒకచోట పోగొట్టుకొని మరోచోట వెదకేవాళ్ళను "కంది చేలో సూదిపోతే పప్పుచట్లో వెదకినట్లు" అనే సామెత విమర్శిస్తుంది. సూది కంది చేలో పోయింది కాట్టి కందిపప్పులో కలిసి ఉంటుందనే అజ్ఞానంతో ఉంటారన్నమాట.

అల్పవస్తువుల్ని కొని అవి పనికిరాకపోతే వాటిని పక్కన పడేసి మళ్లీ పనికి వచ్చే వస్తువుల్ని కొంటారు. అంతే కానీ అల్పవస్తువులకై ముఖ్యమైన వాటికి నష్టాన్ని కలిగించుకోరు. కాని కొందరు అజ్ఞానంతో అల్ప వస్తువుల్ని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పారవేయలేక వాటినే ఉపయోగించుకోవాలని ముఖ్యమైన వాటికి నష్టాన్ని కలిగించు కుంటారు. అలాంటి వాళ్ళను విమర్శించే సామెతలు :

"చెప్పులు చిన్నవని కాళ్ల తెగకోసుకుంటారా?"

"చేంతాడు కురుచైతే బావి పూడ్చుకుంటారా?"

చెప్పులు కాలికి సరిపడకపోతే మరొక జత కొంటారు. అంతేగాని చెప్పులు చిన్నవని కాళ్లను తెగకోసుకోరు. చేంతాడు చిన్నదైతే మరో చేంతాడు కొంటారు కానీ అజ్ఞానంతో బావినే పూడ్చుకోరు.

కొందరు అజ్ఞానంతో ఇతరులు చెప్పిన మాటల్ని సరిగా అర్థం చేసుకోకుండా చేయరాని పనులు చేస్తుంటారని "ముక్కు నలిపి దీపం పెట్టమంటే మొగుడి ముక్కు నలిపిందట" అనే సామెత వివరిస్తుంది. దీపం వత్తి కొసముక్కు అని తెలియక భర్త ముక్కు నలిపితే అజ్ఞానం కాక మరేమంటారు.

**మదం :-**

మానవుని అంతశ్శత్రువుల్లో మదం ఒకటి. క్రొవ్వు, గర్వం, పొగరు, అహంకారం అనేవి దీనికి పర్యాయపదాలు. విద్య, ధన, కుల మదాలను త్రిమదాలు అంటారు. వీటికి అన్న, స్త్రీ, రూప, ఉద్యోగ యౌవన మదాల్ని కలిపి అష్టమదాలని పిలుస్తారు.

ఉత్తములైన వాళ్లు ధనం, అధికారం ఉన్నా లేకపోయినా ఒకేవిధంగా ఉంటారు. వాళ్ల ప్రవర్తనలో మార్పుండదు. కానీ నీచులకు ధనం, అధికారం లభిస్తే గర్వంతో అంధత్వం వస్తుంది. విచక్షణా జ్ఞానం నశిస్తుంది. "ధనం, విద్య, వంశం, అనే మూడు సజ్జనులకు అణకువనూ, విధేయతనూ కలిగిస్తే అవే దుర్మతులకు మదాన్ని కలిగిస్తా"[23] యని భారత ప్రవచనం. గర్వం మానవుని పతనానికి హేతు భూతమవుతుంది. కొంచమైనా గర్వమనేది చిరకాలము నుండి సంపాదించిన తపఃఫలానికి హానికలిగిస్తుంది.

---

23. ఆంధ్ర మహా భారతం 5-2-35

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"..... ... ...........అల్పమయ్యు; ద
ర్పము బహుకాల సంచిత తపఃఫల హానియొనర్పకుండునే"[24]

గర్వం మానవుని అభివృద్ధికి ఆటంకాన్ని కలిగిస్తుంది. అందుకే మహాకవియైన భారవిని తండ్రి పొగడటానికి ఇష్టపడడు. గర్వం కల్గినవాడు ఎవడైనా సరే దండనార్హుడని భారతం పేర్కొంటుంది.

"గర్వియై కార్య మిట్టిదకార్యమిట్టి
దని యెఱుంగక లోకంబు చనుపథమున
దిరుగకున్మదవృత్తి వర్తించునట్టి
వాని గురువైన దండింపవచ్చు........"[25]

ధనం వల్ల మనిషిలో మదం పెరిగి దుర్జనుడుగా మారుతాడు. ధనం లేని నాడు మదం తగ్గిపోయి దుర్గుణాలన్నీ తొలగిపోయి మంచి మనిషిగా మారుతాడని వేమన అభిప్రాయం.

"ధన మెచ్చిన మదమెచ్చును
మదమెచ్చిన దుర్గుణంబు మానక హెచ్చున్
ధనముడిగిన మదముడుగును
మదముడిగిన దుర్గుణంబు మానును వేమా:"[26]

ధనగర్వం కల్గినవాడు న్యాయాన్యాయాల్ని, ధర్మాధర్మాల్ని పాటించడు. మంచి చెడ్డల్ని ఉచితానుచితాల్ని గ్రహించడు. అల్పుడైనవాడు ఐశ్వర్యం లభిస్తే చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తాడు. ధనగర్వంతో మిడిసిపడుతూ విచిత్రమైన కోరికలు కోరుతూ ఉంటాడని చెప్పే సామెతలు ప్రజల వ్యవహారంలో ఉన్నాయి.

"అల్పుడికి ఐశ్వర్యం వస్తే అర్ధరాత్రి గొడుగు పట్టమన్నాడట"
"చీపురుకట్టకు సిరివస్తే కోడి ఈక గొడుగు పట్టెనట"

---

24. ఆంధ్ర మహాభారతం 1-8-117
25. ఆంధ్ర మహాభారతం 4-5-309
26. వేమన పద్యములు : 142 వ పద్యం : ఎస్. వి. గోపాల్ అండ్ కో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"చీరపోతుకు సిరివస్తే గోలకొండకాడికి గొడుగు తెమ్మన్నదట"

"చింతకాయలు అమ్మే వానికి సిరిమానంవస్తే ఆవంకరటింకరవి
ఏమికాయలన్నదట"

నడమంత్రపు సిరి లభిస్తే మనిషి గర్వాంధుడవుతాడు. నడమంత్రపు సిరి మనిషిని గర్వంతో విర్రవిగేట్లు చేస్తుంది.

..................ఘనాభ్యుదయంబు నిప్పుడొం
దితిమని మాటిమాటికిని నిక్కెడు సిగ్గెడు విఱ్ఱవీగెడున్
క్షితినటుగాడె యొక్కొకరికిన్నడు మంత్రపు గల్మికల్గినన్"[27]

గర్వంతో విర్రవీగేవాళ్లను సేవించడం కత్తిమీద సాములాంటిదని, వాళ్ల ప్రవర్తన విచిత్రంగా ఉంటుందని తెలిపే సామెతలు కూడా పుట్టాయి.

"నడమంత్రపుసిరికి నెత్తిమీద కండ్లు"

"కొత్తకలిమిసేవ కత్తిమీద సాము"

"కొత్తగా సిరివస్తే అర్ధరాత్రి గొడుగు పట్టమన్నాడట"

"నడమంత్రపు సిరివస్తే నడిరేయి గొడుగు పట్టమన్నాడట"

చిన్నప్పటి నుంచి చింతకాయలమ్మి "ఆ వంకరటింకర కాయలేమి రాజా!" అన్నదట. ఒకప్పుడు బీదరికంలో ఉంటూ మధ్యలో ధనం లభించడం వల్ల గర్వం పెరిగి పూర్వం బ్రతుకుదెరువుకై అమ్ముకొంటున్న చింతకాయలే వంకర టింకర కాయలుగా కన్పించాయట.

"అల్పబుద్ధి వాని కధికారమిచ్చిన
దొడ్డవారినెల్ల తొలగ గొట్టు
చెప్పుతినెడికుక్క చెఱకు తీపెరుగునా"[28] అంటాడు వేమన.

అల్పుడికి అధికారం లభిస్తే మదం పెరిగి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాడు. మంచి వాళ్లకే అపకారం తలపెడతాడు. అధికార మదంతో ప్రవర్తించే వాళ్ల

27. విజయ విలాసము : 1-34

28. వేమన పద్యరత్నాకరము : 361వ పద్యం : బాలసరస్వతీ బుక్ డిపో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



స్వభావాన్ని విమర్శించే సందర్భంలో "కుక్కకు పెత్తనమిస్తే చెప్పులన్నీ కొరికి పెట్టింది" అనే సామెతను చెప్పుకుంటారు. చెప్పులు కొరికి తినడం కుక్క జాతి లక్షణం. అందుకే దానికి అందకుండ చెప్పుల్ని దూరంగా ఉంచుతాం. దాన్నే చెప్పులకు కాపలా పెడితే ఇంకేముంది? ఇష్టమొచ్చినట్లు చెప్పుల్ని తెగకొరికి వేస్తుంది. దాని అధికారానికి హద్దు ఉండదు. అలాగే అల్పుడికి అధికారం ఇస్తే యథేచ్ఛగా నడుచుకుంటాడు. ఇలాంటి స్వభావాన్ని తెలిపే మరికొన్ని సామెతలు.

"కుక్కకు పెత్తనమిస్తే కుండలు కె(గె)లకదా!"
"కోతికి పెత్తనమిస్తే గోదావరికడ్డంగా ఈదిందట"
"గొద్దెకు పెత్తనమిస్తే గోదావరంతా తేలియాడిందట"
"తేలుకు పెత్తనమిస్తే తెల్లవార్లు తెగకుట్టిందట"
"పేనుకు పెత్తనమిస్తే తలంతా తెగకొరికి పెట్టిందట"
"పేనుకు పెత్తనమిస్తే యీపిని యిరవైచోట్ల యీనిదట"

పెళ్లయిన తర్వాత అల్లుడు అత్తగారిపై అధికారం చలాయిస్తాడు. ఎలాంటి వాడైనా అల్లుడనే అహంకారంతో విర్రవీగిపోతాడు. అల్లుడూ! అనిపిలిస్తే సరి పూచికపుల్లకూడా ఎగిరి నిలుచుంటుందంటే అల్లుడి అధికారగర్వం ఎంతటిదో వ్యక్తమవుతుంది. అల్లుని అధికార గర్వాన్ని వివరించే సామెతలు ప్రజల వ్యవహారంలో వినిపిస్తాయి. ఉదా॥

"అల్లుడని పేరుపెట్టి పుల్ల విరిచివేస్తే ఎగిరిపడిందట"
"అల్లుడూ! అంటే వంకర తాడే లేచి నిలుచుంటుంది"

అల్లుడికే అంత అహంకారముంటే అతని తండ్రికి ఇంకా ఎక్కువ ఉంటుందని "అల్లుడి కత్తికి రెండువైపులా పదునైతే అతని అప్పకు ఆరువైపులా పదును" అనే సామెత వెల్లడిచేస్తుంది. ఆడపడుచు అధికారానికైతే అంతం ఉండదు. ఆడబిడ్డ అనే అహంకారంతో కన్నుమిన్ను కానకుండా ప్రవర్తిస్తుందని క్రింది సామెతలు వివరిస్తాయి.

"ఆడబిడ్డ అర్ధమొగుడు"
"ఉబుసుపోకకు పిండి బొమ్మను చేసి పీటమీద కూర్చుండ బెడితే
ఆడబిడ్డ తనాన అదిరిపడిందట"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"పిండిబొమ్మను చేసి పీట మీద కూర్చుండ బెడితే ఆడబిడ్డ తనాన
అదిరదిరిపడ్డదట"

కులంకూడా మనిషిలో మదాన్ని కలిగిస్తుందని "కులంకొద్ది గుణం", "పుట్టుకతోనే బుద్ధులు - కులంతోనే గుణాలు", "కులం కొద్ది గుణం జాతి కొద్ది బుద్ధి" అనే సామెతలు వివరించగా, తక్కువ కులం వాళ్ళకు పొగరుబోతు తనం ఎక్కువని "తక్కువ జాతికి నిక్కెక్కువ - తవ్వెడు బియ్యానికి పొంగెక్కువ" అనే సామెత చెబుతుంది. మాదిగకులం వాళ్ళకు సహజంగా పొగరని "మా పటేలప్పుడు ఎండ మాదిగవాని పొగరు ఒకటే" అనే సామెత వెల్లడి చేస్తుంది.

"అన్నమదము వల్ల అన్నిమదములు కలుగుతవి"
"కూడెక్కువైతే కువ్వాదమెక్కువ"
"తక్కువజాతి వాడికి ఎక్కువకూడైతే తిక్కతెగులు" అనే సామెతలు

అన్నంవల్ల మనిషిలో మదం కలుగుతుందని చెబుతాయి. ఇలాంటివే వ్యవహారంలో మరికొన్ని కనిపిస్తాయి.

"కూడు కలగగానే కులం మరచిపోతారు"
"కూడుతిని కులమెంచినట్లు"
"నిండిన కడుపు నిక్కిమాట్లాడును"
"నిండిన కడుపు నీతివినదు (ఎరుగదు)"

నీచస్వభావం కలవాళ్లకు, అనర్హులైన వాళ్లకు గౌరవమిస్తే అదివాళ్లలో గర్వాన్ని కలిగించి వాళ్ల ప్రవర్తనలో మార్పును తెస్తుంది. అల్పబుద్ధుల్ని గౌరవించడం వల్ల గర్వాంధులై ప్రవర్తిస్తారని తెలిపే సామెతలు.

"మాలదాన్ని అక్కా అంటే మరొక మెట్టు ఎక్కెనంట"
"మాలదాన్ని ఎంకటమ్మా! అంటే మరింత బిగుసుకున్నదట"
"మాలదాన్ని ఎంకటమ్మా! అంటే మరికాస్త ముందరింట్లోకి
వచ్చిందట"
"మాలదాన్ని వేంకటమ్మ! అంటే మళ్లొస్తా పా రెడ్డి అన్నదంట"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



దుర్జనులను పొగడితే వాళ్లలో గర్వం పెరిగి విర్రవీగుతారని "ఎనుబోతును పొగడితే కామధేనువనుకొని గంగడోలు వూగించి గర్వపడుతుంది" అనే సామెత వెల్లడి చేస్తుంది. మాలవాడు పొగడ్తలకు పొంగిపోయి మదంతో బరువైన పనిచేయటానికైనా సిద్ధపడతాడట. ఈ విధంగా పొగడ్తలకు పొంగిపోయి గర్వంతో అనవసరంగా బరువును నెత్తిన వేసుకొనే వాళ్ల స్వభావాన్ని

"సైరా మాలోడా! అంటే పరమెత్తిపైన వేసుకున్నాడట"

అనే సామెత చెబుతుంది.

## మత్సరం :-

అరిషడ్వర్గంలో ఒట్ట చివరిది మత్సరం. మత్సరం వల్ల ఈర్ష్య, ఈర్ష్యవల్ల పగ అసూయలు కల్గుతాయి. ఇతరులు బాగుపడుతూ ఉంటే చూచి ఓర్వలేరు. ఇతరుల ధనాన్ని, విద్యా సంపదనూ, బలాన్ని చూచి సహించలేక అసూయను పెంచుకుంటారు. కానీ ఇతరుల సంపదను చూసి ఓర్వ లేనివారు అంతులేని ఆవేదన పొందుతారని భారత సూక్తి:

"పరుల ధనమునకు విద్యా
పరిణతికిం దేజమునకు బలమునకు ఘనం
బెరియగ నసహ్యపడున
న్నరుడు దెవులు లేనివేదనన్ బడునధిపా"[29]

ఇతరుల మంచితనాన్ని చూసి కొందరు అసూయపడుతూ ఉంటారు. అసూయ కర్రనంటుకొన్న నిప్పులాంటిది. నిప్పు ఇతరుల్ని కాల్చినా ముందుగా కర్రనే కాల్చి వేస్తుంది. అట్లే అసూయ మనిషిని దహించివేస్తుంది. అసమర్థుని అసూయ పెద్దగా ప్రమాదకారి కాకపోవచ్చునేమో కానీ అర్థబలం, అంగబలం, అధికారబలం కల్గిన వాళ్ల అసూయ చాలా ప్రమాదకరమైంది. సమాజాన్ని దహించి వేస్తుంది. సర్వనాశనం చేస్తుంది.

మానవులలోని అసూయకు ముఖ్యకారణం మనోబలహీనతని "అసూయకు కావలసింది దౌర్బల్యం" అనే సామెత వక్కాణిస్తున్నది. ముఖ్యంగా స్త్రీలు

29. ఆంధ్రమహాభారతము : 5-2-58

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అసూయకు తొందరగా లోనవుతుంటారు. ఇతర స్త్రీలు ధరించిన వస్త్రాల్ని చూసినా, నగల్ని చూసినా వెంటనే అసూయకలుగుతుంది. వెంటనే తమలో కలిగిన అసూయను బయటికి వ్యక్తం చేస్తారు. అందుకే "అసూయ ముందు ఆడది వెనుక," "ఆడవాళ్ళు అసూయకు మారు పేరు" అనే సామెతలు పుట్టాయి. పరస్త్రీలను చూసినప్పుడేకాదు సొంతం అక్క మొగుడు అందగాడైనా, ధనవంతుడైనా, అధికారం కలవాడైనా, పేరు ప్రతిష్టలు కలవాడైనా అక్క అదృష్టాన్ని చూసి ఓర్చుకోలేక చెల్లెలు అసూయతో కుమిలిపోతూ ఉంటుంది. అట్లే చెల్లెలి అదృష్టాన్ని చూస్తే అక్క అసూయకు లోనవుతుందని "చెల్లెలి మగని చూచి చేయి విలగబడ్డదట", "అక్కపగ బావమంచి" అనే సామెతలు వెల్లడిచేస్తాయి.

అసూయవల్ల పగ ద్వేషాలు చెలరేగుతాయి. మగవాళ్లెందరయినా ఫరవా లేదు. కానీ ఆడవాళ్లు ఇద్దరు ముగ్గురు చేరితే కష్టమే. ఒకరిని చూసి మరొకరు ఓర్వలేరు. అసూయతో మండిపోతూ ఉంటారని కొన్ని సామెతలు వివరిస్తాయి.

"ఇద్దరుకూడితే ఇంగలంలేకుండానే మంట మండుతుంది"
"మూడుకొప్పులు కూడితే ముల్లోకాలు ఏకమవుతవి"
"ముప్పదియాలు జుట్లుకూడుతాయి కానీ మూడు కొప్పులు కూడవు"

మానవుడు సంఘజీవి. కాబట్టి సంఘంలో వివిధరంగాల్లోని వ్యక్తులతో పరిచయాలుండటం సహజం. ఇంట్లో కుటుంబ సభ్యుల, ఇరుగు పొరుగు వాళ్ల సహజీవనం ఎంతైనా అవసరం. కాని కొన్ని కారణాలవల్ల కుటుంబంలోని వివిధ వ్యక్తుల మధ్య, ఇరుగుపొరుగు వాళ్ళకు ఒకరిపై మరొకరికి అసూయపెరిగి పగకు దారి తీస్తుంది. అధికార వాంఛకలవాళ్లకు అధికారం కలవాళ్లను చూస్తే అసూయకల్గుతుంది. సమాజంలోని వివిధ మతాల వాళ్ళ మధ్య అసూయద్వేషాలు ఏర్పడుతాయి. భాషాద్వేషాల, వర్గ, ప్రాంతీయ విభేదాలవల్ల అసూయ పొడసూపవచ్చును.

ఉమ్మడి కుటుంబంలోని వ్యక్తుల మధ్యగల అసూయ వల్ల ఉమ్మడి కుటుంబాలు విడిపోతూ ఉంటాయి. కుటుంబ విభజనవల్ల ఆస్తి పంపకాల దగ్గర ఒకరిపై మరొకరికి అసూయఏర్పడి పగకు దారితీయవచ్చు. కుటుంబంలో అసూయాద్వేషాలుండటం సహజం కాబట్టి వాటిని బయటికి ప్రకటించ కూడదని,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఒకవేళ ప్రకటస్తే కలహాలతో కుటుంబాలు కూలిపోతాయని కొన్ని సామెతలు వెల్లడి చేస్తాయి.

"సంసారం గుట్టు వ్యాధి రట్టు"

"కొండంత కాపురం కొండేలతో చెడుతుంది"

"కలహమున్న కొంపలో కట్టు బట్టలుండవు"

కుటుంబములోని అన్నదమ్ములు ఎంతో అన్యోన్యంగా ఉంటారు. అలా ఉంటేనే నలుగురిలో పేరు ప్రతిష్టలు పెరుగుతాయి. అన్నదమ్ములు బాల్యంలో మిక్కిలి సన్నిహితంగా ఉంటారు. ఒకరిపై మరొకరు అనురాగాన్ని అప్యాయతను పెంచుకుంటారు. కానీ పెరిగి పెద్దవాళ్ళయ్యే కొద్ది వాళ్ల మధ్య అనురాగాలు, అప్యాయతలు లోపించి అసూయ ద్వేషాలు చోటు చేసుకుంటాయి. అన్నదమ్ములనే బంధం తొలగిపోయి దాయాదిమాత్సర్యం వాళ్ళ మధ్య ఏర్పడుతుందని క్రింది సామెతలు వెల్లడి చేస్తాయి.

"పుడుతూ సోదరులు, పెరుగుతూ దాయాదులు"

"పుడుతూ పుత్రులు పెరుగుతూ శత్రులు"

"అన్నదమ్ములపొత్తు చిన్నపుడు అప్ప చెళ్ళెళ్ళ పొత్తు పెద్దపుడు"

కుటుంబంలోని సభ్యుల అసూయవల్ల ఉమ్మడి కుటుంబాలు విడిపోతాయి. సోదరులుగా పుట్టినా పెద్దయ్యే కొద్ది దాయాదులుగా మారిపోతారు. ఆస్తి పంపకాల దగ్గరనో, పొలం, ఇల్లు వాటాల దగ్గరనో మనస్పర్థలు వస్తాయి. పగ పెరుగుతుంది. పగ అనేది ఎవరికైనా మంచిది కాదు, పగవల్ల మానవుడు సర్వనాశనం అవుతాడు శారీరకంగా మానసికంగా మనిషి పతనం చెందుతాడు. అందువల్ల పగ మనిషికి మంచిది కాదని భారత సూక్తి :

"పగయకలిగెనేని పామున్న యింటిలో
నున్నయట్లకాక యూఱడిల్లి
యుండునెట్లు చిత్తమొక మాటుగావున"[30]

---

30. ఆంధ్రమహాభారతం 5-3-20

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పగకలిగితే పాముున్న యింట్లో ఉన్నట్లుండునే కాని మనస్సుకు ఊరట కలుగదు. కాబట్టి "పగయడగించుటెంతయు లెస్స" అనే భారతసూక్తిని పాటించాలి. "పగకలిగి బ్రతకటం పాముున్న ఇంట్లో బ్రతకటం ఒకటే", "పగబట్టిన త్రాచు కాటువేయకమానుతుందా?" అనే సామెతలు పగవల్ల కలిగే నష్టాన్ని వివరిస్తాయి.

అసూయాద్వేషాలవల్ల విడిపోయినవాళ్ళు ఒకరిపై ఒకరు పగను పెంచుకొని కారాలు మిరియాలు నూరటం మొదలు పెడతారు. అన్నదమ్ములుగా పుట్టినా దాయాదిపగతో రగిలిపోతూ ఉంటారు. పగతో ఒకరి నాశనాన్ని మరొకరు కోరుకుంటారని, ఒకరిని చూస్తే మరొకరు పగతో మండిపడుతూ ఉంటారని కొన్ని సామెతలు వివరిస్తాయి.

"పాముకు పండ్లలో విషం జ్ఞాతికి కండ్లలో విషం"
"పాముకు విషంపండ్లలో జ్ఞాతికి విషం కండ్లలో"
"జ్ఞాతి గుర్రు అరటి కర్రు వదలవు"
"బావమరిది బ్రతుక గోరు దాయాదిచావగోరు".

"పరుల కలిమికి పొర్గియేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయి"31

అని అంటాడు గురజాడ మహాకవి. తానెంత నష్టపోయినా ఫరవాలేదు కానీ తన దాయాది మాత్రం బాగుపడకూడదనుకొంటాడట. అందుకే "మాబత్తె చస్తే చచ్చింది కాని మా పెద్దనాయన బత్తె పాలివ్వకపోతే చాలు" అనే సామెత పుట్టింది. పగ నిజంగా మనిషిని ఎంత మూర్ఖుడిగా మారుస్తుందో కదా. పగతో రగిలిపోయే దాయాది ఉంటే చాలు ఇక నిప్పు అవసరం లేకుండా మంట మండుతుందని "దాయాది ఉంటే నిప్పెందుకు" అనే సామెత కచ్చితంగా చెబుతుంది.

తోడికోడళ్ళ మాత్సర్యాన్ని తెలియజెప్పే సామెతలు ప్రజల వ్యవహారంలో కన్పిస్తాయి. తోడి కోడళ్లకు ఒకరిని చూస్తే మరొకరికి పడదు. తోడి కోడళ్ళ పగవల్లనే చాలా ఉమ్మడి కుటుంబాలు విడిపోతూ ఉంటాయి. ఇతర కోడళ్ళ

31. గురజాడ ముత్యాలసరాలు : పుట 62 విశాలాంధ్ర ప్రచురణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అందచందాలు, నగలు, మంచి మంచి వస్త్రాలు అన్నీ కంటగింపే. ఒక కోడలికి ప్రత్తన మిస్తే మరో కోడలు భరించలేదు. ఒక కోడల్ని ప్రేమగా చూస్తే మరో కోడలికి మాత్సర్యం పెరుగుతుంది. సవతి పోరు భరించడానికైనా సిద్ధంగా ఉంటుంది కానీ తోడికోడలితో కలిసి ఉండటానికి ఒప్పుకోదంటూ "సవతాలి కుండలోనైనా ఉడుకుతానన్నదిగాని తోడి కోడలు కుండలో ఉడకనన్నదట" అనే సామెత వివరిస్తుంది. మొగుడు కొట్టినా తిట్టినా రాచి రంపానా పెట్టినా భరించ డానికి సిద్ధంగా ఉంటుంది. కానీ తోడికోడలు ఆ దృశ్యాన్ని చూస్తే భరించలేదట. అందుక్కారణం తోడికోడలు సమయం దొరికిందని ఊరంతా దాన్ని చాటింపు వేస్తుందని భయం. అందుకే "మొగుడుకొట్టినందుకు కాదు తోడికోడలు నవ్వి నందుకు" అనే సామెత వ్యాప్తిలోకి వచ్చింది.

తోడికోడళ్ళ మాత్సర్యాన్ంటే సవతుల మధ్య ఉండేపగ ఇంకా ఎక్కువ. సంతానం లేకపోయినా, భార్య అనారోగ్యంగా ఉన్నా భర్త రెండవ వివాహం చేసుకుంటాడు. కొంతకాలం సవతులిద్దరూ కలసి మెలసి ఉంటారు. కాలం నడుస్తున్న కొద్ది భర్త చూపే ప్రేమానురాగాల్లో తేడాలు రావచ్చు. చిన్న భార్యతో కాస్త ఎక్కువ చనువుగా ఉండవచ్చు. చిన్న భార్యకు సంతానం కలగవచ్చు. అలాంటప్పుడు పెద్ద భార్యకు అసూయకలుగుతుంది. అసూయ పగగా మారి చీటికి మాటికి పోట్లాడుకుంటారు. తిట్టుకుంటారు. ఒకరిపై మరొకరు ద్వేషాన్ని పెంచుకుంటారు. సవతులిద్దరిమధ్య అసూయాగ్ని ప్రజ్వరిల్లుతుంది. పచ్చి గడ్డివేసినా భగ్గున మండుతుందన్నట్లుగా ఉంటారు. అందుకే "సవతుల పోరు చితుకుల మంట "అనే సామెత పుట్టింది. సవతి చేతులకు సంకెళ్ళు వేయించి తనేమో ఆభరణాలు ధరించాలని భావిస్తుందని "సవతికి సంకెళ్ళు నాకు పిల్లేండ్లు" అనే సామెత వెల్లడి చేయగా "స్వర్గానికి పోయినా సవతి పోరు తప్పింది కాదు'' అని అంటోంది మరో సామెత.

సమాజంలో ఏ మనిషి ఒంటరిగా జీవించలేడు. మంచికైనా చెడుకైనా ఇరుగూ పొరుగు ఉండాలి. ఎంతటివారికైనా ఇతరులతో ఎప్పుడో ఒకప్పుడు అవసరం ఉండక తప్పదు. అందుకే ఇరుగుపొరుగు వాళ్లతో స్నేహంగా ఉండాలని అంటారు. కానీ అసూయాపరులు ఇరుగుపొరుగు వాళ్ళు బాగుపడుతూ



CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఉంటే చూచి ఓర్చుకోలేరు ప్రతిచిన్న విషయానికి వివాదాల్ని పెంచుకుంటారు. ద్వేషాగ్నితో రగిలిపోతూ ఉంటారు. సమయం దొరికినపుడల్లా పగతీర్చు కోవడానికి ప్రయత్నిస్తారు. "పచ్చిగడ్డి వేస్తే భగ్గున మండినట్లు"గ ఉంటారు. ఇరుగుపొరుగు వాళ్ళపై గల పగతో నోటికి వచ్చినట్లు మాట్లాడుతారు. ఎదురైతే సరి వాళ్ళ పేరు పెట్టితిట్టకపోయినా కోడిమీదనో, కుక్కమీదనో సొడ్డుపెట్టి తిడుతూ ఉంటారు. అందుకే "ఓపనివారు కోరని వస్తువులు ఓర్చనివారు అనని మాటలు ఉండవు" అనే సామెత పుట్టింది. నోటికి వచ్చినట్లు మాట్లాడడమే గాక విపరీతమైన మాటల్ని కూడా పలికిస్తుందట అసూయ. అందుకనేమో "అసూయ పొరుగింటి గుర్రాన్ని గాడిద అనిపిస్తుంది." అనే సామెత ప్రచారంలోకి వచ్చింది. "ఇరుగుమంగలం పొరుగుమంగలం," "పోరిన పొరుగు రాచిన కుండలు మనవు." అనే సామెతలు ఇరుగుపొరుగువారి మధ్యగల ఈర్ష్యల్ని తెలుపుతాయి.

ఇరుగుపొరుగు వాళ్లపై ఉండే మత్సరంతో కొందరు తమకే నష్టం కలిగించు కుంటారు. తమకునష్టం జరిగినా సహిస్తారు కానీ ఇరుగుపొరుగు వాళ్లు బాగుపడితే చూచి ఓర్వలేరు. అలాంటివాళ్ల స్వభావాన్ని తెలియజెప్పే సామెతలు:

"పొరుగింటి పొయ్యి మండుచున్నదని తనపొయ్యిలో నీళ్లపోసుకున్నట్లు"
"ఎదిరింటి పొయ్యిమండితే తన పొయ్యిలో నీళ్ల పోసుకున్నట్లు"
"పొరుగమ్మ సరిగ పెట్టుకుంటే ఇరుగమ్మ ఉరిపెట్టుకుందట"

తాను నష్టపోవడమే గాక అవకాశం దొరికితే నష్టాన్ని కల్గిస్తాడు. కావుననే "పొరుగింటి బిడ్డను దించి లోతుచూచినట్లు" అనే సామెత పుట్టింది. ఇరుగు పొరుగు వాళ్ళపై ఉండే అసూయతో వాళ్ళపై బురదచల్లడానికి వేచి ఉంటాడు. పొరుగింట్లో ఎపుడైనా పోట్లాట జరిగితే చాలు తమఇంట్లో పండుగ జరిగినంత సంబరపడిపోయి ఆ విషయాన్ని ఊరంతా దండోరా వేయిస్తాడు. అందుకే "పొరుగింటి కలహం విను వేడుక" అనే సామెత పుట్టింది.

గ్రామాధికారి అయిన రెడ్డి ప్రజలు సుఖంగా ఉంటే ఓర్వలేడనీ అవసర మొస్తే పగతీర్చు కుంటాడనీ "ఓర్చలేని రెడ్డి ఉండీ చెరచెను, చచ్చీ చెరచెను" అనే సామెత చెబుతుంది. ఈ సామెతకు సంబంధించిన కథ ఒకటి ప్రచారంలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఇలా ఉంది. "ఒక దుష్టుడైన రెడ్డి తన గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉంటే ఓర్చుకోలేక కష్టాలు కలిగించేవాడట. ఆ కష్టాల్ని భరించలేక ఆ రెడ్డి బారి నుండి ఎలా తప్పించుకోవాలని ప్రజలు ఎదురుచూస్తూ ఉండగా, రెడ్డి వ్యాధి గ్రస్తుడయ్యాడని విని ప్రజలు సంతసించారట. ఆఖరు గడియలో ఉన్న రెడ్డి గ్రామ ప్రజల్ని పిలిపించి తన మరణానంతరం తన శరీరాన్ని పొరుగూరి పొలిమేరలో పాతి పెట్టమన్నాడట. అతని మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించలేని ప్రజలు రెడ్డి మరణించాక అతని శవాన్ని పొరుగూరి పొలిమేరలో పాతి పెడుతుండగా ఆ గ్రామ ప్రజలు కోపించి వాళ్లను చావగొట్టారట. అప్పుడు ప్రజలు అనుకున్నారట ఔరా! "ఓర్వలేని రెడ్డి ఉండీ చెరచెను, చచ్చీ చెరచెను" అని. (చూడుడు : సామెతల స్రవంతి : పుట : 38-39)

సమాజంలో వివిధ కులాల, మతాల మధ్య అసూయాద్వేషాలు ఏర్పడు తుంటాయి. ఓర్వలేనితనంతో ఒకరిని మరొకరు నిందించుకుంటారు. ఒక కులం వాళ్లపై మరోకులం వాళ్లు మాత్సర్యాన్ని పెంచుకుంటారు. "కసుమాలపు కమ్మ కులము కంపనాకాలదు కట్టైనా కాలదు" అని కాపుకులంవాళ్లు నిందించగా, "కసుమాలపు కాపుకులం కంపనాకాలదు కట్టైనా కాలదు" అని వెంటనే కమ్మ వాళ్లు నిందించేవారట. అందుకే "కమ్మ కక్ష కాపు కక్ష" అనే సామెత పుట్టింది.

ఒకప్పుడు ఆంధ్రదేశంలో శైవ వైష్ణవమతాల మధ్య అసూయాద్వేషాలు బాగా ఉండేవని చరిత్ర తెలుపుతుంది. శైవుల్ని చూస్తే వైష్ణవులకు, వైష్ణవుల్ని చూస్తే శైవులకు పడేది కాదు.

శైవుల్లో వీరశైవులుండేవారు. వాళ్లు వైష్ణవులేది చేస్తే దానికి ప్రతిగా చేస్తుండేవారు. "వీరశైవులు బసవనిపేర బసవిరాంద్రను తయారు చేసినట్లు వైష్ణవులు కూడా ముద్రలు వేసి దాసీలను సిద్ధము చేసిరి."[32]

ఊరేగింపులు, ఉత్సవాలు జరిగేటప్పుడు శైవులు వైష్ణవులు ఎదురుపడితే పరస్పరం నిందారోపణలు చేసుకుంటూ పోట్లాడుకొనేవారు. ఆ ద్వేషంతో ఒకరి సత్రాన్ని మరొకరు తగులబెట్టు కోనేవాళ్ళని "అడ్డబొట్టు వాడు నిలువుబొట్టువాడు

32. డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు : మన మతములు - సంప్రదాయములు : పుట - 36

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



తగవు లాడి సత్రం తగులబెట్టినారట" అనే సామెత వెల్లడిస్తుంది. ద్వేషాగ్నితో మండిపోతూ సమయం దొరికితే ఒకర్ని మరొకరు అవమాన పరచటానికి సిద్ధపడే వారు. "నాయింటికి నేనే పెద్దను పిల్లికి పెట్టరా పంగనామాలు" అని శైవులు వైష్ణవుల్ని వ్యంగ్యంగా మాట్లాడితే "ఒక లింగడు పోయినా పోయినట్లే బాగా నమిలి మింగరా" అన్నాడట ఒక వైష్ణవుడు అన్నంతినేటప్పుడు నోటిలోనికి వచ్చిన రాతినుద్దేశించి. శైవవైష్ణవుల ద్వేషాల వల్ల యాత్రికులు చాలా కష్టాల్ని ఎదుర్కోవలసి వచ్చేది. అందుకై యాత్రికులు సమయానుకూలంగా ప్రవర్తించే వారు. ఎవరైనా "మీరు దాసరులా? జంగలా?" అని ప్రశ్నిస్తే "ముందూరును బట్టి" అని సమాధానం చెప్పేవారట.

కొందరిమధ్య "పచ్చిగడ్డివేస్తే భగ్గున మండినట్లు" ఉంటుంది. ఒకరిని చూస్తే మరొకరికి పడదు. అసూయాగ్నితో మండిపోతుంటారు. ఒకవేళ వాళ్ల మధ్య స్నేహం ఉన్నా అది "నిప్పుకూ నీళ్ళకూ ఉన్నస్నేహం"లా ఉంటుంది. నిప్పుకు, నీళ్ళకు పరస్పరవైరమే కానీ స్నేహం కుదరదు. పగతో భగ్గుమని మండిపోయేవాళ్లు ఎపుడూ కలసి ఉండరని "నీరు నూనె కలుస్తాయా?" అనే సామెత చెబుతుంది. నీరు నూనె ఎపుడు కలువవు. స్థూల దృష్టికి ఒకే రకంగా కనబడినా అవి వేరువేరుగానే ఉంటాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

## మూడవ అధ్యాయం

# సామెతలు - ద్వంద్వాలు

**కష్ట సుఖాలు :-**

"కష్టసుఖాలు కావడికుండలు" అని పెద్దల సూక్తి. మానవుని జీవితంలో కష్టంకానీ సుఖం కానీ సమానంగా ఉంటాయి. కష్టసుఖాలు చీకటి వెలుగుల్లాంటివి. చీకటి వెంట వెలుగు, వెలుగు వెంట చీకటి ఎలా వస్తాయో అలాగే మానవుని జీవితంలో కష్టం కొన్నాళ్ళు, సుఖం కొన్నాళ్ళు. కష్టసుఖాల గురించి దువ్వూరి రామి రెడ్డి గారు ఇలా అన్నారు :

"కష్ట సుఖములు నీచోచ్చ గతులు గలవు
చక్రదండంబులకు బోలె; సమయమందు
నిట్టి మార్పులనంతమై యొసగుచుండు
భావి పరిణామమెవ్వరు పలుకగలరు?"[1]

"కష్టం నుండి బయటపడే ఏకైక మార్గం కష్టం గుండానే"[2] అని ఆంగ్ల సామెత. "కష్టాలు మానవులకు గాక మాకులకు వచ్చునా?," "కష్టాలు మానవులకు గాక మాకులకా?" అనే సామెతలు కష్టాలు మానవునికి సహజమని వెల్లడి చేస్తాయి. కష్టాలు మానవునికి తప్పవని చెప్పినా అవి శాశ్వతంగా ఉండవని "కష్టాలు కలకాలం కాపురముండవు" అనే సామెత చెబుతుంది. కష్టపడటం మనిషి స్వభావంగా ఉండాలనీ, కష్టపడి సంపాదించడం వల్ల మనిషి సుఖపడతాడని "కష్ట సంపాదనము - ఇష్ట భోజనము", "కష్టపడి సుఖపడమన్నారు" అనే సామెతలు వివరిస్తాయి.

మంచికోసం పాటు పడే వాళ్లకు కష్టాలు తప్పవు. విధి వక్రిస్తే మంచి వాళ్ళకే కష్టాలు కల్గుతాయి. అయితే బుద్ధిమంతుడు కష్టాలు కలిగాయని క్రుంగి

1. కృషీవలుడు - 22 వ పుట - అరుణా ప్రెస్ - నెల్లూరు - 1950
2. "The only way out of a difficulty is through it".

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పోడు. అల్పుడైతే కష్టాల్ని చూసి భయపడి క్రుంగిపోతాడు. కష్టాల వల్లనే మనిషి జీవితంలో పరిపూర్ణత పొందుతాడని "రాపిడి లేనిదే రత్నం ప్రకాశించదు. అలాగే కష్టాలను తట్టుకోలేని మానవుడు ఏ నాటికి పరిపూర్ణత పొందలేడు"[3] అని చైనా సామెత వెల్లడి చేస్తుంది. ఎన్నో సుత్తి దెబ్బలు తింటే గాని కఠినశిల కన్నుల కింపైన రమణీయ శిల్పంగా తయారుకాదు. ఇనుమును కొలిమిలో బాగా కాల్చి ఎన్నో సమ్మెట దెబ్బలు వేస్తే తప్ప ఉపయోగకారి కాదు. అట్లే మానవుడు కూడా ఎన్నో కష్టాల్ని ఎదుర్కొనాలి. అప్పుడే జీవితం అంటే ఏమిటో తెలుస్తుంది. జీవితంలో ఎన్నో ఒడుదుడుకులకు తట్టుకొని నిలుపగలిగినవాడే నిజమైన మనిషి అనిపించుకుంటాడు. అలాంటి వాడినే అందరూ గౌరవిస్తారు. "సంపద వల్ల అవగుణాలు బయటపడతాయి, కష్టాల వల్ల సుగుణాలు వెల్లడవుతాయి"[4] అని ఆంగ్ల సామెత.

"దరిద్రుడు తలగడుగబోతే వడగండ్ల వాన వచ్చిందట" అనే సామెత దరిద్రులకు కష్టాలెక్కువని చెబుతుంది. దురదృష్టవంతులకు కష్టాలు ఎక్కువగా వస్తాయి. కొందరి దురదృష్టమేమో కానీ కష్టాల్లో ఉన్నప్పుడే వాళ్లకే మళ్లీ కష్టాలు కలుగుతాయి. అలాంటివాళ్ల కష్టాల్ని క్రింది సామెతలు వివరిస్తాయి.

"మూలిగే నక్కమీద తాటి పండు పడ్డట్టు"

"గోరుచుట్టుపై రోకటిపోటు"

"మొదలే కుంటికాలు దానికి తోడు పక్షవాతం"

"ముందే ముక్కిడి పైగా పడిసెమన్నట్లు"

"ముక్కిడికి తోడు పడిశమన్నట్లు"

"అసలే మూగ అందులో మూర్ఛ అన్నట్లు"

కష్టంతో బాధపడిపోతున్న వాళ్లకింకా బాధకలిగేట్లు కొందరు మాట్లాడుతూ ప్రవర్తిస్తుంటారు. అలాంటివాళ్లను విమర్శిస్తూ కొన్ని సామెతలు పుట్టాయి.

---

3. భావన - సుభాషితాల సంకలనం - పుట - 21 - యువభారతి ప్రచురణ,
4. మణిపూసలు : పుట - 45 : యువభారతి ఎడ్యుకేషనల్ సొసైటి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఊరిన పుండుపై ఉప్పుచల్లినట్లు"
"ఊరిన పుండుమీద ఉప్పుకారం చల్లినట్లు"
"పుండుమీద కొరవి పెట్టినట్లు"
"కాలిన పొట్టలో కత్తితో గోకినట్లు"

కొందరు అనవసరంగా కష్టాలు కొనితెచ్చుకొని బాధపడుతుంటారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని క్రింది సామెతలు తెలియజెప్పుతాయి.

"ఊరకుండలేక ఒళ్లు ఉమ్మెత్తాకు (దురదగొండె) రుద్దుకున్నట్లు
"ఊరకున్న ప్రాణానికి ఉచ్చుత్రాళ్లు తెచ్చుకొన్నట్లు"
"ఊరకున్న ప్రాణానికి ఉరిపోసుకున్నట్లు"

హాయిగా కాలంగడచిపోతుంటే సుఖంగా ఉండలేక అనవసరంగా కొందరు కష్టాల్ని కోరి తెచ్చుకుంటారు. ఉలవలు పండించడం చాలా సులభం. ఏనేలలోనైనా పండుతాయి. విత్తనం వేసిన నాటి నుండి పంటవచ్చేవరకు ఏమీ ఖర్చులుండవు. దానికి బదులు పత్తి వేస్తే దానికి చాలా ఖర్చు పెట్టాలి. నాటిన నాటి నుండి కూలీలు కూడా ఎక్కువే. ఉలవలకు బదులు పత్తి పెట్టి అనవసరంగా కష్టాలు పెంచుకుంటాడని "ఉలవచేను పెట్టి మగడు ఊరకుండక పత్తిచేను పెట్టి ప్రాణంమీదికి తెచ్చాడు." అనే సామెత చెబుతుంది. ఇలాంటి భావాన్నే "ఊరకుండక ఉప్పరిని తగులుకుంటె తట్టకొంక తన్ను తగిలిస్తున్నాడు," "ఉండి ఉండి ఉప్పరవానితో పోతే చచ్చేదాకా తట్టలమోతే" అనే సామెతలు వెల్లడిచేస్తాయి. ఉప్పరవాళ్ల కష్టజీవులనీ, వాళ్లకు భార్యాలు కావడం వల్ల కష్టాల్ని కొని తెచ్చుకోవడమని భావం.

కొందరికి ఎక్కడికిపోయినా కష్టాలు తప్పవు. వాళ్లకంటే ముందుగా వెళ్లి కష్టాలు కూర్చొని ఉంటాయి. బాగుపడాలని భావించి ఏ పనిచేసినా కష్టాలనే పొందేవాళ్లను గురించి వివరించే సామెతలు :

"దాగబోయిన చోట దయ్యం పట్టుకున్నట్లు"
"మొక్కబోయిన గుడి ముక్కలై మీదపడ్డట్లు"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"పోయిన కంటికి మందు వేయబోతే ఉన్నకన్ను ఊడుకపోయిందట"

"కొండనాలుకకు మందువేస్తే ఉన్న నాలుక కాస్త ఊడి (ఊడ్చుకొని) పోయిందట"

"సంతానానికని సప్తసాగరయాత్రవెడితే ఉప్పునీరు తగిలి ఉన్నదికాస్త ఊడ్చుక పోయిందట"

అల్పసుఖం కోసమై కొందరు అధిక కష్టాల్ని కొని తెచ్చుకుంటారు. ఒక దినం సుఖాన్ని కోరి భార్యతో కలిస్తే భార్య సంవత్సరమంతా ఆ కష్టాన్ని మోయక తప్పదు. అందుకే "ఒకనాటి సుఖం - ఒక ఏటికష్టం" అనే సామెత పుట్టింది. క్షణికమైన సుఖాన్ని కోరి విచ్చలవిడిగా తిరిగి సుఖరోగాలు కల వాళ్లతో సంభోగిస్తే ఆర్నెల్లు రోగంతో బాధపడాల్సి వస్తుందని "అరగడియ భోగం ఆరునెలలరోగం" అనే సామెత చెబుతుంది.

ఎక్కువ కష్టాలు పడే వాళ్లను గురించి చెప్పేటప్పుడు "చిచ్చును ఒడిగట్టినట్లు" అనే సామెతను ప్రయోగిస్తారు.

ప్రతి మానవుడు సుఖపడాలని అనుకుంటాడు. సుఖాన్ని పొందనివాని జీవితం వ్యర్థమని "సుఖమెరుగని బ్రతుకు సున్నవేయని విడెము" అనే సామెత వివరిస్తుంది. అట్లని మానవుడు సుఖాలకు అలవాటు పడకూడదు. సుఖానికి అలవాటు పడితే మనిషి సోమరిపోతు అవుతాడు. అందుకే "సుఖం మరిగిన దాసరి పదం మరచినాడట" అనే సామెత పుట్టింది. కష్టపడటం వల్ల పొందిన సుఖంలో ఎంతో ఆనందం ఉంటుంది. కష్టానికి తగిన ఫలితం లభించినపుడు మనిషి పొందే ఆనందానికి అంతం ఉండదు. ఫలితం లభించడం వల్ల పడ్డ కష్టాలు పటాపంచలవుతాయి. కష్టానికి తగిన ఫలితాన్ని పొందితే కష్టం తెలియదని అంటాడు కాళిదాసు :

"క్లేశః ఫలే నహి పునర్నవతాం విధత్తే",5

---

5 కుమార సంభవము : 5 వ సర్గ - 86 వ శ్లోకం : శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్సు - 1985

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కష్టపడి సుఖపడవచ్చుకానీ సుఖపడి కష్టాల్ని అనుభవించడం అసాధ్యమని "కట్టెలమ్మినచోట పూలమ్మవచ్చు కానీ పూలమ్మినచోట కట్టెలమ్మరాదు" అనే సామెత చెబుతుంది. కష్టపడితేనే సుఖం దక్కుతుందని అంటాడు శ్రీ శ్రీ :

అగాధమౌ జలనిధిలోన
ఆణిముత్యమున్నటు లే
శోకాలమరుగున దాగి
సుఖమున్నది లే (వెలుగునీడలు)

"పరిపూర్ణ సుఖములధిక బాధలకొరకే" అని సుమతి శతకకారుని అభిప్రాయం కూడా, అందుకే కేవలం సుఖానికి అలవాటు పడరాదు.

మానవులంతా సుఖంగా జీవించాలని అనుకుంటారు. కానీ కొందరు ఎప్పుడూ కష్టాలే పడుతుంటారు. సుఖమంటే ఏమిటో వాళ్లకు తెలియదు. కొందరు సుఖపడటం తప్ప కష్టాలంటే ఏమిటో ఎరుగరు. వాళ్ల జీవితం సుఖంగా సాగిపోతూ ఉంటుందే కానీ, ఎలాంటి కష్టాలు వాళ్ల జీవితంలో కనపడవు. అలాంటి వాళ్లను గురించి చెప్పుకొనేటప్పుడు వాళ్ల జీవితం "వడ్డించిన విస్తరి" అని అంటారు.

కష్టం కలిగించాలని కొందరు ప్రయత్నం చేస్తే దానివల్ల కష్టానికి బదులు మేలే జరుగుతుంది. అలాంటి సందర్భంలో "అలిగితంతే గారెల బుట్టలో పడ్డట్లు" అనే సామెతను చెప్పుకుంటారు. ఇలాంటిదే ఇంకో సామెత "అలిగితంతే పట్టెపరుపు మీద పడ్డట్టు"

అనుకోకుండా కొందరికి కార్యసాఫల్యం జరుగుతుంది. ఎలాంటి ప్రయత్నం కానీ, శ్రమకానీ ఉండదు. రొట్టెవిరిగి నేతిలోపడితే మనిషికి అంత కంటే సుఖమేం కావాలి. అలాంటి వాళ్లను గురించి వివరించే సామెతలు :

"రొట్టె విరిగి నేతిలో పడ్డట్లు"
"పండు జారి పాలల్లో పడ్డటు"
"పాయసంలో నెయ్యివొలికినట్లు"
"పాలల్లో పంచదార వొలికినట్లు"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



సుఖానికి అలవాటుపడితే కొందరు శ్రమ చేయడం మానేస్తారు. ప్రతిదినం పాట పాడుకుంటూ ఇల్లిల్లు తిరిగి కడుపు నింపుకొనే దాసరికి ఏ శ్రమ లేకుండా భోజనం దొరికితే పాటపాడడం మరచిపోతాడని "సుఖం మరిగిన దాసరి పదం మరచిపోయాడట" అనే సామెత వెల్లడి చేస్తుంది. సుఖం మరిగి రోజూ చేసే పని కూడా సరిగా చేయని వాళ్లను విమర్శించి చెబుతుంది పై సామెత.

కొందరు సుఖానికి అలవాటు పడిపోయి శ్రమచేయడానికిష్టపడక పొట్ట కోసమై అడ్డమైన దారులు తొక్కుతారనీ, చేయరాని పనులు చేయడానికి కూడా సిద్ధపడతారనీ, "సుఖం మరిగినమ్మ మొగుణ్ణి అమ్ముకొని తినిందట" అనే సామెత చెబుతుంది.

జబ్బు చేస్తే పనిచేయకుండా హాయిగా కూర్చోవచ్చు. కాని సమయానికి కావలసింది, తినడానికేది ఇష్టమో దాన్ని అడిగిన వెంటనే సమకూర్చేవాళ్లుండాలి. అప్పుడు హాయిగా కష్టం లేకుండా సుఖంగా కూర్చొని కాలం గడపవచ్చు. అందుకే

"జరుగుబాటుంటే జ్వరమంత సుఖంలేదు"

"అన్నం తప్పితే గాయమంత సుఖంలేదు" అనే సామెతలు పుట్టాయి.

## మంచీ చెడులు :-

మానవుడు చెప్పే ప్రతి మాట హితంగానూ, ప్రియంగానూ ఉండాలి. అందువల్ల అందరికి మంచివాడు కావడానికి వీలుంటుంది. పరుషమైన వాక్కువల్ల కాకిలోకానికి శత్రువు కాగా మధురమైన వాక్కువల్ల కోకిల మిత్రమైందికదా! కఠినంగా పలికే వాని చుట్టు ఎవరూ చేరరు. మృదువుగా, మధురంగా, చిరునవ్వుతో పలకరించే వాని చుట్టే అందరూ చేరుతారు. అందుకే "నోరు మంచిదయితే ఊరు మంచి దవుతుంది" అనే సామెత పుట్టింది. మంచిమాటలు చెప్పడం వల్ల అందరూ మిత్రులవుతారని "మంచి మాటకు మంది అంతా మనవాళ్లే" అనే సామెత వెల్లడిచేస్తుంది.

"భక్తి కలిగినకూడు పట్టెడైనను చాలు" అన్నట్లుగా మంచితనంతో చేసింది కొంచెమైనా చాలు. విత్తనం చిన్నదిగా ఉన్నా మర్రి వృక్షం మహా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



వృక్షమైనట్లు మంచితనం కొంచెమే అయినా దానివల్ల కలిగే ఫలితం ఎక్కువగా ఉంటుందని "మంచి కొంచమైనా చాలు, విత్తనం చిన్నదైనా చాలు" అనే సామెత సూచిస్తుంది.

మంచివానికి దేన్ని గురించైనా పదిసార్లు చెప్పాల్సిన అవసరం లేదు. ఒకసారి చెబితే చాలు వెంటనే గ్రహించుకుంటాడని క్రింది సామెతలు వివరిస్తాయి.

"మంచివానికొకమాట మొరకు కొక వ్రేటు"

"మంచివానికి మాటే మందు"

"మంచివానికి వకమాట"

"మంచి గొడ్డుకు ఒక దెబ్బ మంచి మనిషికి ఒకమాట"

కొందరు ప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తగా ఉంటారు. అందరితో మంచివాళ్లను పించుకోవాలని చూస్తారు. ఇతరులు చెడ్డయినా ఫరవాలేదు. కాని తాము మాత్రం మంచివాళ్లుగా పేరు తెచ్చుకోవడానికి ఆరాటపడతారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని "అందరికీ మంచివాడు అనంతయ్య" అనే సామెత విమర్శిస్తుంది.

"చంపదగినయట్టి శత్రువుతనచేత
జిక్కెనేని కీడు సేయరాదు
పొసగమేలు చేసి పొమ్మనుటేచాలు"[6] అంటాడు వేమన.

మేలు చేసిన వాళ్లకు మంచి చేయడమే కాదు, కీడు చేసినవాళ్లకు కూడా మంచి చేయడం సజ్జనుల లక్షణం. కానీ దుష్టులూ, అల్పులూ మంచి చేసినా మంచితనాన్ని గుర్తించక మంచి చేయడానికి బదులు చెడే చేస్తాడు. అలాంటి వాళ్ల స్వభావాన్ని విమర్శిస్తూ "మంచి చేసిన ముంగికి ముప్పువచ్చినట్లు, (చేసినట్లు)" అనే సామెత పుట్టింది. పాము బారినుంచి బాలుని రక్షించి మంచి చేసింది ముంగిస. మూతికి నెత్తురుండడంతో అదే బాలుని చంపిందనే ఆవేశంతో అతని తండ్రి దాని ప్రాణానికే ముప్పువచ్చేటట్లు చేసాడు.

---

6. వేమన్నవేదం - 31 వ పద్యం : 34 పుట : యువభారతి ప్రచురణ ; తృతీయ ముద్రణ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఒకవ్యక్తి మంచి చెడులు ఆ ఊర్లో అందరికి తెలుస్తాయి. మంచితనం లేనివాడు స్వంత ఊర్లో రాణించలేక పరాయి ఊర్లో విలువ పెంచుకోవడానికి ఆరాటపడుతుంటాడు. అలాంటి వాని స్వభావాన్ని "ఆ గొడ్డు మంచిదయితే ఆ ఊళ్ళోనే అమ్ముడుపోతుంది" అనే సామెత చెబుతుంది. గొడ్డు మంచిదయితే వేరే ఊళ్లో అమ్మకోవలసిన అవసరం ఉండదు మంచికి ఎక్కడుంటే అక్కడే విలువ ఉంటుంది.

మంచి వాళ్లను పొగడడం వల్ల చెడిపోతారనీ, మంచితనాన్ని కడదాకా నిలబెట్టుకోలేరనీ, అలాంటి వాళ్లను గురించి క్రింది సామెతలు పుట్టాయి.

"మంచివాడు మంచివాడంటే మంచమంతా ఏరిగినాడట"

"మంచివాడు మంచివాడంటే మంచమంతా పెంకలు చేసినాడట"

"మంచివాడు మంచివాడంటే మంచమెక్కి గంతులు వేశాడట"

కొందరు ఒకప్పుడు మంచిగా ప్రవర్తించి మంచి వాళ్లని పేరు తెచ్చుకుంటారు. కానీ వయసు పెరుగుతున్నకొద్దీ వాళ్లలోని మంచితనం తగ్గిపోయి చెడు అలవాట్లకు దగ్గరవుతారు. అలాంటి వాళ్లను "రానురాను రాజు గుఱ్ఱం గాడిద అయిందట" అనే సామెత విమర్శిస్తుంది.

మనవస్తువు మంచిది కానపుడు ఇతరుల్ని నిందించి ప్రయోజనం ఉండదు. మనిషి మంచివాడు కానపుడు ఎవరిని ఏమనటానికి వీలుండదు. మనిషిలోని మంచి చెడుల్ని గ్రహించక ఇతరులపై నిందలు మోపే వాళ్లను విమర్శిస్తూ క్రింది సామెతలు పుట్టాయి :

"మన బంగారం మంచిది అయితే కంసాలి ఏమి చేయగలడు"

"మన నువ్వుల్లో నూనె లేకపోతే గానువాణ్ణి అంటే ఏంలాభం?"

మానవుడు చేసే చెడుపనుల్ని, చెడుస్నేహాన్ని తద్వారా కలిగే ఫలితాన్ని ప్రకటించే సామెతలు వ్యాప్తిలో ఉన్నాయి.

కొందరు చెడ్డవాళ్లు ఇతరుల్ని కూడా చెడగొట్టాలని చూస్తారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని బట్టి "తాజెడ్డకోతి వనమెల్ల చెరచిందట" అనే సామెత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పుట్టింది. ఇలాంటి సామెతనే నాచన సోముడు "తాజెడ్డవాడు వెనకయ్య చేతికి వెసలిచ్చెననుమాట" అని ప్రయోగించాడు నిడదవోలు వేంకటరావు గారు తమ వ్యాఖ్యానంలో "వెనకయ్య" అనగా వినాయకుడనీ, వినాయక శబ్దానికి బుద్ధ దేవుడని వివరిస్తూ పై సామెత బౌద్ధమత సంబంధమైందని పేర్కొంటూ సామెతకు సందర్భమిలా వివరించారు" నీవు చెడిపోయిన మాట అటుంచగా నీవు గృహస్థుని చెడిపివేయుచున్నావు. ఇది వెనకయ్య చేతికి వెసలిచ్చెనన్నట్లున్నది" అని (చూడుడు : హంసవింశతికోపాఖ్యానం : పుట 108 : విజయభాస్కర పబ్లికేషన్స్ 1972)

కొందరు తాము సోమరులుగా తిరగడమే గాక ఇతరుల్ని కూడా పని చేయకుండా చెడగొడుతుంటారు. అలాంటి వాళ్లనుద్దేశించి పుట్టిన సామెతలు :

"మేసే గాడిదను కూసే గాడిద చెడబెండట"

"కూసే గాడిద వచ్చి మేసే గాడదను చెఱిచిందట"

చెడ్డవాళ్ల సంపర్కంలోపడితే మంచివాళ్లు కూడా చెడిపోతారని వేమన కచ్చితంగా చెప్పాడు ;

వేరుపురుగు చేరి వృక్షంబు జెఱచును
ఈడపురుగు చేరి చెట్టు జెఱచు
కుత్సితుండు చేరి గుణవంతు జెఱచురా"[7]

ఎంతమంచివాళ్లైనా చెడ్డవాళ్లతో స్నేహం చేయరాదు. ఒక వేళ చేస్తే మంచివాళ్లను కూడా లోకం చెడ్డవాళ్లనే భావిస్తుంది. చెడ్డవాళ్లతో సహవాసం చేయడం వల్ల చెడ్డవాళ్లనే ముద్ర వేస్తుంది లోకం. చెడ్డవాళ్లతో తిరుగుతూ తాను మంచివాన్ని అని చెప్పుకుంటే లోకం నమ్మదు. అలాంటి వాళ్లను "తాటి చెట్టు క్రింద పాలు త్రాగినా కల్లే అంటారు" అనే సామెత హెచ్చరిస్తుంది.

"గాడిదతో స్నేహం కాలితన్నులకే అన్నట్లు" చెడ్డవాళ్లతో కలసి తిరిగితే ఎంత మంచివానికైనా ప్రమాదం కలుగుతుందని అంటాడు వేమన :

7. వేమన పద్యములు : 15వ పద్యం : శ్రీ యస్. వి. గోపాల్ అండ్ కో,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"కాని వానితోడ గలసి మెలంగిన
హానివచ్చు నెంతవానికైన
కాకి గూడి హంస కష్టంబు పొందదా?"[8]

చెడ్డవానితో స్నేహం చేయడం "దయ్యంతో నెయ్యం చేసినట్లు"గా ఉంటుంది. చెడ్డ వానితో స్నేహం చేస్తే వానితో పాటు మంచి వాడు కూడా తగిన శిక్షను అనుభవించక తప్పదని వివరించే సామెతలు.

"ఇనుము వల్ల నిప్పుకు సమ్మెటపోట్లు"
"నల్లుల వలన మంచానికి కట్టె దెబ్బలు"

"నల్లుల వలన మంచానికి కట్టె దెబ్బలు" అనే సామెత సుమతిశతక పద్యంలో ఎలా పొంది పొసగిందో చూడండి!

కొంచెపునరుసంగతిచే
నంచితముగ గీడువచ్చు నదియెట్లన్నన్
గించిత్తు నల్లి కుట్టిన
మంచమునకు బెట్టుపచ్చుమహిలో సుమతీ",[9]

నీచుడైన వానితో స్నేహం చేస్తే ఎంతటి మంచివానికైనా అవమానం, హానీ జరుగుతాయని చక్కని సామెతను ఇముడ్చుకొన్న భాస్కర శతకంలోని పద్యం వెల్లడి చేస్తుంది:

అనఘునికైన జేకుఱున నర్హుని గూడి చరించునంతలో
మనమెరియంగ నప్పుడవమానము కీడు ధరిత్రియందునే
యనువుననైన దప్పవు యథార్థము తానదియెట్టులన్నచో
నినుమును గూర్చి యగ్నినలయింపదె సమ్మెట పెట్టు భాస్కరా!"[10]

---

8. వేమన పద్యరత్నాకరము : 379 పద్యం : బాలసరస్వతీ బుక్ డిపో
9. సుమతిశతకం : 39 వ పద్యం : సి. వి. కృష్ణాబుక్ డిపో
10. భాస్కర శతకము : 7 వ పద్యం : బాలసరస్వతీ బుక్ డిపో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఇష్టాయిష్టాలు :-

మానవని ఇష్టాయిష్టాలకు మనస్సే కారణం. మనస్సుకు నచ్చిన దాన్నే ఇష్టపడతాడు నచ్చకపోతే అయిష్టాన్ని చూపి దూరంగా ఉంచుతాడు. అలాగే స్త్రీ కూడా మనస్సుకు నచ్చని వానితో కాపురం చేయడానికి ఇష్టపడదు. అందుకే

"మనసుకు నచ్చినవాడు మొగుడుకాని తాళికట్టగానే మొగుడౌనా?

"మనసుకు చేరితే మల్లి - మనసుకు దరకుంటే ఎల్లి'' అనే సామెతలు పుట్టాయి.

తానూ, తనవాళ్ళు చేసిన పనులన్నీ బాగున్నాలేకున్నా మెచ్చుకుంటారు. తనపిల్ల నల్లగా ఉన్నా అందంగా ఉందని భావించి కాకి మురిసి పోతుంది. తనది తనవాళ్లు అనే అభిమానంతో ఇష్టాన్ని చూపే వాని స్వభావాన్ని "కాకిపిల్ల కాకికి ముద్దు'' అనే సామెత చెబుతుంది. ఇలాంటి భావాన్ని వ్యక్తంచేసే ఇతర సామెతలు ;

"ఎవడి కంపు వాడికింపు''

"ఎవరిపిచ్చి వాళ్లకానందం''

"గాడిదకు తనకూత కమ్మగానే ఉంటుంది''

భార్యపై గల ప్రేమతో భర్త ఆమెను ఎంతో ఇష్టంగా చూసుకుంటాడని

''వలపుగలిగేనని వనజాక్షి యధరంబు
పంచదారకుప్ప పాలకోవ
చూత ఫలరసంబు జున్ను సమానము''[11] అన్నాడు వేమన

ఇష్టం ఉన్నంతవరకు ఎవరేమి చెప్పినా వింటారు చెప్పిందే వేదంగా భావిస్తారు ఇష్టంవల్ల తమయెడల ఎలా ప్రవర్తించినా సరే వాళ్లంటేనే ఇష్టపడతారు. కష్టాన్ని కలిగించినా కష్టంలోనే సంతోషాన్ని చూస్తూ మురిసి పోతారు. ఇలా తమ కిష్టమైన వాళ్లనే భావంతో ఇతరులు బాధకల్గించినా ఓర్చుకొనే వాళ్ల స్వభావాన్ని వివరించే సామెతలు :

---

11. వేమన పద్యరత్నాకరము : 2.57వ పద్యం : బాలసరస్వతీ బుక్ డిపో 1983

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఇష్టం అయితే కష్టం లేదు"
"కష్టమైన వస్తువు ఇంగువతో సమానము"
"ఇష్టమైన వారిపెంట ఇంగువతో సమానము"
"కుట్టేవాడు కుడితే చెవులు నొప్పెట్టవు"
"నచ్చినోడు మొత్తినా మెత్తగా ఉంటుంది"

కూరిమిగల దినములలో
నేరములెన్నడును గలుగనేరవు మఱియా
కూరిమి విరసంబైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ![12]

ఒక వ్యక్తిపై ప్రేమ, ఆదరం ఉంటే అతడు చేసే ఏ పనిలోనూ తప్పులు కన్పించవు. అదే వ్యక్తిపై ప్రేమాదరాలు నశిస్తే అంతవరకు ఒప్పులుగా కన్పించినవన్నీ తప్పులుగా కన్పిస్తాయి. ఇష్టంగా ఉంటే పొగడినవాళ్లే అయిష్టం కల్గితే నిందించడం ప్రారంభిస్తారని తెలిపే సామెతలు :

"ఇష్టంలేని పెళ్లాన్ని 'ఒసే' అన్నా తప్పే అమ్మా! అన్నా తప్పే"
"ఇష్టంలేని మొగుణ్ణి జూసి కొనవేళ్లతో మొత్తుకున్నట్లు"

భార్యపై గల ప్రేమవల్ల ఆమె ఏంచేసినా సహించి ఓర్చుకొని మెచ్చుకుంటాడు. అదే ప్రేమ నశిస్తే అయిష్టం ఏర్పడుతుంది. భార్యనుచూస్తే సరిపోదు. ఏ పని చేసినా మెచ్చుకోడు. అందుక్కారణం ప్రేమ లేకపోవడమని అంటాడు వేమన :

"వలపుతీరెనేని వనజాక్షియధరంబు
ములకపంటి గిజరు ముష్టిరసము
చింతపొంత యగును జీడిసమానము"[13]

అయిష్టం వల్ల భార్యచేసే ప్రతిపని తప్పుగా కన్పిస్తుంది. తప్పులేకపోయినా అయిష్టం వల్ల ఏదో ఒక తప్పును వెదకుతుంటాడని "ఆలిని ఒల్లనివాడు

12. సుమతి శతకం - 38 వ పద్యం - సి. వి. కృష్ణాబుక్ డిపో
13. వేమన పద్యరత్నాకరము: 2158వ పద్యం : బాలసరస్వతీ బుక్ డిపో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఈలకూరలో ఉప్పు లేదన్నట్లు" అనే సామెత చెబుతుంది. ఈలకూర సహజంగా ఉప్పుగా ఉంటుంది. దాంట్లో ఉప్పులేదనడం ఎంత వింత ఆరోపణ. అయిష్టత అలా అనిపిస్తుంది. అయిష్టతవల్ల తప్పులు వెదకేవాళ్ల స్వభావాన్ని విమర్శించే సందర్భంలో పై సామెత ప్రయోగించబడుతుంది. "ఒల్లని వానికి పెరుగులో రాయి" అనే సామెత కూడా పై సామెతలాంటిదే. ఇష్టం లేనందువల్ల అనవసరంగా దోషాల్ని వెదకుతుంటారని పై సామెత భావం.

ఇష్టంలేనివాళ్లు ఇంటికి వస్తే పొమ్మని చెప్పలేక తమ అయిష్టతను మాటల్లో, చేతల్లో బయటపెడుతుంటారు కొందరు. అలాంటి సందర్భాల్ని పురస్కరించుకొని పుట్టిన సామెతలు :

"ఉండమనలేక ఊదర, పొమ్మనలేక పొగబెట్టినట్లు"

"పొమ్మనలేక పొగబెట్టినట్లు"

ఇతరులకు ఏదైనా ఇవ్వడానికి, పెట్టడానికి ఇష్టం ఉండదు. అందువల్ల మనస్సులో అయిష్టంతో బాధ పడతారు. మనస్సులోని అయిష్టతను బయటికి చెప్పలేక మాటల్లో తమ అయిష్టతను వ్యక్తం చేస్తుంటారు. అలాంటి వాళ్ల నుద్దేశించి చెప్పుకొనే సామెతలు ఇలా ప్రచారంలో ఉన్నాయి.

"ఒల్లీ ఒల్లని చుట్టం వచ్చాడు ఉడకే ఉలవపప్పా! ఉగాదిదాకా అన్నట్లు"

"పోరానిచుట్టము వచ్చాడు, బొడ్డుపంచి తమలపాకులు కోయమన్నట్లు"

వచ్చిన చుట్టానికి భోజనం పెట్టవలసివస్తే వంట చేయడం ఆలస్యంగా చేస్తే అతనే పోతాడని ఆలోచన. అందుకే తొందరగా ఉడకని ఉలవపప్పు వేసి ఉగాదిదాకా ఉడకమంటున్నది ఆ ఇల్లాలు. అలాగే ఆకుతోటకాడికి వచ్చిన చుట్టం ఆకులు ఇవ్వందే పోడని తెలుసు. అయినా లేతఆకులు కోసి ఇవ్వటం ఇష్టం లేదు. అందుకే తోట యజమాని బొడ్డు పంచి ఆకులు కోయ మంటున్నాడు. అడుగున ఉండేది ముదురాకులే గదా! ముదురాకులు ఇచ్చినా నష్టం ఉండదు. అందుకే నడుం పంచి కోయమనడం.

అవసరమైతే ఇష్టాన్ని చూపిస్తూ అనవసరమనిపిస్తే అయిష్టాన్ని చూపించే వాళ్ల స్వభావాన్ని, "కడుపునిండిన వానికి గారెలు చేదు" అనే సామెత తెలుపు



CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



తుంది. కడుపునిండిన తర్వాత గారెలు పెట్టినా భక్ష్యాలు పెట్టినా ఆకలి ఉండదు కాబట్టి చేదుగా అనిపిస్తాయి.

ఇష్టం ఉంటే ఏ పనైనా చక్కగా చేస్తారు. ఇష్టం లేకపోతే ప్రతి పనీ అరకొరగా చేస్తారు. అయిష్టంతో పనుల్ని సరిగా చేయనివాళ్ల స్వభావాన్ని "ఒల్లని మగనికి తలంబ్రాలు పోసినట్లు", "ఒల్లీ ఒల్లనమ్మ తలంబ్రాలు పోసినట్లు" అనే సామెతలు వెల్లడిచేస్తాయి. పెళ్లిలో తలంబ్రాలు పోసుకోవడం చూసే వాళ్లకు, పోసుకొనే వాళ్లకూ ఎంతో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కల్గించే కార్యక్రమం. అలాంటిది అయిష్టం వల్ల నిరుత్సాహంగా ఎడమొహం పెడమొహం పెట్టుకొని పోసుకుంటుంటే చూసేవాళ్లకు కూడా బాగుండదు.

## నిజం, అబద్ధం -

ఉన్నది ఉన్నట్టుగా చెప్పడం నిజం అనబడుతుంది. సహజమైందే నిజం. నిజాన్నే ఉన్నమాట, యదార్థం, సత్యమని కూడా అంటారు. సత్యమే నిత్యమైందనీ సమస్తలోకం సత్యంలోనే ఇమిడి ఉందనీ అంటారు. అందుకే సత్యస్థాపన కోసం ఎందరో మహనీయులు తమ సర్వస్వాన్ని ధారపోశారు. సత్యం కోసమే ఎన్నో కష్టాలకోర్చి హరిశ్చంద్రుడు సత్య హరిశ్చంద్రుడయ్యాడు. సత్యాన్ని మించింది ఈ లోకంలో మరేదిలేదు.

"సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితాసదా
సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరంపదమ్"[14]

(సత్యమే దైవం. సమస్త సంపదలు సత్యాన్నే ఆశ్రయిస్తాయి. సద్విషయాలన్నీ సత్యం వల్లనే నిలబడతాయి. సత్యంకంటే గొప్పస్థానం లోకంలో మరేదిలేదు. లోకంలో అన్నింటికంటే ఉత్తమోత్తమ మయింది, ఉన్నతమైంది సత్యమే)

ఎంతో ఉన్నత స్థానాన్ని పొందిన సత్యాన్ని అనుసరించడం చాలా కష్టమే. అయినా సత్యమార్గం వీడరాదనీ "సత్యమేవజయతే అన్నట్లు" చివరకు విజయాన్ని సాధించేది సత్యమనీ అంటారు అందుకే "నిజం నిలకడమీద

14. శ్రీమద్రామాయణం : అయోధ్యా - 109-13 శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



తెలుస్తుంది" అనే సామెత పుట్టింది. "పథ్యం చెడరాదు సత్యం తప్పరాదు" అనే సామెత ఎంతకష్టమైనా సత్యాన్ని పలకడం మానరాదని చెబుతుంది.

"నిజమును బలికెడునరులకు
విజయము గలదెందువాని విభవము చూడన్"[15]

అని వేమన వాదం. నిజం పలికినవాడెపుడూ ఓడిపోడు. విజయాన్నే పొందుతాడు. నిజం పలకడం వల్ల నింద వస్తుంది. ఇతరులకు నిష్ఠూరం కావచ్చు. అంతే కానీ అపజయం కానీ అవమానం కానీ కలుగవనీ, ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం వల్ల ఇతరులకు శత్రువు కావలసి వస్తుందనీ క్రింది సామెతలు వెల్లడి చేస్తాయి.

"నిజమాడితే నిష్ఠూరం"
"నిజమాడితే ఉండూరు అచ్చిరాదు"
"ఉన్నమాట అంటే ఉండూరు అచ్చిరాదు."
"నిజమునకు నిందవచ్చును గాని అవమానమురాదు"
"ఉన్నమాట అంటే ఊరికి నాకు ఐరాదు"

నిజం చెప్పేవాడు లోకానికి శత్రువు అనడాన్ని "యథార్థవాది లోక విరోధి" అనే సామెత సమర్థిస్తుంది. లోకానికెంత విరోధి అయినా నిజం చెప్పేవాడు ఎప్పుడూ ఎవరికీ భయపడడని "నిజమైన బంగారం నిప్పుకు వెరవదు" అనే సామెత చెబుతుంది.

'సత్యంవద', 'సత్యమేవజయతే' అని ఒకపక్క ఘోషిస్తున్నా మరో పక్క అసత్యవాదులు పుడుతూనే ఉన్నారు. మంచీచెడులు ఎలా సహజాలో అలాగే నిజానిజాలు కూడా సహజాలు. సత్యం కోసమే పాటుపడేవాళ్లు కొందరైతే అసత్యాలు చెప్పికాలం గడుపుకొనే వాళ్లు మరికొందరు. అబద్ధం చెప్పడం మంచి లక్షణం కాదని తెలిసినా కొందరు దానికే అలవాటు పడతారు. ఒక అబద్ధం చెప్పి దాన్ని కప్పి పుచ్చుకోవడానికి మరో అబద్ధం చెబుతారు. అందుకే "అబద్ధం అంటే అతుకుల బాట" అనే సామెత పుట్టింది. "వెయ్యి అబద్ధాలు చెప్పి ఒక పెండ్లి చెయ్యమన్నారు" అని అంటారు. శుక్రుడు అబద్ధాన్ని సమర్థించి ఏ యే సందర్భాలలో చెప్పవచ్చో వివరించాడిలా :

15. వేమన పద్యములు : 1259 శ్రీ యస్. వి. గోపాల్ అండ్ కో.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"వారిజాక్షులందు వైవాహికములందు
ప్రాణ విత్తమాన భంగమందు
చకితగోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చునఘము బొందదధిప"[16]

కానీ కొందరు సమయం, సందర్భం ఏమీ పాటించకుండా ప్రతి చిన్న విషయానికీ అబద్ధాలు చెబుతుంటారు. అబద్ధాలు చెప్పడంలో అరితేరి, ఎంతో కళాత్మకంగా అబద్ధాలు చెప్పి ఇతరుల్ని నమ్మిస్తారని కొన్ని సామెతలు వివరిస్తాయి :

"అబద్ధం చెప్పితే నిజం ముడ్డిలో మేకు కొట్టినట్లుండాలి"

"అబద్ధం చెబితే నిజం చెప్పేవాడి కంట్లో కారం కొట్టినట్లుండాలి"

"అబద్ధమాడితే గోడపెట్టినట్లుండాలి"

ఆడవాళ్లు అబద్ధం చెప్పడంలో కడునేర్పరులనీ, చెప్పింది అబద్ధమైనా నిజమనిపిస్తుందే కానీ సందేహం కలుగదు అందుకే ఆడవాళ్ల స్వభావాన్ని బట్టి

"ఆడది అబద్ధమాడితే గోడపెట్టినట్లు - మగవాడాడితే తడికపెట్టినట్లు"

అనే సామెత పుట్టింది. పై సామెత వేమన పద్యంలో ఎంత చక్కగా ఇమిడి పోయిందో చూడుడు.

"ఆడుదానిబొంకు గోడబెట్టినయట్లు
పురుషవరుని బొంకు పూరితడక
స్త్రీలనేర్పు మగల జీకాకు పఱమరా"[17]

ఒకసారి అబద్ధం చెప్పడం అలవాటయితే చాలు ఇక చెప్పనక్కర లేదు. చెప్పిన అబద్ధాన్ని దాచుకోవడానికి ఇంకొకటి, దాన్ని కప్పి పుచ్చుకోవడానికి మరొకటి. ఇలా అబద్ధాలు చెబుతునే ఉంటారు. అందుకే "ఒక అబద్ధము

16. శ్రీమహాభాగవతము - అష్టమస్కంధం - 584 ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి. ప్రచురణ 1983

17. వేమన పద్యరత్నాకరము - 2268వ పద్యం - బాలసరస్వతీ బుక్ డిపో : 1983

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కమ్మడానకు వెయ్యి అబద్ధాలు కావలెను" అనే సామెత పుట్టింది. అలవాటైన వాళ్లకు అబద్ధాల గురించిన పట్టింపు ఉండదు. అవసరం ఉన్నా లేకపోయినా ప్రతి చిన్న విషయానికి అబద్ధం చెబుతుంటారు అబద్ధాల పుట్టగా తయారవుతారు. ఎదుటివాళ్లు ఏమనుకుంటారో అని సిగ్గుపడకుండా అబద్ధాలు చెబుతుంటారు. అలాంటి వాళ్లను గురించిన సామెతలు :

"అబద్ధాల పంచాంగానికి అరవైగడియల త్యాజ్యం"

"అబద్ధాల అంకయ్యకు అరవైనాలుగు అసత్య ప్రమాణాలు"

అబద్ధం చెప్పడంలో మనిషి ఎంత ఆరితేరినవాడో ఎన్నివిధాల ఎంత అందంగా చెప్పగలడో క్రింది సామెతలు వివరిస్తాయి.

"బొంకరా బొంకరా పోలిగా అంటే, టంగుటూరి మిరియాలు తాటికాయ లంతేసి"

"బొంకరా బొంకరా పోలుగా అంటే, ఎద్దు అడుగులో ఏడు కొరమీనులు అన్నాడట"

"అబద్ధం చెప్పితే అన్నం పుట్టదు" అని సామెత హెచ్చరించినా కొందరు అబద్ధాలు చెబుతూనే ఉంటారు. అబద్ధాలు చెప్పేవాళ్లను భయపెడుతూ "అబద్ధాలాడితే ఆడపిల్లలు పుడతారు" అని అంటారు.

కోమటి నిజం చెప్పడు. ఒకవేళ నిజం చెబితే వ్యాపారం సాగదు. అందువల్ల తప్పనిసరి అయి అబద్ధాలకు అలవాటుపడతాడు. ఎప్పుడైనా నిజం చెబితే ఎవరూ నమ్మరు. అందుకే "కోమటివాని నిజం" అనే సామెత పుట్టింది. కోమటి చెప్పింది నిజమే అయినా మళ్లీ దాన్ని నిజమని మరోసారి నొక్కి చెప్పవలసి ఉంటుంది. అంటే అది నిజం కాదు అబద్ధమని భావం. నేతి బీరకాయలో ఉన్న నేతిలాంటి నిజమన్నమాట. "ఎరికలోనిమాట యాడికి నిజము" అనే సామెత ఎరుకలు అన్నీ అబద్ధాలు చెబుతారని వెల్లడి చేస్తుంది.

రంకుతనానికి అలవాటు పడ్డవాళ్లు నిజం చెప్పరనీ, అబద్ధమాడితే తప్ప రంకుతనం సాగదనీ క్రింది సామెతలు తెలుపుతాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"రంకు నేర్చినమ్మ బొంకు నేర్చునట"

"బొంకు నేర్చి రంకునేర్వాల"

## నమ్మకం, అపనమ్మకం

"అనుమానం పెనుభూతం" అని సామెత. ప్రతిదానిపై అనవసరమైన అనుమానం పెంచుకోకూడదు. ఎవరిపైనా నమ్మకంలేని వాడు చివరకు తననూ, తన నీడనూ నమ్మలేడు. అందువల్ల నమ్మకాన్ని పెంచుకోవాలి. అయితే నమ్మకం చూపే ముందు బాగా ఆలోచించాలి. నమ్మవచ్చు అనే నిర్ణయానికి వచ్చినపుడే నమ్మాలి. అపుడే ప్రయోజనం ఉంటుంది.

కొందరు మనస్సులో నిర్మలంగా ఉంటూ పైకి పకపక నవ్వుతూ, గలగలమని మాట్లాడుతుంటారు. అలాంటివాళ్లకు కపటం ఉండదనీ, వాళ్లను నమ్మవచ్చుననీ, "పకపక నవ్వేవాడు గబగబ అరచేవాడు కపటమెరుగడు" అనే సామెత చెబుతుంది.

కొందరు తమకు మేలు చేసే వాళ్లకంటే అపకారం చేసే వాళ్లనే సులభంగా నమ్ముతారని "గొర్రె కటికవానిని నమ్మినట్లు గొల్లవాణ్ణి నమ్మదు" అనే సామెత వెల్లడి చేస్తుంది.

కొందరు మాటల్లో నమ్మకాన్ని చూపించినట్లుగా చేతల్లో చూపించరు. చెప్పిన పనిచేయక నష్టాన్ని కలిగిస్తారు. అపుడు అనవసరంగా నమ్ముకొని నష్టపోయిన వాళ్లు నష్టం కలిగించిన వాళ్లను

"నమ్మినానవాలు పోస్తే పుచ్చి బుర్రఅత్తైనవంట"

"నమ్మినానబోస్తే పులిసి బూరటల్లిందట" అని విమర్శిస్తారు.

"మిండని నమ్ముకొని జాతరకు పోయినట్లు" అనే సామెత మిండడు అవసరం తీర్చుకొని ఆ తర్వాత మాయమై పోతాడని హెచ్చరిస్తుంది.

మూర్ఖత్వంతో లేనిదాన్ని నమ్ముకొని ఉన్నదాన్ని పోగొట్టుకునే వాళ్లను గురించి తెలియజెప్పే సామెతలు :

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"సంతలోని దాన్ని నమ్మి కొని ఇంట్లోదాన్ని అమ్ముకున్నట్లు"

"మొగిళ్ళను చూచి మోట చాలించినట్లు"

"మేఘాలు చూచి చెఱువుకు గండిఎత్తినట్లు"

"మొయిలు నీరునమ్మి చెఱువు కట్ట తెగకొట్టుకొన్నట్లు"

మరికొందరు అజ్ఞానంతో నమ్మరాని వస్తువుల్ని, మనుష్యుల్ని నమ్మి కష్టనష్టాలు కొని తెచ్చుకుంటారని విమర్శించే సామెతలు :

"బుడ్డను నమ్మి ఏటిలో దిగినట్లు"

"మట్టి గుఱ్ఱాన్ని నమ్మి ఏట్లోదిగినట్లు"

మట్టి గుఱ్ఱం నీటిలో కరిగిపోయి నట్టేటముంచి వేస్తుందికదా!

మనిషిజీవితం సక్రమంగా సాగాలి అంటే ముందు తనమీద, తాను చేసే పనులమీద నమ్మకముండాలి. ఆ తర్వాత ఇతరుల పట్ల తనకు, తనపట్ల ఇతరులకు నమ్మకం ఉండాలి. అయినా సమాజంలో అపనమ్మకస్థులు కన్పిస్తూనే ఉంటారు రాజు ఎవరినీ నమ్మకూడదని, నమ్మకం కలిగి ఉండక పోవడమే రాజనీతిలో భాగమట :

"నమ్మదగనివారి నమ్మకయున్నది
తగినవారినైన దద్దనమ్మి
యుండదగదు తన్నునొరులు నమ్మెడునట్లు
యుండి యొరుల నమ్మకునికి నీతి"[18]

కొందరు మాటకు ముందే ఏడిస్తే మరికొందరు ఎప్పుడూ నవ్వుతుంటారు. సమయం, సందర్భం లేకుండా ఏడ్చినా, నవ్వినా అనుమానం కల్గుతుంది. నమ్మాలో నమ్మకూడదో అని ఆలోచనలో పడతారు. అందువల్ల

"మాటకు ముందు ఏడ్చే మగవాణ్ణి, నవ్వే ఆడదాన్ని నమ్మరాదు"

18. శ్రీమదాంధ్ర మహాభారతము - శాంతి 3-239 ఉస్మానియా విశ్వ విద్యాలయ తెలుగు శాఖచే ప్రచురితము - 1972

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"వానకు ముందే ఉరిమే ఉరుమును, మాటకు ముందే ఏడ్చే
ఆడదాన్ని నమ్మరాదు"

అనే సామెతలు పుట్టాయి.

ఆకారవిశేషాల్ని, చేసేవృత్తిని, కులాన్ని బట్టి కొందరు నమ్మదగని వాళ్లని లోకంలో ప్రచారంలో ఉంది. "కులానికి ఇంత అంటే తలాగోరంత అన్నట్లు"గ ఎప్పుడో ఎవడో అపనమ్మకంగా ప్రవర్తించడం వల్ల ఆ తర్వాత వచ్చే వాళ్లందరూ అపనమ్మకస్థులని రూఢి అయింది. జూదరి, అగసాలి, వెలయాలు, అంగడివాడు, వామహస్తుడు నమ్మదగని వాళ్లని సుమతి శతక కర్త పేర్కొన్నాడు.

నమ్మకు సుంకరి జూదరి
నమ్మకు మగసాలివాని నటువెలయాలిన్
నమ్మకు మంగడి వానిని
నమ్మకు మీ వామహస్తు నవనిని సుమతీ[19]

వృత్తిని అనుసరించి కంసాలిని, కోమటినీ నమ్మకూడదట. ఎంత మంచి కంసాలి అయినా ఆభరణాలు చేసేటప్పుడు బంగారం దొంగిలిస్తాడట. ఇతరులదే కాదు చివరకు తల్లి మంగళసూత్రం అయినా సరే దొంగిలించక మానడని తెలిపే సామెతలు వ్యవహారంలో ఉన్నాయి :

"అగసాలినీ వెలయాలినీ నమ్మరాదు"
"అగసాలిపొందు వెలయాలి చెలిమి నమ్మరాదు"
"తల్లిపుస్తె బంగారమైన కంసాలి దొంగలించకమానడు"

కరణం వృత్తిలో ఉన్నవాణ్ణి నమ్మకూడదని అంటారు. కరణం ఇతరులేన్నే కాదు ఇతర కరణాన్ని అసలు నమ్మకూడదని సుమతి శతక కారుడు అన్నాడు.

"కరణము గరణము నమ్మిన
మరణాంతక మౌనుగాని మనలేడు సుమీ
కరణము దనసరికరణము
మఱి నమ్మక మర్మమీక మనవలె సుమతీ"[20]

---

19 సుమతి శతకం : 62వ పద్యం - సి. వి. కృష్ణా బుక్ డిపో
20. సుమతి శతకం : 26వ పద్యం - సి. వి. కృష్ణా బుక్ డిపో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కరణం దొంగలెక్కలు వ్రాసి ప్రజల్ని మోసగిస్తాడు. బ్రతికి ఉంటేనే కాదు చచ్చిన తర్వాత కూడా కరణాన్ని నమ్మకూడదని కొన్ని సామెతలు వివరిస్తాయి.

"కాటికి పోయినా కరణాన్ని నమ్మకూడదు"

"కరణాన్ని కంసాలిని కాటికిపోయినా నమ్మరాదు"

కులాన్ని బట్టి కొందరు నమ్మదగని వాళ్లని కొన్ని సామెతలు చెబుతాయి సాధారణంగా మాల మాదిగలు నల్లగానూ, బ్రాహ్మణులు ఎర్రగానూ ఉంటారని ప్రసిద్ధి. దీనికి విరుద్ధంగా ఉంటే నమ్మకూడదని సామెతలు హెచ్చరిస్తాయి.

"ఎర్రటి కోమటినీ నల్లని బ్రాహ్మణ్ణీ నమ్మరాదు"

"ఎర్రమాదిగను నల్లబాపన్ని నమ్మరాదు"

"నల్లబాపనయ్యను ఎర్రమాదిగను నమ్మరాదు"

కమ్మ, సాలె, దూదేకుల, ఎరుకల, ఈడిగె, బోయకులంవాళ్లను కొడిదె కాపు వాళ్లను నమ్మకూడదని తెలిపే సామెతలు ప్రజల వ్యవహారంలో ఉన్నాయి.

"కమ్మని తుమ్మని నమ్మరాదు"

"నేసేవాన్ని నమ్ముకొని పొలిమేర జగడం ఒప్పుకున్నట్లు"

"దుడ్డుకు ఒక్కడైనా దూదేకులవాణ్ణి జీతానికి ఉంచుకోరాదు"

"కొడిదెకాపును కొమ్ముటెద్దును నమ్మకూడదు"

"ముందుపోయే ముత్రాచవానిని, వెనుకవచ్చే బోయవానిని నమ్మరాదు"

కోమట్లు, తురకలు, కమ్మవాళ్లు విశ్వాసపాత్రులు కారనీ, వాళ్లను నమ్మకూడదని కొన్ని సామెతలంటాయి :

"కోడికి కళాసంలేదు కోమటికి విశ్వాసంలేదు"

"తురకోనికి ఇనోసము లేదు కోడికి కళాసము లేదు"

"కప్పకుతోకలేదు కమ్మోనికి ఇనోసంలేదు"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఎడమచేత్తో పనిచేసేవాణ్ణి, చిన్నచెవులున్నవాణ్ణి, పొడల శరీరం గలవాణ్ణి నమ్మకూడదని

"ఎడమచేత్తో పనిచేసేవాడిని - చిన్నచెవుల వాడినినమ్మవద్దు"

"పొట్టివానిని పొడలవానిని నమ్మరాదు" అనే సామెతలుంటాయి.

**అభిమానదురభిమానాలు :-**

తనది, తనవాళ్లు అనే భావంతో ప్రేమానురాగాల్ని చూపించడాన్ని అభిమానం అంటారు. తనబిడ్డ ఎలా ఉన్నా తల్లికి మాత్రం లోకంలో అందరినీ మించిన అందగాడుగా కన్పిస్తాడు. బిడ్డపై గల అభిమానం తల్లికి అలా అనిపిస్తుంది. జానపద స్త్రీ తనబిడ్డపై తనకున్న అభిమానాన్ని ఎంత సుందరంగా అవిష్కరించిందో చూడండి

"వీధినెందరు పున్న విసరదేగాలి
రచ్చనెందరు పున్న రాదమ్మ వాన
నాచిన్న అబ్బాయి వీధి నిలుచుంటే
మొగలిపువ్వుల గాలి ముత్యాలవాన"[21]

అందుకే "కాకిపిల్ల కాకికి ముద్దు" అనే సామెత పుట్టింది.

కొందరు ప్రాణం పోయినా ఫరవాలేదనుకుంటారు. కానీ అభిమానాన్ని మాత్రం వీడరని "ప్రాణంపోయేటప్పుడు కూడా పాము పడగ దించదు" అనే సామెత చెబుతుంది.

కొందరు తక్కువ కులంలో పుట్టినా, తినడానికి తిండి లేకపోయినా అభిమానాన్ని మాత్రం వదలిపెట్టరు. తాము తక్కువనే భావాన్ని వీడి తమ వరకు తాము సన్మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తారు. తమకులాన్ని ధర్మాన్ని గొప్పదిగా భావించి నడుచుకొంటారు. అలాంటివాళ్లను ఇతరులు నిందించినా ఎగతాళి చేసినా అభిమానంతో సమాధానం చెప్పగలరని క్రింది సామెతలు వివరిస్తాయి.

---

21. డా॥ యం. కె. దేవకిగారు "తెలుగు బాలగేయ సాహిత్యం"లో ఉదాహరించిరి : పుట 66

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"మనిషి పేదయితే మాటకు పేదా?"

"కూటికి తక్కువైతే కులానికి తక్కువా?"

"కూటికి పేదయితే కులానికి పేదా?"

మనిషి పేదవాడైనా, కులం తక్కువ వాడైనా మంచిమాటలకు పేదరికం ఉండదు. తక్కువ కులం ఉండదు. "మట్టిలో మాణిక్యంవలె" ఉండవచ్చు.

కొందరు ఇతరులకేదైనా ఆశచూపి తమ చుట్టూ తిప్పుకుంటూ ఉంటారు. తామిచ్చేదానికి ఆశపడి వచ్చారనే చులకన భావంతో హీనంగా చూస్తూ ఉంటారు. అభిమానం లేనివారైతే ఎలాచేసినా, ఎలా మాట్లాడినా వాళ్ళపంచనే పడిఉంటారు. కానీ అభిమానం కలవాళ్ళు దాన్ని సహించలేరు. గంజితాగినా సరే ఇతరులకు దాసోహమనడానికి ఒప్పుకోరు. స్వతంత్రంగా ఉండాలని అనుకుంటారు. అత్తగారింట్లో ఎంతో ఐశ్వర్యముంటుంది. కానీ కోడలికి స్వతంత్రం ఉండదు. కోడల్ని అత్తహీనంగా చూస్తుంది. అష్టకష్టాలు పెడుతుంది. అత్తగారి ఐశ్వర్యమదాన్ని, అధికార గర్వాన్ని అభిమానవతియైన కోడలు సహించలేదు. "అత్తగారింటి ఐశ్వర్యం కన్నా పుట్టింటి గంజిమేలు" అని అభిమానాన్ని ప్రకటిస్తుంది. నిజమేకదా! గంజితాగినా సుఖంగా ఉండొచ్చు. అత్తగారి సూటిపోటు మాటలుండవు. అత్తగారి ఆరళ్ళు ఉండవు.

"అలిగి అత్తగారింటికి వెడి చెల్లిలింటికి పోరాదు" అనే సామెత ఆడ్లుళ్ళ అన్నల అభిమానాన్ని వెల్లడి చేస్తుంది.

కొందరు అనవసర విషయాల్లో అభిమానాన్ని చూపి ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటారని "అభిమానానికి మంగలి కత్తులు మింగినట్లు" అనే సామెత వెల్లడి చేస్తుంది.

తనది, తనవాళ్ళనే అభిమానం కలిగి ఉండవచ్చు. "శ్రుతిమించి రాగాన పడినట్లు" అభిమానం దురభిమానంగా మారకూడదు. తల్లిదండ్రులు తమ పిల్లలపై అభిమానాన్ని చూపించడంలో తప్పులేదు. కానీ కొందరు తమ పిల్లవాడు తప్పుచేస్తున్నాడని తెలిసి కూడా ఊరకుంటారే కానీ మందలించరు. దండించరు కూడా. మంచిమార్గంలో నడిపిద్దామని భావించరు. చివరకు తాము దుఃఖించడమే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



గాక ప్రజల్లో అపకీర్తి పాలౌతారు. ఇలా తమది తమవాళ్ళనే దురభిమానంతో నష్టపోయేవాళ్లను విమర్శించే సామెతలు :

"ఇంటి దీపమని ముద్దుపెట్టుకుంటే మీసాలన్ని తెగకాలినవట"

"మన దీపమని ముద్దులాడితే మూతికాలకుంటుందా?"

దీపాన్ని ఎంతవరకు ఉపయోగించుకోవాలో అంతవరకేగానీ మన దీపమని ముద్దు పెట్టుకుంటే మూతి మీసాలు కాలకుండా ఉంటాయా? దురభిమానం చూపిస్తే ఏదైనా అంతే. నష్టపోక తప్పదు.

తమదైనా, ఇతరులదైనా సత్ప్రయోజనాన్ని కలిగించేదైతే దురభిమానం చూపించినా ఫరవాలేదు. కానీ నిష్ప్రయోజనమైన వాటిపై దురభిమానం చూపిస్తే హాని కలుగక తప్పదు. తన వ్రేలని కన్ను పొడుచుకుంటే కన్ను పోకుండా ఉంటుందా? తమ తండ్రి త్రవ్వీన బావి అనుకొని అందులో దూకితే ప్రాణం పోకుండా ఉంటుందా? తమ వాళ్లదనే దురభిమానంతో ప్రమాదాన్ని కొని తెచ్చు కొనేవాళ్లను విమర్శించే సామెతలు :

"కన్నూ మనదే వేలూ మనదేనని పొడుచుకుంటామా?"

"తండ్రి తవ్వీన నుయ్యి అని దానిలో దూకవచ్చునా?"

"తాత కట్టిన చెఱువని దూకుతారా?"

"ఉరికొమ్మని ఉరిపెట్టుకుంటామా?"

ఎంత విలువైన వస్తువైనా దురభిమానంతో ప్రమాదాన్ని కల్గించుకోకూడదని "బంగారు సూదని కన్ను పొడుచుకుంటామా?" అనే సామెత చెబుతుంది.

## భయ నిర్భయాలు :-

భయం అనేది కొందరిలో సహజంగా ఉండే కొందరు ఇతరులవల్ల ప్రాణ హాని జరుగుతుందనో, దుర్జనులవల్ల ఏదైనా ప్రమాదం జరుగుతుందనో భయ పడుతుంటారు. మనిషిలో భయం కలగడాన్ని గురించి Ross Stanger ఈ విధంగా చెప్పాడు "Fear is homeastatic in the sense that it mobiliges energy to take us away from stimuli which may damage us physically"[22]

22. Basic Psychology - Page No. 104 - 1970 Edition.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఎలా కలిగినా, కారణమేదైనా భయ పడడం మంచిది కాదు. భయం వల్ల మనిషి జీవితంలో ఏమీ సాధించలేడు. ప్రతి విషయంలోనూ భయాన్ని పెంచుకొని క్రుంగిపోతుంటాడు.

చేయరాని పనులు చేస్తే ప్రమాదం వాటిల్లుతుందని తెలిసి కూడా కొందరు తప్పులు చేస్తారు. ఆపైన జరుగబోయే ఫలితాన్ని తలంచుకొని భయ పడతారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని గూర్చి "రోటిలో తలదూర్చి రోకటి పోటుకు వెరచినట్లు" అనే సామెత విమర్శిస్తుంది.

చెడ్డవాళ్లతో స్నేహం చేస్తే ప్రమాదాలు వస్తాయని అందరికి తెలుసు. తెలిసి కూడా కొందరు చెడ్డ వాళ్లతోనే స్నేహం చేస్తారు. ఆ తర్వాత దానివల్ల కలిగే ప్రమాదాన్ని గుర్తుచేసుకొని భయపడతారు అలాంటివాళ్లను "గాడిదతో సేద్యం చేస్తూ కాలితన్నులకు దడిస్తే ఎట్లా" అనే సామెత విమర్శిస్తుంది. తన్నులకు సిద్ధపడే గాడిదలతో వ్యవసాయానికి దిగాలి. ఆ తర్వాత బాధపడితే లాభమేమి ?

కొందరు తమ అసమర్థతో ఇతరులను చూచి భయపడతారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని వివరించే సామెతలు :

"నల్లులకు వెఱచి ఇల్లు విడిచినట్లు"

"పిత్తులకు భయపడి పప్పు వండడం మానివేసినట్లు"

నల్లుల్ని ఏదో ఉపాయంతో చంపాలి కానీ వాటికి భయపడి ఇల్లే వదలివేయడం మంచిది కాదు కదా!

కొందరు ఎప్పుడో ఏదో జరుగుతుందని ముందుగనే ఊహించుకొని భయపడుతుంటారే కానీ పూర్వాపరాల్ని ఆలోచించరని "ఆకాశంలో ఎగిరే పక్షి క్రిందినీటికి భయపడినట్లు" అనే సామెత చెబుతుంది. ఆకాశంలో ఎగురుతూ ఎక్కడో కనిపించే నీటిని చూచి నీటిలో పడతానేమో అని భయపడాల్సిన అవసరం లేదు.

"ఉన్న ఊరి వాడికి వెలుతురు భయం, పొరుగూరి వాడికి నీడ భయం"

"ఊరివాడికి కాటిభయం, పొరుగూరి వాడికి నీటిభయం"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అనే సామెతలు ఊ:డూరి వాళ్లు శ్మశానం చూసి భయపడతారనీ, పొరుగూరివాళ్లు నీటిని చూసి భయపడతారని వివరిస్తాయి. స్వంత ఊరి వాడికి శ్మశానం దగ్గర పడితే చాలు ఏభూతమో, దయ్యమో ఉంటుందని భయం కలుగుతుంది. పొరుగూరి వాడికి శ్మశానం ఎక్కడుంటుందో తెలియదు కాబట్టి శ్మశానంలో ఉన్నా భయముండదు. కానీ నీటి భయం ఉంటుంది. పొరుగూరి వాళ్లకు నీటి ప్రవాహవేగం, లోతు ఎలా ఉంటుందో, ఎంత ఉంటుందో తెలియకపోవడమే భయానికి కారణం.

కొందరు ఇతరులపై ఆధారపడక పోయినా, ఇతరుల సహాయ సహకారాలు పొందక పొయినా అనవసరంగా ఇతరుల్ని చూసి భయపడుతుంటారు. తన కాళ్ల మీద తాను నిలబడుతూ అనవసరంగా ఇతరులకు భయపడేవాళ్లను "తన అన్నం తాను తింటూ తన గుడ్డతాను కడుతూ ఊరికి భయపడవలెనా?" అనే సామెత విమర్శిస్తుంది.

కొందరు తమస్థితిని మరచిపోయి మరీ చిన్నపిల్లవాళ్లలా భయపడతారు. అలా భయపడడం ఉచితమ ? కాదా? అని కూడా ఆలోచించరు. మగవాడు తన మగతనాన్ని కూడా మరచిపోయి భయానికి లోనవుతాడని "మగ్గం గుంతలో పాముంది మగాళ్లను పిల్వవే అన్నాడట" అనే సామెత చెబుతుంది. తానే మగవాడై యుండి భయపడి మగవాళ్లను పిల్వమన్నాడంటే ఎంత పిరికి వాడో తెలుస్తుంది.

"ధైర్యే సాహసే లక్ష్మి" అని ఆర్యోక్తి. ధైర్యవంతుడు లోకంలో సాధించరాని కార్యాలుండవు. ధైర్యం కలవాడు ఎంతటి కష్టాన్నైనా నిర్భయంగా ఎదుర్కొంటాడు. ధైర్యవంతుని భయపెట్టడానికి, అతని ధైర్యగుణాన్ని మాన్పడానికి ఎవరికీ సాధ్యం కాదంటాడు భర్తృహరి :

"నియతి చేత గదర్థితుండయిన ధైర్య
పరుని ధైర్యగుణంబు మాన్పంగ దరమె?"[23]

ఏమీలేనివానికి ఎవరి వల్ల భయముండదని "సన్యాసికి దొంగల భయమేమి?" అనే సామెత చెబుతుంది.

---

23. భర్తృహరి సుభాషితము ; నీతిశతకము - 76వ పద్యం - బాలసరస్వతీ బుక్ డిపో,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కరణం తిట్లకు అలవాటుపడి ఉంటాడు. కాబట్టి కరణం తిట్లకు భయపడ డని "తిట్టుకు భయపడే కరణం - ముట్టుకు భయపడే మడిమేలు ఉండరు" అనే సామెత వెల్లడి చేస్తుంది. చాకలివాడు ముట్టుబట్టలకు భయపడితే బట్టలుతకడమే మానివేయాల్సి వస్తుంది. అందువల్ల నిర్భయంగా ఉంటాడు.

ఎవరెంత భయపెట్టినా ధైర్యగుణం కలవాళ్లు లెక్కచేయరని "తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు బెదురునా?" అనే సామెత చెబుతుంది. తాటాకు చప్పుళ్ళకే కుందేలు బెదిరిపోతే జీవించడము కష్టం. అలాగే ప్రతి చిన్న విషయానికి భయ పడితే బ్రతుకు సాగించడం సాధ్యం కాదు.

ధైర్యగుణం కలవాడు ప్రమాదాన్ని కూడా లెక్కచేయక నిర్భయంగా ఎదుర్కొంటాడు. భయపడితే దేన్నీ లోకంలో సాధించలేనని అతని విశ్వాసం. నిర్భయంవల్ల తన శత్రువు ఇంట్లో ప్రవేశించడానికి కూడా వెనకాడడు. అందుకే "వేటకాని ఇల్లు వెలుపక కుందేలు సొచ్చినట్లు" అనే సామెత పుట్టింది. ప్రమా దాన్ని ఎదుర్కోవడమే కాదు ప్రాణం పోయేటప్పుడు కూడా ధైర్యవంతుడు నిర్భయంగా ఉంటాడని "ప్రాణంపోయేటప్పుడు కూడా త్రాచు పడగ దించదు" అనే సామెత చెబుతుంది.

లోకంలో పిరికి వాళ్ళకు స్థానం లేదు. పిరికివాళ్ళు అందరికి లోకువే. "పిరికి బంటుకు తుమ్మాస్తి" తప్ప ధైర్య సంపద ఉండదు. పిరికివాళ్ళు జీవిం చడం చాలా కష్టం. అందుకే "ధీరుడైనా కావలె, దీనుడైనా కావలె" అనే సామెత పుట్టింది.

"మేడిపండు చూడ మేలిమై యుండును
పొట్టవిచ్చి చూడ బురుగులుండు
పిరికివాని మదిని బింక మీలాగురా"[24]

అని వేమన అన్నాడు. కొందరు పైకి ధైర్యవంతుల్లా కన్పించినా, మాటలు నిర్భ యంగా మాట్లాడినా సమయం వస్తే అసలు రూపం బయటపడిపోతుంది. కాళ్ళూ చేతులూ వణికిపోతూ ముచ్చెమటలు వస్తాయి. ఇలా లోపల భయపడతూ పైకి బింకంగా కనబడే వాళ్ళ స్వభావాన్ని తెలిపే సామెతలు :

24. వేమన పద్యరత్నాకరము : 2446వ పద్యం బాలసరస్వతీ బుక్ డిపో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"పిరికివాడికే పిడికెడంత మీసాలు"

"కోతలకు ఉత్తరకుమారుడు"

**ఉపకారాపకారాలు :-**

"పరోపకారార్థమిదం శరీరమ్" అనే సూక్తిని అనుసరించి శిబిచక్రవర్తి, దధీచి లాంటి త్యాగపురుషులు పరోపకారం కోసమే తమ సర్వస్వాన్ని త్యాగం చేశారు. చేతనైనంత వరకు ఇతరులకు మేలు చేయడమే మానవుని పరమార్థంగా ఉండాలి. చేసే పనులూ, చెప్పే మాటలూ నలుగురికీ ఉపయోగపడేటట్లుగా ఉండాలి. సహాయం చేసిన వాళ్లకు ఉపకారం చేయడం గొప్పతనమనిపించుకోదు. అది ఉపకారం కూడా కాదు. అపకారం చేసిన వాళ్లకు కూడా ఉపకారం చేయడమే నిజమైన ఉపకారం అని సుమతి శతకం చెబుతుంది.

"ఉపకారికి నుపకారము
విపరీతము గాదుసేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ"[25]

"తాను పెట్టకపోయినా పెట్టే యిల్లు చూపెట్టాలి" అనే సామెత ఉపకారం చేయాలని చెబుతుంది.

ఇతరులకు ఉపకారం చేయడమంటే తాను నష్టపోవడమని అర్థం కాదు. ''శరీరమాద్యం ఖలు ధర్మసాధనం'', ''తనకుమాలిన ధర్మం మొదలు చెడ్డబేరం'' అని కదా! మనిషి కేవలం స్వార్థ పరుడు కాకుండ తనకు చేతనైనంత వరకు ఏదో ఒకమేలు చేయాలి. అపుడేతాను, తనచుట్టూ ఉన్న సమాజం హాయిగా ఉండవచ్చు. కానీ కొందరు ఇతరులకు ఉపకారం చేయబోయి తాము నష్టపోతారని వివరించే సామెతలు :

''తనతలుపులు తీసి పొరుగింటికి పెట్టి రాత్రంతా కుక్కలను తోలుతూ కూర్చునట్లు''

''తలుపు ఒకరింటికి తీసిపెట్టి తాను కుక్కలు తోలినట్లు''

---

25. సుమతీ శతకం - 16వ పద్యం - సి. వి. కృష్ణా బుక్ డిపో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



తమకు లేకపోయినా ఇతరులకేదో ఉపకారం చేయాలని కొందరు ఆరాట పడతారు. ఉపకారం చేయాలనే ఆలోచన మంచిదే. కానీ వీలుపడనపుడు దాని కోసం ఆరాటపడడం మంచిది కాదు. అలాంటివాళ్లను ఎగతాళి చేస్తూ "తనకు లేదు తాతకు పోయే" అనే సామెతను చెప్పుకుంటారు.

కొందరు ఉపకారం చేయవలసిన వాళ్లకు చేయక ఇంకెవరికో చేస్తారు. ముందుగా ఇంట్లో వాళ్లకు సహాయపడడం ధర్మం. కాని ఇంటి పనుల కంటే బయటివాళ్ల పనులు చేయడంలో ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు. ఇలా ఇంట్లోవాళ్లకు నిష్ప్రయోజకులుగా ఉంటూ బయటివాళ్లకు మాత్రం ఉపకారులుగా ఉండే వాళ్ల స్వభావాన్ని "ఊర్లోటోళ్లకు ఉపకారి, ఇంట్లోటోళ్లకు దండగమారి" అనే సామెత విమర్శించి చెబుతుంది.

తాము నిర్వర్తించిన బాధ్యతను సహాయంగానూ, పరోపకారంగానూ ఎంచే వాళ్ల నుద్దేశించి పుట్టిన సామెతలు :

"ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారమా ?"

"ఆలికి అన్నం పెట్టి ఊరిని ఉద్ధరించినట్లు అనుకొన్నాడట"

కొందరు ఉపకారం చేస్తున్నట్లు నటిస్తూ అపకారాన్ని తలపెడుతుంటారు. పైకి ఉపకారంలా కనిపించినా చేసిన దాని ఫలితం మాత్రం అపకారమై ఉంటుంది. ఉపకారంలో అపకారాన్ని చేసే వాళ్ల స్వభావాన్ని వెల్లడిచేసే సామెతలు :

"తొట్టి ఊపుతారు - బిడ్డను గిచ్చుతారు"

"దొంగల్లారా ! రండి - రాజుల్లారా ! మేలుకోండి"

"బిడ్డనెత్తుకొని - ముడ్డిగిల్లినట్లు"

తొట్టిలోని బిడ్డను ఊపడం, దొంగలకు సహాయపడడం, బిడ్డనెత్తుకోవడం ఉపకార గుణాల్లా కన్పించినా గిచ్చడం, రాజుల్ని మేల్కొల్పడం, ముడ్డిగిల్లడం అపకార గుణాలు. అందువల్ల ప్రతిఫలం అపకారంగా ఉంటుంది.

దుర్జనుడు నిష్కారణంగానే సజ్జనులకు అపకారం తలపెడతాడు. సజ్జను

6)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



లకు అపకారం చేయడమే దుర్జనుని పని. కానీ కొంచెమైనా మేలు చేయలేడని భాస్కరశతక కర్త వెల్లడించాడు :

"ఊరక సజ్జనుండొడిగి యుండినసైన దురాత్మకుండుని
ష్కారణమోర్వలేక యపకారము చేయుట వానివిద్యగా"[26]

దుర్జనుడు తనకు ఉపకారం చేసిన వాళ్లకే అపకారాన్ని తలపెడతాడని "గడ్డివేయ పోట్లగొడ్డు కొమ్మాడించినట్లు" అనే సామెత అంటుంది. పై సామెత వేమన పద్యంలో ఎంత చక్కగా ఇమిడిందో చూడుడు.

"తనదుబాగుగోరి ధర్మంబు చెప్పిన
చిట్టుచంద్రు మొఅకలెట్ట యెదుట
గడ్డివేయ పోట్లగొడ్డు కొమ్మాడించు"[27]

నీచస్వభావం కలవాళ్లకు ఉపకారం చేసినా వాళ్లవల్ల అపకారమే జరుగుతుందని "పాముకు పాలు పోస్తే విషము వృద్ధియగునట్లు" అనే సామెత వెల్లడి చేస్తుంది.

"అపకారికైనా ఉపకారం చేయాలి" అని అన్నా, ఉపకారం చేసిన వాళ్లకే అపకారాన్ని చేయాలని చూస్తారు. అందుకే "ఉపకారానికి పోతే అపకారం వెంట వచ్చినట్లు" అనే సామెత పుట్టింది.

కొందరు ముందుగా అపకారం చేసి పిమ్మట ఉపకారం చేస్తున్నట్లు నటిస్తారు. అపకారం చేయడమెందుకు? ఆపై ఉపకారం చేస్తున్నట్లు నటించడమెందుకు? అలాంటి వాళ్ల స్వభావాన్ని వివరించే సామెతలు :

"ముడ్డిగిల్లి జోలపాడినట్లు"
"ముడ్డి కాల్చి మూతికి వెన్న దోచినట్లు"
"ముడ్డిలో కారం చల్లి విసనకర్రతో విసిరినట్లు"

---

26. భాస్కర శతకము 18వ పద్యం - బాలసరస్వతీ బుక్ డిపో
27. వేమన పద్యరత్నాకరము - 46వ పద్యం - బాలసరస్వతీ బుక్ డిపో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



## సమర్థాసమర్థతలు :-

మనిషి శక్తిసామర్థ్యాలు అతడు చేసే పనులమీద ఆధారపడి ఉంటాయి. శ్రద్ధను బట్టి పనిలో వ్యక్తి సమర్థత పెరుగుతుంది. సమర్థత కలవాళ్లు వివరించి చెప్పకపోయినా చేయవలసిన, అవసరమున్న పనులన్నీ చేసేస్తారు. చెప్పినంత వరకే గాక దానికి సంబంధించిన పనులన్నింటిని సమయస్ఫూర్తిని చూపి తమ సమర్థతతో చేసుకొని వస్తారు. అలాంటివాళ్ల స్వభావాన్నిబట్టి "చూచి రమ్మంటే కాల్చి వచ్చాడు" అనే సామెత పుట్టింది. పై సామెత రామాయణ కథాసంబంధి. సీతాన్వేషణకోసం వెళ్లిన హనుమంతుడు సీతను కనుక్కోవడమే కాక శత్రు బలాన్ని అంచనా వేసుకొని చివరకు లంకానగరాన్ని కాల్చి వచ్చాడు. రామాయణ పరిజ్ఞానం కల జానపదుడు హనుమంతునివలె సమర్థుడైనవాన్ని గూర్చి చెప్పకోవలసి వస్తే పై వాక్యాన్ని ప్రయోగించి ఉండవచ్చు. అది కాల పరీక్షకు నిలిచి ప్రజల నోళ్లలో నాని ప్రాచుర్యాన్ని పొంది సామెతగా నిలిచి పోయింది. "చూచి రమ్మంటే పెండ్లాడి వచ్చినట్లు" అనే సామెత కూడా మనిషిలోని సమర్థతను చెబుతుంది.

ఏ కొంచెం అవకాశం లభిస్తే చాలు దాన్ని పూర్తిగా వినియోగించుకొనే గడుసరుల స్వభావాన్ని అద్దం పట్టి చూపిస్తాయి ఈ క్రింది సామెతలు :

"వేలు పెట్టేందుకు చోటిస్తే కాలుదూర్చినట్లు"

"వేలిస్తే హస్తం మ్రింగినట్లు"

"ఆవులిస్తే పేగులు లెక్క పెట్టినట్లు"

ఆవులిస్తేనే పేగులు లెక్కించే ఘనులు కొందరైతే వాళ్లను మించే వాళ్లన్నట్లుగా "ఆవులించకుండగానే పేగులు లెక్కపెట్టే" మహాఘనులు మరికొందరు.

మంచిలో కానీ, వంచనలో కానీ ఒకణ్ణి మించిన వాడు మరొకడుంటాడని వివరించే సామెతలు కూడా ఇలా ప్రచారంలో ఉన్నాయి.

"తాడి తన్నువానిని తలతన్నేవాడు కూడా ఉంటాడు"

"తలదన్నేవాడు పోతే తాడిదన్నేవాడు వస్తాడు"

"గొడ్డెను తినేవాడుపోతే బడ్డెను తినేవాడు వచ్చినట్లు"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"గుడిని మింగే వాడొకడయితే గుడిని లింగాన్ని మింగే వాడింకొకడు,
"గుడిని గోపురాన్ని మింగేవాడు మరియొకడు"

ఘనకార్యాలు చేసేవాళ్లకు చిన్నచిన్న పనులొక లెక్క కాదని కొన్ని సామెతలు వెల్లడి చేస్తాయి :

"ఏనుగులు మ్రింగే ఎల్లమ్మకు పీనుగులు పిప్పళ్ళు"

"తలుపులు మ్రింగే వానికి అప్పడాలు లొటలొట"

"వాములు మ్రింగే స్వాముల వారికి పచ్చిగడ్డి మోపు ఫలహారము"

పనసతొనలు తినాలంటే దాని తోలుతీయాలి. అదెంతో కష్టంతో కూడు కొన్న పని. తోలు తీయకుండా తినటానికి వీల్లేదు. ఎంతకష్టమైన పనైనా సరే ఆవలీలగా చేయగలిగేవాళ్ల స్వభావాన్ని "తోలు తీయకుండానే తొణలు మింగి నట్లు" అనే సామెత చెబుతుంది.

కొందరు చేతల్లోనేకాక మాటల్లోనూ సామర్థ్యం కలిగి ఉంటారు. మాటల సమర్థతతో ఏ పనైనా సరే చేయగల ఘటనాఘటనా సమర్థుల స్వభావాన్ని వ్యక్తంచేసే సామెత లివి :

"తిమ్మిని బ్రహ్మి, బ్రహ్మిని తిమ్మి చేసినట్లు"

"నందిని పంది, పందిని నంది చేయగలవాడు"

"ఖాజీని ఫాజీగాను, ఫాజీని ఖాజీగాను మార్చినట్లు"

"చిన్నక్కను పెద్దక్క, పెద్దక్కను చిన్నక్క చేసినట్లు"

అత్త ఏంచేసినా చెల్లుతుంది. కానీ అత్తమించిన కోడళ్లు ఉంటారనీ, ఆధి క్యతతో అత్తకేమి తగ్గరని :

"అత్త అర్ధము అమ్మితే అత్తను కానక కోడలు ముత్తుము అమ్మింది"

"ఇల్లు మ్రింగే అత్తకు యుగం మ్రింగే కోడలు" అనే సామెతలు వివ రిస్తాయి.

గురువును మించిపోయి గురువుకే నామాలు పెట్టే శిష్యులుంటారని తెలిపే సామెతలు :

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"గురువును మించిన శిష్యుడు"
"గురువుకు తిరుమంత్రం చెప్పినట్లు"
"గురువుకు పంగనామం పెట్టినట్లు"
"గురువుకు పెట్టెరా పంగనామము"
"గురువుకన్నా గుడ్డు మించింది"

గురువును మించిపోయే శిష్యులున్నట్టే తండ్రిని కూడా మించిపోయే తనయులున్నారంటూ "తండ్రిని మించిన కొడుకు" అనే సామెత చెబుతుంది.

శ్రద్ధ లేకపోవడం వల్లనో, సోమరితనం వల్లనో, శారీరక బలం లేకపోవడం వల్లనో కొందరిలో అసమర్థత చోటు చేసుకుంటుంది. పని చేయడంలో ఆసక్తిని చూపరు. ఒకవేళ చేయాల్సి వచ్చినా చకచకా చేయరు. పనిలో చాకచక్యాన్ని, నైపుణ్యాన్ని చూపరు. సామర్థ్యం కలవాళ్ళు అడ్డంకులెన్ని ఎదురైనా వాటిని తొలగించుకొని తమ పనుల్ని నెరవేర్చుకుంటారు. అసమర్థులు పనుల్ని సరిగా చేయరు. అట్లని తమ అసమర్థతను ఒప్పుకోరు. పని జరుగకపోవడానికి తమ అసమర్థతే కారణమని అందరికీ తెలిసినా తాము మాత్రం ఒప్పుకోరు. ఇతర కారణాల్ని ఏవో చెబుతూ ఉంటారు. నాట్యం చేయటంలో సామర్థ్యం కలవాళ్ళు ఇతరమైన లోపాలున్నా తమ నాట్యనైపుణ్యంతో ప్రేక్షకుల్ని పరవశింపజేయగలరే కానీ మద్దెల సరిగా లేదని, రంగస్థలం సరిగా లెదని రకరకాల కారణాల్ని చెప్పి తమ అసమర్థతను కప్పి పుచ్చుకోరు. తమ అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికి ఇతర కారణాల్ని చెప్పేవాళ్ల స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"ఆడలేక మద్దెల ఓడన్నట్లు"
"ఆడలేక మద్దెలవానిపై గోడుపోసుకున్నట్లు"
"ఆడలేక అంగణం వంకర అన్నట్లు"
"ఆడలేక పాతగజ్జెలు అన్నట్లు"
"ఓడిన గుర్రం జీనుపై సొడ్డుపెట్టినట్లు"
"తలపాగా చుట్టలేక తలవంకర అన్నట్లు"
"నరకలేని బంటు కత్తి చుఱుకు లేదన్నట్లు"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అల్పకార్యాల్ని కూడా చేయలేని కొందరు పెద్ద పెద్ద కార్యాలు చేస్తామని ముందుకు వస్తారని అలాంటివాళ్ల అసమర్థతను

"ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎగురుతానన్నట్లు"

"కూర్చుండి కూడు వండలేనమ్మ వంగుండి తీర్థానికి వస్తానన్నట్లు"

అనే సామెతలు వివరించగా మరికొన్ని సామెతలు ఇలా విమర్శిస్తాయి.

"కాలువ దాటలేనివాడు కదలి దాటగలడా?"

"కూటిలోరాయి తీయలేని వాడు ఏటిలోని రాయితీయగలడా?"

"కూర్చుండి లేవలేడు గాని ఎగిసి తాటికాయతంతానన్నాడు"

"కూర్చుండి లేవలేనమ్మ గంగని శివరాత్రికి వస్తానన్నదట"

బలవంతునిపై బలహీనునికి కోపం రావచ్చు. కానీ అసమర్థతవల్ల ఎదిరించే ధైర్యం ఉండదు "అత్తమీది కోపం దుత్తమీద చూపినట్లు" తనకంటే అసమర్థులైన వాళ్లపై చూపిస్తారని అలాంటివాళ్ల స్వభావాన్ని విమర్శించే సందర్భంలో ప్రయోగించే సామెతలు :

"పిల్లితోక ఎద్దు తొక్కితే ఎలుక దిక్కు ఎగ్రఅగించి చూచిందట"

"పిల్లితోక బత్తె తొక్కితే ఎలుకమీద మీసాలు దువ్వింది"

"బత్తె పిల్లికాలు తొక్కితే పిల్లి ఎలుకపై మీసాలు దువ్వెందట"

అసమర్థతవల్ల కొందరు ఒకటి చేయబోయి మరొకటి చేస్తారని "నంది చేయబోయి పందిని చేసినట్లు" అనే సామెత చెబుతుంది.

## ఆడంబర నిరాడంబరాలు :-

తమ శక్తినీ, స్థితినీ గూర్చి ఆలోచించకుండా శక్తికిమించి ప్రవర్తించడాన్ని ఆడంబరం, ఆర్భాటం అని అంటారు. చెప్పే మాటల్లో కొందరు, చేసే పనుల్లో మరికొందరు ఆడంబరాన్ని చూపిస్తారు. అల్పులు ఆడంబరంగా ప్రవర్తిస్తారని వేమన ఇలా అన్నాడు :

"అల్పుడేపుడు బల్కు నాడంబరముగాను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



సజ్జనుండు పల్కు జల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా ?''[28]

కొందరు మాటల్లో ఎక్కువ ఆడంబరాన్ని చూపుతుంటారని అలాంటి వాళ్లను విమర్శించే సామెతలు :

''మాటలు చెప్పే మొనగాండ్లె గాని పూటబత్తెమిచ్చే పుణ్యాత్ములు లేరు''

''మాటల చుట్టమేగాని పూట చుట్టం కాడు''

''మాటలతోనే మామిడిపండ్లు రాలుస్తాడు''

''మాటలు కోటలు దాటును కానీ కాలు గడపదాటదు''

''మొరిగే కుక్క కరవదు'' అన్నట్లు పనిచేయడం చేతకాక పోయినా మాటలు మాత్రం ఆడంబరంగా ఉంటాయని క్రింది సామెతలు చెబుతాయి.

''అస్తమానం అరిచేపిల్లి ఎలుకల పట్టలేదు''

''వట్టి గొడ్డుకు అరుపులెక్కువ''

''ఉత్తకుండకు ఊపులెక్కువ''

''వానలేని మబ్బులకు ఉరుములెక్కువ''

''చెల్లని రూపాయకు గీతలెక్కువ, చేతకాని వానికి మాటలెక్కువ''

కొందరు మాటలు ఎక్కువగా మాట్లాడి పనులు తక్కువగా చేస్తుంటారు. అలాంటివాళ్ల స్వభావాన్ని తెలిపే సామెతలు :

''అంత ఉరిమి ఇంతేనా కురిసేది''

''ఆ ఉరుముకు ఈ చినుకేనా?''

''ఈ సంబరానికేనా ఇంత ఆర్భాటం''

ఏదైనా పని చేసేముందు ఆ పని చేయడానికి శక్తి ఉందా? లేదా? అని ఆలోచించాలి. అపుడే దానివల్ల ప్రయోజనం ఉంటుంది. కానీ కొందరు తమ

---

28. వేమన పద్యరత్నాకరము - 362 వ పద్యం - బాలసరస్వతీ బుక్ డిపో - 1988

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



శక్తిని గుర్తుంచుకొనక ఆడంబరానికి పోయి ప్రవర్తిస్తుంటారు. పెళ్ళిళ్లకనీ పేరంటాలకనీ శక్తికి మించిన ఖర్చులు చేసి నవ్వులపాలవుతుంటారు. "మంచమున్నంతవరకే కాళ్లు చాపుకోవాలి" అని సామెత హెచ్చరిస్తున్నా, ఆడంబరానికి పోయి కోటీశ్వరులతో పోటీ పడతారనీ, తిన తిండి లేకపోయినా మంచి మంచి దుస్తులు వేసుకోవాలనీ, ఆభరణాలు ధరించాలనీ, దాసదాసీజనం ఉండాలనీ, తాగటానికి గంజిలేకపోయినా మీసాలకు సంపెంగ నూనె కావాలనీ, ఉంపుడుగత్తె ఉండాలనీ ఆడంబరాలకు పోయేవాళ్లను విమర్శించే సామెతలు :

"కాసుకు గతిలేదు కోటికి పడగలెత్తినాడు"

"మింగమెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె"

"మింగమెతుకు లేకుంటే లంజకు లత్తులట"

"తినతిండి లేకపోయినా లంజకు బులావ్ అంటాడు"

"పుండు మీదికి నూనెలేవంటే బూరెలొండే పెళ్ళామా అన్నట్లు"

కొంచెమున్నా సరే గొప్పలకు పోయేవాళ్లనుద్దేశించి పుట్టిన సామెతలు :

"కూటికి జరిగితే కోటికి జరిగినట్లు"

"అంబలి తాగేవాడికి మీసాలెగబట్టె వాడొకడు"

"గంజి తాగినా లంజకు పోవాల"

"గంజి తాగేవానికి మీసాలు ఎగబెట్టేవాడొకడు"

తిన తిండిలేక అవస్థలు పడుతుంటే అంబలి దొరికితే దానితో ఆకలి తీర్చుకోవాలి. అంతేకాని అంబలి తాగుతూ మీసాలెగబట్టేవాడొకడు మరొకడు కావలంటే వాడి కెక్కడి నుండి తెచ్చిపెడతాడు? తన దగ్గరున్న గంజి ఇచ్చి తన కడుపు కాల్చుకోవాల్సి వస్తుంది కదా!

కొందరు తమకే జరగక ఇబ్బంది పడుతూనే ఇతరులకేదో సహాయం చేస్తామని ఆర్భాటాలు పలుకతుంటారు. తాము పోతే తిండిపెట్టే వాళ్లుండరు. కానీ తమవెంట పదిమంది ఉండాలని ఆర్భాటాలు చేసేవాళ్ల స్వభావాన్ని చెప్పే సామెతలు :

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"తాదూర సందులేదు మెడకొకడోలు అన్నట్లు"

"తలదూర్చేదానికి తావులేకుంటే మెడకు డోలొకటి"

''తాదిన తవుడు లేదు వారాంగనకు వడియాలట''

''తననోటికి తవుడు లేదు లంజనోటికి పంచదారట''

"ఆలుబిడ్డలు అన్నానికి అకోరిస్తుంటే లంజకు బిడ్డలు లేరని రామేశ్వరం పోయినాడట''

''తాబోతే తౌడు దొరకదు కాని, రాయరా సన్నాలకు చీటీ అన్నాడట''

''తాబోతే మజ్జిగ చుక్కకు గతిలేదు, చీటి వ్రాస్తే పెరుగు పంపుతారన్నట్లు''

తమను గురించి ఇతరులు గొప్పగా అనుకోవాలని కొబోలు తమ తాహతుకు మించిన వస్తువుల ధరల్ని అడుగుతుంటారు. అలాంటివాళ్ల నుద్దేశించి చెప్పే సామెతలు :

''కూలికి వచ్చి పాలికి మాట్లాడినట్లు''

''తిరిపెపు మజ్జిగకు వచ్చి పాడిగేదెను బేరమాడినట్లు''

''పూటకూళ్ళకు వచ్చినవాడు పుట్లధర అడిగినట్లు''

కొందరు చిట్టచివరికి వచ్చి తాము చేయి కలిపి ఆ పనంతా తామే చేసినట్లు ఆడంబరాలు చెప్పుకుంటారు. కష్టపడుతూనే ఉంటుంది కోడలు, చూస్తూనే ఉంటుంది అత్త. కానీ సహాయం మాత్రం చేయదు. కానీ కోడలు పని పూర్తి చేశాక అత్తగారు ఆ పనిలో చేయి కలిపి అంతా తానే చేశానని గొప్పలు చెప్పుకుంటుంది. అందుకే "అన్నీ అమర్చిన తర్వాత అత్తగారు వేలు పెట్టినట్లు" అనే సామెత పుట్టింది.

"మా తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన చూడండి." అంటూ కొందరు తమ స్థితిగతుల్ని గూర్చి పట్టించుకోకుండా తమ తాత ముత్తాతల గొప్ప తనాన్ని గూర్చి ఆడంబరాలు చెప్పుకుంటారు. ఎప్పుడో తాతముత్తాతలు నేతులు తాగితే మనకేం లాభం. ఇపుడు మనం ఏమి తాగుతున్నామో అది ఆలోచించాలి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కొందరు ముందుగా ఆర్భాటానికి పోయి తర్వాత ఎదుటి వాళ్ళు తగ్గరని తెలిసి వెనక్కు తగ్గుతారు. అనవసరంగా ఆర్భాటం చేసి మళ్ళీ తగ్గిపోయే వాళ్ళ స్వభావాన్ని "మూరెడు పొంగి బారెడు కుంగినట్లు" అనే సామెత తెలుపగా క్రింది సామెతలు విమర్శిస్తాయి.

''మూరెడు ముందుకు పోనేల? బారెడు వెనక్కురానేల?''

''మూరెడెక్కేదెందుకు? బారెడుకుంగే దెందుకు?''

''మూరెడు పొంగడం ఎందుకు? బారెడుకుంగడం ఎందుకు''

కాలగమనంలో హెచ్చుతగ్గులు సహజం. ఓడలు బండ్లు కావచ్చు బండ్లు ఓడలు కావచ్చు. అయితే మారిన పరిస్థితులకు తగ్గట్లుగా నడచుకుంటే నష్టం ఉండదు. బాధలుండవు. పూర్వమెలా సుఖాల్ని అనుభవించారో అలాగే మారిన స్థితిలో అనుభవించాలనుకోవడం పొరపాటుతో కూడిందే కాక దుఃఖకారణం కూడా. కొందరు తమ పరిస్థితులు మారాయనీ, వాటికి అనుగుణంగా నడచుకోవాలనీ అనుకోక పూర్వంలాగా ఉండాలని ఆడంబరాలకు పోతుంటారు. అలాంటివాళ్లను ఎగతాళి చేస్తూ "రాజ్యాలు పోయినా రాచరికాలు పోలేదు" అనే సామెత పుట్టింది.

కొందరు పైకి ఆడంబరంగా కన్పించినా వాళ్లచేతలూ మాటలూ ఎంతో భిన్నంగా ఉంటాయి. అలాంటి వాళ్లను "పైన పటారం లోన లొటారం" అనే సామెత హేళన చేస్తుంది. ఇలాంటిదే "అంచుడాబె కాని పంచెడాబు లేదు" అనే సామెత. పంచె అంచు డాబుసరిగా ఉన్నా మిగిలిన భాగం అంచులా కనపడదు. పంచె డాబుసరిగా ఉంటే కొంతకాలం నిలుస్తుంది కానీ అంచు డాబుసరిగా ఉండే పట్టుమని పదినాళ్లైనా ఉండదు.

ఉత్తములు ప్రారంభించిన ఏ పనికీ ఎలాంటి ఆర్భాటమూ ఉండదు. కానీ కొందరు పని ప్రారంభించడానికి ముందు ఎంతో ఆర్భాటం చేస్తారు. పని ప్రారంభించకపోయినా పనంతా పూర్తయినట్లు మాట్లాడుతారు. చివరకు ఆ పనిని అసలే ప్రారంభించరు. ఒకవేళ ప్రారంభించినా మధ్యలోనే వదిలివేసి మాయమవుతారు. అలాంటివాళ్ల స్వభావమే "ఆరంభశూరుడికి ఆర్భాటలెక్కువ" అనే సామెత ఆవిర్భావానికి కారణమయింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఉంటే ఉగాది లేకుంటే శివరాత్రి" అన్నట్లుగా కొందరు ఉన్ననాడు ఆడంబరాలకు పోయి మిడిసిపడుతూ లేనినాడు ఇబ్బందులు పడుతుంటారని

"ఉన్ననాడు ఉగాది పండుగ లేనినాడు కాముని పండుగ"

"ఉంటే అమీరు లేకుంటే ఫకీరు"

"ఉంటే ఊరు లేకపోతే పాడు" అనే సామెతలు

వెల్లడి చేస్తాయి.

ఒక విషయాన్ని గురించి ఏమి తెలియకపోయినా అంతా తెలిసినట్లు కొందరు ఆడంబరంగా మాట్లాడుతారు. తెలియకపోయినా తెలిసినట్లు ప్రవర్తించే వాళ్ల స్వభావాన్ని

"ఓకుఎన్ని వంకరలో తెనియని వానికే వయ్యారము"

"ఓనమాలు రానివాడు వడ్డీలు గుణించినట్లు" అనే సామెతలు చెబుతాయి.

కొందరు లేనిపోని ఆడంబరాలకు పోయి అష్టకష్టాలు పడటమే కాక నలుగురిలో నవ్వుల పాలవుతుంటే మరికొందరు ఎలాంటి ఆడంబరాలు లేక ఉన్న దాంతోనే తృప్తిపడుతూ ఉంటారు. తమ శక్తిసామర్థ్యాల్ని తమ స్థితిని అర్థం చేసుకొని నడుచుకొంటారు. ఆడంబరాలకు పోయి అప్పులు చేయక "అప్పులేని గంజి చిప్పడైనా చాలు" అని తమ శక్తి ననుసరించే నడచుకుంటారు. "మంచముున్నంతవరకే కాళ్ళు చాపుకోవాలి" అన్న సూక్తిని అక్షరాల పాటిస్తారు. ధనం ఉన్నా లేకున్నా, ఎంత పెద్ద హోదాలో ఉన్నా వాళ్లలో ఎలాంటి ఆడంబరం కనిపించదు. ఎంతో నిబ్బరంగా ఉంటారు. పెద్దలంటే గౌరవం, వినయం చూపిస్తారు. ఇతరులపట్ల ఆదరాభిమానాల్ని చూపిస్తారు. ఏమీ లేకపోయినా ఎగిరిపడే వాళ్లనూ, అన్నీ ఉన్నా అణిగిమణిగి ఉండేవాళ్లను గురించి చెబుతుందీ సామెత "ఏమిలేని విస్తరి యెగిసిపడితే అన్ని ఉన్న విస్తరి అణిగి వుండినది". విస్తరిలో ఏమీలేకపోతే కొంచెం గాలి తగిలితే చాలు ఎగిరెగిరి పడుతుంది. నిండా వడ్డించిన విస్తరి ఏ గాలికి ఎగిరి పడదు. అలాగే నిరాడంబరులు.

"సజ్జనుండు పల్కు చల్లగాను" ఉన్నట్లుగా అన్నీ తెలిసినవాడు మితంగా మాట్లాడుతాడు. మూర్ఖుడు తనకేమి తెలియకపోయినా అన్ని తెలిసినట్లు మాట్లాడుతాడు. మాటల్లోనేకాదు కష్టాల్లోకానీ, సుఖంలో కాని సజ్జనుడు సమంగా ఉంటాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అల్పుడు కష్టం కలిగితే అధికంగా దుఃఖిస్తాడు. సుఖం కలిగితే ఆనందంతో ఉప్పొంగి పోతాడు. "నిండుకుండ తొణకదు" అనే సామెత అన్నిటిలోనూ సమంగా ఉండేవాళ్ల స్వభావాన్ని వివరిస్తుంది. "వెల్తికుండ దొలకుచు నుండు గాని మరి తొల్కనే నిండు ఘటంబు" అని అంటాడు భాస్కరశతకర్త.

## మొహమాట నిర్మొహమాటాలు :

కొందరు ప్రతి విషయానికి మొహమాటపడి ఇబ్బందుల్ని కొని తెచ్చుకొంటారు. చేసే పనులవల్ల నష్టం కానీ ప్రమాదం కానీ జరుగనప్పుడు మొహమాటపడినా ఫరవాలేదు కానీ ప్రమాదం జరిగే విషయాల్లో మొహమాటం చూపడం మంచిది కాదు. మొహమాటానికి పోయి ముప్పు తెచ్చుకుంటారని "మొహమాటానికి పోతే ముండకు కడుపొచ్చినట్లు" అనే సామెత చెబుతుంది.

కొందరు తగిన సమయం చూసి ఇతరుల్ని మొహమాటపెట్టి తమ పనులు చేసుకుంటారని అలాంటివాళ్ల నుద్దేశించి "వంగతోట కాడ మాత్రం వదినా! అన్నట్లు" అనే సామెత పుట్టింది. ఇతరులెంత మొహమాట పెట్టినా కొందరు మొహమాట పడకూడదని "తోటమీది వాడికి పీటమీది వాడికి మొగమాట ముండ రాదు" అనే సామెత హెచ్చరిస్తుంది. ఒకవేళ మొహమాటం చూపితే తోటగలవాడు వంకాయలు పెట్టాల్సి వస్తుంది. పీటమీదివాడైతే తన గద్దెకు తిలోదకాలివ్వకోవడమే అన్నమాట.

ప్రతి విషయానికీ మొహమాట పడేవాళ్లు కొందరైతే మరికొందరు ఏ విషయంలోనైనాసరే ఎవరేమనుకొన్నాసరే నిర్మొహమాటంగా ఉంటారు. మొహమాటాన్ని చూపనివాళ్ల స్వభావాన్ని వెల్లడిచేసే సామెతలు :

"ఎక్కడ బావ! అన్నా వంగతోటకాడ మాత్రం అనమాకు"
"ఎక్కడ వదినా! అన్న వంగతోటకాడ మాత్రం అనకు"
"బంధువుడవు సరే కానీ పైరులో చేయిపెట్టవద్దు"

బావా! వదినా! అన్నారని మొహమాటపడినా, బంధువని మొహమాటం చూపినా వంకాయలు పెట్టి నష్టపోవలసి వస్తుంది. అందుకే నిర్మొహమాటంగా ఉంటారు కొందరు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

## నాల్గవ అధ్యాయం

# సామెతలు విభిన్న స్వభావాలు

### కృతఘ్నత :-

అవసర సమయాల్లో ఆదుకున్న వాళ్ళను ఎప్పుడూ మరచిపోకూడదు. వాళ్ళపట్ల కృతజ్ఞత చూపడం ధర్మం. కానీ కొందరు తమ అవసరం తీరిన వెంటనే సహాయం చేసిన వాళ్ళను మరచిపోతారు. అలాంటి వాళ్ళనే కృతఘ్ను లనీ, వాళ్ళ స్వభావాన్నే కృతఘ్నతనీ అంటారు. మానవుని చెడు స్వభావాల్లో కృతఘ్నత ఒకటి. ఎన్ని పాపాలకైనా ప్రాయశ్చిత్తం కలవేమో కానీ కృతఘ్ను డికి మాత్రం లేదని రామాయణ శ్లోకం వివరిస్తుంది.

"బ్రహ్మఘ్నేచ సురాపేచ చోరే భగ్నవ్రతే తథా
నిష్కృతిః విహితా సద్భిః కృతఘ్నేనాస్తి నిష్కృతిః"[1]

(బ్రాహ్మణ హంతకునికి, తాగుబోతుకు, చోరునికి, వ్రతభంగం చేసుకొన్నవాడికి ధర్మశాస్త్రాలు ప్రాయశ్చిత్తాలను తెలియ చెప్పాయి. కానీ మిత్ర ద్రోహి, కృత ఘ్నుడైనవాడు ఏమి చేసినా వాని పాపానికి నిష్కృతి లేదు.)

కృతఘ్నతకు మించిన పాపం లేదన్నమాట. కృతఘ్నుల స్వభావాన్ని తెలియచెప్పే సామెతలు ప్రచారంలో ఉన్నాయి.

కొందరు తమకు మేలు చేసినవాళ్ళ సహాయాన్ని మరచిపోయి వాళ్ళకే అపకారాన్ని తలపెడతారు. అలాంటివాళ్ళ స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"అన్నంపెట్టిన ఇంటికి కన్నంవేసినట్లు"
"తినయింటి వాసాలు లెక్కపెట్టినట్లు"

---

1. శ్రీమద్రామాయణం : కిష్కింధ - 34-12. శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"తాగిన రొమ్ము గుద్దినట్లు"

"రక్షించిన వాణ్ణి భక్షించినట్లు"

కొందరు తమ అవసరం తీర్చుకోవడానికై ఎదుటి వాళ్ళను ఇంద్రుడనీ, చంద్రుడనీ పొగడి అందలమెక్కిస్తారు. నీటముంచినా, పాలముంచినా నీవే దిక్కంటారు. అవసరం తీరితే పొగడిన వాళ్ళనే నిందించడానికి, అవమానపరచడానికీ ప్రయత్నిస్తారనీ, అలాంటి కృతఘ్నుల స్వభావాన్ని.

"అక్కఱ ఉన్నంతసేపు ఆదినారాయణ అక్కఱతీరితే గూద నారాయణ"

"ఏఱు దాటేవరకు వెంకటనారాయణ ఏఱుదాటినాక గూదనారాయణ"

"ఓడ ఎక్కేవరకు ఓడమల్లయ్య ఓడదిగ్గానే బోడి మల్లయ్య"

"అక్కఱ తీరినాక తక్కెడ పొయ్యిలో బెట్టినట్లు"

"అక్కఱ తీరితే అల్లుడు తొత్తుకొడుకు"

"అక్కఱ తీరితే అక్కమొగుడు కుక్క"

"అవసరముండే కాళ్లు అవసరం తీరితే రాళ్లు" అనే సామెతలు వెల్లడి చేస్తాయి.

కనీ, పెంచీ పోషించిన తల్లిదండ్రులకంటే కొందరు ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తారు. ఇంట్లోవాళ్లకు మేలు చేయడానికి బదులు బయటివాళ్లకే మేలు చేస్తుంటారు. ఇంటి పనులకంటే బయటివాళ్ల పనుల్ని ఎంతో ఉత్సాహంగా చేస్తారని, అలాంటివాళ్ల స్వభావాన్ని

"ఇంటిదేవుణ్ణి వదలి వీధిలో దేవునికి మొక్కినట్లు"

"ఇంటికి ఇత్తడి చిలుక పొరుగింటికి బంగారు చిలుక"

"ఇంటికి ఈలకత్తి పొరుగింటికి బంగరుకత్తి" అనే సామెతలు చెబుతాయి. ఇలాంటివే మరికొన్ని సామెతలు :

"ఇంటిమగనికి ఎద్దబండి - బయటి మగనికి గుఱ్ఱాలబండి"

"ఇంటి మగనికి ఈతకల్లు - బయటిమగనికి తాటికల్లు"

"ఇంటికి ఏబ్రాసి పొరుగుకు శ్రీమహాలక్ష్మి"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఇంటికి జ్యేష్ఠాదేవి పొరుగుకు శ్రీమహాలక్ష్మి"

ఒకరి సొమ్ము తింటూ మరొకరి క్షేమాన్ని కాంక్షించేవాళ్ల కృతఘ్నతా స్వభావాన్ని తెలిపే సామెతలు :

"కాంరెడ్డోరి కూడుతిని పేరం రెడ్డోరి పసులు కాచినట్లు"
"సిద్దారెడ్డోరి చద్దనం తిని శివారెడ్డోరి ఆవులు మేపినట్లు"
"ఆపూరి అంబలితాగి దూపూరి వారి దూడలు కాచినట్లు"
"మగని సొమ్ము తిని మిండని పొట్లుపడినట్లు"

మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేయడం కూడా కృతఘ్నతే. బాగా నమ్మినవాళ్లను మోసంచేసే కృతఘ్నుల స్వభావాన్ని

"నమ్మించి గొంతుకోసినట్లు"
"తడిగుడ్డతో గొంతు కోసినట్లు" అనే సామెతలు వివరిస్తాయి,

## మోసం

"మోసముననుదనక మొదటిముఖ్యతహాని
మోసముననుదనదు మురుపు తప్పు
మోసముననుదనదు మోక్షము తప్పురా"[2]

ఇతరులను మోసగిస్తే హాని కలుగునని, గౌరవం నశించుననీ, చివరకు ముక్తి లభించదని వేమన చెప్పినా మాయమాటలు చెప్పి ఇతరుల్ని నమ్మించి మోసం చేసేవాళ్ళు, వేషధారణతోనూ, వ్యాపారంలోనూ మోసంచేసే వాళ్ళు, పనీ పాటా లేక సోమరి తనంతో పొట్టకోసం మోసం చేసేవాళ్ళు కనిపిస్తారు. మోసం చేయడం మంచిదికాదనీ, మోసాన్ని విసర్జించిన వాడే ధన్యుడని త్యాగరాజు కృతి చెబుతుంది.

"కాసు వీసములకోసము యాసతో
వేసము ధరించి మోసము చెందని
యతడే ధన్యుడురా ఓ మనసా !

---

2. వేమన పద్యరత్నాకరము 44వ పద్యం : బాలసరస్వతీ బుక్ డిపో, 1983

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అయితే మోసాన్ని మోసంతోనే జయించాలనీ, మోసగాణ్ణి మోసం చేయడంలో తప్పులేదనీ, "మాయికులయందు బుద్ధిమంతుడు మాయావి యయి ప్రవర్తింపవలె గాని ఋజువుగా ప్రవర్తింపగూడదు'' అని మిత్ర భేదంలోని వాక్యం అంటుంది.

వస్తువుల్ని కొనటానికి వెళ్తే వ్యాపారి మొదట మంచి వస్తువును చూపించి ఇచ్చేటప్పుడు మాత్రం మరోవస్తువును ఇస్తాడు. ఇలా మోసం చేసేవాళ్ళ స్వభావాన్ని బట్టి పుట్టిన సామెతలు :

"మంచి పగడాలు చూపి మాయపగడాలు అమ్మినట్లు''

"అమ్మేదొకటి అసిమిలో నిదొకటి"

"నెయ్యి అని అరచి నూనె అమ్మినట్లు"

ఎదుటివాళ్ల అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని కొందరు మోసం చేస్తుంటారు. గేదకున్న లోపాన్ని కప్పిపుచ్చడానికి దాన్ని నీటిలో ఉంచి కేవలం దాని కొమ్ముల సొగసును మాత్రమే చూపించి అమ్మాలని చూస్తారు. అలాంటివాళ్ల మోసాన్ని "నీటిలో గేదెను పెట్టి కొమ్ములు చూపి బేరమాడినట్లు" అనే సామెత వెల్లడి చేస్తుంది.

కొందరు పైకి చూడ్డానికి మంచివాళ్ళుగా కనిపిస్తూ ఇతరుల్ని నమ్మిస్తారు. సమయం దొరికితే మోసం చేస్తారు. వాళ్ల స్వభావాన్ని "కొంగజపం చేపల కొఱకే" అనే సామెత వెల్లడి చేస్తుంది. కొంగ ఒంటికాలుపై నిలబడి తపస్సు చేయుచున్నదానిలా నటించి చెరువులోని చేపల్ని తినివేస్తుంది. అలాగే మానవులు కూడా మనస్సులో కపటం కలిగి పైకి మంచిమాటల్ని చెబుతూ సమయం దొరికితే దెబ్బతీయడానికి ప్రయత్నిస్తారని క్రింది శ్లోకం వివరిస్తుంది.

''ఛాదయిత్వాఽఽత్మభావం హి చిరన్తిశతబుద్ధయః
ప్రహరన్తి చ రంధ్రేషు సోఽనర్థః సుమహాన్భవేత్''[3]

(దుర్మార్గులు చెడు ఆలోచనల్ని లోపల దాచుకొని, పైకి తియ్యగా మాట్లాడుతూ పొంచి ఉండి సమయం దొరికితే చాలు సర్వనాశనం చేస్తారు. ఆ అనర్థాన్ని తట్టుకోవడం చాలా కష్టమౌతుంది.)

---

3. శ్రీమద్రామాయణం : యుద్ధకాండం - 17-38 - శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్స్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



మాటల్లో తియ్యదనాన్ని చూపి విషపుచేష్టల్ని చేసేవాళ్ల స్వభావాన్నిబట్టి పుట్టిన సామెతలు :

"నోట్లో చక్కెర కడుపులో కత్తెర"

"నాలుకతేనే మనస్సు విషం"

"నాలుక నారాయణ చంకలో చురకత్తి"

"అంగిట విషం మున్నాలిక తియ్యదనం"

"ఎదలో కత్తెర నాలుకలో బెల్లం"

ఇతరులకు స్వల్పంగా ఆశచూపి నమ్మించి మోసం చేస్తారు కొందరు. చేపలు పట్టేవాడు ఎరవేసి మోసంతో చేపల్ని పట్టేస్తాడు. అలా ఇతరుల్ని మోసం చేసేవాళ్ల నుద్దేశించి "ఎఱవేసి చేపను పట్టినట్లు" అనే సామెత చెబుతుంది.

కొందరు బాగా నమ్మినవాళ్లనే మోసం చేస్తారని "నమ్మితిరా సిద్ధా! అంటే దెంగితిరా గుద్దా అన్నడట" అనే సామెత మొరటుగా చెబుతుంది. ఎప్పుడైనా బాగా నమ్మినవాణ్ణి మోసం చేయడం చాలా సులభం. క్రొత్త వాళ్లనూ, నమ్మనివాళ్లనూ మోసం చేయడం వీలుకాదనే భావాన్ని;

"తిన్న ఇంటి వాసాల్ని లెక్కపెడతావేమిరా, అంటే పొరుగింటి సంగతి నాకేమి తెలుసు అన్నాడట" అనే సామెత వెల్లడి చేస్తుంది.

## అనుమానం :-

మనిషికి అనుమానం కలుగకూడదు. అనుమానించడం మొదలు పెడితే చివరకు తనపై తనకే నమ్మకం ఉండదు అనుమానంతో అనవసరంగా జీవితాన్ని పాడుచేసుకుంటాడు అందుకే "అనుమానం పెనుభూతం" అనే సామెత పుట్టింది. లేనిపోని అనుమానాల్ని పెంచుకొని చివరకు ప్రాణానికే ముప్పుతెచ్చుకుంటారని "అనుమానం ప్రాణసంకటం" అనే సామెత వెల్లడి చేస్తుంది. అనుమానం వ్యాధిలా మనిషిని పట్టి పీడిస్తుంది. మనస్సులో ఏదో అనుమానాన్ని పెట్టుకొని బయటికి చెప్పక తమలోతాము క్రుంగిపోతుంటారు. మనోవ్యాధికి



CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ముందు లేదన్నారు. అందువల్ల "ఆయుస్సు తీరినవాడు ఆర్నెల్లకు చస్తే- అను మానపడినవాడు అప్పుడే చస్తాడు" అనే సామెత పుట్టింది.

"అనుమానం ముందుపుట్టి ఆడది తర్వాత పుట్టింది" అనే సామెత ఆడ వాళ్లకు అనుమానం ఎక్కువనే విషయాన్ని వెల్లడి చేస్తుంది. ఆడవాళ్లు తమ భర్తలకు సంబంధించి లేనిపోని అనుమానాల్ని పెంచుకొని ప్రతిదాన్ని అనుమా నిస్తూ మగవాళ్లను చిరాకుపరుస్తుంటారు.

తమకు సంబంధించిన విషయం కాకపోయినా ఇతరులేమి మాట్లాడినా తమను గురించే మాట్లాడుతున్నారని కొందరు అనవసరమైన అనుమానం పెట్టు కుంటారు. "గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు"గా కొందరు అనవసరంగా గుమ్మడికాయల గుర్తులు తమ భుజాలపై ఉన్నాయేమో అని తడిమి చూసుకుంటారని పై సామెత చెబుతుంది.

తంబళ్ళకు అనుమానం ఎక్కువనీ, అనుమానంతో ప్రాణానికి ముప్పు తెచ్చుకుంటారని "తంబళి అనుమానం తలతిక్కతోసరి" అనే సామెత వ్యక్తం చేస్తుంది. దీనికి సంబంధించిన కథను డా॥ పి. నరసింహారెడ్డిగారు ఇట్లా పేర్కొ న్నారు "గుండుకొమ్ముల ఎద్దును చూచి ఆ కొమ్ముల నడుమ తన తలదూరుతుందా దూరదా అని సందేహించి సందేహనివృత్తికై దాని కొమ్ములలో తలదూర్చి, అది పరుగుతీయగా చిత్రహింసను అనుభవించినాడు. అంటే వాని తలతిక్కను వది లించిందన్నమాట" (తెలుగు సామెతలు - జనజీవనం - పుట. 126)

## తిండిపోతుతనం :-

"శరీరమాద్యం ఖలుధర్మసాధనం" అని ఆర్యోక్తి. ఏ ధర్మాన్ని ఆచ రించాలన్నా, ఏ కర్మ చేయాలన్నా శరీరం ముఖ్యసాధనం. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే తగిన ఆహారం తీసుకోవాలి. శరీరాన్ని పోషించేది ఆహారం. మాన వుడు ఏంచేసినా కేవలం ఆహారాన్ని సంపాదించడం కోసమే. అందుకే "కూటి కోసం కోటి విద్యలు" అనే సామెత వ్యవహారంలో ఉంది. అట్లని కేవలం మనిషి తిండికోసమే పుట్టాడనడం మంచిది కాదు. శరీర పోషణకు ఎంత ఆహా రం అవసరమో అంతే ఆహారాన్ని తినడం శ్రేష్ఠం. అన్నం తినకపోతే శరీరం నీరసించి పోతుంది. ఏ పని చేయటానికి శక్తి ఉండదు. అందువల్ల తగిన ఆహా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



రాన్ని తగినంతగా భుజించాలి. "హితంమితంభుంజీత" అని పెద్దలమాట. హితమైన ఆహారాన్ని మితంగా తినాలి.

"తదన్నమపి భోక్తవ్యం జీర్యతే యదనామయమ్"[4]

(అనారోగ్యాన్ని కలిగించకుండా జీర్ణమయ్యేటంత ఆహారాన్ని తినాలని భావం.) అమితాహారం అనారోగ్య హేతువు. అమితాహారాన్ని స్వీకరించడం వల్ల జీర్ణం కాక శరీరానికి అనేక విధాల హాని కలిగిస్తుందని "బహుతిండి బహునాశనం" అనే సామెత వెల్లడి చేస్తుంది. మితంగా తింటే శరీరం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపే సామెతలు :

"ఒకపూట తింటే యోగి రెండుపూటలా తింటే భోగి మూడుపూటలా తింటే రోగి"

"బొక్కెడు తిన్నమ్మ బూరగమాను - చేరెడు తిన్నమ్మ చెక్కపేడు"

శరీరం ఆరోగ్యంగా ఉంటే మనస్సు కూడా ఆరోగ్యంగా ఉంటుంది. శరీరం మనస్సు రెండూ ఆరోగ్యంగా ఉంటే మానవుడు లోకంలో దేన్నైనా సాధించ గలడు. మానవునిలోని తిండిపోతుతనాన్ని తెలియజెప్పే సామెతలు ప్రజల వ్యవ హారంలో కనిపిస్తాయి.

"బ్రతుకుటకు తినవలెను గాని తినుటకే బ్రతుకరాదు" అన్నట్లు జీవించడం కోసం తినేవాళ్లు కొందరైతే తినడం కోసమే జీవించేవాళ్లు మరికొందరు. ఎపుడూ తిండిని గురించిన ఆలోచన తప్ప మరేమీ ఆలోచించరు. ఎపుడైన సరే తినడానికి సిద్ధంగా ఉంటారని, అలాంటివాళ్ళను "ఉలవులు తింటావా ! బసవన్నా ! అంటే ఊ అన్నట్లు" అనే సామెత విమర్శిస్తుంది. తిండిని గురించి ఆలోచించే వాణ్ణి "నాకు వేసే పిండాకూడు నాకు వేస్తే అవిరేటి కుండలకాడ చచ్చినట్లు తొంగుం టాను అన్నాడట" అనే సామెత విమర్శిస్తుంది.

కొందరు తిండి తినడంలో చూపించే ఉత్సాహాన్ని పనిచేయడంలో చూపిం చరు. పని చేయాల్సి వస్తే కడుపునొప్పి అనో కాళ్ళనొప్పి అనో ఏవేవో సాకులు చూపుతారు. ఎక్కడలేని రోగాలు వాళ్లకే వస్తాయి. తిండి దగ్గరకు వచ్చే

---

4. శ్రీమద్రామాయణం : అరణ్యకాండం - 50 - 27 శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



సరికి అన్ని రోగాలు మాయమైపోతాయి. తిండిలో ఉత్సాహాన్ని చూపి పని చేయ డంలో సోమరితనాన్ని చూపేవాళ్ల స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"తిండికి తిప్పరాజు, పనికి పోతురాజు"

"తిండికి ఏనుగు - పనికి పీనుగు"

"దాణాకు నోరుతెరిచి కళ్ళానికి నోరుమూసినట్లు"

"కడి అంటే నోరు తెరచి కళ్లమంటే నోరు మూసినట్లు"

"మేతకరణమేగాని, కోతకరణం కాదు"

"గంతకట్టేదా! బసవన్నా అంటే ఉహు అని గుగ్గిళ్ళు తింటావా!
అంటే ఆహా అన్నాడట"

"తిండికి పిడుగు పనికి బడుగు"

తిండిపోతులను గూర్చిన జానపదగేయమే సామెతగా నిలిచిపోయిన తీరు చూడుడు;

"నీళ్ళకు పోరాకమ్మా అంటే నిదురొస్తాదమ్మా
కట్టెలకు పోరాకమ్మ అంటే కడుపునొస్తదే అమ్మా
బొచ్చె తెచ్చుకోరాబొమ్మా అంటే అట్లా చెప్పమాయమ్మా"

కొందరు తిండి విషయం వచ్చేసరికి ముందుగా ఉంటారు. పని చేయాల్సి వస్తే ఎక్కడో వెనుక చేరుకుంటారు. ఏవేవో సాకులు చెప్పి పనిచేయటం తప్పించు కుంటారు. తిండికి ముందుండి పని దొంగలై వెనుక చేరేవాళ్లను విమర్శించే సామెతలు :

"తిండికి ముందుకోపు పనికి వెనుకకోపు"

"బంతికి ముందు బారుకి వెనుక"

"దున్నబోతే దూడలలోను మేయబోతే పోతులలోను"

"మేయబోతే ఎద్దులలోకి దున్నబోతే దూడలలోకి"

వెనుకపడితే అన్నం దొరకదేమో అనే భయంతో బంతిలో ముందు భాగంలో చేరుతారు. బారులో (సైనికుల్లో) ముందుగా ఉంటే శత్రువులతో పోరాడాల్సి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



వస్తుంది. అందుకై తప్పించుకోడానికి వెనుకచేరతారు. దూడలతో పని చేయించరు. ఎద్దుల్తో పనిచేయించినా మంచి తిండిపెట్టి పోషిస్తారు. తిండికి వచ్చేసరికి ఎద్దుల్తో పోటీపడి పని చేయాల్సివస్తే దూడల్లోకి చేరి పని తప్పించుకుంటారు.

కొందరు ఏ పని చేయరు. ఎపుడూ సోమరితనంతో కాలం గడుపుతూ ఉంటారు. పొద్దున్నుంచి రాత్రివరకు ఊరిమీద పడి తిరుగుతూ ఉంటారు. ఎక్కడ తిరిగినా, ఎలా కాలం గడిపినా భోజన సమయానికి మాత్రం ఇంటికి చేరుకుంటారు. అలాంటివాళ్లని విమర్శించే సామెతలు :

"ఏపాటు తప్పినా సాపాటు తప్పదు"

"ఏపూజ తప్పినా పొట్టపూజ తప్పదు"

దరిద్రుడికి ఆకలి ఎక్కువంటారు. అన్నం దొరికితే చాలు తినటమే వాని పని. ఎపుడు తిండి దొరుకుతుందా అని ఎదురుచూస్తూ ఉంటాడు. దొరికితే చాలు సమయాసమయాల్ని పాటించక తినేస్తుంటాడు. అందుకే "దరిద్రుడికి సద్దికట్టియిస్తే, ఊరి వెలుపలి కుంట కాడనే భోంచేసి పోయినాడట" అనే సామెత వ్యాప్తిలో ఉంది.

జబ్బుతో బాధపడేవాళ్ళు పథ్యం ఉండవలసి వస్తుంది. జబ్బుతో ఉన్నపుడు ఆహారం ఎంత మితంగా తింటే అంత మంచిది. "లంఖణం పరమౌషధం" అంటారు పెద్దలు. నిరాహారంగా ఉంటే మరీ మంచిదన్నమాట. కాని తిండిపోతు వ్యాధితో బాధపడుతూ ఉన్నా తిండిని గూర్చి మాత్రం మరచిపోడు. జబ్బుతో ఎంత బాధపడ్డా భోజనం మాత్రం ఎప్పటిలాగా తింటాడని తెలిపే సామెతలు :

"కాటికి కాళ్ళుచాచి తిండికి చేతులు చాచినట్లు"

"మూలుగు మునపటిలాగే భోజనాలు ఎప్పటిలాగే"

ఎపుడూ తిండిని గురించే ఆలోచించేవాళ్ల స్వభావాన్ని

"మేకకు జ్ఞాపకముండేది మేతసంగతి"

"మేకకు తెలిసినదంతా మేతసంగతి"

"పాటిమీద గంగానమ్మకు కూటిమీదనే లోకం"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఏటిమీది బాపనయ్యకు కూటిమీద చింత"

అనే సామెతలు వెల్లడి చేస్తాయి.

కొందరు ఎంత తిండి తింటారో ఎలా జీర్ణించుకుంటారో ఏమోకాని తిండి దగ్గర కూర్చుంటే ఎంతసేపటికి లేవరు. తమతోపాటు కూర్చున్నవాళ్లు తిని లేచి పోయినా తాము ఇంకా తింటూనే ఉంటారు. అలాంటివాళ్లను గురించిన సామెతలు :

"మామ బంతికి కూర్చొని అత్త బంతికి లేస్తాడు"

"అప్పతో కూర్చొని అమ్మతో లేచినట్లు"

"అయ్యతోగూడ సద్దన్నం తిని అమ్మతోగూడ వేడి అన్నం తిన్నట్లు"

"అమ్మతో కూడా మారన్నం తింటాడు"

ఎక్కువ తిండివల్ల నిద్ర ఎక్కువ. తిండి ఎక్కువైతే చదువు తగ్గిపోతుంది. చదువు చదవకపోయినా తిండి మాత్రం తక్కువ చేయరు. అలాంటి వాళ్లను విమర్శించే సామెతలు :

"అన్నచొరవే గాని అక్షర చొరవలేదు"

"అన్న దీక్షయేకాని అక్షర దీక్షలేదు"

"తెలివి తక్కువ ఆకలి ఎక్కువ"

తిండిమీద ఉన్న పట్టుదల చదువు మీద లేకపోతే తెలివి తక్కువ అవుతుంది, ఆకలి పెరుగుతుంది.

"కూటి కోసమే కోటివిద్యలన్నట్లు"గ ఉదర పోషణార్థమై రకరకాల వేషాలు వేస్తూ ఉంటారు అక్షర జ్ఞానం లేకపోయినా కొందరు కాషాయవస్త్రాలు ధరించి సన్యాసాశ్రమాన్ని పుచ్చుకుంటారు. సమయానికి తిండిని గురించి ఆలోచన తప్ప వారిలో పాండిత్యమేమీ ఉండదు. అలాంటివాళ్లను అధిక్షేపిస్తూ "భగవద్గీత పుచ్చుకుంటారా! అంటే కడుపు నిండింది. ఇక తినలేను అన్నాడట" అనే సామెతను ప్రయోగిస్తారు. భగవద్గీత అంటే ఏమిటో తెలియదు. అదికూడా ఒక రకమైన తిండి అనుకున్నాడు పాపం! అందుకే ఇక తినలేనన్నాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఎక్కువగా తినేవాడి కడుపును తమ ప్రాంతపు పెద్ద చెరువుతో పోల్చి చెప్పుకుంటారని క్రింది సామెతలు వెల్లడి చేస్తాయి.

"కడుపా? కందుకూరి చెరువా"

"కడుపా? కంచాలమ్మా చెరువా"

"కడుపా? కావేరిపాకు చెరువా?"

"కడుపా? కళ్లేపల్లి చెరువా?"

"కడుపా? తుంబళం చెరువా?"

"అర్ధశేరు బియ్యం తింటావురా? అంటే మూడు మెతుకులు విడిచిపెడతా నన్నాడట" అనే సామెత ఎంత వండి పెడితే అంతా తినేవాళ్ళ స్వభావాన్ని వెల్లడి చేస్తే, ఎంత తిన్నా, కడుపులో తినటానికి స్థలం లేకపోయినా కొందరికి ఇంకా తినాలనే ఆశ ఉంటుందని; "కళ్లు కావాలంటాయి కడుపు వద్దంటుంది" అనే సామెత వ్యక్తం చేస్తుంది తిండిపోతుకు భార్య అనవసరమని "అద్దెడు తినే వాడికి ఆలెందుకు, ఇద్దుము మోసేవానికి ఎద్దెందుకు" అనే సామెత చెబుతుంది.

"పిల్ల బావిలో పడ్డదిరా అంటే ఉండు అంబలి తాగి వస్తానన్నట్లు" అని సామెత చెప్పినట్లుగా ఇతరుల ప్రమాదం కన్నా తమ తిండికే ప్రాధాన్యాన్నిచ్చే తిండిపోతులు కొందరుంటారు.

కొందరికి ఎప్పుడూ తిండిమీద చింత. ఎపుడు ప్రొద్దు క్రుంకుతుందా? తిందామని ఎదురుచూస్తూంటారని క్రింది సామెతలు చెబుతాయి :

"ప్రొద్దెపుడు క్రుంకునా ముద్దెపుడు మ్రింగుదునా"

"గూట్లో దీపం నోట్లోకడి"

"గూట్లో దీపం - నోట్లో కబళం"

"గూట్లో దీపం - నోట్లో మెతుకు"

"గూట్లో దీపం - నోట్లో కబళం" అనే సామెత జైనమతస్థుల ఆహార సంప్రప

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



దాపుం నుండి పుట్టిందని చెప్పినా తొందరగా భోజనం చేసేవాళ్ల స్వభావాన్ని తెలుపుతుంది.

కొందరు తిండిపోతులు ఎక్కడకు వెళ్లినా తమ తిండిని గురించే పట్టించుకుంటారు. పెండ్లికి వెళ్తే తిండి ఎలా దొరుకుతుందని ఆలోచిస్తారనీ, తిండి దొరికితే చాలు తినేసి తమదారిన తాము వెళ్లిపోతారని "మగవాని పెండ్లా ఆడదాని పెండ్లా? అంటే అదేమో నాకు తెలియదు. గాడిపొయ్యి దగ్గర కాస్త వేస్తే గతికి వచ్చినాను అన్నాడట" అనే సామెత వెల్లడి చేస్తుంది. పెండ్లికి వెళ్తే మగవాని పెండ్లో - ఆడదాని పెండ్లో తెలియకుండా ఉండదు. తెలియదంటే కేవలం తిండి కోసమే పోయినట్లు వ్యక్తమవుతుంది.

తిండి ఎక్కువయి ఆయాసపడుతుంటే ఏదైనా మందు వేసుకుంటే తగ్గిపోతుందని ఎవరైనా సలహా ఇస్తే తిండిమీదే ఆలోచన కలవాడు "ఆవగింజకు సందు ఉంటే అరవై గారెలు అపుడే తిననా?" అని సమాధానం ఇచ్చాడంటే ఎంతటి తిండిపోతో వ్యక్తమవుతుంది. ఇలాంటివే మరికొన్ని సామెతలు :

"వాము తింటావా మామా? అంటే వాము పోసకు సందుంటే
ఒక వడతునకే తిననా అన్నాడట"

"వాము పట్టే సందే ఉన్న ఒక భక్ష్యమైనా తినేవాడిని"

"ఆవగింజంత సందుంటే అరభక్ష్యం తిననా?"

ఏదైనా తింటావా? అని ఎవరైనా అడిగితే చాలు తిండిపోతు సిద్ధంగా ఉంటాడు. పెట్టిందే తింటాననడమే కాక ఇంకా ఏమి పెట్టినా తినటానికి సిద్ధమని క్రింది సామెత వెల్లడి చేస్తుంది;

"చక్కిలాలు తింటావా? చల్ది తింటావా? అంటే చక్కిలాలు తింటాను, చలిదీ తింటాను అయ్యతోగూడ అవతల అన్నమూ తింటాను అన్నాడట."

## ప్రయత్న లోపం :-

చిన్నదైనా, పెద్దదైనా పని జరగాలంటే మానవుని ప్రయత్నం చాలా అవసరం. ఎంత బలం ఉన్నా, ధనం, ఉత్సాహం ఉన్న పని చేయాలనే ఆలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



చన ఉండాలి. దానితోపాటు ప్రయత్నం కూడా ఉండాలి. వడ్డించిన విస్తరి దగ్గర కూర్చున్నా ప్రయత్నం చేయందే అన్నం నోట్లోకి రాదు. కలిపి నోట్లో పెట్టినా బాగా నమిలి, మ్రింగే ప్రయత్నం చేయాలి. అపుడే అది జీర్ణాశయంలో చేరుతుంది. కాబట్టి ఏ పని సాధింపబడాలన్నా ముందుగా ప్రయత్నమనేది ఉండాలి. ఒక్కొక్క రాయి తీసినా కొన్నాళ్ళకు ఎంత పెద్ద కొండయినా తరిగి పోతుంది. "సాధనమున పనులు సమకూరుధరలోన" అన్నాడు వేమన. ఆకలి తీరాలంటే మృగరాజైన సింహం కూడ వేటాడక తప్పదు. గుహలో కూర్చొని నిద్రించు సింహం నోటిలోనికి జంతువులు తమంత తాము వచ్చి చొరవని క్రింది శ్లోకం చెబుతుంది.

"ఉద్యమేనహి సిధ్యన్తి కార్యాణి న మనోరథైః
న హి సుప్తస్య సింహస్య ప్రవిశన్తి ముఖేమృగా !"5

కార్య సాఫల్యం జరగాలంటే ఎలాంటివాడైనా ప్రయత్నం చేయక తప్పదని

"కూర్చున్న చోటికి కూడొస్తుందా?"
"పద్మాసనం వేసికూర్చుంటే పరమాన్నం వడ్డిస్తారా?"

అనే సామెతలు నొక్కి చెబుతాయి.

ప్రయత్నం చేస్తే మానవుడు సాధించనిదంటూ ఏదీ ఉండదు. మానవుని అభ్యుదయమంతా అతడు చేసే ప్రయత్నం మీదనే ఆధారపడి ఉంటుంది. "వెయ్యి మైళ్ల ప్రయాణం కూడ ఒక్క అడుగుతోనే ఆరంభమవుతుంది" (మణి పూసలు - పుట. 123) అని జాపాన్ సామెత. ప్రయత్నమే లేకపోతే ఎదురుగా నిధి లభించినా పొందలేడు. అల్పుడైనా ప్రయత్నం చేస్తే ప్రయత్నరహితు డైన ఎంతటి శత్రువునైనా జయించగలడని భారత సూక్తి.

"ఆరంభ రహితు బొందునె
యారయ సంపదలు హీనుడయ్యును బురుషుం
డారంభశీలుడై యకృ
తారంభుల నొర్చు నెంత యధికులనయినన్"6

---

5. హితోపదేశం - ప్రస్తావికా : 37 శ్లోకం, వావిళ్లవారి ప్రతి.
6. ఆంధ్రమహాభారతం : 2 - 1 - 123

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



మానవ ప్రయత్నం ఉంటే దానికి దైవం కూడా అనుకూలిస్తుంది. ప్రయత్నం చేసేవానికే లక్ష్మి సిద్ధిస్తుందనీ, ప్రయత్న రహితుణ్ణి చూస్తే లక్ష్మి కూడా దూరంగా పోతుందని హితోపదేశం చెబుతుంది :

"అవ్యవసాయినమలసం దైవపరం సాహసాచ్చ పరిహీణమ్
ప్రమదేవ పతిం వృద్ధం నేచ్ఛతి లక్ష్మీర్గహీతు మీషదపి"7

కొందరు తామేమీ ప్రయత్నం చేయరు. కాని తమ పనులు మాత్రం జరిగిపోవాలనీ, దాని ఫలితం లభించాలనీ అనుకుంటారు. తాము ప్రయత్నం చేయాలనే ఆలోచన వదలి కేవలం భగవతునిపై భారం వేసేవాళ్ల స్వభావాన్ని వివరించే సామెతలు :

"గాలిలో దీపంపెట్టి దేవుడా? నీ మహిమ అన్నట్లు"

"గానుగరోట్లో చెయ్యిపెట్టి పెరుమాళ్ళ కృప అన్నట్లు"

"చెఱుకా! బెల్లం పెట్టమంటే పెడ్తుందా! గానుగలో వేసి తిప్పితే పెడ్తుతుంది"

గాలిలో దీపంపెట్టి దానికి గాలి తగులకుండా కనీసం ప్రయత్నమైనా చేయాలి. ప్రయత్నమే చేయకపోతే భగవంతుడేమి చేయగలడు. అలాగే రోట్లో చేయి పెట్టాక రోకలి పోటు పడుతుందనీ, కాబట్టి బయటికి తీయాలనే ప్రయత్నం చేయకపోతే భగవంతుడు మాత్రం ఆపగలడా?

కొందరు తామేమీ ప్రయత్నించక తమ పనంతా ఇతరులే చేయానుకుంటారు. కార్యసాధనకై ఇతరులు తమవంతుగ సహాయపడగలరు. కానీ వాళ్లే ఆ పనంతా చేయలేరు. చేయటానికి వీలుండదు. అన్నం కలిపి నోట్లో పెట్టగలరే కానీ నమిలి మ్రింగించలేరు కదా! గుర్రాన్ని నీటి దగ్గరకు తీసికొని పోగలరే కాని నీళ్లు త్రాగించలేరు కదా! ఇతరులెంత సహాయపడినా చేయవలసిన వాళ్లు ప్రయత్నించకపోతే ఆ పని కాదనీ, అలాంటివాళ్ల నుద్దేశించి పుట్టిన సామెతలు :

"గుర్రాన్ని చెఱువు దగ్గరకు తీసుకెళ్లగలమేగాని నీరు త్రాగించలేము గదా?"

---

7. హితోపదేశః - సుహృద్భేదః : 4వ శ్లోకం, వావిళ్లవారి ప్రతి 1969.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"గోవును గోలెం దగ్గరకి తీసుకెళ్లగలం కానీ కుడితని తాగించగలమా?"

"కండ్లు మూయించవచ్చునుగాని కలలు కనేట్లు చేయగలమా?"

"ముప్పదికోట్ల దేవతలు ముక్కుపట్టించగలరు కాని నారాయణా! అనిపించగలరా?"

## అనుకరణం :-

అనుకరణ స్వభావం ప్రాణికోటికి సహజం. అనుకరణం పిల్లలపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది. ఇతరుల్ని ఒకసారి చూస్తే వెంటనే అనుసరించటానికి ప్రయత్నిస్తారు. "సంఘంలోని మర్యాద, మన్ననలు, భక్తిశ్రద్ధలు, పూజాపునస్కారముల వైఖరి మొదలగునవి పెద్దవారిని చూచి వారివలెనె నటించు కోరిక చిన్ననాటి నుండియే అజ్ఞాతముగా పని చేయుచు-డును"8

మానవుని జీవనపరిణామానికి అనుకరణం ఎంతో ఆవశ్యకం. అనుకరణమే లేనిచో మానవుడు పుట్టినవాడు పుట్టినట్లుగానే ఉండిపోవలసి వస్తుంది. ప్రకృతిని, ప్రపంచంలోని వ్యక్తుల్ని అనుకరిస్తూనే మానవుడు తన జీవితాన్ని తీర్చి దిద్దుకోవడం జరుగుతుంది. మానవుని జీవితంలో ఇంతటి ప్రభావాన్ని చూపించే అనుకరణ విషయంలో మానవుడు ఎంతో జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. అనుకరణం ఒక నీడలాంటిదనీ, మనిషిని అనుసరించి నీడ ఎలా ఉంటుందో అనుకరించే వ్యక్తి కూడా అంతే. అందువల్లే బాల్యం నుండే సజ్జన సాంగత్యం అలవడాలని పెద్దలంటారు.

మానవుడు సంఘజీవి. సంఘంలోని వివిధ వ్యక్తుల స్వభావాలకు ఆకర్షితుడు కావడం సహజం. ఇతరుల్ని అనుకరించేటప్పుడు తమ స్థితిని, శక్తిసామర్థ్యాలను, అర్హతను, దేశకాలాల్ని గుర్తించాలి. తగినవాటినే అనుకరించాలి. అలా అనుసరిస్తే ప్రమాదం ఉండదు. కాని కొందరు తమ స్థితిని, అర్హతను గుర్తించక ఇతరుల్ని అనుకరించి ప్రమాదానికి గురి అవుతుంటారు. ధనవంతుల్ని బీదవాడు అనుకరించడం సాధ్యమవుతుందా! "పెంట్రుకలున్నమ్మ ఏ కొప్పైనా పెట్టినట్లు" ధనవంతులు ఏమైనా చేస్తారు. ఎంతో డబ్బు ఖర్చుచేసి విలువైన వస్త్రాల్ని, నగల్ని ధరిస్తారు. అలాంటి ధనవంతుల్ని చూసి బీదవాళ్లు వాళ్లవలె

8. కె. వేదాంతాచారి - పిల్లల శిక్షణా సమస్యలు : పుట. 19

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఉండాలనుకోవడం, వస్త్రాల్ని, ఆభరణాల్ని ధరించాలనుకోవడం పొరపాటు. ప్రమాదకరం కూడా! అలాగే బలవంతుల్ని బలహీనులు, సమర్థుల్ని అసమర్థులు అనుకరించాలనుకోవడం మంచిది కాదు. ఇలా తమ అంతస్థు తెలుసుకోకుండా తమకంటే అధికుల్ని అనుకరించి ప్రమాదంలో పడే వాళ్ళ స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"పులిని చూచి నక్క వాతలు పెట్టుకొన్నట్లు"

"నెమలిని చూచి నక్క నాట్యమాడినట్లు"

"ఊరంతా వడ్లెండ బెట్టుకుంటే నక్కతోక ఎండబెట్టుకొన్నదట"

పులికి వాతలున్నాయని నక్కవాతలు పెట్టుకుంటే కష్టాలనుభవించక తప్పదు. ఊళ్ళో వాళ్ళకు వడ్లున్నాయని ఎండబెట్టుకుంటే నక్కతోక ఎండబెట్టుకోవడం మూర్ఖత్వం కాక మరేమవుతుంది? "దువ్వజూచి నక్కయొడలు గాల్చికొన్న వడువున" (4-165) అని నాచన సోముని ప్రయోగం.

కొందరు ఇతరులేమి చేస్తే తాము అదే చేయాలనుకుంటారు. అది సాధ్యమౌనా కాదా! అని ఆలోచించరు. ధనవంతుల ఆర్భాటాల్ని చూసి బీదవాళ్లు అనుకరించడం వీలుకాదు. బీదవాళ్లు తమకున్నంతలోనే తృప్తి పడాలి. ధనవంతులు బంగారు నగలేసుకుంటే బీదవాళ్లు రోల్డుగోల్డు నగలన్నా వేసుకోవాలనుకుంటారు. అలా అనుకోవడంలో తప్పులేదు. కానీ సాధ్యం కాని విషయాల్లో ధనవంతుల్ని, అధిక హోదాకలవాళ్ళను అనుకరించాలని ప్రయత్నించి ఇతరుల్లో నవ్వుల పాలవుతుంటారు. "రాజు తలిస్తే దెబ్బలకు కొదవా ?" అన్నట్లు రాజుగారు తలచుకుంటే ఏమైనా చేయగలడు. రాజుగారి పెళ్లాం కూడా అంతే. రాజుగారి పెళ్లాన్ని చూసి రాజ్యంలోని వాళ్ళందరూ అట్లే చేయాలనుకోవడం పొరపాటు. రాణిగారు మేడెక్కితే ఆమెలాగా అందరూ మేడ ఎక్కడం సాధ్యంకాదు. సాధ్యం కాదని భావించినవాళ్లు ఊరకుంటే కుమ్మరివాడి పెళ్లాం నాకేమి తక్కువా అన్నట్లు తన ఆవమెక్కిందట. ఆవమెక్కితే కుండలు పగులుతాయి. దానివల్ల తనకే నష్టం. అందుకే "రాజుగారి పెళ్లాం మేడ ఎక్కితే కుమ్మరివాడి పెళ్లాం ఆవమెక్కిందట" అనే సామెత పుట్టింది. కుమ్మరివాడి పెళ్లాంలాగా అనుకరించేవాళ్ల స్వభావాన్ని విమర్శిస్తూ పై సామెతను చెప్పుకుంటారు. ఇలాంటివే మరికొన్ని సామెతలు :

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"అక్కన్నమాదన్నలు అందలమెక్కితే సాటినరసప్ప చెఱువు గట్టు ఎక్కినాడట"

"వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు తులాభారం తూగితే కరెడ్లరామన్న వంకాయలభారం తూగినాడంట"

కొందరు గ్రుడ్డిగా ఇతరుల్ని అనుకరిస్తుంటారు. ఉచితానుచితాల్ని, సత్యాసత్యాల్ని తెలుసుకోక అనుకరించడానికి ప్రయత్నిస్తారు. "గ్రుడ్డెద్దు చేల్లో పడ్డట్లు" ఒక పద్ధతి లేకుండా ఇష్టం వచ్చినట్లుగా ఇతరుల్ని అనుకరిస్తుంటారు. మఱికొందరేమో ఇతరులు చెప్పిన మాటల్లో ఎంత నిజం ఉందో ఆలోచించరు. సత్యాసత్యాల్ని గ్రహించక చెప్పిన మాటల్ని యథాతథంగా పాటిస్తుంటారు. అలాంటివాళ్ల స్వభావాన్ని విమర్శించే సామెతలు:

"దున్న ఈనినదంటే దూడను గాట కట్టేయమన్నట్లు"

"దున్నపోతు యీనిందంటే చెంబుతేరా ! పాలు పితుకుదామన్నట్లు"

దున్నపోతు ఈనడం నిజమా? కాదా! అని ఆలోచించక గాట కట్టివేయడానికి పూనుకుంటే ఎలా!

సాధారణంగా గొఱ్ఱెలు గుంపులు గుంపులుగా పోతుంటాయి ఒక గొఱ్ఱె ముందు పోతూ ఉంటే మిగిలినవన్నీ దాని వెనుక పోతుంటాయి. పోతూ పోతూ మొదటి గొఱ్ఱె దారిమళ్లించి ప్రక్కకు తిరిగినా, మరో మార్గంలో పోయినా మిగిలినవన్నీ దాని వెనుకనే పోతాయి. ఆ దారి సరిగ్గా ఉందా? లేదా! ఎక్కడికెళ్తుంది? అనే ఆలోచన వాటికుండదు. అలాగే కొందరు ఇతరులు ఎలా చేస్తే అలాగే చేస్తూ అనుకరిస్తూ ఉంటారు. అలాంటివారి స్వభావాన్ని "గొఱ్ఱెవాటు ఏలం వెట్టి" అనే సామెత విమర్శిస్తుంది.

కాపుకులస్థులు తమ కులంలో ఒకరు ఏ విధంగా చేస్తే మిగిలిన వాళ్ళందరూ అదే విధంగా చేస్తారనీ, ఏమి ఆలోచించక అనుకరిస్తుంటారనీ "కాపుదాటు గొఱ్ఱెదాటు" అనే సామెత చెబుతుంది.

కొందరు ఇతరుల వేషభాషల్ని అనుకరించటానికి ప్రయత్నం చేస్తారు. దుర్జనులు సజ్జనులవలె వేషధారణ చేసి సజ్జనులమనిపించుకోవాలని తాపత్రయ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పడుతుంటారు. సజ్జనుల ప్రవర్తనల్ని, పనుల్ని ప్రక్కకు నెట్టి కేవలం వేష ధారణను మాత్రమే అనుకరిస్తారు. ముఖ్యంగా సాధువుల మనిపించుకోవాలనీ, వేషధారణ విషయంలో అనుకరిస్తుంటారు. అయితే వేషం మారినంత మాత్రాన ఆలోచనలు మారవని "తలలు బోడులైన తలపులు బోడులా ?" అనే సామెత విమర్శిస్తుంది. ఈ సామెత వేమన పద్యంలో ఒకపాదమయింది.

"వేషభాష లెంక గాషాయ వస్త్రముల్
బోడినెత్తులొప్పబొరయు చంద్రు
తలలు బోడులైన తలపులు బోడులా",9

ఇతరులు ప్రమాదం కలిగే పనులు చేస్తూ ఉన్నా ప్రమాదాన్ని గురించి ఆలోచించక అనుకరించి కొందరు ప్రమాదంలో పడుతూ ఉంటారనీ "తోటివాడు తొడ కోసుకుంటే తానుమెడకోసుకున్నట్లు" అనే సామెత వివరిస్తుంది.

**అనుభవం :-**

ఏ పని చేయాలన్నా మనిషికి అనుభవం ఉండాలి. అనుభవం కలవాడు ఒక పనిని చేసినట్లుగా అనుభవశూన్యుడు చేయలేడు. అనుభవంవల్ల మనిషి ఎంతో జ్ఞానాన్ని సంపాదించవచ్చు. అనుభవం మనిషిని ఎంతో తీర్చిదిద్దుతుం దనీ, అనుభవాలవల్ల మనిషిలో ఎంతో మార్పు వస్తుందనీ అన్నాడు ఖలీల్ జిబ్రాన్ :

"తరులు గిరులు ఝరులు
తరంగాల తాకిడితో
మారునట్లు మనిషిమారు
అనుభవాల రాపిడితో",10

మనిషికి అనుభవం ఒక పాఠశాల లాంటిది. ఎన్ని గ్రంథాలైనా మనిషిని అను భవంలాగా తీర్చిదిద్దలేవు "Practice makes a man Perfect" అని అంటుం

9. వేమన పద్యరత్నాకరము - 2475 - బాలసరస్వతీ బుక్ డిపో : 1983
10. డా॥ సి. నారాయణరెడ్డి అనువాదం - 'మణిపూసలు'లో ఉదాహృతం - పుట. 6

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



దాక ఆంగ్ల సామెత. "నడవంగ నడవంగ దావ - పాడంగ పాడగ పాట." "తీయగా తీయగారాగము-మూల్గగా మూల్గగా రోగము" అనే సామెతలు అనుభవం యొక్క ప్రాముఖ్యాన్ని సమర్థిస్తాయి. కాబట్టి అనుభవాన్ని మించింది లోకంలో మరేది లేదు. అనుభవం స్వానుభవం కావచ్చు. ఇతరుల అనుభవం నుంచి నేర్చుకొన్నది కావచ్చు. చిలుకపలుకుల్లాగా ఎన్ని శాస్త్రాలు వల్లించినా అనుభవం కలవానితో సమానుడు కాలేడు. అన్నీ చదివిన వానికంటే ఏమీ చదవకపోయినా అనుభవం ఉంటే చాలు చదివిన వానికంటే మేలని తెలిపే సామెత. "చిన్న వాడి చదువుకన్న గొప్పది పెద్దవాడి అనుభవం". ఒక కొత్త డాక్టరు కంటే, "పాతరోగి సగం వైద్యుడు" అనే సామెత చెబుతుంది. అనుభవమే నిజమైన శాస్త్రమని "అనుభవమే శాస్త్రం - మాటలే మంత్రాలు" అనే సామెత భావం.

అనుభవం రావాలంటే కష్టపడాలి, ఖర్చు చేయాలి. నష్టపోయినా అనుభవం సంపాదించవచ్చు. అలాంటి అనుభవం జీవితంలో బాగా ఉపయోగపడు తుంది. ధనమెంతో ఖర్చుపెట్టి కోర్టుచుట్టూ తిరిగి చివరకు కేసులో ఓడిపోయినా అనుభవం సంపాదించాడట. అందువల్లే "అగ్రహారం పోతేపోయింది. కాని అక్ష్ట అంతాబాగా తెలిసింది." అనే సామెత పుట్టింది. అనుభవం పొందడానికి కొత్త డాక్టరైన సరే రోగుల్ని చంపక తప్పదట. "నలుగురు రోగుల్ని చంపందే డాక్టరు కాడు" అనే సామెత పై విషయాన్ని చెబుతుంది.

కొందరు ఇతరుల అనుభవాల్ని చూసి నేర్చుకుంటారు. అనుభవంతో ఇతరులు చెప్పిన మాటల్ని విని తమ పనుల్ని చక్కబెట్టుకుంటారు కాని కొందరు ఇతరుల అనుభవాల్ని చూసి నేర్చుకోరు. అనుభవం కలవాళ్లు చెప్పినా వినరు. "తనదాక వస్తేగాని తలనొప్పి బాధ తెలియదు" అన్నట్లుగా తాము స్వయంగా అనుభవిస్తే తప్ప తెలుసుకోలేరు. అలాంటివాళ్ళ స్వభావాన్ని వివరించే సామెతలు :

"తడిస్తేగాని గుడిసె కప్పడు"

"తడిసిగాని గుడిసెకప్పడు తగిలికాని ఎత్తువేయడు"

"తాగితేకాని మొగ్గడు తడిస్తేగాని కప్పడు"

అనుభవం లేక నష్టపోయి ఆ తర్వాత తెలుసుకున్న వాణ్ణి గూర్చి "తడిసిన తర్వాత గుడిసె కప్పినట్లు" అనే సామెత చెబుతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఏదైనా పనిచేయడంతో అనుభవమున్న వాడికి, అనుభవం లేనివాడికి తేడా కనిపిస్తుంది. రోజూ చేసే అలవాటువల్ల పనిలోని మెలకువలు తెలిసి ఉంటాయి. కాబట్టి తడబడకుండా చేయగలడు. అనుభవం లేనివాడు మొదలు పెట్టిన దగ్గరనుంచి తడబాటు పడుతూనే ఉంటాడు. ఏ వస్తువునెలా ఉపయోగించాలో తెలియక తంటాలు పడుతూ ఉంటాడు. ప్రతిదినం తిరుమణి ధరించేవాడికి నామం పెట్టుకోవడం సులభం. కానీ ఏ రోజూ నామ పెట్టనివాడు అవసరార్థమై తిరుమణి పెట్టవలసివస్తే అది సాధ్యమవుతుందా? పుల్లపట్టుకోవడంలోనే అనుభవం లేదని తెలుస్తుంది. "అచ్చం తిరుమణిధారి అయితే పుల్లపట్టడంలోనే తెలుస్తుంది." అనే సామెత పై విషయాన్ని వెల్లడి చేస్తుంది.

కావిడి యొక్క బరువు దాన్ని మోసే వాడికే తెలుస్తుంది. దిగిన వాడికే తెలుస్తుంది నీటిలోతు. అంతే కానీ పైనున్న వాడికి తెలియదు. అలాగే ఏ విషయంలోనైనా దానికి సంబంధించిన అనుభవం ఉన్నవానికే కానీ ఇతరులకు తెలియదని క్రింది సామెతలు వెల్లడి చేస్తాయి.

"మోసే వానికి తెలుసు కావిడి బరువు"

"మునిగే వానికి తెలుసు నీటిలోతు"

నిరంతర అభ్యాసంవల్ల ఏదైనా పని చేయడం సులభం. అభ్యాసం వల్లనే అర్జునుడు చీకట్లో బాణ ప్రయోగం చేశాడు.

"వాసనందనుండు కుడువం గుడువం బటు మారుతాహతిం
జేసి చలించి దీపశిఖ వెచ్చెర బోవుడు భోజనక్రియా
భ్యాసవశంబునంగుడిచి పన్నుగనిట్టుల విద్యలెల్లన
భ్యాసవశంబునం బడయ భారము లేదని నిశ్చితాత్ముడై"[11]

కావున అభ్యాసంవల్ల ఏ కార్యమైన సాధింపవచ్చు అభ్యాసం లేకపోతే చేసినపని కూడా సవ్యంగా ఉండదు. అభ్యాసంలేక ఏదైనా పనిచేస్తే నష్టపోతారని తెలిపే సామెతలు :

"అభ్యాసం లేని రెడ్డి అందలమెక్కితే అటూ ఇటూ అయిందట"
"ఎన్నడూ ఎక్కని రెడ్డి గుఱ్ఱమెక్కితే వెనుకముందయిందట"

---

11. ఆంధ్ర మహాభారతము - 1-5-228 ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖచే ప్రచురితము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కొందరు కొన్ని అలవాట్లకు లోబడితే ఆ అలవాటును వదిలిపెట్టలేరు. అలవాటు ప్రకారం ఆ సమయానికి ఎక్కడున్నా వచ్చి చేరుతారు. ఇలాంటి అలవాటు మంచి విషయాల్లో అయితే నష్టం లేదు. కాని చెడు విషయాల్లో అయితే ప్రమాదకరం. కొన్ని అలవాట్లకు లోనైన వాళ్లను ఆ అలవాట్లను డి మాన్పింపలేమనీ, ఎక్కడ వున్నా సరే ఆ సమయానికి అక్కడికి చేరుకుంటారని వివరించే సామెతలు :

"తినమరిగిన కుక్క వరిచేల్లదోవ పట్టిందట"

"చవి ఎరిగిన కుక్క చావగొట్టినా పోదు"

"అలవాటు పడిన కుక్క ఇంటిని వదలదన్నట్లు"

"అలవాటుపడిన పసరం పాతగాటి చుట్టు తిరిగినట్లు"

ఒక విషయంలో విశేషానుభవమున్న వాళ్లకు తక్కువ అనుభవం కల వాళ్లు సలహాలివ్వబోతే అలాంటి వాళ్లను అపహాస్యం చేసే సామెతలు :

"ఆరుగురు బిడ్డల తల్లికి ముగ్గురు బిడ్డలతల్లి ముక్క నేర్పిందట"

"ఏడుకాన్పులమ్మకు మూడుకాన్పులమ్మ ముక్కనేర్పినట్లు"

## సోమరితనం :

ఉత్సాహో బలవానార్యస్త్యుత్సాహాత్పరం బలమ్
సోత్సాహస్యాపి లోకేఽస్మిన్న కించిదపి దుర్లభమ్[12]

(ఉత్సాహమే మానవునకున్న గొప్ప బలం. ఉత్సాహాన్ని మించిన మరోబలం లేదు. ఉత్సాహం కలవాడు లోకంలో సాధింపలేనిదంటూ ఏమీ ఉండదు.)

ఏపని చేయాలన్నా మనిషికి ఉండవలసింది ఉత్సాహం. అది లేనినాడు శారీరక బలమెంత ఉన్నా, ఇతర పరిస్థితులు అనుకూలించినా నిష్ప్రయోజనమే. ఉత్సాహంతో ముందుకుపోతూ ఉంటే దైవం కూడా అనుకూలిస్తుంది. ఉత్సాహం లేకపోవడం వల్ల మనిషికి సోమరితనం అలవాటు అవుతుంది. అభివృద్ధిని కాంక్షించే వానికి సోమరితనం ఉండరాదు.

---

12. శ్రీమద్రామాయణం : కిష్కింధకాండ - 1-122 శ్లోకం

8)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



సోమరితనం మంచి లక్షణం కాదు. సోమరితనం వల్ల మనిషికెన్నో కష్టాలు వస్తాయి. దుఃఖం పొందాల్సి వస్తుంది. సోమరితనం వల్ల మానవుడి బుద్ధిలో రకరకాల ఆలోచనలు పుట్టి నిరాశానాన్ని కలిగిస్తాయి. "An idle man's mind is a dedevil's workshop" అని ఆంగ్ల సామెత. సోమరితనం మంచిది కాదని తెలిసి కూడా మనిషి దానికి బానిసవుతాడు. శక్తి సామర్థ్యాలు లేని సోమరులు కొందరైతే ఉత్సాహం, ఉత్తేజంలేని సోమరులు మరి కొందరు. సోమరితనం వల్ల ఏ పని చేయటానికి ముందుకురారు. చెప్పిన సమయంలో చేయరు. సక్రమంగా చేయరు. చేద్దాంలే అనుకుంటునే కాలాన్ని వ్యర్థం చేస్తారు. సోమరితనం వల్ల ఏ పనిచేయరు. పని చేయకపోతే తిండి దొరకదు. తిండికోసం దొంగతనంలాంటి అక్రమ మార్గాల్ని అనుసరిస్తారని "ఒళ్లు వంగని వాడు దొంగలలో కలసినాడట" అనే సామెత వివరిస్తుంది.

సోమరితనం ఒక జబ్బులాంటిది అది మనిషిని పట్టి పీడిస్తూ మనిషి మనుగడకే ముప్పు తెస్తుంది. "Idleness is hunger's mother and of theft its first brother" (సోమరితనం ఆకలికి తల్లి దొంగతనానికి అగ్రజుడు) అని ఆంగ్ల సామెత. సోమరులు ప్రతిదానికి "రేపు" అని వాయిదా వేస్తుంటారు. ఏం రోజుకారోజు అది 'రేపు' అవుతుందే కాని నేడు కాదు. పని జరుగదు. ఆ పని ప్రారంభించరు. పూర్తి చేయరు. "Tomorrow is the day on which idle men works" (రేపు అనేది సోమరులు పని చేసేరోజు) అని మరో ఆంగ్ల సామెత. అందుకే ఏ పని చేయాలనుకున్నా వెంటనే మొదలు పెట్టాలిగానీ వాయిదా వేయకూడదంటారు. రేపటి పనిని కూడా ఈ రోజే చేయాలని పెద్దలంటారు.

కొందరు ఇతరులకు సహాయపడటం అటుంచి సోమరితనంవల్ల తమ పనుల్ని కూడా తాము చేసుకోరు. ప్రతిదానికి ఇతరులపై ఆధారపడతారు. ప్రమాదం జరుగుతున్నా సరే చూస్తూ ఊరకుంటారు కానీ ప్రయత్నించరు. ఇతరులెవరైనా చెబితే వాళ్ళనే సహాయపడమంటారే తప్ప తాము మాత్రం చేసుకోరంటూ తెలియ చెప్పే సామెతలు :

"నీ తలమీద తేలున్నదంటే నీ చేతితో కాస్త తీసివేయమన్నాడట"

"నీ ముక్కున చీమిడోయ్ అంటే నీ చేతితో కాస్త తీసివేయమన్నాడట"

ముక్కున చీమిడి చీదలేడంటే ఎంత సోమరిపోతో మరి !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఎవరూ లేకపోతే తమపని తాము చేసుకుంటారు కొందరు. కానీ ఆ సమయంలో ఇతరులు కనిపిస్తే వాళ్ళలో సోమరితనం చోటు చేసుకుంటుంది. అదెంత చిన్నపనైనా చేయటానికి ఉత్సాహాన్ని చూపరు. ప్రతి చిన్నపనికూడా బరువైనట్లు బాధపడిపోతారు. ఆ! వారు చేస్తారులే మనకెందుకు? అనే సోమరితనంతో ప్రతి చిన్నపనిలోనూ కష్టాన్ని చూసేవాళ్ళ స్వభావాన్ని విమర్శిస్తూ "ఎత్తేవాడుంటే ఎకుల బుట్టా బరువే" అనే సామెత పుట్టింది. ఏకులబుట్ట ఏం బరువు ఉంటుంది? అయినా సోమరికదే భారమవుతుందట.

007375

"వేలు చూపిస్తే హస్తం మింగేవారు" కొందరైతే అవకాశాన్ని కల్పించినా సోమరితనం వల్ల ఇచ్చిన అవకాశాన్ని జారవిడచుకునే వాళ్లు మరికొందరు. వెనుకనుంచి ఎవరోఒకరు ముందుకు తోస్తూ ఉండాలి. ఎంతకాలమని అలా తోయగలరు. ఏదో మొదట ప్రయత్నించవచ్చు. అంతేకానీ పని అయ్యేంత వరకు ఇతరులే సహాయపడటం సాధ్యంకాదు. సోమరితనం వల్ల అవకాశం లభించినా ప్రయత్నించక ఇతరులపై ఆధారపడేవాళ్ళ స్వభావాన్ని విమర్శిస్తూ "చెట్టు ఎక్కేవానికి ఎంతదాకా ఎక్కుడు పెట్టగలం" అనే సామెత వెలువడింది.

"కష్టేఫలి" అన్నారు పెద్దలు. కష్టపడితే తప్ప ఏ పనీ జరగదు. ఫలితం దక్కదు. కొందరు సోమరితనం వల్ల ఏ పనిచేయకనే ఫలితం కోసం ఎదురు చూస్తారు. గాలిలో మేడలు కడుతుంటారు. కష్టపడకుండా కేవలం ఫలితాన్ని కోరుకునే సోమరిపోతుల స్వభావాన్ని ఖండిస్తూ "చెరుకా బెల్లంపెట్టు అంటే పెడుతుందా?" అనే సామెత పుట్టింది. చెరుకు బెల్లంగా మారాలంటే ఎంతో శ్రమ అవసరం. ఏ శ్రమా చేయకుండా బెల్లం ఎలా వస్తుంది. కష్టం లేనిదే సౌందర్యాలు సృష్టించబడవని "There are no excellencies without hard Labour" అనే ఆంగ్లసామెత చెబుతుంది.

సోమరితనం కలవారు వీలున్నంతవరకు ఏ కష్టం లేకుండా చూసుకుంటారు. ఒకవేళ పని చేయాల్సి వస్తే ఏ పనిలో అయితే కష్టం ఉండదో అలాంటి పనినే ఎన్నుకుంటారనీ క్రింది సామెత భావం.

"బ్రాహ్మణ పాలేరుతనం చేస్తావా? పల్లకీ ఎక్కుతావా? అంటే పల్లకీ ఎక్కితే ఒళ్ళు కదులుతుంది. బ్రాహ్మణ పాలేరు తనమే చేస్తానన్నాడట"

పల్లకి ఎక్కడంకంటే బ్రాహ్మణులవద్ద పాలేరుతనం చేయడం సులభమన్నమాట!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



## తొందరపాటు/ఆత్రం :-

వినదగు నెవ్వరు సెప్పిన
విని నంతనె వేగపడక వివరింపదగున్
కని కల్ల నిజము తెలిసిన
మనుజుడె పో నీతిపరుడు మహిలో సుమతీ ! 13

ఏ విషయంలో కూడా తొందరపడకూడదు. చేయాల్సిన పనిని గూర్చి క్షుణ్ణంగా పరిశీలించాలి. కార్యసాధనకు కావాల్సిన మెలకువల్ని తెలుసుకోవాలి. లాభనష్టాల్ని బేరీజు వేసుకోవాలి. అన్నీ ఆలోచించి దానివల్ల మేలు జరుగుతుందనిపిస్తే అపుడు ప్రయత్నించాలి. అంతేకానీ "లేడికి లేచిందే పరుగు" అన్నట్లుగా అనుకున్న వెంటనే పని అయిపోవాలనుకోవడం పొరపాటు. తొందరపడి ఏ పనీ చేయరాదనీ తొందరపాటువల్ల ఆపదలు సంభవిస్తాయని భారవి సూక్తి :

సహసా విదధీత న క్రియామవివేక : పరమాపదాంపదమ్
వృణుతే హి విమృశ్యకారిణం గుణలుబ్ధా: స్వయమేవ సంపదః" 14

ఆత్రపడితే అన్నీ అనర్థాలు కలుగుతాయని "ఆత్రపడితే అన్నీ మురుకులే" అనే సామెత చెబుతుంది. తొందరపాటువల్ల మనిషి ఆలోచించడనీ, తొందరపాటు మనిషిని అనాలోచనపరునిగ మారుస్తుందనీ "ఆత్రగాడికి బుద్ధిమట్టు" అనే సామెత వెల్లడి నిస్తుంది. తొందరపాటువల్ల జరగాల్సిన పని కూడా జరుగదనీ, అనుకున్నది జరగటానికి వీలులేదని "ఆత్రపడి ఆవులు మేపితే పొద్దుగుంకుతుందా?" అనే సామెత హెచ్చరిస్తుంది. ఎంత తొందరపడి ఆవులు మేపినా సూర్యుడు ఎప్పుడు అస్తమించాలో అప్పుడే అస్తమిస్తాడు కానీ మనతొందరను బట్టి ముందుగా అస్తమించడు.

ఆత్రపడేవాడు తాను ఆలోచించకపోగా ఎదుటి వాళ్ళను కూడా ఆలోచించనీయడు. ఒకటే తొందర పెట్టేస్తాడు. చిటికెలమీద పని అయిపోవాలంటాడు. పని సక్రమంగా జరగాలనే దానికంటే పని అయిపోవడమే ముఖ్యం. అందుకే తాను తొందర పడడమేగాక అందరినీ తొందర పెట్టేస్తాడు. "ఆత్రగాడు ఒళ్ళో

13. సుమతీశతకం : 100వ పద్యం - సి. వి. కృష్ణా బుక్ డిపో
14. కిరాతార్జునీయం : 2-30 వావిళ్లవారి ప్రతి 1967 ముద్రణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పెట్టేదా? దళ్ళో పెట్టేదా? అన్నట్లు" తొందరపడుతూ ఉంటాడు. ఆత్రగాడిని మించిన ఆత్రగాడు మరొకడు. ఆత్రగాడికంటే ఎపుడూ ముందే ఉంటాడు అని తెలిపే సామెతలు :

"ఆత్రగానికి అవతల పెట్టుదువు గాని నాకు ఒళ్లోపెట్టు అన్నాడట"

"ఆత్రగాడికి ఆకులో పెడితే నాకు బోకిలో పెట్టుమన్నట్లు"

కొందరు ఇతరులు పనిచేస్తుంటే చూస్తూ ఉంటారు. కొద్ది సేపట్లో పని అయిపోతుందని తెలుసుకానీ పని అయిపోయేంతవరకు ఓపిక పట్టలేరు. అయ్యే పని ఎలాగూ అవుతుంది. ముందుగా నా పని చూసేయ్యమంటారు. పనవుతూ ఉండగానే ఎదుటివాళ్ళను తొందరపెట్టే వాళ్ళ స్వభావాన్ని విమర్శించే సామెత :

"అయ్యే పూజ అవుతూ ఉండనీ ఊదేశంఖం ఊదేస్తాం"

శంఖం ఊదేస్తే పూజ అయిపోయిందని అర్థం. ఇక తర్వాత కార్యక్రమం మొదలు పెట్టవచ్చునన్నమాట.

కొందరికి ఏదైనా పని అయ్యేంతవరకు ఓపిక ఉండదు. కొద్దిసేపు ఓపిక పడితే ఫలితం గురించి వాళ్ళకే తెలుస్తుంది. అయినా ఆలస్యాన్ని భరించలేక ఎదుటి వాళ్ళను ఏమవుతుందని తొందరపెట్టేస్తుంటారు. అలాంటి వాళ్ళను విమర్శించే సామెతలు :

"తినబోతూ రుచులడిగినట్లు"

"కుడువబోతూ కూరల రుచి అదగడమెందుకు ?"

"కుడువబోతూ కూరల రుచి అడిగినట్లు"

ఏదైనా ఒకపనిని గురించి ముందు జాగ్రత్త తీసుకోవడంలో తప్పులేదు. కానీ అనవసర విషయాల్లో అనవసరమైన జాగ్రత్త తీసుకుంటూ, హడావిడి చేస్తూ అందరిని తొందరపెడుతూ ఉంటారు. ఎపుడో నెలరోజుల తర్వాత ఊరెళ్లాలి అనుకుంటే ఇప్పటినుండే పెట్టెతీసి బట్టలు సర్ది హంగామా చేస్తూ ఉంటారు. అనవసరంగా ముందుగనే ఆత్రపడే వాళ్ళ స్వభావాన్ని విమర్శించే సామెతలు :

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar.

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఏరు ఏడామడ ఉండగానే చెప్పులు చేతపట్టుకొన్నట్లు"

"ఏరు ఏడామడ ఉండగానే చీరవిప్పి చంకన పెట్టుకొన్నదట"

"ధర్మపురిలో దొంగలించబోతూ ధార్వాడనుండి వంగుని పోయాడట"

తొందరపాటు తనం వల్ల చెప్పులు వేసుకున్న సౌకర్యము, చీరకట్టిన సింగారము, నిలిచినడిచే సౌలభ్యమూ కోల్పోవడం జరిగింది.

## అమాయకత్వం :-

ఏ విధమైన పుస్తక జ్ఞానం కానీ, లోకజ్ఞానం లేనివాళ్లు అమాయకంగా కనిపిస్తారు. ఏది మంచీ, ఏది చెడూ, ఏది అసత్యం అని ఏమీ తెలియదు. తమకేమీ తెలియక పోవడంవల్ల ఇతరులేమి చేయమంటే అదే చేస్తారు. దానివల్ల కలిగే నష్టాన్ని, లాభాన్ని భరిస్తారు. అమాయకత్వంవల్ల ఇతరుల మోసాన్ని గుర్తించలేరు. అలాంటి వాళ్ళ స్వభావాన్ని "తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్లు" అనే సామెత వెల్లడి చేస్తుంది.

అమాయకత్వం వల్ల ఏ చిన్నపని కూడా చేయలేరు. తనపని తాను చేసుకోక పోవడమేగాక ఇతరులకు ఎలాంటి పని కూడా చేసి పెట్టలేరు. అమాయకత్వంలో అతి చిన్న పనిని కూడ చేయలేరని "వెన్నపెట్టితే మింగలేడు వేలు పెడితే కఱవలేడు" అనే సామెత విమర్శిస్తుంది. వెన్ననోట్లో పెడితే పసిపిల్లాడైనా చెప్పకుండానే మింగేస్తాడు. ఒక్కొక్కసారి వెన్నతోపాటు వేలును కూడా కొరికేస్తాడు. వెన్న పెడితేనే మింగలేని అమాయకుడు ఇక వేలు ఎలా కొరకగలడు.

అమాయకత్వంవల్ల ఎవరు మంచి వాళ్లో, ఎవరు చెడ్డవాళ్ళో తెలుసుకోలేరు లోకంలోని వాళ్ళందరూ మంచివాళ్ళే అని భావిస్తారు. అందరూ మంచి వాళ్ళు కావడంవల్ల తమకేమి మోసం చేయరని అందరిని నమ్మి ప్రవర్తిస్తుంటారు. తమ అమాయకత్వంలో లోకమంతా మంచిదని నమ్మి ప్రవర్తించేవాళ్ళ స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"టెంకాయ చెట్టుకు మడిగుడ్డ కట్టగానే దొంగకడ్డమా ?"

"మామిడి చెట్టుకు మడిగట్టి దొంగలు ఎక్కలేరు అన్నట్లు"

మామిడిచెట్టుకు కానీ, టెంకాయ చెట్టుకు కానీ మడిగుడ్డ కట్టినంత మాత్రాన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



దొంగ ఊరుకుంటాడా? కాయల్తోపాటు దాన్నికూడా ఎత్తుకొని పోగలడు. అమాయకంగా ఉంటే నష్టపోక తప్పదు.

అనాలోచితంగా నిష్ప్రయోజనమైన పనిచేసేవాళ్ళ స్వభావాన్ని "పుల్లయ్య వేమారం వెళ్ళి వచ్చినట్లు" అనే సామెత విమర్శిస్తుంది. భర్త భార్యతో మాట్లాడుతూ వేమారం వెళ్ళి రావాలని చెబుతుంటే విన్నకొడుకు పుల్లయ ఏ పనిమీద వెళ్లాలి? చేయాల్సిన పనేమి? అని తండ్రిని అడక్కుండానే పొద్దునలేచి వేమారం వెళ్ళి తిరిగి వచ్చాడట. తండ్రి తల్లితో 'వేమారం వెళ్ళాలి వెళ్ళనే లేదు' అని అంటూంటే పుల్లయ్య 'నేను వెళ్ళొచ్చాను' అన్నాడట. పుల్లయ్య వేమారం వెళ్ళి ప్రయోజనం లేదు. పైవిధంగా ప్రవర్తించేవాళ్ళ స్వభావాన్ని క్రింది సామెతలు విమర్శిస్తాయి.

"తంబళ్ళ అక్కయ్య మోదుమూడి వెళ్ళనూ వెళ్ళాడు తిరిగిరానూ వచ్చాడు"
"వెంకయ్య వేమవరము వెళ్ళనూ వెళ్ళాడు రానూ వచ్చాడు"
"సింగన్నా! అద్దంకి పోయినావా? అంటే పోనూపోయా, రానూవచ్చా అన్నాడట"

## లోకువ:-

ధనహీనుడూ, బలహీనుడూ లోకంలో అందరికీ లోకువ. కులం తక్కువ వాళ్ళను చూస్తే ఇతరులకు చులకన భావం ఏర్పడుతుంది. ఆపదల్లో ఇరుక్కున్నవాళ్ళూ ఇతరులకు లోకువే. ఇతరుల్ని చులకన భావంతో చూసేవాళ్ళ స్వభావాన్ని వ్యక్తం చేసే సామెతలు ప్రజల వ్యవహారంలో ఉన్నాయి.

"ధనం మూలమిదం జగత్" అని కదా సూక్తి. ధనవంతుడు లోకంలో అందరినీ చులకనగా చూస్తాడు. గొప్ప కులం కలవాళ్లూ, గొప్ప వంశం కలవాళ్లూ, విద్వాంసులూ- వీళ్లందరూ ధనవంతునికి బానిసలని అంటాడు వేమన:

> "కులము కలుగువారు గోత్రంబు కలవారు
> విద్యచేత విఱ్ఱవీగువారు
> పసిడి కల్గువాని బానిసకొడుకులు"[15]

---

15. వేమన పద్యరత్నాకరము : 307 వ పద్యం - బాలసరస్వతీ బుక్ డిపో - 1983

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పేదవానికి ఇతరుల్ని ఆశ్రయిస్తే తప్ప జీవనం గడవదు. ఇతరుల్ని ఆశ్రయించి ఇతరులపై ఆధారపడి జీవించేవాడు అందరికీ లోకువే. పేదవాడి స్థితి అలా ఉంటే వాని భార్యను గురించి ఇక చెప్పనక్కరలేదు పేదవాడి భార్య వీధిలోని వాళ్లందరకు లోకువని క్రింది సామెతలు వివరిస్తాయి.

"పేదవాని వెంట పడెనమ్మా జోరీగ"

"పేదవాణ్ణి చూస్తే పేలాలూ త్రుళ్లుతాయి"

"బీదవాడు బిచ్చపువాడికి లోకువ"

"పేదవాని పెళ్లాం వాడకెల్ల లోకువ"

"పేదవాని పెళ్లాం వాడకెల్లా వదినె"

ఎంతటి బలవంతుడైనా ఆపదలో చిక్కుకుంటే ఇతరులు అతన్ని లోకువగా చూస్తారనీ, అలాంటివాళ్ళ స్వభావాన్నిబట్టి పుట్టిన సామెతలు :

"ఏనుగు రొంపిలో కూరుకుపోతే కాకికి కూడా లోకువే"

"బురదలో దిగబడ్డ ఏనుగును బొంతకాకి అయినా పొడుస్తుంది"

"పండ్లూడిన కుక్కను పసరమైనా కరచును"

పండ్లూడి పోవడంతో కుక్క చులకనై పోతుంది. అందుకే పసరం ఎదురు తిరిగి కరిచింది. అధికారంలో పదవిలో ఉన్నపుడే అందరూ వంగి సలాములు కొడతారు. వాళ్లే అధికారం, పదవి తొలగిపోతే అందరికీ లోకువైపోతారు. అంతవరకు తమకు విధేయులైనవాళ్లే అవిధేయులుగా మారుతారు. అలాంటి సందర్భంలో పై సామెతను ప్రయోగిస్తారు. "కర్రలేనివాణ్ణి గొర్రెయినా కరుస్తుంది" అనే సామెత కూడా పై సామెతలాంటిది.

మేనమామ కూతుర్ని చేసుకోవడం మేనరికమంటారు. మేనరికమంటే కొందంకి ఇష్టం ఉండదు. మేనమామ మాత్రం పిల్లనిస్తానంటూ అబ్బాయి యింటి చుట్టూ తిరుగుతూ ఉంటారు. అందువల్ల పిల్ల తండ్రిని అబ్బాయివాళ్లు చులకనగా చూస్తారు చులకన భావంతో అమ్మాయి వరస కాదనీ చెప్తారట.

"కోరి పిల్లనిస్తామంటే కులం తక్కువ అన్నట్లు"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"పిలిచి పిల్లనిస్తామంటే కులం తక్కువ అన్నట్లు"
"పిలిచి పిల్లనిస్తామంటే (కన్ను) మెల్ల అన్నాడట"
"పిలిచి పిల్లనిస్తామంటే అల్లునికి మనోరోగం లేసెనంట"

మేనత్త కొడుకంటే అమ్మాయిలు చులకనగా చూస్తారట. "ఉంగ్రాళ్ళు ఒకపిండివంటేనా మేనత్త కొడుకూ ఒక మొగుడేనా" అని మేనబావను చులకనగా మాట్లాడతారని పై సామెత తెలుపుతుంది.

మగపిల్లలు లేని తల్లిదండ్రులు అల్లుని ఇల్లరికం ఉంచుకుంటారు. "ఇల్లరికం అల్లుడు ఇంటిల్లపాదికి మొగుడు" అని చెప్పినా ఇల్లరికం ఉంటే అల్లుడు చులకనయిపోతాడని సామెతలు తెలియజేస్తాయి. అల్లుడనే గౌరవం మొదట్లో ఉన్నా పోనూ పోనూ అల్లునికి గౌరవముండదు. ఇంటి పనులన్నీ అల్లుని చేతనే చేయిస్తారు. ఇల్లరికపు అల్లుడంటే చులకనగా చూస్తారు. అందుకే;

"ఇల్లరికం కన్నా మాలరికం మేలు" అనే సామెత పుట్టింది. అల్లుడంటె ఎంత చులకన భావమో!

"కట్టేలేదు కంపాలేదు, కాచిపోయనీక్లూ లేవు పదవోయి అల్లుడా! నూతి గట్టుకు" అనే సామెత చెబుతుంది.

తల్లి ఉంటే ఆడబిడ్డకు పుట్టింటిలో సకల మర్యాదలు జరుగుతాయి. నెలల తరబడి పుట్టింట్లో ఉన్నా ఆమె గౌరవానికి లోపం ఉండదు. కానీ తల్లి లేకపోతే ఒక దినం కూడా ఆమె పుట్టింట ఉండలేదనీ, చీరసారెలకూ, చివరకు భోజనం కూడా సరిగా పెట్టరని క్రింది సామెత చెబుతుంది:

"అయ్యో వదినా! అంతకుముందు వచ్చిన అన్నబంతిన తిందువు
ఇంతకుముందు వచ్చిన ఏరాలి బంతిన తిందువు, ఇప్పుడేలాగు?
ఎలుకపొయ్యి ఎత్తుక పోయిందే"

ఇంటికి వచ్చిన ఆడపడచును కోడలు అలా మాట్లాడిందంటే ఆడపడచు అంటే ఎంత లోకువో మరి.

పిల్లలతో అతిచనువుగా మాట్లాడితే పిల్లలు చులకనగా చూస్తారనీ, పెద్దలంటే భయభక్తులుండవనీ, అతిచనువు చేయడం వల్ల చులకన భావం ఏర్పడి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



చెప్పిన మాట వినరని "చనవిస్తే చంక కెక్కినట్లు", "చంక కెక్కినపిల్ల చచ్చినా దిగదు" అనే సామెతలు వెల్లడి చేస్తాయి.

భార్యను గౌరవించడం భర్త ధర్మం. తన సర్వస్వం భర్తే అని నమ్ముకున్న భార్యను భర్త చులకనగా చూస్తే మిగిలిన ఇంట్లోవాళ్లకు, చివరకు బయటి వాళ్లందరికీ ఆమె లోకువై పోతుందని తెలిపే సామెతలు :

"మొగుడు ముండా! అంటే ముష్టివాడుకూడా ముండా అంటాడు"

"ఇంటివానికి చులకనైతే బయటి వానికి చులకన, బానిసవానికి చులకన"

"ఇంటివాడు 'ఇలో' అంటే పొరుగువాడు 'పొలో' అన్నాడట"

"ఇంటివాడు 'ఒసే' అంటే బయటివాడు 'తసే' అంటాడు."

"ఇంటివారు వేలు చూపితే బయటివారు కాలు చూపుతారు"

భర్త బయట ఎంత అధికారం చలాయించినా, క్రింది ఉద్యోగులను గడగడలాడించినా ఇంటికి వస్తే చాలు అతని బడాయి తగ్గిపోతుంది. ఆఫీసులో అందరికీ పులిలా కన్పించినా ఇంటికి వస్తే భార్యదగ్గర పిల్లిలా మారిపోతాడని వివరించే సామెతలు :

"ఇంట్లో పిల్లి బయట పులి"

"ఊరంతా నాన్నకులోకువ - నాన్న అమ్మకులోకువ"

"అరవై ఊళ్ళ అములుదారు ఆలికి దాసుడు"

"ఎంతవారలైనా కాంత దాసులే"

"ఇంటికి దీపం ఇల్లాలు" అన్నారు. ఇంట్లో ఉండేనే స్త్రీకి ఎంతో గౌరవం ఉంటుంది. ఎన్ని రంగాల్లో ఎంత ముందంజ వేసినా స్త్రీ ఇష్టం వచ్చినట్లు తిరగడం మంచిది కాదనీ, గడపదాటి బయటికి వెళ్తే అందరూ చులకనగా చూస్తారని :

"తిరిగి ఆడది తిరగక మగవాడు చెడును"

"ఇల్లు దాటిన ఆడది లోకానికి లోకువ" అనే సామెతలు వెల్లడిచేస్తాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



భర్త అండలేకపోతే భార్యలోకువ అయినట్లే భార్యలేని భర్త కూడా అందరికి లోకువని "అదవ ఎవరు అంటే అలు సచ్చినోడంట" అనే సామెత చెబుతుంది.

యజమానికానీ, అధికారికానీ కఠినంగా ప్రవర్తించకపోతే క్రిందివాళ్ళకి చులకనై పనులు సక్రమంగా చేయించలేడని "రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ళతో నడుస్తుంది." అనే సామెత చెబుతుంది.

"స్థానబల్మికాని తన బల్మికాదయా" అని వేమన చెప్పినట్లుగా స్థానభ్రంశం చెందడంవల్ల ఎంతటి అధికారం కలవాడైనా ఇతరులకు లోకువై పోతాడని వివరించే సామెతలు :

"ఒక ఊరి కాపు ఇంకొక ఊరి మాల"

"ఒక ఊరి రాజు ఇంకొక ఊరి రైతు"

"ఒక ఊరి రెడ్డి ఇంకొక ఊరికి పసులపోలుగాడు"

## ఆలస్యం :-

"రేపటి పని ఈరోజే చేయాలి" అన్నారు పెద్దలు. రేపు చేయాల్సిన పనిని గూర్చి ముందుగా ఆలోచిస్తే ఏ ఆటంకం లేకుండా సాగిపోతుంది. ముందు జాగ్రత్తవల్ల ఆలస్యం జరుగకుండా నిర్ణీత సమయంలో పని పూర్తవుతుంది. ఆలస్యం చేయడం మంచి లక్షణం కాదు "ఆలస్యాదమృతం విషం" అని కదా ఆర్యోక్తి. ఏ పని ఎపుడు చేయాలో అపుడే చేయడం మంచివాళ్ల లక్షణం.

ఆలస్యమనేది మానవుని అలసత్వానికీ, సోమరితనానికీ ప్రతీక. కొందరు సమయాసమయాల్ని పాటించకుండా ప్రతిదానికి ఆలస్యంగా చేస్తుంటారు. నిత్య జీవితంలో నిద్రనుంచి లేచినా, భుజించినా, పడుకున్నా, మరేపని చేసినా ఆలస్యంగానే చేస్తుంటారు. ఎవరు హెచ్చరించినా చేద్దాంలే, చూద్దాంలే అనుకుంటారే కానీ వెంటనే ప్రారంభించరు. అలా గంటలు, దినాలు, నెలలు గడిపేస్తారు. అందుకే "అదుగో అంటే ఆరునెలలు" అనే సామెత పుట్టింది.

మరికొందరు ఎదుటివాళ్ల అవసరాన్ని గుర్తించక తమ సహజ ధోరణితోనే ఆలస్యం చేస్తుంటారు. తమ ఆలస్యంవల్ల ప్రమాదం జరుగుతుందని తెలి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



సినా తొందరగా చేయడానికి ప్రయత్నించరు. దొంగలు పడి దోచుకపోతున్నారు రండని జెట్టిని పిలిస్తే, వాడు తన వేషధారణ పూర్తి చేసుకొని వచ్చేసరికి దొంగలు ఊరంతా దోచుకొని పోయారట. సమయా సమయాల్ని గుర్తించక అనవసరమైన ఆలస్యం చేసేవాళ్ల స్వభావాన్ని వెల్లడి చేసే సామెతలు :

"జెట్టి సింగారించుకొనేటప్పటికి పట్నం కొల్లబోయింది"

"చీర సింగారించేటప్పటికి పట్నం చూరబోయిందట"

"దొంగలు పడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్లు"

స్త్రీలు కొన్ని సందర్భాల్లో బాగా ఆలస్యం చేస్తుంటారనీ పెళ్లిపేరంటాలకు పోయేటపుడు ముస్తాబుతో కాలయాపన చేస్తుంటారనీ, "చీర సింగారించేసరికి ఊరుమాటుమణిగింది" అనే సామెత చెబుతుంది.

కొన్ని సందర్భాలలో కొందరు అనవసరంగా ఆలస్యం చేస్తుంటారనీ, అలాంటి సందర్భాల్ని పురస్కరించుకొని క్రింది సామెతలు పుట్టాయి :

"కూడు ఉడికిన వెనుక పొయ్యి మండును"

"అన్నం ఉడికినాక పొయ్యి మండినట్లు"

"వంట ముగిసిన తర్వాత పొయ్యి మండుతుంది"

"గతజలసేతు బంధనం"

కొందరు ముందు జాగ్రత్త లేకపోవడం వల్ల ఏ పనైనా సకాలంలో చేయక నష్టపోతారు. నష్టపోయిన తర్వాత జాగ్రత్త వహిస్తారు. ప్రమాదం జరిగినాక జాగ్రత్తపడి లాభంలేదు. అలాంటి వాళ్ల స్వభావాన్ని విమర్శిస్తూ పుట్టిన సామెతలు :

"చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు"

"కులంచెడ్డ వెనుక బుద్ధి వచ్చినట్లు"

"మగడు చచ్చిన తర్వాత ముండకు బుద్ధి వచ్చినట్లు"

చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నా, కులం చెడ్డ తర్వాత బుద్ధి వచ్చినా,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



మగడు చచ్చిన తర్వాత ప్రవర్తనలో మార్పు వచ్చినా ఫలితం శూన్యమే కదా! చెప్పిన సమయంలో కాక మరెప్పుడో ఆలస్యంగా పనులు చేసేవాళ్ళ స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"మందుకు పోయినవాడు మాసికానికి వచ్చినట్లు"

"అగ్నికి పోయినమ్మ ఆరునెలలు గర్భమై వచ్చినట్లు"

"విత్తనాలకు పోయిన రెడ్డి ఓదె ఎత్తగా వచ్చినాడట"

పై సామెతలు అతిశయోక్తిగా కన్పించినా ఎక్కువ ఆలస్యంగా పనులు చేసే వాళ్ళ స్వభావాన్ని వ్యంగ్యంగా విమర్శిస్తాయి.

కొందరు ఎంతముందుగా బయలుదేరాలనుకున్నా ఏవో పనులు చేసుకుంటూ తీరా బయలుదేరే సమయానికి ఆలస్యం చేస్తూ ఉంటారు. ఎంత ముందుగా జాగ్రత్త పడినా అయ్యే ఆలస్యం ఎలాగు చేస్తూ ఉంటారని "ఎంత పొద్దుండగనే లేచినా తుమ్మగుంట వద్దనే తెల్లవారింది" అనే సామెత వెల్లడి చేస్తుంది. తొందరగా పొలానికి వెళ్లాలని ముందుగా లేచినా తీరా బయలుదేరేసరికి మామూలు సమయమే అవుతుందట. తుమ్మగుంటకు బదులు ఆయాప్రాంతాల్లో వేరే వేరే ప్రదేశాల పేర్లని వాడడం ఉంది.

"ఏయూళకాడ వేసినా చింతమాకులోళ్ల ఊరుకాడ తెల్లారేనంట"

"ఏవేళపుడు లేచినా రాళ్ళోంక కాడ్నే తెల్లవారినట్లు"

ఏదైనా ప్రమాదంలో ఉన్నపుడు వెంటనే చేతనైన సహాయం చేసి కాపాడాలి కానీ నిదానం చేకూడదు. పిల్లబావిలో పడిందంటే వెంటనే బయటికి తీసే ఏర్పాట్లు చూడాలి కానీ ఆలస్యం చేయకూడదు. కానీ కొందరు ఇతరులు ప్రమాదంలో ఉన్నాసరే మాములుగా వాళ్లెపుడు ఆలస్యం చేసినట్లుగానే చేస్తుంటారు. అలాంటివాళ్ళ స్వభావాన్ని "పిల్లబావిలో పడ్డదిరా అంటే ఉండు అంబలి తాగివస్తానన్నట్టు" అనే సామెత చెబుతుంది అవతలివ్యక్తికి ప్రాణం పోతుంటే తిథివారనక్షత్రాలు చూడాలని ఆలస్యం చేసే వ్యక్తిని "ప్రాణం మీదికి వచ్చినపుడు పంచాంగం చూచి మందు పోస్తారా?" అనే సామెత విమర్శిస్తుంది.

కొందరు "గూట్లో దీపం నోట్లో కబళం అన్నట్టు" ఎపుడెపుడు తిందామని తొందరపడితే మరికొందరు తిండి దగ్గర కూడా చాలా ఆలస్యం చేస్తుంటారని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"అందరూ కుంచాల దగ్గరకు వెళ్లేవరకు మేము కంచాల దగ్గరకైనా వెళ్ళలేమా" అనే సామెత వెల్లడి చేస్తుంది. ఆకలి తీర్చుకోవడానికి సమయానికి తిన కుండా ఆలస్యం చేయడం అనవసరం. అనారోగ్యకరం కూడా!

**అతిగారాబం -**

"అతి సర్వత్ర వర్జయేత్" అని ఆర్యోక్తి. ఏ విషయంలోనూ అతిగా ఉండటం మంచిది కాదు. అతిగా ప్రవర్తించడం అనర్థదాయకం "అతిస్నేహ పరిష్వంగా ద్వర్తిరార్ద్రాపి దహ్యతే" (రామాయణం - కిష్కింధ 1-115) అతి స్నేహంవల్ల దీపంలో వత్తి తగలబడిపోతుంది. అలాగే అతిగా ప్రవర్తించడం వల్ల మానవుడు కూడా నశించిపోతాడని భావం.

సాధారణంగా తల్లిదండ్రులు తమ సంతానంపట్ల మమకారాన్ని కలిగి ఉంటారు. పిల్లలపై మమకారం ఉండవచ్చు. పిల్లల్ని గారాబంగా పెంచవచ్చు. కానీ గారాబం చేయడానికి కొంత పరిమితి ఉంటుంది. అతి గారాబం చేయడం వల్ల పిల్లల్ని పాడుచేసినవాళ్లవుతారు. అతి గారాబంతో తామేం చేస్తున్నారో కూడా మరచిపోయి ప్రవర్తిస్తారు. తాము చేసే పనులవల్ల బిడ్డకు బాధ కలుగుతుందని కూడా భావించరు. పుట్టిన బిడ్డకు అతిగారాబంవల్ల బరువుకు మించిన పనులు చేసేవాళ్ల స్వభావాన్ని విమర్శించే సామెతలు

"అబ్బురాన బిడ్డ పుడితే గడ్డపారతో చెవులు కుట్టుతాను అన్నాడట"

"గారువాల బిడ్డకు గడ్డపారతో చెవులు కుట్టి సలికేపారలు తగలేసిందట"

"అబ్బురాన అబ్బాయి పుడితే ఆముదముతో ముడ్డి కడిగిందట"

ఎంత గారాబం అయితే మాత్రం గడ్డపారతో చెవులు కుడితే బిడ్డ భరించగలడా? సలికెపారలు తగిలిస్తే ఆ బరువును మోయగలడా? బిడ్డపై ఎంత ప్రేమ ఉన్నా ఏ పని ఎలా చేయాలో దాన్ని అలాగే చేయాలికాని మరోలా చేయరాదు. నీళ్ళతో కడిగితే శుభ్రమవుతుంది కానీ ఆముదంతో కడిగితే కల్మషం పోతుందా?

పిల్లలపై అతిగారాబాన్ని చూపించడంవల్ల తల్లిదండ్రుల మాటల్ని వినరు. పిల్లలు ఏం కావాలంటే అది యివ్వడం మంచిదికాదు. ఏది మంచి, ఏది చెడ్డా అనేది తల్లిదండ్రులకు తెలుసుకాని పిల్లలకు తెలియదు. అందువల్ల పిల్లలకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



మంచి మాటలు చెప్పి మంచిమార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులది. కాని అతిగారాబం చేయటంవల్ల, పిల్లలు చెప్పినట్లే వినడంవల్ల పిల్లలు ఇష్టం వచ్చి నట్లుగా ప్రవర్తిస్తారు. అలాంటివాళ్ల స్వభావాన్ని "ఆడింది ఆట పాడింది పాట" అనే సామెత వివరిస్తుంది.

కొందరు పిల్లల్ని అతిగారాబంగా పెంచటంతోపాటు బలిష్ఠంగా ఉండాలని రకరకాల ఆహారపదార్థాలు తినిపిస్తూ ఉంటారు. తిండి పెట్టడంలో అందులో మంచి పదార్థాల్ని పెట్టడంలో తప్పులేదు తిండిపెట్టి బలవంతుల్ని చేయటంతో పాటు పనిపాటలు కూడా నేర్పించాలి. తిన్న తిండి ఒంటికి పట్టాలన్నా శరీరానికి వ్యాయామం కూడా అవసరం. అయితే అతి గారాబం చేసేవాళ్లు పిల్లల్ని ఏ పని చేయనీయరు. పనిచేస్తే ఎక్కడ సన్నబడిపోతారో అని పిల్లలు చేయాల్సిన పనుల్ని ఇతరులతో చేయించడమో లేక తామే చేయడమో కనిపిస్తుంది. అలాంటి వాళ్ల స్వభావాన్ని తెలిపే సామెతలు :

"కుక్కను గుఱ్ఱంవలె సాకి దొంగవస్తే రెడ్డి మొరిగినాడట"

"కుక్కను పందివలె పెంచి దొంగవస్తే ఆలుమగలే మొరిగినారట"

కుక్కను పెంచేది దొంగల్ని పట్టుకోడానికి కదా! లేకపోతే నిరర్థకమే.

అతిగారాబంతో పనిపాటలు చేయనీయకుండా పిల్లల్ని పెంచడం వల్ల పిల్లలు పనిపాటలు చేయక సోమరి పోతులవడమేకాక, మదించి యిష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారంటూ

"ఒక్క కూతురు అని వరి అన్నం పెడితే మిద్దెక్కి మిండగాళ్ళను పిలిచిందట"

అనే సామెత హెచ్చరిస్తుంది. అందువల్ల పిల్లలు చెడిపోయేటట్లుగా అతిగారాబాన్ని చూపడం మంచిది కాదు.

మతిమరుపు :-

ప్రతివాడు ఎప్పుడో ఒకప్పుడూ మతిమరుపు పనులు చేస్తూనే ఉంటాడు. ముఖ్యంగా అలవాటులేని విషయాల్లో మతిమరుపు కనిపిస్తూ ఉంటుంది. ఎప్పుడూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



గొడుగు తీసికొని వెళ్లే అలవాటు ఉండదు. ఏదైనా పనిమీద వెళ్తుంటే వర్షమొస్తే గొడుగు పట్టుకెళ్తారు. కాని తిరిగి వచ్చేటప్పుడు వర్షం లేకపోతే గొడుగుపెట్టిన చోటే మరచివస్తారు. కొందరు ఎప్పుడూ మతిమరుపు పనులు చేస్తూంటారు. ఒక వస్తువును ఎక్కడో పెడతారు. పెట్టినచోటు మరచిపోయి దానికోసమే ఎక్కడెక్కడో వెదకుతారు. తీరా చూస్తే అది వాళ్లకు దగ్గర్లోనే, అందుబాటులోనే ఉంటుంది. ఒకచోట ఒక వస్తువును పెట్టి మరొకచోట దానికోసమై వెతికేవారిని విమర్శించే సామెతలు ;

"చంకలో పిల్లనుంచుకొని ఊరంతా వెతికినట్లు"

"ఉయ్యాల్లో పిల్లను పెట్టుకొని ఊరంతా వెదికినట్లు"

కొందరు మాటల్లో పడితే ఇతర విషయాల్ని మరచిపోతారు. అందులో ఆడవారు మరీను. నలుగురమ్మలు కలిస్తే సరి. వచ్చిన పని మరచిపోయి లోకాభిరామాయణంలో మునిగిపోతారు. ఎంత ముఖ్యమయిన పనైనా సరే మాటల్లో పడి మరచిపోతారంటూ "మాటల్లో పడి మగనిని మరచినట్లు" అనే సామెత వెలువడింది. మగనినే మరచిపోయిందంటే ఎంత మతిమరుపో చెప్పనక్కరలేదు.

సంబరంలో పడిపోయిన పెండ్లికొడుకు పెండ్లికూతురు మెడలో తాళి కట్టడం మరచిపోయాడని "పెండ్లి సందడిలో పుస్తె కట్టమరచాడట" అనే సామెత విమర్శిస్తే, పెండ్లి సమయంలో బాజాల సంబరంలో పడిపోయిన పురోహితుడు ముఖ్యమైన పనైన మంగళసూత్రాన్ని కట్టించడం మరచిపోయాడని "బాజాల సందడిలో మంగళసూత్రాన్ని మరచాడట" అని మరో సామెత విమర్శిస్తుంది. ఇతరమైన సంతోషంలో పడిపోయి అతి ముఖ్యమైన విషయాన్ని మరచిపోయే వాళ్లను విమర్శించే సామెతలు పై రెండు.

కొందరు అతి స్వల్ప విషయాల్ని ప్రతినిత్యం చేసే పనులైనా సరే మరచిపోతారు సాధారణంగా అలాంటి వాటిని మరచిపోవడానికి వీల్లేదు.

"నీళ్ళ ఛాయకు పోయినచోట ముడ్డిమరచిపోయి వచ్చినాడట"

"బయటికి పోయినచోట గుడ్డ మరచివచ్చినట్లు" అనేవి మతిమరుపు వాళ్లని గూర్చి అతిశయోక్తిగా చెప్పే సామెతలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కొందరు ఏ పనిచేసినా వెంటనే మరచిపోతూ ఉంటారు. ఏమడిగినా సరే నాకు గుర్తులేదనే అంటారు. ఎన్నిసార్లు అడిగినా గుర్తురాదనే అంటారని తెల్పే సామెత :

"చెంబు ఎక్కడపెట్టి మరచినావురా అంటే నీళ్ళ ఛాయకూర్చున్న చోటికి ఇటు అన్నాడు. నీళ్ళఛాయ ఎక్కడ కూర్చున్నావు అంటే చెంబు పెట్టిందానికటు" అన్నాడట.

మొత్తంమీద ఎన్నిసార్లు అడిగినా చెంబు ఎక్కడ పెట్టాడో మాత్రం గుర్తుకు రాలేదట.

"మతిమరపుతో నీళ్ళలోబడి ఈదను మరచినట్లు" అనే సామెత ప్రమాదంలో కూడా మతిమరపును వీడరని చెబుతుంది.

కొందరు చేసిన పని సక్రమమే అయినా మతిమరవుతో అయ్యో! పొరపాటు చేశాము అని బాధపడుతూ ఉంటారు. అలాంటివాళ్లని విమర్శించే సామెతలు :

"మరచిపోయి మజ్జిగలో చల్లపోశాను అన్నట్లు"
"మరచిపోయి మజ్జిగలో చేమిరి వేసినట్లు"
"మరచిపోయి చూరుబొట్టులో మజ్జిగ పోసినన్నట్లు"

మతిమరపుతో చేసినా లాభమేకాని నష్టంకాదు.

## స్వార్థం :

"పరోపకారార్థమిదం శరీరం" అనే సూక్తి ననుసరించి తమ సర్వస్వాన్ని అర్పించిన త్యాగధనులు ఎందరో కనిపించినట్లే తమను గూర్చి, తమ వాళ్లను గూర్చి ఎప్పుడూ ఆలోచించే స్వార్థపరులూ ఉంటారు. ఏం చేసినా, ఏం మాట్లాడినా తమకు వచ్చే లాభమేమి? అనే ఆలోచననే తప్ప ఇతరులకు సహాయ పడదామనే తలంపు ఉండదు.

స్వార్థపరులు సమాజానికి చీడపురుగుల్లాంటివాళ్లు. తమ స్వార్థం కోసం ఇతరుల్ని బలి చేస్తారు. తాము బాగుంటే చాలు ఇతరులేమయితే మాకేం అనుకుం



CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



టారు. స్వార్థపరులు మంచీ, చెడ్డలీ్న పాపపుణ్యాల్ని పాటించరు. తాము, తమ వాళ్లూ అనే పరిధిని ఏర్పరచుకుంటారే తప్ప ఇతరులను గూర్చి పట్టించుకోరు.

"తనకుమాలిన ధర్మం మొదలు చెడ్డబేరము" కదా అని తాను బాగుపడా లనుకోవడం తప్పుకాదు. అది వ్యక్తిగత స్వార్థం. దాంతోపాటు తన చుట్టూ ఉన్నవాళ్లనూ, సమాజాన్ని, దేశాన్ని గురించి ఆలోచించే స్వభావం కూడా ఉండాలి. అలాకాక కేవలం వ్యక్తిస్వార్థంతో తన ప్రయోజనం కోసం ఇతరుల్ని నష్టపెట్టకూడదు.

తమ స్వార్థం కోసం కొందరు ఇతరుల్ని ఉపయోగించుకొని, మాటలతోనే కాలం గడిపేవాళ్ల స్వభావాన్ని ఆధారం చేసుకొని పుట్టిన సామెతలు :

"ఆటాపాటా మా యింట మాపటి భోజనం మీయింట"

"మాటలన్నీ మాయింట్లో మాపటి భోజనం మీయింట్లో"

"మాటకు మా ఇంటికి, కూటికి మీ ఇంటికి"

"మాటలకు మా యింట్లో మాపటికి మీ యింట్లో"

తమతో మాట్లాడుతూ, ఆటలాడుతూ కాలం గడపాలనే స్వార్థమే తప్ప వాళ్ల అవసరాల్ని తీర్చాలని ఆలోచించపోతే ఎలాగు !

మరికొందరు తమ సొమ్ము పైసాకూడా ఖర్చు చేయరు. ఇతరుల సొమ్ము ఎంతైనా ఖర్చు చేయించడానికి ముందుకు వస్తారు. పది మందిలో ఉంటే అందరితో సమానంగా ఖర్చుపెట్టడం సంస్కారవంతుల లక్షణం. కానీ స్వార్థ పరులు ఇతరులు ఖర్చుపెడితే సంతోషంగా అనుభవిస్తారని అలాంటివాళ్ల మన స్తత్వాన్ని తెలిపే సామెతలు :

"ఇంటి సొమ్ము విప్పపిండి పొరుగింటి సొమ్ము బెల్లం"

"తన సొమ్ము అల్లం పెరవారి సొమ్ము బెల్లం"

"ఒకరిదైతే ఓపికంతా తనదైతే తగరమంతా"

"పరుల సొమ్ము పంచదార తన సొమ్ము విషపుదార"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కొందరు తమ పనులపట్ల స్వార్థ భావాన్ని చూపిస్తారు తమ పని అంటే ఎంతో ఉత్సాహాన్ని చూపిస్తారు. ఎంతో జాగ్రత్త చేస్తారు. తమ శక్తియుక్తుల్ని ఉపయోగించి సక్రమంగా జరిగేట్లు చూస్తారు ఏ లోపం రానీయకుండా, భంగం కలుగకుండా పగలు రాత్రీ, ఎండవాన అనక కష్టపడతారు తమ పనిని శ్రద్ధతో చేసుకోవడంలో తప్పులేదు. కానీ అదే పని ఇతరులదైనా, ఉమ్మడిపని అయినా, అశ్రద్ధ చూపిస్తారు. ఎక్కడలేని సోమరితనం, నిరుత్సాహం వస్తాయి. పనిచేయ లేక నీరసించిపోతారు. తన పని అంటే నదిలా పొంగిపోయేవాడు పరాయివాళ్ళ పని అంటే రాయిలా అయిపోతాడని వివరించే సామెతలు :

"సొంతానికి ఏనుగు ఉమ్మడికి పీనుగు"

"సొంతానికి పిడుగు ఉమ్మడికి బడుగు"

"పరాయి వాడిపని అంటే రాయిలా ఉన్నవాడు
తనది అంటే నదిలా పొంగి పోతాడు"

కొందరు తమ వస్తువులంటే ఎంతో శ్రద్ధ చూపుతారు. ఇతరుల వస్తువు లంటే ఎలాపోతే మాకేం అనుకొంటారు. తమవి అనే స్వార్థంతో తమవి కాని వాటిపట్ల అశ్రద్ధ చూపే స్వార్థపరుల స్వభావాన్ని వెల్లడి చేసే సామెతలు :

"తనది కాకుంటే తాటిచెట్టు కెదురుదేకమన్నారు"

"తనది కాకుంటే తాడిపత్రి వరకు దోక్కోమన్నట్లు"

తమకు ప్రయోజనాన్ని కలిగించకపోతే, తమకు దక్కకుంటే అవి ఎలా పోయినా ఫరవాలేదని అనుకునే వాళ్ళ స్వభావాన్ని బట్టి :

"తనకు కాని రాజ్యం పండితేనేమి? మండితేనేమి?"

"ఎద్దు ఏటంటే పోతేనేమి? బండిబాటంట పోతేనేమి?"

అనే సామెతలు వెలువడ్డాయి.

కొందరు శ్రమ ఇతరులది, ఫలితం తమది కావాలనుకుంటారు. తమ గొడ్రె ఎక్కడ తిరిగినా, ఏమితిన్నా తిరిగి ఇంటికి వచ్చి పాలు తమకే ఇస్తే చాలు అని భావించే వాళ్ళ స్వార్థ బుద్ధిని తెలిపే సామెతలు :

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఏ మందలో కట్టినా మన మందలో ఈనితేచాలు"

"ఎక్కడమేసినా మన ఇంట్లో పాలిస్తే చాలు"

"ఆవు ఎక్కడ తిరిగితేనేమి? ఇంటికి వచ్చి పాలిస్తే చాలు"

"ఎక్కడ మేసినా పేడమన పెరట్లో వేస్తే చాలు"

తాము బాగుపడాలి ఇతరులు నశించి పోవాలనీ భావించేవాళ్ల స్వార్థపూరిత నీచస్వభావాన్ని "తనను తప్పించి ఆకాశమంత పిడుగు పడమన్నట్లు" అనే సామెత చెప్పగా ఇంకా వెర్రితలలు వేసే స్వార్థాన్ని "కొడుగు బాగుండాలి కోడలు ముండమొయ్యాలి" అనే సామెత వివరిస్తుంది.

తమవాళ్లకొకనీతి పరులకొకనీతిని చెప్పేవాళ్ల స్వభావాన్ని :

"కూతురికి మంగళవారం శుక్రవారం కోడలికి దివ్వెలు దివ్వెలు"

"కూతురిపురుడు కుండల్లో కోడలిపురుడు కొండల్లో"

అనే సామెతలు వ్యక్తం చేస్తాయి.

తన కడుపు నిండితే చాలు, ఇతరుల్ని గురించి పట్టించుకోరని, తమ పనులు జరిగిపోతే చాలు, ఇతరుల పనులగూర్చి మనకెందుకని భావించేవాళ్లను "చద్ది అన్నం తిన్నమ్మ మొగడి ఆకలి ఎరుగదు" అనే సామెత విమర్శిస్తుంది.

"ఇరుక్కుపెడితే ఏమొస్తుంది- పొరుక్కుపెడితే ఏమొస్తుంది నా గుల్లి కుక్కకు పెడితే గుల్లిస్తుంది" అనే సామెత ఇతరులకు పెడితే నష్టమనీ అవసరం లేకపోయినా తన స్వార్థానికే ఉపయోగించే వాళ్ల స్వభావాన్ని వెల్లడి చేస్తుంది.

**ఆశ :**

ఆశ సకల దోషాలకు నిలయం. అది ఎల్లప్పుడూ మానవునికి దుఃఖాన్నే కలిగిస్తుంది. అందువల్లే బుద్ధిమంతులు ఆశను త్యజిస్తారని భారతసూక్తి :

"అది సర్వదోషములకా
స్పదమది దురిత క్రియానుబంధంబునకున్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



మొదలు నిరంతర దుఃఖ
ప్రదమని మది తలచి తృష్ణబాతురుసుమతుల్"16

మనిషికి గల బంధనాల్లో ఆశ ఒకటి. ఆశాబంధనంలో చిక్కుకున్నవాడు యథేచ్ఛగా తిరుగలేడు. ఆశకు దాసుడైనవాడు లోకంలో అందరికీ దాసుడే. ఆశ మనిషిని ఒకచోట స్థిరంగా ఉండనీయదు. పిచ్చిపట్టిన మనిషిలా తిరుగుతూ ఉంటాడని వేమన అంటాడు :

"ఎక్కడయినా యాశలినుమడి యుండగా
తిక్కపట్టి నరుడు తిరుగుచుండు
కుక్కవంటి యాశ కూర్చుండనీయదు"17

ఆధునిక మానవుడు ఆశావాదిగా ఉండాలి. అత్యాశకూడదు. మానవునికి ఆశ ఊపిరి లాంటిది. ఆశ లేకపోతే మానవుని స్థితి "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుంటుంది. కాబట్టి ప్రతివానిలోనూ ఆశాభావం ఉండాలి. ఆశగలవాడు లోకంలో సాధించరానిదంటూ ఉండదు. ఆశతో అడుగు ముందుకు వేసి నడిచేవానికే నూరామడలైన దూరంగా కనబడదని క్రింది శ్లోకం చెబుతుంది.

"నయోజన శతం దూరం వాహ్యమానస్య తృష్ణయా
సన్తుష్టస్య కరప్రాప్తేఽ ప్యర్థే భవతి నాదరః"18

ఆశ లేకపోతే మనిషికి అభివృద్ధి ఉండదు. అందువల్ల ప్రతి మనిషి ఆశతో బ్రతకాలి. నిరాశావాదిగా ఉండకూడదు. అట్లని దురాశకులోను కాకూడదు.

ఆశావాది కష్టాల్ని చూచి భయపడడు. కష్టాల వెనుకున్న సుఖాలపైననే ఆశావాది దృష్టి ఉంటుంది. కష్టాలు అనుభవిస్తే మనిషి సుఖాన్ని పొందవచ్చు అనే ఆశ మనిషికి ఉంటుందని "పడమట క్రుంకిన పొద్దు తూర్పునలేవదా !" అనే సామెత చెబుతుంది. పై సామెతకు గల వివిధార్థాల్ని వివరిస్తూ డా॥ ఆర్వీయస్

16. ఆంధ్రమహాభారతము 8-2-25 : ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖవారి ప్రచురణ.
17. వేమన పద్యములు : 69వ పద్యం - శ్రీ యస్.వి. గోపాల్ అండ్ కో
18. హితోపదేశః మిత్రలాభః : 158వ శ్లోకం - వావిళ్లవారి ప్రచురణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



సుందరంగారు ఆశావాదాన్ని కూడ పేర్కొన్నారిలా "కష్టాలు సుఖాలు కావడికుండ లనేది మనం జీవితంలో రుచి చూడగల్గిన సత్యం. ఈనాడు కష్టం అనుభవిస్తే రేపు సుఖం లభించగలదనే ఆశే జీవిని నిలబెడ్తుంది. ఈ ఆశావాదమే పై వాక్యంలో ధ్వనిస్తుంది"19

'జీవన్ భద్రాణిపశ్యతి' అని సంస్కృత లోకోక్తి. ప్రాణాలపై ఆశ కలిగి ప్రమాదం నుంచి బయటపడితే చాలు ఎలాగైనా బ్రతుకును సాగించవచ్చు అనే ఆశావాదాన్ని వ్యక్తం చేసే సామెతలు:

"బ్రతికి ఉంటే బలుసాకు తినవచ్చు"
"ఊపిరి ఉంటే ఉప్పు అమ్ముకొనైనా బ్రతుకవచ్చు"
"ప్రాణముంటే ఉప్పుగల్లమ్ముకొని బ్రతుకవచ్చు"

అన్యోన్య దాంపత్యంలో ఒకరిపై మరొకరికి ఆశ ఉండడం సబబు అంటాడు వేమన:

"భార్యమీదనాశ పరగుపురుషునకు
మగనిమీదనాశ మగువకుండు"20

ఆశ ఉండాలంటూనే అత్యాశవల్ల మనిషి చెడిపోతాదని హెచ్చరిస్తాడు.

"నీళ్ళలోని చేప నెఱమాంసమాశకు
గాలమందు జిక్కి కూలినట్లు
ఆశపుట్టి మనుజుడారీతి చెడిపోవు"21

ఆశ ఉండడం తప్పుకాదు. కానీ అంతంలేని ఆశకు పోరాదనీ, ఆశకు దాసుడై స్వార్థంతో సిగ్గూ, భయము అన్నింటిని వదిలివేస్తాడనీ, పాపపుణ్యాలతో నిమిత్తం లేదని క్రింది సామెతలు వివరిస్తాయి.

---

19. ఆంధ్రుల జానపద విజ్ఞానం : సామెతలు పుట. 190 - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
20. వేమన పద్యరత్నాకరము : 1759 పద్యం - బాలసరస్వ బుక్ డిపో 1988.
21. వేమన పద్యములు : పద్యం - శ్రీ యస్.వి. గోపాల్ అండ్ కో.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఆశకు అంతులేదు గోచికి దరిద్రంలేదు"

"ఆశకు అంతులేదు నిరాశకు చింతలేదు"

"ఆశకు ముదిమిలేదు అర్థికి సౌఖ్యంలేదు"

"ఆశ సిగ్గెరుగదు నిద్ర సుఖమెరుగదు"

"ఆశగలమ్మ దోషమెరుగదు పూటకూళ్ళమ్మ పుణ్యమెరుగదు"

కొందరు ఇతరుల వస్తువులపై ఎంతో ఆశను చూపిస్తారు. అవి ఎలా ఉన్నా సరే రుచిగా ఉన్నాయని మెచ్చుకుంటారు. ఇతరుల వస్తువులపై ఆశపడే వాళ్ల స్వభావాన్ని "పొరుగింటి పుల్లకూర రుచి" అనే సామెత వెల్లడి చేస్తుంది.

కొందరు తమ శక్తిసామర్థ్యాల్ని మరచిపోయి శక్తికిమించిన వాటికై ఆశ పడతారనీ, తాము ఆశించినా లభ్యం కావని తెలిసినా ఆశపడే వాళ్లస్వభావాన్ని:

"అందని మానిపండ్లకు అర్రులు సాచినట్లు"

"అందని మానిపండ్లకు ఆశపడ్డట్లు"

అనే సామెతలు చెబుతాయి ఇలాంటి సందర్భానికి సంబంధించి "అద్దములోని నీడ కెటులాసపడం బొసగున్ తలోదరీ" అని నాచనసోముడు ప్రయోగించాడు.

ఆశ చాలా చెడ్డది. అది మనిషిని ఎలా నడిపిస్తుందో తెలియదు. ఒక్కొక్క సారి మనిషి తెలివితేటల్ని కూడా కోల్పోయి ప్రవర్తిస్తాడు. ప్రయోజనం ఉన్నా లేకపోయినా ఇతరుల వస్తువులు ఊరికే లభిస్తే చాలు వాటికై ఆశపడతాడనీ, ఎంత అల్పమైన వస్తువైనా సరే ఉచితంగా వస్తుంది కదా అని ఆశపడేవాళ్ళ స్వభావాన్ని బట్టి పుట్టిన సామెతలు:

"చచ్చినవాడికి వచ్చిందే కట్నం"

"ఫ్రీగా వస్తే ఫినాయిల్ అయినా త్రాగవచ్చు"

"ఆశపడినచోట ఆడిందే సరసం"

"తాలుకంకి గింజలోయ్ దాసరీ! అంటే రాలినకాడికే
గోవిందా! అన్నట్లు"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



''ఊరికేవస్తే మా వాడు ఇంకొకడు ఉన్నాడు.'' అంటూ తమతోపాటు తమ వాళ్ళను తీసుకొనిపోయే దురాశపరులు కొందరుంటే, ఊరికే పెడుతున్నారు కదా అని అనుకోక అందులో కూడా అధికారాన్ని చూపిస్తూ ''ఊరికే పెట్టే అమ్మను నీ మొగుడితోపాటు పెట్టమన్నట్టుగా''గా ప్రవర్తించేవాళ్ళు మరికొందరు.

ఆశతో కొందరు నీచాతినీచంగా ప్రవర్తిస్తారని ''కక్కిన కూటికి ఆశించినట్లు'', ''పీతిమీది పైపాకు ఆశపడినట్లు'' అనే సామెతలు వివరిస్తాయి.

''ఆశకుపోతే గోచిలో రాయి పడ్డట్లు'' కొందరు ఆశపరులై తక్కువ లాభానికి కక్కుర్తిపడితే దానివల్ల ఎక్కువ నష్టాన్ని పొందుతారని క్రింది సామెతలు వెల్లడిచేస్తాయి.

''అడ్డెడు వడ్లకు ఆశపడిపోతే తూమెడు వడ్లు దూడతిని పోయిందట''

''కాసుకు గింజల పనికిబోతే కుంచెడు గింజలు దూడతిని పోయిందట''

''కాసుకు మూతినాకబోతే మూడునూర్ల ముంగర పోయిందట''

''ఆశపడి పాసిన అన్నం తింటే పాటుపడి పది లంఖణాలు చేసినట్లు''

''ఆశపడి ఆరు ఉపోష్యాలుంటే ఆ రోజు కూడా ఆరికమెతుకు లేనా ?''

ఆశకులోబడ్డవాళ్ళు ఎంత శ్రమకైనా ఓర్చుకొని ఎంతదూరమైనా వెళ్తారని ''కానికి టెంకాయ ఇస్తారని కాశికి పోయినట్లు'' అనే సామెత చెప్పగా ''అడక్కుండా చెప్పులిచ్చాడు అడిగితే గుర్రమిస్తాడన్నట్లు'' అత్యాశతో వెంటబడతారని మరో సామెత చెబుతుంది.

అత్తగారెంత ధనవంతులైన కోడలికి పుట్టింటిపై ఆశ ఉండడం సహజమని

> ''అత్తవారింట సకల భాగ్యంబులున్న
> మగని మీదట దనకెంత మక్కువున్న
> నాడు బుట్టువు పుట్టింటి కాసపడును''[22]

---

22. విజయవిలాసము : 3-133 - వావిళ్లవారి ప్రచురణ : 1965 ముద్రణ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అని చేమకూర వేంకట కవి నుడివినాడు. పుట్టింటిపై ఆశపడవచ్చు. కాని అది తల్లిదండ్రుల్ని నాశనం చేసేదిగా ఉండరాదు "ఆడపిల్ల ఆశ మూఁ వాసం గుంజుక పోయేవరకు తీరదు" అనే సామెత పుట్టింటిని దోచుకొనిపోయే ఆడపిల్లల ఆశను వెల్లడి చేస్తుంది.

ప్రాణం పోతున్నా తిండిపోతు తిండిపై ఆశను చంపుకోడని "కాటికి కాళ్లు చాచుకొని తిండికి చెయ్యి చాచేవాడు" అనే సామెత చెప్పగా "ఆకలి ఆకాశ మంత గొంతుక సూది బెజ్జమంత" అనే సామెత తిండిపై గల అత్యాశను వివరిస్తుంది. ఆశిస్తున్న ఫలితం అత్యంతమైంది కాని చేసే ప్రయత్నం మాత్రం అత్యల్పమైంది అనే విషయాన్ని గర్భీకరించుకొన్నది పై సామెత. ఇలాంటిదే "జొన్నవిత్తనాలు నాటి వరి విత్తనాలకు ఆశించినట్లు" అనే మరో సామెత :

ఆశపడకూడనివాడు అందులోనూ లేనిదానికై ఆశ పడడాన్ని "గుబళకమ్మ చళ్లు చూచి సన్యాసిగాడు సంబరపడినాడు" అనే సామెత చెబుతుంది. "గుబళకమ్మ" అంటే స్తనాలు లేని ఆడదని అర్థం. స్తనాలు లేకపోయినా అందులోనూ సన్యాసి ఆశపడడం ఎంత విడ్డూరమో చూడండి.

గాండ్ల కులంవాళ్లకు ఆశ ఎక్కువని "గాండ్లవాని ఆశ గోతం పట్టదు" అనే సామెత వెల్లడి చేస్తే "అత్తకు అల్లుడాశ, బాపనికి పప్పాశ", "ఆశబోతు బాపడు గోచిపాతలో ముప్పందుం మూట గట్టుకున్నాడట" అనే సామెతలు బ్రాహ్మణుల ఆశను తెలియచేస్తాయి.

## మొండితనం :-

పట్టుదల మనిషికి చాలా అవసరం. పట్టుదల లేకపోతే ఏ పని సరిగా చేయలేడు. దేన్ని సాధించలేడు. కార్యసాధనకు పట్టుదల అవసరమనీ, పట్టుబట్టి విడువరాదనీ వేమన అంటాడు.

> పట్టు పట్టరాదు, పట్టి విడువరాదు
> పట్టేనేసి బిగియ పట్టవలయు
> పట్టు విడుటకన్న పడిచచ్చుటేమేలు"[23]

23. వేమన్న వేదం : 14వ పుట - యువభారతి ప్రచురణ 1981.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అయితే పట్టుదలకు కూడా సమయాసమయాలుంటాయి. మొండి పట్టుదల పనికి రాదు. మంచి విషయాల్లో పట్టుదల ఎంత ప్రయోజనకరమో చెడు విషయాల్లో అంత ప్రమాదకరం. మొండి పట్టుదలగలవాళ్లు పెద్దవాళ్ళు, బుద్ధిమంతులు చెప్పిన మాటల్ని వినక తాము చెప్పిందే జరగాలని మొండి పట్టుదలను చూపిస్తారు. ఇతరుల ఆలోచనలు అక్కరలేదంటారు. తమకు నచ్చింది కాబట్టి చేస్తామని మొండితనం చూపేవాళ్ల స్వభావాన్ని వెల్లడి చేసే సామెతలు :

"తానుబట్టిన కుందేదికి మూడేకాళ్ళు"

"తాను పట్టిన కోడికి నాలుగు కాళ్ళు"

"తాను మునిగింది గంగ తాను మెచ్చింది రంభ"

"రాజు మెచ్చింది రంభ తాను మునిగింది గంగ"

మొండి పట్టుదల కలవాడు తానేమనుకుంటే అదే చేస్తాడని "తెగించిన వాడికి తెడ్డే లింగము" అనే సామెత చెబుతుంది.

మొండివాళ్లను ఎవరూ మార్చలేరనీ, మార్చాలని ప్రయత్నించిన వాళ్ల కూడా విసిగిపోతారు కాని మార్చలేరని తెలియజెప్పే సామెతలు :

"మొండిదానా ! మొండిదానా మొగుడేమి చేస్తున్నాడంటే, కొట్టి కొట్టి వాడే చచ్చాడన్నదట"

"మొండికెక్కిన దాన్ని మొగుడేమి చేయును ? రచ్చకెక్కిన దాన్ని రాజేమి చేయును ?"

కొందరు ప్రతిదానికి మొండిగా ఉంటారు. ఇతరులెన్నిసార్లు చెప్పినా వినరు. తమ మొండితనంతో ఇతరుల్ని విసిగిస్తుంటారు. అలాంటివాళ్ల స్వభావాన్ని వివరించే సామెతలు :

"ఇంతికి రావద్దంటే విస్తరాకు తెమ్మన్నట్లు"

"ఇంట్లోనుంచి తోసివేస్తూ వుంటే చూరుపట్టుకొని వ్రేలాడినట్లు"

"భోజనానికి రావద్దంటే పట్టుచీర కట్టుకొని వస్తానన్నట్లు"

"వెంటరావద్దంటే ఎత్తుకొమ్మని ఏడ్చాడట"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"వెళ్లిపొమ్మంటే పెళ్లికి వెళ్ళుదామన్నట్లు"
"వెళ్లిపొమ్మంటే చూరు పట్టుకొని వ్రేలాడినట్లు"
"మొక్కుబడే లేదంటే ఒకదాసరికైనా పెట్టమన్నట్లు"

మొండివాళ్ళకు ఆయుస్సు ఎక్కువని "మొండికి బండకు నూరేండ్లాయుస్సు" అనే సామెత చెబుతుంది. "మొండికి సిగ్గులేదు మొండకు గాలిలేదు." అనే సామెత మొండితనం కలవాళ్ళకు ఇతరులు ఏమనుకుంటారో అనే సిగ్గు కూడా ఉండదని వెల్లడి చేస్తుంది.

మొండివానికి తగిన మొండివాడే లభించే సందర్భంలో "మొండిగి దగ్గ మిండడు" అనే సామెతను ప్రయోగిస్తారు. ఇలాంటిదే "మొండి గురువు బండ శిష్యుడు" అనే సామెత.

అవకాశవాదం :-

ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ[24]

అన్నాడు సుమతి శతకకారుడు. సందర్భానుసారంగా మాట్లాడి తాను బాధపడక ఇతరుల్ని బాధపెట్టకుండా నడచుకోవడం మంచిది. అవకాశాన్నిబట్టి నడచుకోవాలన్నమాట. అవకాశం దొరకక ఎందరో ఇబ్బంది పడుతూ ఉంటారు. అవకాశం లభిస్తే దాన్ని చక్కగా ఉపయోగించుకోవాలి. అవకాశాన్ని సద్వినియోగపరచుకున్నపుడే జీవితంలో ముందుకు వెళ్ళటానికి వీలుంటుంది. అందుకే "అవకాశం చూసి సొమ్ము చేసుకోరా" అనే సామెత పుట్టింది. ఎన్ని ఉపాయాలున్నా, ఎంత ధనం ఉన్నా, బలం, ఉత్సాహం ఉన్నా అవకాశం లేకపోతే ఫలితం శూన్యమే. కాబట్టి శక్తియుక్తుల్ని, సామర్థ్యాన్ని ఉపయోగించి లభించిన అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకోవాలని వివరించే సామెతలు :

"గాలి ఉన్నపుడే తూర్పార పట్టాలి"

---

24. సుమతిశతకం ; 18వ పద్యం - సి. వి. కృష్ణా బుక్ డిపో.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"గాలివాటం చూచి తూర్పార బట్టాలి
"గాలిపెట్టినపుడే తూర్పు పోసుకున్నట్లు"

"Make hey while sun Shines" అనే ఆంగ్లసామెతపై విషయాన్నే సూచిస్తున్నది. వ్యవసాయదారులు వడ్లు జొన్నల్లాంటి ధాన్యాల్ని శుభ్రం చేయటానికి తూర్పు పోస్తారు. తూర్పు పోయటానికి గాలి ఉండాలి. అందువల్ల రైతులు గాలికోసం ఎదురుచూస్తారు. గాలి వచ్చిన వెంటనే ధాన్యమంతా తూర్పు పోసుకుంటారు. అవకాశం లభించినపుడే పని పూర్తి చేసుకుంటారు. ఇలాంటి సామెతే "గాలివాటం చూచి తెరచాప ఎత్తాలి." నదుల్లో, సముద్రాల్లో పడవలకు తెరచాప కట్టి ఏదిక్కుగా వెళ్లాల్లో అదిక్కుగా గాలి వీచినపుడు తెరచాప ఎత్తుతారు. తెరచాప సహాయంతో గాలివీచిన దిక్కున పయనించి గమ్యస్థానం చేరుకుంటారు. సమయం దొరికినపుడు పనులు చేసుకోవడమనే స్వభావంపైసామెతల్లో వ్యక్తమవుతుంది.

కొందరు అవకాశాన్నిబట్టి 'ఊసరవెల్లి'లాగా తమ వేషభాషల్ని ప్రవర్తనను మార్చుకుంటారు. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవడం వేరు. కేవలం అవకాశవాదులుగా మారడంవేరు. అవకాశవాదులు తమ స్వలాభాపేక్షతో ఆ విధంగా ప్రవర్తిస్తుంటారు. "ఏ రోటికిపోతే ఆ రోటిపదం పాడినట్లు" అవకాశాన్ని బట్టి మారుతూ ఉంటారు. "ఏ యెండకా గొడుగుపట్టినట్లు" ప్రవర్తించే వాళ్ళు కొందరుంటారు.

ఒకప్పుడు ఆంధ్రదేశంలో శైవవైష్ణవులు బాటసారులకై సత్రాలు నడిపే వాళ్ళు. కానీ ఆనాడు వైష్ణవులకు వైష్ణవులకు పడేది కాదు. వీళ్ళద్వేషం యాత్రికులపై పడేది. అందువల్ల యాత్రికులు శైవుల సత్రానికి వెళ్తే శైవులమనీ, వైష్ణవుల సత్రానికి వెళ్తే వైష్ణవులమనీ చెప్పుకొనే వాళ్ళు. అంటే అవకాశానిబట్టి సంప్రదాయాల్ని అనుసరించే వాళ్ళని కొన్ని సామెతలు వెల్లడి చేస్తాయి. "రామాలయం ఉన్నచోట రామభద్రయ్య, శివాలయం ఉన్నచోట వీరభద్రయ్య" అని పేర్లు కూడా మార్చుకొనేవారట. అంతేకాదు దారిలో ఎవరన్నా ఎదురై "మీరు దాసర్లా? జంగాలా?" అని ప్రశ్నిస్తే ముందుగా వచ్చే ఊరునుబట్టి "జంగాలనీ, దాసర్లనీ చేప్పేవాళ్ళని కొన్ని సామెతలు చెబుతాయి.

"జంగాలా! దాసర్లా! అంటే ముందూరునుబట్టి"
"జంగాలో దాసర్లో ముందూరునుబట్టి"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఇతరులపైన ఉన్న కోపాన్ని తీర్చుకోవడానికి అవకాశం కోసం ఎదురు చూసి సమయం దొరికినపుడు ఒకేసారి తమ కసిని తీర్చుకుంటారు. అవకాశం దొరికితే అపుడేమి చేసినా ఎదుటివాళ్ళు ఏమీ చేయలేరు. ఇలా సమయంకోసం వేచి వుండి సమయం దొరకగానే తమ కోపాన్ని తీర్చుకొనే వాళ్ళ స్వభావాన్ని వివరించే సామెతలు :

"దయ్యంపట్టినపుడే చెప్పుతో కొట్టాలి"

"నొప్పులెత్తుకున్నపుడే మంత్రసానికి దెప్పసందు"

దయ్యం పట్టినప్పుడు దేంతో కొట్టినా ఊరుకుంటారు. మిగతా సమయంలో ఊరుకోరు. అలాగే మంత్రసానికి ప్రసవసమయమే మంచి అవకాశం. ఆ తర్వాత ఆమె ఏమి చెప్పినా కుదరదు. ఏమి చేసినా ఊరుకోరు.

కొందరు "అందితే జుట్టు అందకపోతే కాళ్ళు" పట్టుకుంటారు. సమయాన్నిబట్టి ఎలా వీలైతే అలా ప్రవర్తిస్తారు. "అబ్బితే శిగ అబ్బకపోతే కాళ్లు" అనేది కూడా పైలాంటి సామెతే. "గోడమీది పిల్లవాటం"లా ఉంటారు మరి కొందరు. అవకాశం వస్తే ఎటు అవసరమనుకుంటే అటు దూకేస్తారు. "గోడ మీది పిల్లవాటము కోమటి సాక్ష్యం" అనే సామెత కోమట్లు అవకాశవాదు లంటుంది.

## లంచగొండితనం :

అవినీతికి ఆలవాలమైన వాడు తానేపని చేసినా దానికి ప్రతిఫలాన్ని ఆశిస్తాడు. పనిచేయడం తన ధర్మమనీ, తానందుకే నియమింపబడ్డాననీ, తన విధి నిర్వహణకు తగిన ధనం లభిస్తుందనీ తెలిసి కూడా అక్రమ మార్గంలో డబ్బును సంపాదించాలని చూస్తాడు. అలాంటివాణ్నే లంచగొండి అంటారు. నేడు సమాజంలో ప్రతిచోట ఈ జబ్బు కనిపిస్తుంది. కొందరిలో ఈ స్వభావం చిన్నప్పటి నుండే కనిపిస్తుంది. ఏ పనిచేయమన్నా దానికి ప్రతిఫలాన్ని ఆశిస్తారు. ఏదైనా పని చేయమంటే "అది చేస్తే నాకేమిస్తావు ?" అని ప్రశ్నిస్తారు. పెద్దలే ఒక్కొక్కసారి పిల్లలకు నేర్పుతారేమో అనిపిస్తుంది. "స్కూలుకెళ్ళరా నీకు చాక్లెటు ఇస్తాను." అని పిల్లల్ని లంచానికి అలవాటు పడేట్లు చేస్తారు. ఆ తర్వాత ఏ పని చేయమన్నా దానికి ఏమిస్తావని అడుగుతారు. కొందరు ఏ పనిచేసినా లంచమడుగుతూ ఉంటారని "లంచం లేనిదే మంచమెక్కడు" అనే సామెత చెబుతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"తైలం పడందే బండి కదలదు" అన్నట్లుగా ప్రతిచోటా లంచం ఇవ్వందే ఏపనైనా జరుగదు. ఒక్కొక్కసారి గొప్పవాళ్ళ పనులు కూడా లంచం ఇవ్వందే జరుగవనీ "ఇరుసున కందెన పెట్టక పరమేశుని బండి అయినా పారదట" అనే సామెత వెల్లడి చేస్తుంది. పరమేశ్వరుని బండి కదలకపోవడమేమిటి! అంటే లంచం యొక్క ప్రభావం మనిషిపై ఎంతగా పనిచేస్తుందో పై సామెత చెబుతుంది.

పిల్లలు మొండితనం చేసినా, ఏడుస్తున్నా వాళ్ళ ఏడ్పును మాన్పించడానికి పప్పుల్లాంటివి పెడుతుంటారు. అలాగే కొందరు ఇతరుల బాధనుండి తప్పించుకోవడానికి ఏదో ఒకటి యిచ్చి వాళ్ళను వదిలించుకుంటారు. అలాంటివాళ్ళ స్వభావాన్ని "పప్పులు పెట్టి పోరుమాన్పినట్లు" అనే సామెత వివరిస్తుంది.

## క్రమశిక్షణ :-

ఏ పని చేసినా నియమబద్ధంగా చేయాలి. అపుడే ఆ పనికి తగిన ఫలితం సులభంగా దక్కుతుంది. క్రమశిక్షణ మనిషి జీవితానికి చాలా ముఖ్యం. క్రమశిక్షణ లేని జీవితం చుక్కానిలేని నావలాంటిది. ఎక్కడికెల్తుందో, ఎలా వెళ్తుందో తెలియదు. క్రమశిక్షణ లేకపోతే ఎలాంటి వాళ్లైనా వ్యర్థమే. అలాంటి వాళ్ళు దేనికీ పనికిరారు. అందుకే అలాంటివాళ్ళు ఎవరైనా, ఎలాంటి స్థానంలో ఉన్నా వదలిపెట్టాలని "అంకెకురాని ఆలిని ఆర్గురు బిడ్డల తల్లి అయినా విడువాలె" అనే సామెత చెబుతుంది. "అంకెకు రాని ఆలు కీలెడలిన కాలు" అనే సామెత కూడా సక్రమమార్గంలో నడవకపోతే భార్యయైనా సరే వదలి పెట్టాలంటుంది. కీలు లేని కాలు నడవడానికి పనికి రాదు. అట్లే క్రమశిక్షణలేని భార్య కూడా పనికిరాదని భావం.

అదుపాజ్ఞలు లేకపోతే ఏ మనిషీ ఒక క్రమ పద్ధతిలో నడచుకోడనీ' ఏ పనిచేసినా అది సరిగా ఉండదనీ, "అంకెలేని కోతి లంకంతా చెఱచిందట" అనే సామెత వివరిస్తుంది. ఇది రామకథా పరమైన సామెత. లంకలో ప్రవేశించిన కోతి ఇష్టం వచ్చినట్లు తిరిగి లంకంతా నాశనం చేస్తుంది. అదుపాజ్ఞలు లేకుండా ప్రవర్తించే వాళ్ళందరికి వర్తించే చక్కని సామెత. "అదుపులేని గుర్రాలు అడవులు పట్టుకొని తిరిగినవట" అనే సామెత క్రమశిక్షణ లేని వాళ్ళు అధోగతిపాలవుతారని చెబుతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



## నిష్ప్రయోజనం :

కొందరు ఎంత కష్టపడినా ఫలితం సరిగా ఉండదు. పడిన కష్టానికి వచ్చిన ఫలితానికి సరిపోతుంది. మిగులేమి ఉండదు. కష్టపడినందుకు కొంతైనా మిగులు ఉంటే ప్రయోజనం, కానీ కష్టానికి వచ్చిన దానికి సరిపోతే కష్టపడటం అనవసరం. ఎంత కష్టపడినా వచ్చిన లాభానికి కష్టానికి సరిపోయే సందర్భంలో చెప్పుకునే సామెతలు :

"గాజుల బత్తెం భోజనానికి సరి"
సంతలో బేరం లచ్చి గాజులకు సరి"
"ఏటియీతకు బీపిమేతకు సరి"
"లంకమేత ఏటి ఈతకు సరి"

ప్రొద్దున్నుంచి చేసిన వ్యాపారం కేవలం భోజనానికి సరిపోతే మిగిలిన ఖర్చులు ఎలా ! గోదావరినదిని ఈదిన ఈతకు లంకలోని మేతకు సరిపోతే కష్టపడటం అనవసరమనిపిస్తుంది.

కొందరికి ఎంత కష్టపడినా కష్టానికి తగిన ఫలితం ఉండదు. పడినకష్టం ఎక్కువ, వచ్చిన లాభం చాలా తక్కువగా ఉంటుంది. ఎప్పుడు చూసినా కష్ట పడుతూనే ఉంటారు. క్షణం తీరిక ఉండదు క్షణం తీరికలేకుండా పనిచేస్తూ ఆదాయం పొందలేని వాళ్ళను విమర్శించే సామెతలు :

"దమ్మిడి ఆదాయంలేదు క్షణం తీరికలేదు"
"ఘడియ పురుసత్తులేదు గవ్వ సంపాదనలేదు"
"గడియ పురుసత్తు లేదు గవ్వ ఆదాయంలేదు"
అవ్వ తీసిన గంధం తాత బుడ్డకు సరిపోయినట్లు"
"అవ్వవడికిన నూలు తాతమొలత్రాటికి సరి"
"సాయబు సంపాదన బీబీ కుట్టుపోగులకే సరి"

దమ్మిడీ ఆదాయం లేకుండా గడియ పురుసత్తులేకుండా పనిచేయడం వ్యర్థమే గదా !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఉపాయం :-

ఉపాయం ఉంటే ఎంతకష్టమైన పనిని కూడా సాధించుకోవచ్చు. ఉపాయంవల్ల కలుగబోయే కష్టాల్ని, ప్రమాదాల్ని తప్పించుకోవచ్చునని "ఉపాయం ఉంటే అపాయంలేదు'' అనే సామెత చెబుతుంది.

ఉపాయం కలవాడు తాను ఉన్నచోటనే ఏ ఇబ్బందులూ లేకుండా తన జీవనాన్ని గడుపుకోవచ్చునని ''ఉపాయం ఉన్నవాడు ఊరిమీద బ్రతుకుతాడు'' అనే సామెత వెల్లడి చేస్తుంది. ఉపాయం లేనివాడు అవకాశాలున్నా బ్రతకడం చాలా కష్టమనీ.

''ఉపాయం లేనివాడు ఉపవాసంతో చచ్చాడు''

ఉపాయం లేని దాసరి ఊర్లోనే పస్తుంటాడు"

అనే సామెతలు వివరిస్తాయి. అందువల్ల ఉపాయంలేని వాడు ఊర్లో ఉండడం అనవసరమనీ, అలాంటివాణ్ణి ఊర్లో నుండి గెంటివెయ్యాలట. అందుకే కాబోలు "ఉపాయం లేనివాణ్ణి ఊళ్లోనుంచే వెళ్లగొట్టమన్నారు.'' అనే సామెత పుట్టింది.

కొందరు ఉపాయంతో తమకు ఖర్చులేకుండా ఇతరుల సొమ్మును ఖర్చు చేయించి, తమకు లాభం కలిగే విధంగా మాటలు చెప్పి ఇతరుల్ని మభ్యపెడతారు. అలాంటి వాళ్ళ నుద్దేశించి పుట్టిన సామెతలు :

''నీ పప్పు నా పొట్టు కలిపి ఊదుక తిందాం అన్నట్లు''

''మీ ఇంట్లో తినివచ్చి మా యింట్లో చేయికడుక్కోమన్నట్లు''

''నీ కూడు తిని, నీ గుడ్డ కట్టి నాకు కాపురం చేయమన్నాడట''

''నాకిన్ని గంజిమెతుకులు పోయి నీ కాకలి కాకుండ మందిస్తానన్నాడట''

ఉపాయంతో కొందరు తాము కష్టపడకుండా, ఇతరులు చూడ్డానికి మాత్రం తీరికలేనట్లుగా, పనిలో నిమగ్నమయినట్లుగా కనపడాలని ఆరాటపడతూ ఎదుటి వాళ్ళకు మాయమాటలు చెప్పి పనిచేస్తున్నట్లు నటించే వాళ్ళ స్వభావాన్ని వివరించే సామెతలు :

"నీవు దంచు నేను పక్కలెగరేస్తాను అన్నట్లు''

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఓలి! ఓలి! నీవు వడ్లు దంచు నేను పక్కలెగరేస్తాను అన్నట్లు"

"నువ్వు పోటు వెయ్యి నేను సువ్వీ! సువ్వీ! అంటానందట"

ఇతరులు వడ్లు దంచి కష్టపడితే పక్కనుండి పక్కలెగరేయడం ఉపాయంతో బ్రతకనేర్వడం కాక మరేమవుతుంది.

"జీతం బత్తెం లేకుండా తోడేలు గొర్రెలను కాస్తానన్నదట" అనే సామెత కూడ ఉపాయంతో మాయమాటలు చెప్పి కాలం గడుపుకోవాలనే వాళ్ల స్వభావాన్ని వెల్లడి చేస్తుంది.

ఇతరులు అమాయకత్వాన్ని ఆధారం చేసుకొని ఉపాయంతో మాట్లాడి తప్పుదారి పట్టిస్తారని "ముక్కు కోస్తే మూన్నాళ్లకొస్తుంది కొప్పు కొయ్యరా కుమ్మరి మొగుడా" అందట. ముక్కు కోస్తే ప్రమాదం కానీ కొప్పు కోస్తే ప్రమాదమేముంది. మళ్లీ వస్తుందనే ఉపాయం.

## చదువు :-

చదువు మనిషికి విజ్ఞానాన్ని కలిగిస్తుంది. మంచి చెడుల్ని తెలియజేస్తుంది. "చదివిన సదసద్వివేక చతురత గలుగున్" అన్నాడు పోతన. చదువు మానవుని సన్మార్గంలో నడిపించి సత్ప్రవర్తన, సచ్ఛీలం కలిగిస్తుంది. "విద్యలేనివాడు వింత పశువు", "చదువురానిమొద్దు కదలలేని ఎద్దు" అనే సామెతలు మనిషికి చదువు అవసరం అనే విషయాన్ని తెలియజేస్తాయి. కాని కొందరికి "చదువు చెరెడు బలపాలుదోసెడు" అన్నట్లుగా చదువేమో తక్కువగా ఉంటుంది. దానికి అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంటుంది. "చదువు సన్నమయ్యె - అయ్యలావయ్యె" అనే సామెత తక్కువగా చదివి ఎక్కువగా తిండి తిని బలిసేవాళ్ళ స్వభావాన్ని వెల్లడి చేస్తు-ది.

కొందరు చదువకముందే సక్రమంగా ఉంటారు. చదివిన తర్వాత వాళ్ళ ప్రవర్తనలో వికారం కనబడుతుంది చదవకముందు సక్రమంగా మాట్లాడేవాళ్ళు చదివిన తర్వాత విడ్డూరంగా మాట్లాడడం, మంచి పనులు చేసేవాళ్ళు చెడుపనులు చేయడం, మంచి మాటల్ని లెక్క చేయకపోవడం లాంటివి చేస్తుంటారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



సంస్కారహీనులుగా, పెద్దలపట్ల గౌరవం లేని వాళ్ళులా ప్రవర్తిస్తుంటారు. అలాంటివాళ్ళ స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"చదవక ముందు పెసలంటూ చదివేస్తే పిసలన్నట్లు"

"చదవక ముందు కాకరకాయ చదివిన వెనుక కీకరకాయ అన్నట్లు"

"చదువుకొన్నన్నాళ్ళు పసులు పసులు అని చదువుకున్నాక పచులు పచులు అన్నట్లు"

"చదువక ముందు వరవర అంటూ చదివిన వెనుక వడవడ అన్నాడట"

"చదవక ముందు నంది నంది అంటే చదివిన వెనుక పంది పంది అన్నాడట"

"చదివేస్తే ఉన్న మతిపోయినట్లు" చదువుకోకముందే చక్కని తెలివి తేటల్ని ప్రదర్శించేవాళ్ళు చదువుకొన్న తర్వాత తెలివి తక్కువగా ప్రవర్తిస్తుంటారు. అలాంటివాళ్ళను విమర్శించే సామెతలు :

"చదివిన వాడికన్నా చాకలివాడు మేలు"

"చదివినతనికన్నా-చాకలిసతిమేలు"

చాకలి చదువక పోయినా ఎవరెవరింట్లో ఎన్నెన్ని గుడ్డలు ఉతకడానికి తీసుకొని వెళ్తాడో ఆయా గుడ్డల్ని ఒకటికూడా తక్కువ కాకుండా వాళ్ళ వాళ్ళ యిండ్లలో తిరిగి అప్పచెబుతాడు. ఎవరి లెక్కలు తప్పినా చాకలి లెక్క మాత్రం తప్పదు.

## నిర్దయ -

"ఆత్మవత్ సర్వభూతాని". "సర్వేజనాస్సుఖినోభవంతు" అనే లోకోక్తులు సర్వప్రాణుల్ని తనవలే భావించాలనీ, తోటి మానవులు సుఖంగా జీవించాలని ప్రతి మానవుడు కాంక్షించాలని చెబుతాయి. తోటి మానవుల్ని ప్రేమించడం మానవధర్మం. తాము భూతదయకలిగి ప్రవర్తించడమే కాక సకల మానవులూ ఆచరించాలని ప్రబోధించిన కరుణామయులు చరిత్రపుటల్లో కనిపిస్తారు. "నితాంతాపారభూతదయయును దాపసమందార నాకు దయసేయుగదే", [శ్రీ మహాభాగవతము - దశమస్కంధం - 1288], "దయయు సత్యంబు లోనుగాదలపడేని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



గలుగనేటికి తల్లుల కడుపుచేటు" [శ్రీ మహాభాగవతం ప్రథమ స్కంధం-12] అని పోతన భూతదయపట్ల ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించాడు.

ఒక చెంపమీద కొడితే మరో చెంప చూపించే దయార్ద్రహృదయులెలా ఉంటారో అనవసరంగా ఇతరులకు కష్టం కలిగించే నిర్దయులు కూడా కని పిస్తారు. నిష్కారణంగా తమ స్వార్థంకోసం నిర్దయులై ఇతరుల్ని హింసించే వాళ్ల, ధనమదంతో, అధికార గర్వంతో నిర్దయులుగా ప్రవర్తించేవాళ్ల కఠిన స్వభావాన్ని వెల్లడిచేసే సామెతలు ప్రజల వ్యవహారంలో చోటు చేసుకున్నాయి.

కోడలు లేచింది మొదలు రాత్రి పడకునే వరకు కష్టించి పని చేస్తుంది. ఇంట్లోని అందరికీ నానా చాకిరీ చేస్తుంది. ఇంటి గౌరవాన్ని కాపాడాలని ఇంటికి వచ్చిన అతిథులకు, బంధువులకు సకల మర్యాదలు చేస్తుంది. ఇంత పనిచేసినా కోడలిపై అత్తకు ఏమాత్రం జాలి ఉండదు. కఠినమైన మాటలతో మనస్సును బాధ పెడుతుందే కానీ, ప్రేమతో పలకరించదు. ఎంత కష్టపడి పని చేసినా కోడలిపై అత్తకు కరుణ ఉండదనీ, కత్తికి కరుకుదనం, వేపకు చేదు ఎలా సహజమో అత్తగారు కూడా అంతేననీ, అత్తగారంటే కోడలిపాలిట మృత్యుదేవత అనీ కొన్ని సామెతలు వెల్లడి చేస్తాయి.

"అత్త మంచి వేము తీపిలేదు"

"అత్త మెత్తన కత్తిమెత్తన లేవు"

"అత్తకు శాంతంబు కత్తికి మెత్తన కలదే"

"అత్తమిత్తి ఏరాలు కత్తి"

వేపకు తియ్యదనం, కత్తికి మృదుత్వం అత్తకు దయాదాక్షిణ్యాలు లోకంలో లభించనివి.

కోడలిపై దయలేని అత్తకు కోడలు ఏంచేసినా తప్పుగా కనిపిస్తుంది. అత్తగారి దయకు పాత్రమవుదామని దండం పెట్టినా కోడలిపై అత్తకు దయ కలుగకపోగా దోషంలా కనిపిస్తుందని "దయగల అత్తకు దండం పెట్టినా తప్పే ఊరకున్నా తప్పే" అనే సామెత వివరిస్తుంది.

కఠినాత్మురాలైన అత్తగారింట్లో కోడలికెన్ని కష్టాలో! అలాంటి అత్త



CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



గారింట్లో అష్టకష్టాలు పడే కోడళ్ళ అనుభవాన్ని పురస్కరించుకొని కొన్ని సామె తలు పుట్టాయి.

"అత్తింటి కాపురం కత్తిమీద సాము"

"అత్తవారిల్లంటే కత్తులబోను"

"అత్తింటి సుఖం మోచేతి దెబ్బవంటిది"

మోచేతి దెబ్బ ఎలాంటిదో అనుభవైకవేద్యమే కానీ తెలియచెప్పరానిది. మోచేతి దెబ్బ ఎలాంటిదో తెలిస్తే కాని అత్తింటి కాపురం ఎలాంటిదో తెలియదు. ఒకసారి తండ్రి కూతుర్ని ఇంటికి పిలుచుకొని వెళ్తూ 'నీ కాపురం ఎలా ఉందమ్మా ?' అని ప్రశ్నించాడట. అందుకు కూతురు చెప్పిందట "మోచేయి గోడకు తగిలినంత సుఖంగా ఉందని" అయితే తండ్రికి కూతురు చెప్పిన సమాధానంలోని అంతరార్థం వెంటనే బోధపడలేదట. ఆ తర్వాత ఎపుడో తండ్రి మోచేయి తగిలి భరించరాని నొప్పి కలిగిందట. అపుడు కూతురి కాపురం ఎలాంటిదో తండ్రికి అర్థమైందట.

అత్తగారి-ట్లో కోడల్ని పూచిక పుల్లకన్నా అధ్వాన్నంగా చూస్తారు. అత్తగారేం చేసినా చెల్లుతుంది. కానీ కోడలికి జరగదు. "ఔననటానికి, కాదన టానికి అత్తకే అధికారం కాని కోడలిదేముంది" అన్నట్లుగా భిక్షం వేయటానికి కూడా కోడలికి అధికారం ఉండదు. అత్తగారు ఏ తప్పు చేసిన సమర్థించు కుంటుంది. కాని కోడలికి సాధ్యపడదు. "అత్తకొట్టిన కుండ ఆడుగోటి కుండ కోడలు కొట్టిన కుండ కొత్తకుండ" అనే సామెత అత్తగారి తప్పును కప్పి పుచ్చు తుంది. కోడలి ఒప్పును తప్పుగా మారుస్తుంది. కోడలు ప్రొద్దున్నుంచి ఎంత చాకిరి చేసినా కనీసం తిండి కూడా సరిగా పెట్టదు. ఎంత కఠిన హృదయం కలిగిందో అత్తగారు. ఒకవేళ కోడలే నోరుతెరచి అడిగినా అత్తగారు చెప్పే సమాధానం హృదయ విదారకంగా ఉంటుంది. "ఆకలి ఎత్తుతున్నది అత్తగారూ! అంటే రోకలి మింగవే కోడలా! అన్నాడట" అనే సామెతలో అత్తగారి నిర్దయ గోచరిస్తుంది.

అత్తగారిలాగే పినతల్లి కూడా కఠిన హృదయురాలని కొన్ని సామెతలు వివరిస్తాయి. తండ్రి రెండో భార్య పినతల్లి [మారుతల్లి] అవుతుంది. మారుతల్లి, పినతండ్రి భార్య సరిగా చూడకపోగా పిల్లల్ని అనేక విధాలుగా హింసిస్తారు. పినతండ్రి భార్య పినతల్లి కాదట. పినతల్లి ఏంచేసినా పిచ్చిదాని చేష్టలా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఉంటుంది. అలాగే మారుతల్లి కూడా మొదటి భార్య పిల్లల్ని హింసించి వాళ్లపట్ల కఠినంగా ప్రవర్తిస్తుంది. తన పిల్లలు కాదనే భావంతో వాళ్లచేత నానా పనులు చేయిస్తుంది. కాని చివరకు తిండి కూడా సరిగా పెట్టదు. వాళ్ల ఆలనాపాలనా పూర్తిగా విస్మరించి వాళ్ల గురించి ఏమీ పట్టించుకోదని వివరించే సామెతలు :

"పినతండ్రి పెండ్లాము పినతల్లికాదు మేనమామ
పెండ్లాము మేనత్తకాదు"

"పినతల్లిపెట్టు పిచ్చిదాని పెట్టు"

"పాలేరువానికి పశువుపోయినా మారుతల్లికి బిడ్డపోయినా దిగులులేదు"

"సవతితల్లికి బిడ్డలు పోతేనేమి? సొమ్ములకాపువానికి టక్కలు పోతే
నేమి?"

మారుతల్లి నిర్దయను "తనచేయి కాలుతుందని సవతిబిడ్డ చేతితో కలియబెట్టిందట" అనే సామెత చెబుతుంది. కఠినాత్మురాలు కాబట్టి పరలోకంలో కూడా మారుతల్లి వద్దంటూ "మారులోకానికి పోయినా మారుతల్లి వద్దు" అనే సామెత ఘోషిస్తుంది.

భార్యాభర్తలు అన్యోన్యంగా, పార్వతీ పరమేశ్వరుల్లాగా ఉండాలి. శబ్దార్థాల్లాంటిది భార్యాభర్తల అనుబంధం. భర్త సమస్త సుఖాలకు, గౌరవానికి భార్యయే కారణమని క్రింది శ్లోకం చెబుతుంది.

"కార్యేషుమంత్రీ కరణేషుదాసీ
భోజ్యేషుమాతా శయనేషురంభా
ధర్మే ఽనుకూలా క్షమయాధరిత్రీ
భార్యాచ షాడ్గుణ్యవతీహదుర్లభా"[25]

అందుకే భార్యకు ఎంతో ఉన్నతం, ఉత్తమమైన స్థానం ఇచ్చారు. అయితే కొందరు నిర్దయులై భార్యను అనూహ్యంగా హింసిస్తారు. తమ అవసరం ఉన్నంతవరకు ప్రేమను ఒలకబోసి, తియ్యటి కబుర్లు చెప్పి తమ వాంఛల్ని తీర్చుకుంటారు. అవసరం తీరినంతనే భార్యను నానాహింసలకు గురి చేస్తారు. అందుకే "మంచము మీద ఉన్నంతసేపు మగడు కిందికి దిగితే యముడు" అనే పుట్టింది.

25. సుభాషితరత్నభండాగార : పుట. 351, శ్లోకం 27 నిర్ణయసాగర ప్రెస్, బొంబాయి - 1952

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"ఎద్దుపుండు కాకికి నొప్పా?"

అన్నట్లుగా కొందరు దయాదాక్షిణ్యాలు లేనివాళ్ల ఇతరుల ఇబ్బందుల్ని, కష్టాల్ని గూర్చి పట్టించుకోక ప్రవర్తిస్తారనీ, అలాంటివాళ్ల నుద్దేశించి క్రింది సామెతలు పుట్టాయి.

"గొర్రె ఏడిస్తే తోడేలుకు కనికరమా?"

"ఎలుక ఎంత ఏడ్చినా పిల్లి కనికరిస్తుందా?"

"పుండుపొడిచే కాకికి ఎద్దునొప్పి తెలుస్తుందా?"

దయను చూపితే ఎక్కడ డబ్బివ్వాల్సి వస్తుందేమో అని లోభి నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తాడని "వేలు కోసుకున్నా సున్నం పెట్టడు" అనే సామెత చెప్పగా, కరణం ఎపుడూ కఠినహృదయం కలవాడై నిర్దయుడుగా నడచుకుంటాడని" "కరణం సాధుకాదు కాకి తెలుపుకాదు" అనే సామెత వెల్లడి చేస్తుంది.

**తప్పు :-**

తప్పు చేయడం మానవ సహజం. తప్పుచేయనివారంటూ ఉండరు. ప్రతి వాడూ ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక తప్పు చేస్తుంటాడు. అందుకే "ఉర్వి జనులకెల్ల నుండ తప్పు" అన్నాడు వేమన. "తప్పులేనివారు ధరణిలో లేరు" అనే సామెత పై విషయాన్నే చెబుతుంది. మనిషి చేసే పనులు బయటికి చెప్పక పోతే అవి తప్పో, ఒప్పో తెలియకపోవచ్చు. చేసిన తప్పులు ఇతరులకు చెప్పక దాచుకున్నా సాటివాళ్లకు తెలియకపోయినా భగవంతుడికైనా తెలుస్తుందని "తప్పు వొప్పు దైవమెఱుంగును పప్పుకూడు బాపడెరుగు" అనే సామెత వెల్లడి చేస్తుంది. తప్పుల్లో తరతమ భేదాలుండవచ్చు. కాని తప్పు చిన్నదైనా పెద్దదైనా తప్పుతప్పే. తప్పును ఒప్పుకోవడం, దాన్ని సరిదిద్దుకోవడం జీవితానికి చాలా మంచిది.

తప్పు చేయడం సహజం కాబట్టి తప్పు చేయాలనుకోవడం మంచిది కాదు. తప్పు జీవితంలో మచ్చలా నిలిచిపోతుంది. "వెలుతురుకు నీడ ఎలాంటిదో జీవితానికి తప్పులు అలాంటివి"[26] అని అన్నాడు ఎర్నెస్ట్ జాన్‌జర్

26. మణిపూసలు : సూక్తుల సంకలనం : పుట. 78 - యువభారతి ఎడ్యుకేషనల్ సొసైటీ 1983

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



"తప్పులెన్నువారు తమతప్పులెరుగురు" అని వేమన అన్నట్లుగా కొందరు తాము తప్పులు చేస్తూ తమ తప్పుల్ని గూర్చి తెలుసుకోక ఇతరుల్లోని తప్పుల్ని వేలెత్తి చూపుతుంటారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని తెలిపే సామెతలు :

"తనకంట్లో దూలం పెట్టుకొని పరులకంట్లో నలుసు లెంచినట్లు"

"నీకంటనుండే దూలం మరచి ఎదుటివానికంటి నలుసు ఎన్నకు"

"గురివింద గింజ తన క్రింది నలుపు తానెరుగదట"

కొందరు తామే తప్పులు చేస్తూ ఇతరుల్ని మాత్రం సన్మార్గంలో నడుచు కొమ్మని బుద్ధులు చెబుతారు. అలాంటి వాళ్లను.

"అత్త అంకుపోతూ కోడలికి బుద్ధి చెప్పినట్లు"

"అత్త తెడ్డు నాకుతూ కోడలికి బుద్ధి చెప్పినట్లు" అనే సామెతలు వివరిస్తాయి.

కొందరు ఇతరులకు నీతి సూత్రాలు చెప్పి తామే తప్పులుచేస్తూ ఉంటారు. అలాంటివాళ్ల స్వభావాన్ని విమర్శించి చెప్పే సామెతలు :

"చెప్పేవి శ్రీరంగనీతులు దూరేది దొమ్మరి గుడిసెలు"

"చెప్పేది నీతులు చేసేవి గోతులు"

"చదివేది రామాయణం పడగొట్టేది దేవాలయం"

తాము పెద్ద తప్పు చేస్తూ తమకంటే చిన్న తప్పు చేసేవాళ్లను భయపెడుతూ ఉంటారు. అలాంటివాళ్ల స్వభావాన్ని

"కుప్ప పీకే దొంగ పరిగ ఏరుకునే వానిని బెదిరించినట్లు"

"ఓదె కట్టె దొంగ పరిగ ఏరే వానిని బెదరించినట్లు" అనే సామెతలు వెల్లడి చేస్తాయి.

ఇతరులెవరూ చూడలేదు కదా! అని భావించి కొందరు తప్పులు చేస్తూ ఉంటారు. అట్లని వాళ్లు చేసే తప్పులు ఇతరులకు తెలియకపోవు. తాము తప్పులు చేసినా ఇతరులకు తెలియవని భావించి తప్పులు చేసేవాళ్లను "పిల్లి తననెవరూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



చూడలేదని పాలు తాగుతుందట" అనే సామెత ఖండిస్తుంది. తననెవరూ చూడరని పిల్లి కండ్లు మూసుకొని పాలు త్రాగినంత మాత్రాన ఆ విషయం ఇతరులకు తెలియకపోతుందా !

కొందరు తప్పులు చేసి తమ తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికై మంచి పనులు చేస్తూ ఉంటారు. కానీ ఒకసారి తప్పుచేస్తే అది మచ్చగా మిగిలిపోతుందే కానీ తొందరగా చెరిగిపోదు. చేసిన తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికై మంచి పనులు చేసేవాళ్ల స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"ఆవును చంపి చెప్పులు దానం చేసినట్లు"

"చెట్లు నరికి పండ్లు దానం చేసినట్లు"

"చెఱువును తెంచి చేపలు పంచినట్లు"

తప్పుచేసి దాన్ని కప్పిపుచ్చుకోవడానికై ఎంత మంచి పనిచేసినా ప్రయోజనం లేదని హెచ్చరిస్తాయి కొన్ని సామెతలు :

"ఆవును చంపి గోరోజనం రోగార్తులకిచ్చిన పుణ్యాత్ముడగునా ?"

"చెఱువు తెగ గొట్టి చేపలు వండిపెట్టగానే మాన్యుడగునా ?"

## సంతోషం :-

సంతోషంగా ఉంటే చాలు మనిషికి అదే బలం ఉత్సాహం. అన్నీ సంపదలూ ఉన్నట్లే. సంతోషం కలవాడు ఏ పని చేయడానికి వెనుకాడడు. అందుకే "సంతోషమే సగం బలం", "సంతోషం సగం సత్తువ" అనే సామెతలు పుట్టాయి. కాబట్టి "తన సంతోషమే స్వర్గము" అన్నాడు సుమతీ శతకర్త.

కానీ కొందరు అల్ప సంతోషు లుంటారు. సాధించాల్సింది, చేయాల్సింది ఎంతో ఉన్నా అల్పఫలితానికే సంతోషపడిపోతారు. ఇతరులు ఎంతో ఇవ్వాల్సింది ఉన్నా కొంచెం ఇస్తేనే మురిసిపోతారు. అలాంటివాళ్ళ స్వభావాన్ని "ఖుదుము చేతికిస్తే పండుగనేవాడు" అనే సామెత వెల్లడి చేస్తుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



## అహంకారం :-

కొందరిలో నేను, నాది అనే అహంకారం ఎక్కువ ఉంటుంది. తాను లేక పోయినా, తన వస్తువులు లేకపోయినా ఇతరులకు కాలమే గడవదనే అహంకారంతో విర్రవీగుతుంటారు. అహంకారంతో తానేమి చేస్తున్నాడో, ఏమి చెబుతున్నాడో గ్రహించలేక మనిషి తప్పుదారిలో నడుస్తుంటారు.

సూర్యుని గమనంలో, కాలప్రవాహంలో ఎవరున్నా లేకపోయినా లోక వ్యాపారం కూడా సాగిపోతుంటుంది. మానవుని జీవితం కూడా అంతే. ఇతరుల ప్రమేయం ఉన్నా లేకపోయినా మానవుని జీవన ప్రవంతి సాగిపోతుందే కానీ ఇతరుల కోసం ఆగిపోదు. సమయానికి ఎవరున్నా లేకపోయినా, ఏది ఉన్నా లేకపోయినా ఏదోవిధంగా కార్యాన్ని నడుపుకోవడం మనిషి విధి. అంతే కాని దేనికోసమైనా పనిని ఆపితే ఇంక అన్ని పనులు అలాగే నిలిచి పోతాయి. జీవన యాత్ర సాగదు. కానీ కొందరు అహంకారంతో విర్రవీగుతూ తాను లేకపోయినా, తన వస్తువులు లేకపోయినా ఈ లోకంలో ఏమీ జరుగదు. ఎక్కడిదక్కడ ఆగి పోతుందని భావించే వాళ్ళుంటారు. అలాంటివాళ్ళ స్వభావాన్ని ఖండించే సామెత లున్నాయి.

"తనకోడి కుంపటి లేకపోతే తెల్లవారదన్నట్లు"

"అయ్యవారు రాకపోతే అమావాస్య ఆగుతుందా?"

కోడి కూయకపోతే తెల్లవారదా? కుంపటి లేకపోతే అగ్ని దొరకదా? అలాగే అయ్యవారు రాలేదని అమావాస్య ఆగిపోతుందా? ఏది ఆగదు. ఎలాగైనా కాలం గడచిపోతుందని పై సామెతల భావం

## అప్పు :

కొన్ని సదుపాయాలున్న ఊర్లోనే ఉండాలంటూ సుమతీశతకారుడు ప్రప్రథమంగా పేర్కొనది అప్పు ఇచ్చేవాణ్ణి"[27] అంటే ఎవరికైనా ఎప్పుడో ఒకసారి అప్పుచేయక తప్పదని భావం. అయినా వీలున్నంతవరకు అప్పు చేయ కుండడం మంచిది. అప్పుచేయడం అలవాటైతే దాని నుండి మరల్చడం చాలా కష్టం. అప్పు చేయడంవల్ల మనిషి స్వతంత్రతను కోల్పోతాడని "అప్పు తీసు

---

27. సుమతి శతకం : 7వ పద్యం - సి. వి. కృష్ణా బుక్ డిపో, మద్రాసు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



కున్నపుడే చెప్పుచేతలలో ఉండాలి" అనే సామెత చెబుతుంది. అప్పుచేస్తే అప్పు ఇచ్చినవానికి లొంగి ఉండాలన్నమాట.

అప్పు మనిషికి ముప్పును కలిగిస్తుంది. తలమీద బరువై మనిషిని క్రుంగ దీస్తుంది. అందుకే "అంగట్లో అరువు తలమీద బరువు" అనే సామెత పుట్టింది. తలమీది బరువులాంటిది కాబట్టే కొందరికి అప్పు అంటే భయం. తాము తిన్నా తినకపోయినా ఫరవాలేదు కాని అప్పుచేయడానికి భయపడతారు. "అప్పులేని గంజి దొప్పెడేచాలు", "అప్పులేనిదే ఐశ్వర్యం" అని సామెతలు చెప్పినట్లుగా ఉన్నదాంతోనే హాయిగా జీవిస్తారు. ఒకవేళ ఎప్పుడైనా అప్పు చేయాల్సివస్తే గంజి నీళ్లు తాగైనా అప్పుతీర్చడానికి ప్రయత్నిస్తారని" అప్పుతీర్చి అంగట్లో కాపురం చేయాలి" అనే సామెత చెబుతుంది.

అప్పు ఎంత ప్రమదకారి అయినా కనీస అవసరాలు తీర్చుకోవడానికైనా ఎంతో కొంత అప్పుచేయక తప్పదు. ప్రతి మనిషి అప్పుచేస్తాడని "అప్పులేని మనిషి పిప్పిలేని పగడం ఉండునా?" అనే సామెత వెల్లడి చేస్తుంది.

అప్పుచేయడం కొందరికి మహాసరదా. అప్పుచేస్తే తీర్చగలమా లేదా అనే ఆలోచన కంటే అప్పు ఎలా సంపాదించాలి అనేదే వాళ్ల ఆలోచన. ఉన్నంతతోనే కాలం గడుపుకొందామని ఆలోచించరు. అప్పుపడినా ఫరవాలేదు. కాని తినే తిండికి లోపం ఉండకూడదని ఎలాగైనా అప్పు చేస్తారు. అలాంటి వాళ్ల స్వభావాన్ని "అప్పుచేసి అయిన నిప్పులాంటి సారా తాగాలి" అనే సామెత వెల్లడి చేస్తుంది. ఆడంబరాలకు పోయి అప్పులు చేసి, అప్పు తీర్చలేక నానా ఇబ్బందులు పడుతూ ఉంటారు కొందరు. తలకు మించిన అప్పుచేసి దాన్ని తీర్చటానికి ఆస్తిపాస్తులమ్ముకొనే వాళ్ల స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"అప్పుచేసి చెడును - చెట్టెక్కి చేయి విడిచి చెడును"

"పూడ్చలేనంత గొయ్యి - తీర్చలేనంత అప్పు చేయరాదు"

ఆడంబరాలకు పోయి అప్పులు చేసి నలుగురిలో నవ్వులపాలవుతూ ఉంటారు. శక్తికిమించి అప్పులు చేసి పరిహాస పాత్రులయ్యే వాళ్లను విమర్శించే సామెతలు కొన్ని ప్రజల్లో ప్రచారాన్ని పొందాయి ఇలా :

"అప్పుచేసి కొప్పుతీర్చిండట"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



''అప్పుచేసి పప్పుకూడు''

''అప్పుచేసి ముచ్చెలు కొంటే అప్పుతీర్చక ముందే బొచ్చెలు బొచ్చెలైనాయి''

"అప్పు ఆరుమాడలకన్నా రొఖ్ఖం మూడు మాడలు మేలు" అనుకొని కొందరు అప్పుచేయక ఉన్నదాంతోనే ఎలాగో కాలం గడుపుతుంటే మరికొందరికేమో అప్పులు చేయడమే ప్రధాన ధ్యేయం. ప్రతిదానికి ఎవరో ఒకరి దగ్గర అప్పులుచేసి తమ పనులు నెరవేర్చుకుంటారు. అలాంటివాళ్ళ స్వభావాన్ని "బాసికం మొదలు భజంత్రీల వరకు బదులుతో జరిపినట్లు" అనే సామెత వివరిస్తుంది. పెండ్లంతా చేతిబదులుగా అప్పుకింద తీసుకొని ముగించారంటే అప్పు చేయడంలో వాళ్ల ఎంత ఘనులో !

కొందరు అప్పు తీసుకొనేటప్పుడు చూపే ఉత్సాహం దాన్ని తీర్చడంలో చూపించరు. అప్పు ఇచ్చిన వాళ్లను తమచుట్టూ తిప్పించుకుంటారు. కానీ త్వరగా తీర్చరు. అందువల్ల ఇచ్చిన అప్పు సమయానికి తిరిగిరాదని "అప్పు అదనుకు రాదు అకటికీ రాదు" అనే సామెత చెబుతుంది. అప్పు ఇచ్చి వసూలు చేసుకోవడం ఎంత కష్టమో "అప్పు ఇచ్చి చూడు - ఆడపిల్లనిచ్చి చూడు" అనే సామెత తెలుపుతుంది.

అప్పు ఇచ్చినవాడి పాపమేమో కాని ఇచ్చిననాటి నుంచి వసూలు చేసుకోవటానికై తీసుకున్నవాని చుట్టు తిరగాల్సి ఉంటుంది. అప్పు ఇచ్చినవాడు కనిపిస్తే ఎక్కడ డబ్బు అడుగుతాడో అనే ఉద్దేశ్యంతో తీసుకున్నవాళ్లు ముఖం తప్పించుకొని తిరుగుతారని, అంతేకాక అప్పు ఇచ్చినవానికి చెడు జరగాలనీ కోరుకుంటారనీ వివరించే సామెతలు :

"తప్పుచేసిన వానికి అప్పుచేసిన వానికి ముఖం చెల్లదు"

"అప్పు ఇచ్చినవాడు బాగుకోరును - తీసుకున్నవాడు చెడుగోరును"

**పనికిమాలినతనం :-**

ఏ పని చేసినా ఏదో ఒక ప్రయోజనం ఉండాలి. నిరుపయోగమైన పని చేయటంవల్ల సమయం వ్యర్థమౌతుంది. శరీరానికి కూడా అనవసరమైన శ్రమ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



అభ్యుదయాన్ని కాంక్షించేవాళ్లు కాలాన్ని వ్యర్థం చేయక ఉపయోగకరమైన పనుల్ని మాత్రమే చేయాలి ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి పనిచేస్తూ ఉండాలి. అంతేకాని ఏ పని లేదు కదా అని పనికిమాలిన పనులు చేయరాదు. పని లేకపోతే ఊరకనే ఉండవచ్చు కానీ పనికిమాలిన, నిష్ప్రయోజనమైన పనులు చేయరాదు. అలా చేసేవాళ్ల స్వభావాన్ని విమర్శించే సామెతలు :

"పనిలేని మంగలి పిలిచి తలగొరిగినాడట"

"పనిలేని మంగలి పిల్లి తలగొరిగినాడట"

"పనిలేని మాచకమ్మ పిల్లి పాలు పితికిందట"

"పనిలేని రాజు పాపరాజు ఏం చేస్తున్నాడంటే
కుందేటి కొమ్మకు రేకలు తీస్తున్నాడట"

"పనిలేదు పాటలేదు ఇట్లన్నా మళ్ల నీ వెంట్రుకలు సరిదీస్తానన్నట్లు"

"పనిలేదు పాటలేదు పట్టత్తా నీకాళ్ళకైనా మొక్కుతానన్నట్లు"

## గయ్యాళితనం :-

తననోటి దురుసు తనంతో కానీ, చేష్టలతో కానీ ఇతరుల్ని భయపెట్టి ఇబ్బందిపెట్టే తత్త్వాన్ని గయ్యాళితనం అంటారు. గయ్యాళి నోరును కట్టుదిట్టం చేయడం సాధ్యంకాదని ''గాలిని మూటకట్టవచ్చు కాని గయ్యాళి నోరు కట్టలేం'' అనే సామెత చెబుతుంది.

సాధారణంగా అత్తగారు గయ్యాళిగా ఉంటుంది. ఇంటికి వచ్చిన కోడల్ని నానా ఇబ్బందులు పెట్టడం, పని చేయించుకున్నా సరిగా తిండి పెట్టకపోవడం, సమయం సందర్భం లేకుండా ప్రతిదానికి నోటికి వచ్చినట్లు మాట్లాడటం లాంటివి అత్తగారి గయ్యాళి తనాన్ని సూచిస్తాయి. అత్తగారి గయ్యాళి తనానికి తట్టుకో లేని కోడలు ''అత్తవారిల్లంటే కత్తులబోను''గా భావిస్తుందట. అత్తగారి ఆరళ్ళకు తట్టుకొని రాటుదేలిన కోడలు ఎదురు తిరిగి ''అత్తా నిన్ను కొత్త కుంపట్లో ఏసి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



మొత్తా'' అని అంటుంది. అత్తను మించిపోయిన గయ్యాళి కోడలు మొగుణ్ణి కూడా వదలిపెట్టదని ''అత్తను కొట్టి అటకెక్కింది మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కింది'' అనే సామెత వెల్లడి చేస్తుంది.

గయ్యాళుల మధ్య మంచివాళ్లుండడం సాధ్యం కాదనీ, గయ్యాళిని చూస్తే ఇతరులు దూరంగా పారిపోతారని క్రింది సామెతలు చెబుతాయి.

''గయ్యాళి గచ్చపొద ఒకటి''

"గయ్యాళి రచ్చకెక్కితే సంసారి దొంతుల సందున దాగుతుంది.''

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

Forwarded free of cost, and with the compliments of the Department of Education, Government of India, New Delhi.

# ఆధార గ్రంధాల పట్టిక


| | |
|---|---|
| తెలుగు సామెతలు : | Captain M. W. Car, 1986<br>Asian Educational Services<br>New Delhi. |
| తెలుగు సామెతలు : | ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి<br>మూడవ కూర్పు : 1974 |
| తెలుగు సామెతలు - జనజీవనం | డా॥ పి. నరసింహారెడ్డి<br>ఎం ఏ. పి హెచ్. డి<br>శ్రీనివాస మురళి పబ్లికేషన్స్<br>తిరుపతి : 1983 |
| సామెతలలో సాంఘిక జీవనం : | జి. యస్. మోహన్<br>శ్రీనివాస పబ్లికేషన్స్<br>మలయనూరు, అనంతపురం జిల్లా |
| సాటి సామెతలు : | విజయా పబ్లికేషన్స్<br>మద్రాసు - 17 : 1960 |
| సామెత : | సి. వేదవతి<br>స్పందన సాహిత్య సమాఖ్య<br>బుట్టాయిపేట : మచిలీపట్నం<br>ద్వితీయ ముద్రణ : 1985 |
| రాయలసీమ పలుకుబడులు : | సంపాదకుడు: వెలగా వెంకటప్పయ్య<br>తెలుగు సాహితి : కడప 1979 |
| ప్రజా సూక్తం :<br>[తెలుగు సామెతలు సంకలనం] | యువభారతి ప్రచురణ: హైదరాబాదు<br>నాల్గవ ముద్రణ : 1982 |


CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



ఆంధ్రుల జానపద విజ్ఞానం : డా॥ ఆర్వీయస్. సుందరం
ప్రథమ ముద్రణ : 1983
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
హైదరాబాద్

వేమన్న వేదం : వ్యాఖ్యాత : శ్రీ ఆరుద్ర
యువభారతి ప్రచురణ
తృతీయ ముద్రణ 1987

సుమతి శతకం : సి. వి. కృష్ణా బుక్ డిపో
19/99 అమ్మన్ కోవిల్ వీధి
మద్రాసు - 1

వేమన పద్యములు : ఎస్. వి. గోపాల్ అండ్ కో
శార్వరి : ఉగాది

భాస్కర శతకము : బాలసరస్వతీ బుక్ డిపో
[టీకాతాత్పర్య సహితము] ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్ కర్నూలు

భర్తృహరి సుభాషితము : బాలసరస్వతీ బుక్ డిపో
ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్ : కర్నూలు
మొదటి ముద్రణ : 1980

శ్రీహితోపదేశః : వావిళ్ళ రామస్వామి శాస్త్రులు
అండ్ సన్స్
మద్రాసు - 1 1969

కుమార సంభవం ॥ వ్యాఖ్యాత : చలమచర్ల వేంకట
5వ సర్గ శేషాచార్యులు
శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్
హైదరాబాదు : 1985

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పరిశోధన : డా॥ నాయని కృష్ణకుమారి
ఆంధ్ర సారస్వత్ పరిషత్
తిలక్ రోడ్డు : హైదరాబాదు
ప్రథమ ముద్రణ : 1979

రాజాజీ భగవద్గీత : అనువాదం: కిళాత్తూరు శ్రీనివాసాచార్యులు
దిలిటిల్ ఫ్లవర్ కంపెని
త్యాగరాయనగర్ - మద్రాసు - 18

ఆంధ్ర మహాభారతము : తెలుగు శాఖ
సంశోధిత ముద్రణము : ఉస్మానియా విశ్వవిద్యాలయము
హైదరాబాదు

శ్రీ మహా భాగవతము : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్ - సైఫాబాదు
హైదరాబాదు
చతుర్థ ముద్రణ : 1983

సాంఘిక మనో విజ్ఞాన శాస్త్రము : సంపాదకుడు: డా॥ ఎస్. యాదగిరిరెడ్డి
తెలుగు అకాడమి : హైదరాబాదు
1984 - ముద్రణ

మనోవిజ్ఞాన శాస్త్రము - పరిచయం : సంపాదకుడు : ఆచార్య కె. రామకృష్ణరావు
తెలుగు అకాడమి : హైదరాబాదు
1979 - ముద్రణ

పిల్లల శిక్షణా సమస్యలు : కె. వేదాంతాచారి
ద్వితీయ ముద్రణ 28-3-68

హితోపదేశము : మోతీలాల్ బనారసీ దాస్
ఢిల్లీ : 1985 ముద్రణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



సుభాషిత రత్న భాండాగర ; నిర్ణయసాగర్ ప్రెస్
బొంబాయి - 2
1952 ముద్రణ

మణిపూసలు ; సంకలనం : మన్నన గిరిధరరావు
యువభారత్ ఎడ్యుకేషనల్ సొసైటి
గుంటూరు ॥ నాల్గవ ముద్రణ 1983

శ్రీమద్రామాయణము : తాత్పర్యకర్త : శ్రీమాన్ చలమచర్ల
వేంకట శేషాచార్యులు
శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్: హైదరాబాద్

## ఆధార వ్యాసాలు :

తెలుగు సామెతలు ; బేకుమళ్ల కామేశ్వరరావు
భారతి, ఫిబ్రవరి 1955

తెలుగు సామెతలు : నిడుదవోలు వేంకటరావు
భారతి, జనవరి, 1966

సామెతలు - ఛందస్సామ్యతలు : బండి నాగరాజు, భారతి, మార్చి 1966

సామెతలు : అక్కిరాజు రమాపతిరావు,
తెలుగు త్రైమాసిక వైజ్ఞానిక పత్రిక
జనవరి - మార్చి 1982

తెలుగు సామెతల్లోని భావ సౌందర్యం : సుచంద్ర, తెలుగు - త్రైమాసిక
వైజ్ఞానిక పత్రిక జనవరి-మార్చి 1982

భిన్నత్వంలో ఏకత్వం సాధించి సామెతలు: కాలిపు వీరభద్రుడు,
స్రవంతి, మార్చి 1968

తెలుగు సామెతలు : డా॥ చిలుకూరి సుబ్రమణ్యశాస్త్రి
స్రవంతి, ఫిబ్రవరి, 1980

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Àrya Samaj Foundation Chennai and eGangotri



| | |
|---|---|
| స్త్రీలు - సామెతలు : | ఇల్లిందల సరస్వతి<br>సుజాత 15-10-52<br>కిన్నెర : డిసెంబర్ : 1952 |

**ENGLISH**

| | |
|---|---|
| **Field of Psychology:** | **Edited by J. P. GUILFORD**<br>**University of Southern Calfornia**<br>**3rd Edition: 1966** |
| **Basic Psychology :** | **Ross Stanger Charless M. SOLLEY**<br>**Tata Mc Graw - Hill Publishing Co. LTD.**<br>**BOMBY: 1970 Edition.** |

007375

पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

GURUKUL KANGRI LIBRARY
Accession
Class on
Cat on
Tag etc.
Checked
Any Other

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

GURUKUL KANGRI LIBRARY
Accession
Class on
Cat on
Tag on
Checked
Any Other
1.2.92

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

## బుక్కరాయ సముద్రం రామాచార్యులు

పుట్టినది : 1-7-1951 గుళ్ళదుర్తి, కోవెలకుంట్ల తాలూకా
కర్నూలు జిల్లా

తల్లిదండ్రులు : శ్రీమతి బి. తిరుమలమ్మ, శ్రీ బి. రాఘవాచార్యులు

విద్యాభ్యాసం : ప్రాథమిక ఉన్నత విద్యలు - గుళ్ళదుర్తి
కళాశాల విద్య - వి. ఆర్. కళాశాల నెల్లూరు
ఎం. ఏ., ఎం. ఫిల్ - శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం
అనంతపురం :

ప్రస్తుతాధ్యయనం : పిహెచ్.డి. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం.
అంశం : జానపదనృత్య కళ - గొరవ సంప్రదాయం.

ఉద్యోగం : జి. పుల్లారెడ్డి జూనియర్ కళాశాల
ఆంధ్రోపన్యాసకుడు,
మెహిదీపట్నం, హైదరాబాదు-28

రచనావ్యాసంగం : సాహిత్య పరిశోధనా వ్యాసాలు వ్రాయుట, ఆకాశవాణిలో
ప్రసంగాలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar